# ఈనాడు




విజయవాడ 2-8-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 354

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

# ...అంత ధీమా వద్దు!

బీమా మనిషికి ఎంత ముఖ్యమో.. వాహనానికీ అంతే ముఖ్యం. అసలు పాలసీ లేకుండా రోడ్డుమీదకు రావద్దని మోటారు వాహనాల చట్టం చెబుతోంది. అయినా సరే తెలుగు రాష్ట్రాల్లో వేల కొద్దీ వాహనాలకు ఇన్సూరెన్స్ ఉండట్లేదు. ఈ నిర్లక్ష్యం వల్ల మొదటికే మోసంవచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

- గతంలో ద్విచక్ర వాహనం కొనుగోలు చేసినప్పుడు.. షోరూమ్‌లో తొలి ఏడాదికి బీమా పాలసీ చేయించేవారు. ఆ గడువు ముగిశాక చాలామంది వాహనదారులు పాలసీ రెన్యువల్ చేసుకోవడం మానేసేవారు. ఇలా చేసేవారి సంఖ్య పెరుగుతుండడంతో ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) 2019లో కొత్త నిబంధన అమల్లోకి తెచ్చింది. దీనిప్రకారం వాహనం కొనుగోలుచేసినప్పుడే తప్పనిసరిగా అయిదేళ్లకు బీమా చేయిస్తున్నారు. తొలి ఏడాది కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్, మిగిలిన నాలుగేళ్లు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పిస్తున్నారు.
- అయితే అయిదేళ్ల తర్వాత వాహనదారులు మళ్లీ అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పాలసీ రెన్యువల్ చేయకపోతే ఏమవుతుందిలే.. అనే ధీమాతో ఉంటున్నారు.



తెలుగు రాష్ట్రాల్లో 85 శాతం మంది ద్విచక్ర వాహనదారులు ఎలాంటి బీమా లేకుండానే బండ్లను రహదారులపై నడిపిస్తున్నారు.

ఐఆర్‌డీఏఐ నిబంధనల మేరకు కొత్త కారు కొనుగోలు చేసే సమయంలో మూడేళ్లకు తప్పనిసరిగా బీమా పాలసీ తీసుకోవాలి. తొలి ఏడాది పూర్తిస్థాయి బీమా, తర్వాత రెండేళ్లకు థర్డ్ పార్టీ బీమా ఉంటుంది. ఇది ముగిశాక కూడా చాలామంది పాలసీ రెన్యువల్ చేసుకోవడం లేదు.

దారుణం కదా...

- కార్లను కొనుగోలు చేస్తున్నవారిలో 40 శాతం మంది బీమా పాలసీలు సకాలంలో రెన్యువల్ చేసుకోవడంలేదు.
- 50 శాతం ఆటోలు... 95 శాతం ట్రాక్టర్లు ఇన్సూరెన్స్ లేకుండానే మన రోడ్లపై తిరిగేస్తున్నాయి.
- వాహనానికి, యజమానికి, ఎదుటివారికి (థర్డ్ పార్టీకి) కలిపి చేసేదానిని కాంప్రహెన్సివ్ లేదా పూర్తిస్థాయి ఇన్సూరెన్స్ అంటారు.
- కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్‌కి, థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌కు చెల్లించే ప్రీమియంలో వ్యత్యాసం తక్కువగా ఉన్నాసరే.. చాలామంది థర్డ్‌పార్టీ బీమా చాలనే ధోరణిలో ఉంటున్నారు.
- హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలు, జిల్లా కేంద్రాల్లో తనిఖీలు ఎక్కువగా ఉంటాయి. దీనివల్ల పరిస్థితి కొంతవరకు అదుపులో ఉంటోంది.
- గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించరు కదా అని వాహన బీమాను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇది ప్రమాదకరమైన ధోరణి.



**నచ్చిన కంపెనీ ఎంచుకోవచ్చు..**

డీలర్ చేయించే బీమా కంపెనీ పాలసీయే తీసుకోవాలనే నిబంధన లేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ, ది ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ, న్యూ ఇండియా ఎష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఉన్నాయి. ఇవికాకుండా ప్రైవేటు బీమా సంస్థలు 20 వరకు వాహనాలకు పాలసీలు ఇస్తున్నాయి.

- ఈనాడు, అమరావతి

## తూనీగ అందం.. సీతాకోకచిలుక చందం!







ప్రకాశం జిల్లా పెళ్లూరు- వాసేపల్లిపాడు మార్గంలో వివిధ వర్ణాల తూనీగలు కనువిందు చేస్తున్నాయి. చిరుజల్లుల సమయంలో వందల సంఖ్యలో ఎగురుతూ సీతాకోకచిలుకల గుంపును తలపిస్తున్నాయి. 'రియోథెమిస్ వులిగినోసా రకానికి చెందిన ఈ తూనీగలు దక్షిణాసియా, చైనా, ఆఫ్రికా దేశాల్లో ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ కనిపించడం అరుదే' అని కృష్ణా యూనివర్సిటీ జీవ వైవిధ్య విభాగం ఆచార్యులు డాక్టర్ వీరబ్రహ్మాచారి తెలిపారు.

– ఈనాడు, ఒంగోలు

## గోవా.. వైజాగ్ కాదు.. నల్లమల అందాలు



పచ్చదనంతో కొండల మధ్యలో జలం.. మధ్యలో చిన్నపాటి గ్రామం.. గుట్టల మధ్య పడవల్లో విహారం.. ఇదంతా ఏ గోవా, వైజాగ్ బీచ్‌లోనో కాదండీ.. తెలంగాణలోని నల్గొండ జిల్లాలో. నాగార్జునసాగర్ జలాశయం నిండి.. జలాలు వెనక్కి రావడంతో ఈ నల్లమల కొండలు అందాలతో అలరారుతున్నాయి. 40 ఏళ్ల కిందట విశాఖ నుంచి వచ్చిన ఆరు కుటుంబాలు నల్గొండ జిల్లా నేరెడుగొమ్ము మండలం చిన్నమునిగల్ గ్రామ సమీపంలో చేపల వేట చేస్తూ గుడారాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఇప్పుడు 300 కుటుంబాలకు విస్తరించి వైజాగ్‌కాలనీగా మారింది. దేవరకొండ నుంచి 32 కి.మీ. దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి వెళ్లేందుకు డిండి రోడ్డు మార్గం ద్వారా పోలేపల్లి నుంచి నేరెడుగొమ్ము, పెద్దమునిగల్, చిన్నమునిగల్ మీదుగా రోడ్డు మార్గం ఉంది.

– న్యూస్‌టుడే, చందంపేట

## భారత్‌లో మొదటి మొబైల్ కాల్‌కు 30 ఏళ్లు



భారత్‌లో మొబైల్ కాల్స్ ప్రారంభమై గురువారంతో 30 ఏళ్లు పూర్తయ్యాయి. 1995 జులై 31న మొదటి ఫోన్‌కాల్ కోల్‌కతా నుంచి దిల్లీకి వెళ్లింది. అప్పటి బెంగాల్ సీఎం జ్యోతిబసు నోకియా హ్యాండ్‌సెట్ నుంచి దిల్లీలోని కేంద్ర టెలికాం మంత్రి సుఖ్‌రామ్‌కు ఈ కాల్ చేశారు. 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దిల్లీలో 'మొబైల్ కాంక్లేవ్ 2025' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో 1995 నుంచి 2025 వరకు భారత మార్కెట్‌లోకి వచ్చిన ప్రతి మొబైల్ ఫోన్‌ను ప్రదర్శించారు. 'ఫ్రమ్ ఫస్ట్‌కాల్ టు డిజిటల్ ఇండియా' అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ ప్రదర్శనకు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా హాజరయ్యారు. 120 కోట్ల మొబైల్ వినియోగదారులతో నేడు ప్రపంచంలోనే రెండోస్థానంలో భారత్ ఉన్నట్లు మంత్రి తెలిపారు.

–ఈటీవీ భారత్

## వీధి కుక్కలకు వానగూడు!



వర్షాల నుంచి వీధి కుక్కలకు రక్షణ కల్పించేందుకు బ్లూ క్రాస్ ఆధ్వర్యంలో మార్స్ పెట్‌కేర్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ కలిసి ముందుకొచ్చాయి. వీధి కుక్కలు, పిల్లుల కోసం మొబైల్ షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు 'పా ప్రొటెక్ట్' కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో చేపట్టారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని బ్లూ క్రాస్ నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సినీ నటి, బ్లూ క్రాస్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్ అక్కినేని అమల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మార్స్ పెట్ కేర్ ఇండియా ఎండీ సలీల్ మూర్తి కార్యక్రమంలో పాల్గొన్నారు.

– ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే

## 'ప్యారట్ మ్యాన్' హర్‌సుఖ్ భాయ్



గుజరాత్‌లోని జునాగఢ్ జిల్లా కేశోద్ పట్టణానికి చెందిన హర్‌సుఖ్ భాయ్ వాఘాసియాను అందరూ 'ప్యారట్ మ్యాన్' అని పిలుస్తారు. ఏకంగా 10 వేల రామచిలుకలు రోజూ ఈయన పెట్టే దాణాను తింటాయి. కడుపు నిండా తిని, తమ తమ గూళ్లకు తిరిగి వెళ్లిపోతాయి. హర్‌సుఖ్ భాయ్ 'ప్యారట్ మ్యాన్'గా మారడం వెనుక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. దాదాపు 30 ఏళ్ల కిందట ఈయన ఓ ప్రమాదానికి గురయ్యారు. ఆ సమయంలో తన ఆహారాన్ని పూర్తిగా మార్చాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఒక మిత్రుడు అల్పాహారంగా వండుకునేందుకు కాడలతో కూడిన సజ్జలను తన పొలం నుంచి తెచ్చి ఇచ్చేవారు. సజ్జ కాడలను ఇంటి కిటికీ నుంచి బయటకు పడేయగానే, వాటిని తినేందుకు రామ చిలుకలు పెద్దసంఖ్యలో వచ్చేవి. దీన్ని చూసిన హర్‌సుఖ్ భాయ్ రామ చిలుకల ఆకలి బాధను తీర్చేందుకు ఏదైనా చేయాలని ఆనాడే సంకల్పం చేసుకున్నారు. సజ్జ కాడలు అమర్చేందుకు వీలుగా పెద్దసైజు ఇనుప స్టాండును చేయించారు. వీటిలో సజ్జ కాడలు పెట్టి, నేలపై వేరుశనగ గింజలు వెదజల్లుతారు. గత 28 ఏళ్లుగా లక్షల రూపాయలు వెచ్చించి హర్‌సుఖ్ భాయ్ ఇలా చిలుకల ఆకలి తీరుస్తున్నారు.

–ఈటీవీ భారత్

## అశ్వదళం.. అతివ కదం



తెలంగాణ పోలీసు అశ్వదళంలో (మౌంటెడ్ పోలీస్-నగర విభాగం) తొలిసారిగా 10 మంది మహిళా కానిస్టేబుళ్లు చేరారు. ఈ దళం నెక్లెస్ రోడ్డు, శాసనసభ, చార్మినార్ వద్ద విధులు నిర్వహిస్తోంది. పండగలు, ఉత్సవాల సమయాల్లో ఘర్షణలు జరగడానికి అవకాశమున్న ప్రాంతాల్లో గస్తీ చేపడుతోంది. ఇద్దరికి రోజు విడిచి రోజు లేక్ పోలీస్ డ్యూటీ ఉంటుంది. ప్రతి శుక్రవారం ఈ దళం పాతబస్తీలో ఉంటుంది. ప్రతి రోజు తమ గుర్రాలకు ఆహారం అందించడం, వాటి చేత ప్రాక్టీస్ చేయించడం వీరి విధుల్లో భాగం. ఈ విభాగాన్ని డీసీపీ రక్షితామూర్తి, ఏసీపీ కిషన్‌రావు, ఆర్ఎస్ఐ రమేశ్ రెడ్డి పర్యవేక్షిస్తారు. ఏఎస్ఐ పృథ్వీ సింగ్ అశ్వాలపై వీరికి శిక్షణ ఇస్తారు. ఈ సంవత్సరంలో జరిగే ఆల్‌ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనేందుకు కూడా అశ్వదళంలో కానిస్టేబుళ్లు సిద్ధమవుతున్నారని ఆర్ఎస్ఐ రమేశ్‌రెడ్డి తెలిపారు.

– ఈనాడు, హైదరాబాద్

## ఎవర్‌గ్రీన్ జనార్దన్



ఈయన పేరు రావుట్ల జనార్దన్. అందరూ పిలిచేది గ్రీన్ జనార్దన్. పేరులో 'గ్రీన్' ఎందుకొచ్చిందనేగా మీ సందేహం. దాని వెనక ఓ 'పచ్చటి' నిజముంది. నిజామాబాద్‌కు చెందిన ఆయన 2009 నుంచి మొక్కలు నాటడాన్ని వ్యాపకంగా మార్చుకున్నారు. ఇప్పటివరకు 2.5 లక్షలకుపైగా నాటించారు. 5 లక్షల విత్తన బంతులను అడవులు, ఖాళీ ప్రదేశాల్లో చల్లించి ఇటీవల ప్రత్యేక మైలురాయి చేరారు. సీతాఫలం, అల్లనేరేడు, చింత, జామ, వేప, మామిడి, సపోట విత్తనాలు 50 కిలోలు సేకరించి అడవుల్లో స్వయంగా చల్లారు. 'చెట్లుంటే పురోగతి-లేకుంటే అధోగతి' అని నమ్ముతారాయన. అదే శీర్షికతో పుస్తకాన్ని రాశారు. సొంత ఖర్చుతో 20 వేల ప్రతులు ముద్రించి.. వాటిని ప్రభుత్వ పాఠశాలల్లో పంచుతున్నారు. తన ఆశయ సాధన కోసం ఇటీవల ఇంటి స్థలాన్ని రూ.20 లక్షలకు అమ్మేశారు. 'ప్రకృతి సంరక్షణపై ఇంతటి సంకల్పం వివేకానంద పుస్తకాల వల్లే కలిగింది. జీవితంలో ఏం చేసినా పది మందికి ఉపయోగపడాలనేదే నా లక్ష్యం' అని చెప్పే జనార్దన్ ధరించే దుస్తులు, నడిపే బండి, రాసే పెన్ను, జీవనాధారమైన ప్రింటింగ్ ప్రెస్ ఇలా.. అన్నీ పచ్చని రంగుతోనే కన్పిస్తాయి. అందుకే ఆయన ఎవర్‌గ్రీన్ మరి.

–ఈనాడు, నిజామాబాద్

## మదిదోచే మాణిక్యమాల

### జీఐ గుర్తింపు పొందిన తమిళనాడులోని తోవాలై గ్రామ పూలదండలు



వివిధ రకాల మాణిక్యమాలలు



స్వామివారికి అలంకరించిన మాణిక్యమాలలు

రైతు ఇంట పుట్టిన పూలు.. మహిళల పనితనంతో 'మాణిక్య మాలలు'గా పేరు తెచ్చుకున్నాయి. అవి నేడు 'భౌగోళిక గుర్తింపు (జీఐ)' పొంది.. ఏకంగా ఆ ప్రాంతానికే పేరు తీసుకొస్తున్నాయి. తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా తోవాలై గ్రామ మహిళలు అల్లే 'మాణిక్య మాలలు' రత్నాలతో చేసినట్లు ఉంటాయి. అందుకే వాటికి ఆ పేరొచ్చింది. దేశవిదేశాల్లో మంచి డిమాండు ఉన్న ఈ దండల తయారీ.. తోవాలై మహిళలకు వెన్నతో పెట్టిన విద్య. అల్లికలో వైవిధ్యం, దండలు ఎక్కువ రోజులు తాజాగా ఉండటంతో ఇవి ఆకట్టుకుంటున్నాయి. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ గతంలో మహాబలిపురాన్ని సందర్శించినప్పుడు ప్రధాని మోదీ స్వయంగా వీటి అల్లిక విధానాన్ని ఆయనకు వివరించారు. రంగులు స్పష్టంగా కనిపించేలా, పూల సొగసు పోకుండా అల్లే ఈ మాలలు అంబానీ ఇంట పెళ్లి వేడుకలో మెరిశాయి. ఇందుకు తోవాలై మహిళలు ముంబయి వెళ్లి మరీ దండలుగా కూర్చి వచ్చారు. తిరువనంతపురం పద్మనాభస్వామి ఆలయ ఉత్సవాల్లో పెరుమాళ్‌కు 130 ఏళ్లుగా వీటినే ధరింపజేస్తున్నారు. వీటి తయారీకి అరటి పువ్వు, తెల్ల రోజాలు, చెరువుల్లో పెరిగే మొక్క ఆకులు, అరటి నార ఉపయోగిస్తారు. సహజ పూలకుతోడు పచ్చటి ఆకులు, మెత్తటి నార వాడటంతో ఆ తేమ వల్ల మూడు, నాలుగు రోజుల వరకూ దండలు తాజాగా ఉంటాయి. ఒక మాల కట్టడానికి కనీసం 4 గంటలు పడుతుంది. రూ.500 నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తారు.

– న్యూస్‌టుడే, చెన్నై(ఆర్కేనగర్)

## భక్తికి ఫలం.. పర్యావరణ హితం



భక్తితో కనిపించిన దేవుళ్ల విగ్రహాలన్నీ తెచ్చి ఇంట్లో పెడతాం. కానుకలుగా ఇచ్చినవీ చాలానే ఉంటాయి. కానీ, అవి పాడైనా, ఇంట్లో ఎక్కువైనా... ఏం చేయాలో అర్థం కాదు. చాలామంది పాపభీతితో పారేయలేరు. అలాగని ఉంచుకోనూ లేరు... కొందరు దగ్గర్లోని గుడిలో పెడతారు... మరికొందరు నదులు, కాలువల్లో వేసేస్తారు. కానీ, అక్కడా అవి వ్యర్థాలుగానే మిగిలిపోతాయని మాత్రం ఆలోచించరు. అలాంటి పరిస్థితిని గమనించిన డాక్టర్ శాంతి తుమ్మల బెంగళూరులోని హెచ్ఎస్ఆర్ సిటిజన్ ఫోరం సహకారంతో వినూత్న పరిష్కారాన్ని చూపారు. ఉపయోగంలో లేని దేవతా విగ్రహాలు, చిత్రపటాలను సేకరించి రీసైక్లింగ్ ద్వారా ఉద్వాసన పూజతో వాటికి వీడ్కోలు పలుకుతున్నారు. స్థానికంగా ఉండే దేవాలయ ప్రాంగణాలే వేదికగా స్థానికుల నుంచి వీటిని సేకరిస్తారు. గాజు, చెక్క, ఇనుప మేకులు, ఫొటోకాపీ... ఇలా 10-12 పదార్థాలను వేరు చేసి రీసైక్లింగ్‌కి పంపిస్తారు. అయితే, 'లామినేటెడ్ ఫొటోలూ వస్తుంటాయి... వాటిని రీసైకిల్ చేయలేం. ఆలోచించి కొనుక్కుంటే మీ భక్తికి ఫలం దక్కుతుంది. పర్యావరణ హితమూ' అంటారు శాంతి. మరి మీరేమంటారు!

– వసుంధర డెస్క్

## అమ్మవారికి 'కరెన్సీ' కళ



తమిళనాడులోని వేలూరు జిల్లా కాట్పాడి సమీప పంజూరులోని పంజి అమ్మవారు కరెన్సీ నోట్ల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆషాఢ మాసం మూడో శుక్రవారం సందర్భంగా రూ.15 లక్షల విలువైన నోట్లతో అమ్మవారిని సుందరంగా ఇలా అలంకరించారు.

– న్యూస్‌టుడే, వేలూరు

## చిల్లవారిపల్లెండీ.. పాలు ఉచితమండీ!



సాధారణంగా చాలా గ్రామాల్లో పాడి రైతులు పాలను విక్రయిస్తూ ఆదాయాన్ని పొందుతుంటారు. శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలోని చిల్లవారిపల్లి గ్రామం మాత్రం అందుకు పూర్తిగా భిన్నం. ఇక్కడ పాలు ఉచితంగా పోస్తారు. దీనికి వెనుక ఓ ఆసక్తికరమైన విషయం ఉంది. గ్రామ ఇలవేల్పైన శ్రీకాటికోటేశ్వరుడు సుమారు 400 ఏళ్ల కిందట చిల్లవారిపల్లికి పాల కావిడితో వచ్చారని, ఆయన ప్రతి రూపమే పాలు అని ఇక్కడి వారు బలంగా నమ్ముతారు. అందుకే ఈ గ్రామంలో పాలను ఉచితంగా పోయడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ మొత్తం 400 కుటుంబాల్లో కలిపి 1,350 మంది దాకా నివసిస్తున్నారు. ఆయా ఇళ్లల్లో ఆవులు, గేదెలు 315 దాకా ఉన్నాయి. రోజూ 400 లీటర్ల పాల ఉత్పత్తి ఉంటోంది. స్థానికులకే కాదు.. వేరే గ్రామస్థులకూ పాలు ఉచితంగా పోయడానికి సిద్ధంగా ఉంటామంటున్నారు ఇక్కడి వారు.

-న్యూస్‌టుడే, తాడిమర్రి


## మన్యం ఆచారం.. భూమాతకు ప్రణామం!



తెలిసిన వారెవరైనా ఎదురైతే 'షేక్‌హ్యాండ్' ఇచ్చి పలకరిస్తాం. మన్యంలో మాత్రం నేలపైకి వంగి.. రెండు చేతులతో భూమిని తట్టి, నమస్కరించిన తర్వాతే తమవారి చేతులు పట్టుకుని పలకరిస్తారు. తమ వారి భారాన్ని భూమాత భరిస్తూ.. క్షేమంగా ఉంచుతోందని వారు అలా చేస్తారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలో గిరి మహిళలు శుక్రవారం తమ ఆచారంలో ఒకరినొకరు పలకరించుకుంటున్న దృశ్యం.

– హుకుంపేట, న్యూస్‌టుడే

## మెరుపు @ 829 కి.మీ.



ఉరుములతో కూడిన వర్షాలు పడుతున్నపుడు ఆకాశంలో పెద్ద పెద్ద మెరుపులు చూస్తుంటాం. ఈ మెరుపులు క్షణాల్లో మాయమైనా.. వాటికీ ఓ రికార్డు ఉందని తెలుసా? ప్రపంచంలోనే అత్యంత పొడవైన మెరుపు 829 కిలోమీటర్లట! అమెరికాలోని టెక్సాస్, కాన్సస్ రాష్ట్రాల మధ్య 2017 అక్టోబరు 22న ఇది ఏర్పడింది. 2020 ఏప్రిల్ 29న 768 కి.మీ.ల పొడవుతో ఏర్పడిన మెరుపు రెండోస్థానంలో ఉంది. ఇది కూడా అమెరికాలోని టెక్సాస్, మిసిసిపి రాష్ట్రాల మధ్య ఏర్పడినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) చెబుతోంది. సాధారణంగా ఇలాంటి భారీ మెరుపులు పెద్ద పెద్ద తుపానులు వచ్చినప్పుడు కనిపిస్తుంటాయి. ఈ సమయంలో అవి చాలా ఎక్కువ దూరం ప్రయాణిస్తాయి. దీనినే 'బోల్ట్ ఆఫ్ ది బ్లూ'గా పిలుస్తారు. భారీ మొత్తంలో విద్యుత్తుశక్తి ఉండే ఇలాంటి మెరుపుల వల్ల ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నట్లు డబ్ల్యూఎంవో పేర్కొంది.

–ఇంటర్నెట్ డెస్క్

## పదవీ విరమణ రోజు 17 కి.మీ. పరుగు



సాధారణంగా పదవీ విరమణ చేసే ఉద్యోగులు.. తమ చివరి పని రోజున అధికారులు, సహోద్యోగులకు తమ అనుభవాలు పంచుకుని బాధ్యతలు విరమించి వాహనాల్లో ఇంటికి చేరుకుంటుంటారు. కన్యాకుమారిలో ఓ ఎస్సై మాత్రం తన పదవీ విరమణ రోజున భిన్నంగా 17 కి.మీ. దూరం పరిగెట్టారు. ఆయనే కన్యాకుమారికి చెందిన బాలకృష్ణన్. 1984లో పోలీసుశాఖలో చేరిన ఈయన శాంతిభద్రతలు, ట్రాఫిక్ మొదలైన పలు విభాగాల్లో విధులు నిర్వహించారు. తన నిజాయతీతో ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. ఆయనకు వాకింగ్, రన్నింగ్‌పై ఆసక్తి ఎక్కువ. కన్యాకుమారిలోని కొట్టార్ పోలీస్‌స్టేషన్‌లో బాలకృష్ణన్ పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమం ఇటీవల జరిగింది. కార్యక్రమం అనంతరం ఆయన్ను 17 కి.మీ. దూరంలోని పూవియూర్‌లో ఉన్న ఇంటికి కారులో దిగబెట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ, బాలకృష్ణన్ అందుకు నిరాకరించారు. మత్తుపదార్థాల వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఇంటికి పరిగెడుతూ వెళ్లారు. ఇప్పుడు ఇందుకు సంబంధించిన ఫొటో, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

– న్యూస్‌టుడే, చెన్నై (ప్యారిస్)




# ఈనాడు






విజయవాడ 2-8-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 354 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



అభిమానుల కోరికపై
1 కాదు, 2 కాదు లక్షల వెరైటీలు
శ్రావణ మాసంలో
ఆషాడం ధరలకే
శ్రావణ వేడుకలు
SUPER SRAVANAM
K9 sale
పండుగలు & వివాహ వేడుకలకై
కంచి పట్టుచీరల
సరికొత్త వెడ్డింగ్ కలెక్షన్
తూకం పద్ధతిలో చీరల అమ్మకం
అలంకారి ప్రింట్ సారీస్ కొనుగోలుపై
2వ చీర ₹39 మాత్రమే
MRP ₹3695/-
PER KG ₹400 PURE GEORGETTE SAREES
PER KG ₹500 PAVITRA SILK SAREES
PER KG ₹600 PATIYALA SILK SAREES
PER KG ₹800 ANIKA PATTU / NEELAM SILK SAREES
PER KG ₹950 JK PATDLA SILK SAREES
PER KG ₹1000 IKKAT SILK SAREES
PER KG ₹1100 ARMANI / SALONI SILK SAREES
PER KG ₹1200 ANU SILVER SILK SAREES
PER KG ₹1800 RM SILK SAREES
SRAVANAM SPECIAL KG PATTU SAREES
PER KG ₹1500 VASTRAKALA PATTU SAREES
PER KG ₹2300 PACIDI/LEPAKSHI PATTU SAREES
PER KG ₹2700 EKKATH PATTU SAREES
ప్రతి పోచంపల్లి ఫ్యాన్సీ సారీస్ కొనుగోలుపై
2వ చీర ₹9 మాత్రమే
MRP ₹999/-
DESIGNER SAREES
1150 ₹345 DESIGNER SAREE COLLECTION
1250 ₹375 DESIGNER SAREE COLLECTION
1350 ₹405 DESIGNER SAREE COLLECTION
1450 ₹435 DESIGNER SAREE COLLECTION
1650 ₹495 DESIGNER SAREE COLLECTION
DESIGNER SAREE COLLECTION 70% OFF KOLKATA WORK SAREES
LADIES WESTERN WEAR & LEISURE WEAR
Buy 4 ₹500 NIGHTY
Buy 2 ₹999 COTTON DRESS MATERIAL
Buy 2 ₹1499 PATIYALA SUIT SET
Buy 3 ₹1599 PLAZZO SUIT SET
Buy 2 ₹1999 LEHANGAS
Buy 1 ₹245 GIRLS COTTON FROCKS
Buy 3 ₹695 GIRLS COTTON FROCKS
Buy 1 ₹445 GIRLS NIGHT WEAR
Buy 2 795 GIRLS NIGHT WEAR
Buy 4 ₹450 BOYS SHORTS
Buy 5 ₹500 GIRLS T-SHIRTS
BOYS WEAR
Buy 1 ₹295 Buy 3 ₹745 BOYS T-SHIRT-NICKER
Buy 1 ₹445 Buy 2 ₹795 BOYS NIGHT WEAR
₹600 BOYS SHORTS
Buy 4 ₹550 BOYS SHORTS
895 ₹448 BOYS CAPRI
Buy 4 ₹600 BOYS 3/4 PAJAMA
695 ₹348 BOYS SHIRTS 645 ₹323
1295 ₹648 BOYS PANTS 1195 ₹598
GIRLS WEAR
Buy 4 ₹550 GIRLS T-SHIRTS
Buy 3 ₹550 GIRLS SHORTS
Buy 4 ₹600 GIRLS SHORTS
Buy 4 ₹650 GIRLS 3/4 PYJAMA
Buy 4 ₹595 BOYS T-SHIRTS
50% OFF GIRLS SKIRTS
MENS WEAR
*Conditions apply
ARROW FLYING MACHINE Buy 1 30% OFF Buy 1 GET 1 FREE
BLACKBERRYS Buy 1 30% OFF Buy 2 40% OFF Buy 4 GET 50% OFF
Pepe Jeans U.S. POLO ASSN. celio* KILLER Buy 1 30% OFF Buy 1 GET 1 FREE
Arvind LinenClub OCM GIZA HOUSE Raymond SÖKTAS DIGJAM
CRIMSOUNE CLUB Buy 1 30% OFF Buy 2 40% OFF Buy 4 GET 50% OFF
INDIAN TERRAIN Buy 1 20% OFF Buy 2 30% OFF Buy 3 GET 2 FREE
MONTE CARLO Buy 1 30% OFF Buy 2 40% OFF Buy 2 GET 2 FREE
SUITING & SHIRTING 50% OFF
turtle benetton Buy 1 30% OFF Buy 1 GET 1 FREE
Allen Solly parx Buy 1 20% OFF Buy 2 30% OFF Buy 2 GET 2 FREE
spykar Being Human Buy 1 40% OFF Buy 2 50% OFF
PETER ENGLAND Buy 1 25% OFF Buy 2 GET 1 FREE Buy 3 GET 2 FREE
అన్ని రకాల వస్త్రాల పై
Upto 70% OFF
కంచి పట్టు చీరలు
కంచి సొసైటీ ధరలకే అమ్మకం
R.S. Brothers™
బీసెంట్ రోడ్ క్రాస్, ఏలూరు రోడ్ విజయవాడ
బందర్ రోడ్ విజయవాడ
TOLL FREE 1800 570 1999
Email : info@rsbrothers.net | Shop us @ www.rsbrothers.net Follow us on : RSBrothersIndia rsbrothersindia

# ఈనాడు



విజయవాడ 2-8-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 354
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

## తెలుగు సినిమా జాతీయ మెరుపులు



షారుక్‌ఖాన్ విక్రాంత్ మాస్సే రాణీముఖర్జీ


- జాతీయ ఉత్తమ నటులు షారుక్ ఖాన్, విక్రాంత్ మాస్సే, ఉత్తమ నటి రాణీముఖర్జీ
- జాతీయ ఉత్తమ చిత్రం 'ట్వల్త్ ఫెయిల్'

ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన భగవంత్ కేసరి

- 'హను-మాన్', 'బేబి' చిత్రాలకు చెరో రెండు పురస్కారాలు
- ఉత్తమ గేయ రచయిత కాసర్ల శ్యామ్
- ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్

మరిన్ని వివరాలు సినిమా లో

3లో




## ట్రంపెడు సుంకాల మోత



### ఒక్కో దేశానికి ఒక్కో విధంగా అమెరికా వడ్డింపు

### ఈ నెల 7 నుంచి అమల్లోకి

### భారత్ సహా 70 దేశాల్లో కలకలం

### సిరియాపై 41% .. పాకిస్థాన్‌కు మాత్రం తగ్గింపు

**వాషింగ్టన్, దిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక్కో దేశానికి ఒక్కో విధమైన సుంకాల మోతతో హడలెత్తిస్తున్నారు. 'సర్దుబాటు చేసిన ప్రతీకార సుంకం' భారత్‌పై 25 శాతంగా ఉంటుందని ప్రకటించిన ఆయన.. ఇవన్నీ ఈ నెల 7 నుంచే అమలవుతాయని తాజాగా వెల్లడించారు. రష్యా నుంచి ఇంధనం, సైనిక సామగ్రి కొంటున్నందుకు భారత్‌పై విధిస్తామన్న జరిమానా గురించి దీనిలో ప్రస్తావించలేదు. పాకిస్థాన్‌కు మాత్రం తొలుత ప్రకటించడానికంటే తగ్గించినా ఇతర దేశాలపై ఎడాపెడా బాదారు. 10% నుంచి 41% వరకు సుంకాలు విధించే కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. 'ప్రతీకార సుంకాల్లో మరిన్ని మార్పులు' పేరుతో దీనిని వెలువరించారు. కొందరు వ్యాపార భాగస్వాములు తమతో అర్థవంతమైన వాణిజ్య, భద్రతపరమైన ఒప్పందాలకు అంగీకరించడమో, త్వరలో సమ్మతి తెలపడమో చేయబోతున్నారని ట్రంప్ దీనిలో పేర్కొన్నారు. వాణిజ్య అడ్డంకుల్ని శాశ్వతంగా తొలగించుకుని తమతో కలిసి ప్రయాణించే ఉద్దేశం వాటికి ఉందని చెప్పారు. ఇతరులు మాత్రం చర్చల్లో పాల్గొంటున్నా వాణిజ్య బంధంలో అసమానతల్ని (మిగతా 3లో)

### రష్యా సమీపంలోకి అమెరికా అణు జలాంతర్గాములు!

మోహరింపునకు ట్రంప్ ఆదేశం

6లో







## 7 నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్తు

### పవర్ లూమ్స్‌కు 500, హ్యాండ్‌లూమ్స్‌కు 200 యూనిట్లు

### తాజాగా 1,08,499 మందికి వితంతు పింఛన్లు

### చెడగొట్టడం.. పడగొట్టడమే వైకాపా నైజం

### ఐదేళ్లపాటు రాష్ట్రంలో విధ్వంసానికి పాల్పడింది

### గూడెంచెరువు ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఈనాడు, కడప: న్యూస్‌టుడే, జమ్మలమడుగు:** మగ్గాలున్న చేనేతకారులకు ఈ నెల 7 నుంచి ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పవర్ లూమ్స్‌కు 500, హ్యాండ్‌లూమ్స్‌కు 200 యూనిట్ల వరకు ఉచితంగా అందిస్తామని వివరించారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం గూడెం చెరువులో శుక్రవారం ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు, బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు సింగపూర్ వెళ్లానని, పేదల పింఛన్ల పంపిణీలో పాల్గొనడం కోసం ముందుగానే తిరిగి వచ్చేశానని చెప్పారు. పింఛన్ల పంపిణీకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు చెబుతూ.. రాష్ట్రంలో 64 లక్షలమందికి ఏటా రూ. 33,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు పునరుద్ఘాటించారు. తాజాగా 1,08,499 మంది వితంతు పింఛన్లకు రూ. 43.40 కోట్లు ఇస్తున్నామని తెలిపారు. మహానాడు వేదికగా ఇచ్చిన హామీ మేరకు జిందాల్ ద్వారా కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టును ఎన్టీఆర్ ప్రారంభించగా తాను పూర్తి చేశానని గుర్తు చేస్తూ.. హంద్రీ- నీవాను శరవేగంగా పూర్తి చేయడంతో పాటు గాలేరు- నగరి ప్రాజెక్టును కడప వరకు పొడిగిస్తామన్నారు. 'చెడగొట్టడం, పడగొట్టడం చాలా తేలిక. నిలబెట్టడమే (మిగతా 3లో)



### వృద్ధురాలికి ఓదార్పు

జమ్మలమడుగు మండలం వేమకుంట గ్రామానికి చెందిన వృద్ధురాలు బోయపాటి వెంకట సుబ్బమ్మ తన మనవరాలు లక్ష్మీదేవి దివ్యాంగురాలని, పింఛన్ రూ.4 వేల నుంచి రూ. 15 వేలకు పెంచి ఆదుకోవాలని సీఎంకు విన్నవించారు. కుటుంబ పోషణకు పడుతున్న కష్టాలను వివరిస్తూ చంద్రబాబును పట్టుకుని విలపించారు. ముఖ్యమంత్రి ఆమెను ఓదార్చి.. తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్‌కు సూచించారు.

### అతనొచ్చేదీ లేదు.. అంతు తేల్చేదీ లేదు

హత్యలు చేసే వారిని తుదముట్టిస్తా

గతంలోలా ఏమాత్రం ఏమరుపాటు ఉండదు

కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు

3లో

## రాబడులు శుభసూచికం

- ఏ జులైలోనూ రానంతగా గత నెలలో జీఎస్టీ వసూళ్లు
- మొత్తం జీఎస్టీలో 14% వృద్ధి
- నికర జీఎస్టీ వసూళ్లలో 12.12% పెరుగుదల




**ఈనాడు, అమరావతి:** రాష్ట్రం ఈ ఏడాది జులైలో గతంలో ఏ జులైలోనూ లేనంత జీఎస్టీ రాబడి సాధించింది. అటు స్థూలంగా పరిశీలించినా, ఇటు నికరంగా లెక్కలు పరిగణనలోకి తీసుకున్నా ఇదే రికార్డు. 2018 నుంచి 2025 వరకు చూస్తే జీఎస్టీ స్థూల వసూళ్లు రూ. 3,803 కోట్లు రాబట్టడం ఇదే మొదటిసారి. నికర జీఎస్టీ వసూళ్లు రూ. 2,930 కోట్లు సాధించడమూ రికార్డే. దక్షిణాది రాష్ట్రాల్లో ఇదే అత్యధికం అని రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కమిషనర్ ఎ.కె.బాబు తెలియజేశారు. పెద్ద రాష్ట్రాలలో మనం మూడో స్థానంలో ఉన్నామన్నారు. తొలి త్రైమాసికంలో వచ్చిన ప్రతికూల ఫలితాలతో పోలిస్తే ఇది ప్రతికూలతను నిరోధించడమే కాకుండా 14% వృద్ధితో ఎగువకు దూసుకువెళ్లామని ఆయన విశ్లేషించారు. (మిగతా 3లో)

# గువాహటిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించండి

## అస్సాం సీఎంను కోరిన తితిదే ఛైర్మన్

తిరుమల, న్యూస్‌టుడే: అస్సాంలోని గువాహటిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించాలని ఆ రాష్ట్ర సీఎం హిమంత బిశ్వశర్మను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. శుక్రవారం అస్సాం వెళ్లిన తితిదే ఛైర్మన్.. అక్కడి సీఎంను కలిసి మాట్లాడారు. ఇందుకు స్పందించిన హిమంత బిశ్వశర్మ స్థలం కేటాయింపుతోపాటు ఆలయ నిర్మాణానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత కామాఖ్య అమ్మవారి ఆలయ విశిష్టతను అస్సాం సీఎం వారికి వివరించారు. అఖిల భారత హిందూ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి జీవీఆర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మకు వినతిపత్రం అందిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



# ఆర్‌ఎంయూల్లో.. అధికంగానే కావాలట!

- ఓ గుత్తేదారు సంస్థ నుంచి తీవ్ర ఒత్తిడి
- టెండరుపై ముందుకెళ్లేందుకు భయపడుతున్న అధికారులు
- రూ.150 కోట్ల పనికి పిలిచిన టెండరు రద్దు

ఈనాడు, అమరావతి: భూగర్భ విద్యుత్ లైన్ల పనుల్లో వినియోగించే రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్‌ఎంయూ) సరఫరా టెండరు మరోసారి రద్దయింది. టెండరు ధరపై ఒక 'నిర్మాణ' సంస్థ అధిక మొత్తాన్ని కోట్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ధరకు దక్కించుకునేందుకు ఉన్నతస్థాయి నుంచి ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ప్రైస్‌బిడ్ తెరిచి.. అధిక ధరకు గుత్తేదారుకు కట్టబెట్టేందుకు అధికారులు భయపడుతున్నట్లు తెలుస్తోంది. అలా చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్న ఆందోళన అధికారుల్లో కనిపిస్తోంది. దీంతో వివిధ సాంకేతిక అంశాలను ప్రస్తావిస్తూ టెండరు ప్రకటననే అధికారులు రద్దు చేసినట్లు తెలిసింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం, ప్రమాదాల నియంత్రణకు భూగర్భ విద్యుత్ లైన్ల పనులను తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) ప్రతిపాదించింది. వాటిలో వినియోగించే ఆర్‌ఎంయూల సరఫరా కోసం ఈ ఏడాది జూన్‌లో రూ.150 కోట్లతో టెండరు పిలిచింది. వైకాపా ప్రభుత్వ హయాంలో విద్యుత్ సంస్థల్లో చక్రం తిప్పిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ (తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందినది), షిరిడీసాయి ఎలక్ట్రికల్స్‌తో పాటు.. మరో నాలుగు కంపెనీలు బిడ్‌లు వేశాయి. బిడ్‌లు దాఖలు చేసిన సంస్థలు సరైన పత్రాలు (క్రెడెన్షియల్స్) సమర్పించలేదని తెలిసింది. దీంతో సాంకేతిక బిడ్ దగ్గరే ప్రక్రియను అధికారులు నిలిపేశారు.

### 10 శాతం వరకు అదనం!

టెండరు ధరపై 10 శాతం అధికంగా కోట్ చేసే అవకాశం గుత్తేదారులకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అంతకుమించి కోట్ చేస్తూ బిడ్‌లు దాఖలైతే.. గుత్తేదారులతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు. ఈ లెక్కన రూ.150 కోట్లపై గరిష్ఠంగా రూ.15 కోట్ల (10 శాతం) వరకు బిడ్ వేసే అవకాశం ఉంటుంది. ఈ టెండరు దక్కించుకోవడం ద్వారా గరిష్ఠ లబ్ధి పొందేందుకు ఒక నిర్మాణ సంస్థ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

◆ ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటు, ఆర్‌ఎంయూల సరఫరా కలిపి రూ.1,165 కోట్లతో 2022 డిసెంబరులో ఈపీడీసీఎల్ మొదటిసారి టెండర్లు పిలిచింది. అయితే అప్పట్లో వివిధ కారణాలతో ఈ ప్రకటనను రద్దు చేసింది.

◆ 2023 ఏప్రిల్‌లో రెండోసారి భూగర్భ విద్యుత్ లైన్లకు రూ.1,194 కోట్లు, ఆర్‌ఎంయూల సరఫరాకు రూ.314 కోట్ల చొప్పున విడదీసి డిస్కం టెండర్లు పిలిచింది. ఒక్క లైన్ల పనులను రాఘవ కన్‌స్ట్రక్షన్స్ రూ.1,295.94 కోట్లకు దక్కించుకుంది. ఇది టెండరు ధరపై రూ.91.94 కోట్లు (7.7 శాతం) అదనం. ఒప్పందం ప్రకారం పనులు ఆగస్టు నాటికి పూర్తి కావాల్సి ఉంటే.. కేవలం 22 శాతం పనులను మాత్రమే సంస్థ పూర్తి చేసింది. మరో ఏడాది గడువు పెంపు కోసం ప్రయత్నిస్తోంది.

◆ భూగర్భ లైన్ల పనుల కోసం అప్పట్లో రాఘవ, షిరిడీసాయి సంస్థలతో పాటు మరో రెండు కంపెనీలు బిడ్‌లు వేశాయి. సాంకేతిక బిడ్‌ల పరిశీలనలో ఆ రెండు కంపెనీల బిడ్లను అధికారులు తిరస్కరించారు. ఎల్1గా రాఘవ, ఎల్2గా షిరిడీసాయి సంస్థలు నిలిచాయి. ఇదే వ్యవహారాన్ని ఆర్‌ఎంయూ టెండర్లలోనూ అమలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అధికారులు మాత్రం సాంకేతిక అంశాల కారణంగా టెండరు రద్దు చేసి.. నిబంధనలు మార్చి కొత్త ప్రకటన ఇవ్వనున్నట్లు చెబుతున్నారు.

# విశాఖలో 5 ఐటీ కంపెనీలకు భూ కేటాయింపులు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ఐదు ఐటీ కంపెనీలకు భూములు కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న నిర్ణయాలు, మంత్రివర్గ సమావేశం ఆమోదంతో ఈ కేటాయింపులు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయా సంస్థలు రూ.19,223 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా, 53,100 మందికి ఉద్యోగాలు కల్పించనున్నాయి.

★ పేనమ్ పీపుల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విశాఖ మధురవాడలోని హిల్-2లో ప్లాట్ నంబరు సీ1ఏలో 45 సెంట్లు, రుషికొండ ఐటీ పార్క్‌లో 4 ఎకరాలు కలిపి మొత్తం 4.45 ఎకరాలు కేటాయించారు. ఎకరా రూ.4.05 కోట్ల ధరతో ఈ కేటాయింపు చేశారు. ఆ సంస్థ రూ.207.5 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా, 2,500 మందికి ఉద్యోగాలు కల్పించనుంది.

★ కపిల్ గ్రూప్‌నకు చెందిన బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌కు వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఏర్పాటుకు వీలుగా ఎండాడ వద్ద ఎకరా రూ.1.5 కోట్ల ధరతో 10 ఎకరాలు కేటాయించారు. ఇక్కడ ఆ సంస్థ రూ.1,250 కోట్ల పెట్టుబడి పెట్టి, 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించనుంది.

★ మధురవాడ ఐటీ సెజ్‌లో సిఫీ ఇన్ఫినిటీ స్పేసెస్ లిమిటెడ్‌కు ఎకరా రూ.కోటి ధర చొప్పున రూ.3.6 ఎకరాలు కేటాయించారు. 550 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు ఎకరా రూ.50 లక్షల చొప్పున ధరతో పరదేశిపాలెంలో 25 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆమోదం తెలిపింది. డేటా సెంటర్ కోసం ఆ సంస్థ రూ.15,266 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 600 మందికి ఉపాధి కల్పించనుంది.

★ ఐటీ స్పేస్, రిటైల్, రెసిడెన్షియల్, డేటా సెంటర్స్ ఏర్పాటు కోసం సత్వ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మధురవాడలో ఎకరా రూ.1.5 కోట్ల ధరతో 30 ఎకరాలు కేటాయించారు. ఈ సంస్థ రూ.1,500 కోట్ల పెట్టుబడి పెట్టనుండగా, 25 వేల మందికి ఉపాధి కల్పించనుంది.

★ విశాఖపట్నం ఐటీ సెజ్‌లో రెండుచోట్ల గ్లోబల్ ఇన్నోవేషన్ సిటీ ఏర్పాటుకు వీలుగా ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎకరా 99 పైసల ధరతో 10.29 ఎకరాలు కేటాయించారు. ఈ సంస్థ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులు పెట్టి, 10 వేల మందికి ఉద్యోగాలు కల్పించనుంది.

# ఉప రాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబరు 9న

ఈనాడు, దిల్లీ: జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి స్థానం భర్తీకి ముహూర్తం ఖరారైంది. 17వ ఉప రాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం షెడ్యూలు విడుదల చేసింది. దీని ప్రకారం సెప్టెంబరు 9న ఈ ఓటింగ్ జరగనుంది. ఉప రాష్ట్రపతి స్థానం ఖాళీ అయినట్లు కేంద్ర హోంశాఖ జులై 22న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషను ఆధారంగా దాని భర్తీకి ఈసీ సమాయత్తమైంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల చట్టం -1952లోని సెక్షన్ 4, సబ్‌సెక్షన్లు (4).. (1)ని అనుసరించి ఇప్పుడు ఎన్నికకు నోటిఫికేషను జారీ చేసింది. ఒకే అభ్యర్థి రంగంలో ఉంటే నామినేషన్ల చివరితేదీ అయిన ఆగస్టు 21కే ఫలితం తేలిపోతుంది. ఎన్నిక అనివార్యమైతే సెప్టెంబరు 9వ తేదీ వరకు వేచిచూడాల్సి ఉంటుంది. పార్లమెంటు ఉభయ సభల్లో ఎన్డీయేకు ప్రస్తుతం స్పష్టమైన మెజార్టీ ఉన్నందున ఈ కూటమి అభ్యర్థి విజయం దాదాపుగా ఖరారు కానుంది. అయినా కాంగ్రెస్ సారథ్యంలోని ప్రతిపక్షాలు ఉమ్మడి అభ్యర్థిని పోటీకి దింపే అవకాశాలు కనిపిస్తున్నాయి. జగదీప్ ధన్‌ఖడ్ పదవీకాలం 2027 ఆగస్టు 11 వరకు ఉన్నప్పటికీ ఆయన రెండేళ్ల ముందుగానే రాజీనామా చేశారు. సాధారణంగా ఎంపీలు, ఎమ్మెల్యేల పదవులకైతే మిగిలిన పదవీకాలం వరకే ఎన్నికలు నిర్వహిస్తారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67 ప్రకారం ఉప రాష్ట్రపతి తన అయిదేళ్ల పదవీకాలానికి ముందే దిగిపోయినా తర్వాత జరిగే ఎన్నిక మళ్లీ అయిదేళ్ల పూర్తి కాలానికే నిర్వహించాల్సి ఉంటుంది. ఉప రాష్ట్రపతి స్థానం మరణం, రాజీనామా, తొలగింపు.. ఇతరత్రా ఏదైనా కారణాల వల్ల ఖాళీ అయితే సాధ్యమైనంత త్వరగా మళ్లీ ఎన్నిక నిర్వహించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 68(2) చెబుతోంది.

**ఓటింగ్ విధానమిలా:** రాజ్యాంగంలోని ఆర్టికల్ 66 ప్రకారం ఉప రాష్ట్రపతిని పార్లమెంటు ఉభయ సభల సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజి ఎన్నుకుంటుంది. దీని ప్రకారం 17వ ఉప రాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజి పరిధిలోకి రాజ్యసభ నుంచి 233 మంది ఎన్నికైన సభ్యులు, 12 మంది నామినేటెడ్ సభ్యులు.. లోక్‌సభ నుంచి 543 మంది ఎన్నికైన సభ్యులు వస్తారు. ప్రస్తుతం రాజ్యసభలో 5 సీట్లు, లోక్‌సభలో 1 సీటు ఖాళీగా ఉన్నందున మిగిలిన 782 మంది ఉప రాష్ట్రపతి ఓటింగులో పాల్గొననున్నారు. ఇందులో ప్రతి సభ్యుడి ఓటు విలువ ఒకటిగానే ఉంటుంది. విజయానికి 391 ఓట్లు అవసరం కాగా, ఎన్డీయేకు 422 మంది సభ్యుల బలముంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 66(1) ప్రకారం ఈ ఎన్నిక దామాషా ప్రాతినిధ్య విధానం ప్రకారం, సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటింగ్ పద్ధతిలో జరుగుతుంది. ఇందుకు రహస్య బ్యాలెట్ విధానం అనుసరిస్తారు. ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థుల పేర్ల పక్కన ఓటర్లు తమ ప్రాధాన్యతను తెలిపే అంకె వేయాలి.. అక్షరాల్లో రాయకూడదు. బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్యనుబట్టి ఓటర్లు తమకు నచ్చినంత వరకు ప్రాధాన్య అంకెలను బ్యాలట్‌పై రాయొచ్చు. ఓటు చెల్లుబాటు కావాలంటే మొదటి ప్రాధాన్య అంకె తప్పనిసరిగా వేయాలి. మిగతా ప్రాధాన్య అంకెలు నచ్చితే వేయొచ్చు.. లేదంటే లేదు. ఈ ఓటింగ్ కోసం ఈసీ ఓటర్లకు ప్రత్యేక పెన్నులు అందిస్తుంది. పోలింగ్‌స్టేషనులో అధికారి బ్యాలెట్‌తోపాటు ఈ పెన్ను కూడా ఇస్తారు. ఓటర్లు ఆ పెన్నుతోనే మార్కింగు చేయాల్సి ఉంటుంది. మరే పెన్ను వాడినా కౌంటింగ్‌లో ఆ ఓటును చెల్లుబాటు కానిదిగా పక్కన పెడతారు.

### ఇదీ షెడ్యూలు

| | |
|---|---|
| నోటిఫికేషన్ జారీ | ఆగస్టు 7 |
| నామినేషన్లకు చివరితేదీ | ఆగస్టు 21 |
| నామినేషన్ల పరిశీలన | ఆగస్టు 22 |
| నామినేషన్ల ఉపసంహరణకు చివరితేదీ | ఆగస్టు 25 |
| పోలింగ్ తేదీ (ఎన్నిక అవసరమైతే) | సెప్టెంబర్ 9 |
| పోలింగ్ సమయం | ఉదయం 10.00 నుంచి సాయంత్రం 5.00 వరకు |
| ఓట్ల లెక్కింపు | అదే రోజు సాయంత్రం |

# వేతనం రూ.15,000.. ఆస్తి రూ.100 కోట్లపైనే!

## కర్ణాటకలో ఒప్పంద చిరుద్యోగి అవినీతి విశ్వరూపం!

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: లంచాల ఆరోపణలు ఎదుర్కొంటున్న కళకప్ప నిడగుంది అనే చిరుద్యోగి రూ.కోట్లకు పడగెత్తిన వైనం చూసి కర్ణాటక లోకాయుక్త అధికారులు ముక్కున వేలేసుకున్నారు. కళకప్ప నివాసంపై లోకాయుక్త అధికారులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. కేఆర్ఐడీఎల్ (కర్ణాటక గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ)లో సహాయక ఉద్యోగిగా పనిచేస్తున్న అతని ఆస్తి రూ.100 కోట్ల పైచిలుకు ఉన్నట్లు గుర్తించారు. కళకప్ప పేరిట, ఆయన కుటుంబసభ్యుల పేరిట 24 నివాసాలు, ప్రధాన కాలనీల్లో 30కుపైగా ఇంటి స్థలాల పట్టాలు, నగదు, విలువైన ఆభరణాలు లభించాయని అధికారులు శుక్రవారం తెలిపారు. కొప్పళ జిల్లా యలబుర్గా తాలూకా బండిహాళకు చెందిన కళకప్ప 20 ఏళ్లుగా ఒప్పంద పద్ధతిలో సహాయక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొద్ది రోజుల కిందట లంచం తీసుకుంటూ దొరికిపోయి సస్పెన్షన్‌కు గురయ్యాడు. సస్పెండ్ అయ్యే సమయానికి అతని వేతనం నెలకు రూ.15 వేలు. కేఆర్ఐడీఎల్‌లో జడ్.ఎం.చించోళ్లికర అనే ఆయన కార్యనిర్వాహక ఇంజినీర్(ఈఈ)గా ఉన్నప్పుడు రూ.100 కోట్ల పనులకు నకిలీ బిల్లులు పెట్టి సొమ్ము చేసుకున్న ఆరోపణలు ఉన్నాయి. చించోళ్లికర, కళకప్ప, ఒక గుత్తేదారుపై సీనియర్ అధికారులు ఇటీవలే లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే కళకప్ప నివాసంపై అధికారులు దాడులు చేయడం గమనార్హం.

# అతనొచ్చేదీ లేదు.. అంతు తేల్చేదీ లేదు

● తెదేపా అధినేత చంద్రబాబు

ఈనాడు, కడప: 'హత్యలు చేయను.. చేసేవారిని తుదముట్టించే వరకు వదిలిపెట్టను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. రాజకీయ ముసుగులో కొందరు అరాచకాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని, వారి అంతు తేలుస్తానని స్పష్టం చేశారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగులో తెదేపా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అరాచకాలు సృష్టించే వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టే ప్రసక్తే లేకుండా సీసీ కెమెరాలు, డ్రోన్ల వంటి సాంకేతికతను వినియోగిస్తున్నామన్నారు. గతంలో కొంత ఏమరుపాటుగా ఉండటంతో పులివెందులలో వివేకానందరెడ్డిని హత్య చేసి తాను చేసినట్లుగా ఆరోపించారన్నారు. అందుకే అప్పట్లో ప్రతిపక్షం గెలిచిందని, ఇప్పుడా అవకాశం ఇవ్వబోనన్నారు. మళ్లీ ఆ అరాచకవాది అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు. 'తాగించి.. మనుషుల్ని రోడ్ల పైకి తీసుకెళ్లి రెచ్చిపోతున్నారు. మళ్లీ వస్తా.. అంతు తేలుస్తానంటూ ఊదరగొడుతున్నారు. అతని మాటలు ఎవరూ నమ్మడం లేదు. రాష్ట్రంలో పెట్టుబడుల విషయంలో ఒప్పందాల పునరుద్ధరణకు సింగపూర్ ముందుకు రావడమే అందుకు నిదర్శనం' అని పరోక్షంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. రాజధాని అమరావతిని సర్వనాశనం చేశారు. పోలవరం ప్రాజెక్టును గంగలో కలిపేశారు. రాష్ట్రాన్ని అన్నిరకాలుగా అఘాతంలోకి నెట్టేశారు. రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసి.. దోచుకున్నారు' అని విమర్శించారు.

● **పొలిటికల్ గవర్నెన్స్‌తో పదవులు:** కార్యకర్తల అభిప్రాయం మేరకే నామినేటెడ్ పదవులిస్తున్నామని.. త్వరలోనే మరిన్ని అవకాశాలు కల్పించేలా పొలిటికల్ గవర్నెన్స్ అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. అందుకే పర్యటనల్లో కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇచ్చే సందర్భంగా గ్రామ, మండల నేతలు పాల్గొని.. లబ్ధిదారులకు వాటిని తెదేపా ప్రభుత్వం ఇస్తున్నదనే విషయాన్ని గుర్తు చేయాలని సూచించారు. జమ్మలమడుగులో కొత్తగా స్థాపించే పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. వైకాపా దుష్ప్రచారంపై అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు.

● **జగన్ ఘరానా మోసగాడు:** 'జగన్ ఘరానా మోసగాడు. సొంత పత్రిక, ఛానల్‌లను అడ్డంపెట్టుకుని తప్పుడు ప్రచారాలతో ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. సాక్షి మీడియాను అనుసరిస్తే కుక్క తోక పట్టుకుని గోదారి ఈదినట్టే. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సౌమ్యురాలు. ఆమె వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడిన వారిని మందలించాల్సింది పోయి.. ఇంకా నోటికొచ్చినట్లు మాట్లాడేలా ప్రోత్సహించడాన్ని ఏమనాలి? పార్టీ అధినేతగా ఉన్న వ్యక్తి తన పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలను క్రమశిక్షణలో ఉంచాలి' అని అన్నారు.

● **బంగారుపాళ్యం నెల్లూరులో ఉందట!:** 'చిత్తూరు జిల్లాలో బంగారుపాళ్యం ఉంటే, అక్కడి పర్యటన దృశ్యాలను.. ఆ దుర్మార్గుడి నెల్లూరు పర్యటనతో జత కలిపి భారీగా జనం వచ్చినట్లు చూపించారు. ఇలాంటి జిమ్మిక్కులతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తున్నారు. పర్యటనలతో అసౌకర్యం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం.

● అందరికీ అందుబాటులో ఉంటా. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల్ని కూడా హెచ్చరిస్తున్నా. మేము మాత్రం బాగుంటాం. కార్యకర్తల్ని పట్టించుకోం అంటే కుదరదు. అందరూ ప్రజల్లో ఉండాలి' అని సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గండికోట విశేషాల గురించి స్థానికులను అడిగి తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



గూడెం చెరువు గ్రామంలో ప్రజావేదికకు హాజరైన స్థానికులు, తెదేపా నేతలు, కార్యకర్తలు



చేనేత కార్మికుడి ఇంటికి వెళ్లి మగ్గంపై వస్త్రం తయారీ గురించి తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

# 7 నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్తు

(మొదటి పేజీ తరువాయి)

చాలా కష్టం' అని ముఖ్యమంత్రి అన్నారు. వైకాపా పాలనలో ఐదేళ్లపాటు విధ్వంసానికి పాల్పడ్డారని విమర్శించారు. కేంద్రం అమలు చేసిన 95 ప్రాయోజిత పథకాలను నిలిపేసి రాష్ట్రానికి అన్యాయం చేశారని, వాటిని సరిచేయడానికి ఎంతో కష్టపడుతున్నామని తెలిపారు. గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులు తెలుసుకున్నారు. ఉల్సాల అలివేలమ్మకు పింఛను అందించి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. వారింట్లో చేనేత మగ్గాన్ని పరిశీలించారు.

**సీమ పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళిక**

పారిశ్రామికంగా సీమ అభివృద్ధికి పూర్తిస్థాయి ప్రణాళిక తయారు చేశామని చంద్రబాబు తెలిపారు. సీమలోని ప్రాజెక్టులన్నీ నీటితో కళకళలాడుతున్నాయని, ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చడానికి శ్రీకారం చుట్టామన్నారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద రైతులకు ఆర్థిక సాయాన్ని శనివారం చెల్లిస్తామని, కేంద్రం ఇచ్చే రూ.2 వేలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 వేలు కలిపి జమ చేస్తామని చెప్పారు.

**గండికోటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

గండికోట ప్రాంతంలో అభివృద్ధి పనులకు సాస్కీ కింద రూ.78 కోట్లతో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. గండికోటను అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేసిందని వివరించారు. ఈజ్ మై ట్రిప్, హిల్టన్ హోటల్స్ సహా వివిధ సంస్థలు ఏపీ టూరిజం కార్పొరేషన్‌తో రూ.500 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నాయి. గండికోట, శ్రీశైలం, మంత్రాలయం, తిరుపతి తదితర ప్రాంతాల్లో హోటళ్ల నిర్మాణం, సాహస క్రీడలు, హైరోప్, కయాకింగ్, జెట్‌స్కీయింగ్ వంటి ఒప్పందాలు ఇందులో ఉన్నాయి. అనంతరం చంద్రబాబు గండికోట సందర్శించి పర్యాటకులతో ముచ్చటించారు. మంత్రులు సవిత, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, తెదేపా కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

## ఆటో ఎక్కిన ముఖ్యమంత్రి

ఈనాడు, కడప: న్యూస్‌టుడే, జమ్మలమడుగు: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆటోలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. పింఛన్ల పంపిణీ కోసం గూడెం చెరువు గ్రామానికి వచ్చిన ఆయన తొలుత డ్రైవర్ జగదీష్ ఇంటికి వెళ్లారు. అతని కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. జగదీష్ ఆటో నడుపుతున్న విషయం తెలిసి తనకు బాడుగకు వస్తావా? అని అడిగారు. అతను సరేననడంతో తన కాన్వాయ్‌ను వదిలి ఆటోలో కూర్చున్నారు. 2 కి.మీ దూరంలోని ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. ప్రయాణ సమయంలో జగదీష్‌తో కుటుంబ పరిస్థితి గురించి ఆరా తీశారు. ఆటో దిగాక ఛార్జీ చెల్లించారు. ఉద్వేగానికి గురైన జగదీష్.. చంద్రబాబుకు పాదాభివందనం చేశారు.



**సొంత ఇలాకాలో జగన్‌కు ఝలక్**

పులివెందుల, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో పలువురు వైకాపా నాయకులు ఆ పార్టీని వీడి తెదేపాలో చేరారు. వైకాపా జిల్లా అధికార ప్రతినిధి మోడెం పుష్పనాథరెడ్డి జమ్మలమడుగు పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరారు. ఆయనతో పాటు కొత్తపల్లె సర్పంచి ప్రసాద్‌యాదవ్, పులివెందుల కౌన్సిలర్ కమలమ్మ, ఆమె భర్త శేషు కూడా తెదేపాలో చేరారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో తెదేపాలోకి వలసలు పెరగనున్నాయని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

## గ్రహం అనుగ్రహం


2-8-2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
**అష్టమి:** ఉ. 5-49 తదుపరి నవమి
**విశాఖ:** పూర్తి
**వర్జ్యం:** ఉ. 9-35 నుంచి 11-22 వరకు
**అమృత ఘడియలు:** రా. 8-15 నుంచి 10-01 వరకు
**దుర్ముహూర్తం:** ఉ. 5-42 నుంచి 7-24 వరకు
**రాహుకాలం:** ఉ. 7-30 నుంచి 9-00 వరకు
**సూర్యోదయం:** ఉ.5.42; **సూర్యాస్తమయం:** సా.6.30

## వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| నెల్లూరు | 38.0 | 29.0 |
| రాజమహేంద్రవరం | 38.0 | 26.0 |
| విశాఖపట్నం | 37.2 | 27.8 |
| తిరుపతి | 37.2 | 26.6 |
| ఒంగోలు | 36.7 | 28.4 |
| విజయవాడ | 36.5 | 28.0 |
| నరసాపురం | 36.3 | 26.5 |
| గుంటూరు | 36.0 | 29.0 |
| విజయనగరం | 36.0 | 27.0 |
| కడప | 36.0 | 26.0 |
| తాడేపల్లిగూడెం | 35.6 | 27.9 |
| శ్రీకాకుళం | 35.0 | 28.0 |
| కర్నూలు | 34.0 | 24.7 |
| అనంతపురం | 33.8 | 24.0 |
| కరీంనగర్ | 33.0 | 25.0 |
| నిజామాబాద్ | 31.9 | 24.9 |
| హైదరాబాద్ | 31.6 | 23.3 |
| మహబూబ్‌నగర్ | 31.0 | 23.5 |

## ఇదీ సంగతి!




కంగ్రాట్స్ సార్! ఆటలపై మీ మక్కువ, టాలెంట్ చూసి క్రీడా శాఖ ఇచ్చారట

# హైకోర్టు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్ గేదెల

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా న్యాయవాది తుహిన్ కుమార్ గేదెల నియమితులయ్యారు. ఈ నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం గత నెల 2న సమావేశమై తుహిన్ కుమార్ పేరును హైకోర్టు న్యాయమూర్తిగా నియమించే నిమిత్తం కేంద్రానికి సిఫారసు చేసింది. తుహిన్ కుమార్ నియామకంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరనుంది.

**తుహిన్ నేపథ్యమిదే..**

తుహిన్ కుమార్ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా (ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా) వీరఘట్టం మండలం, కత్తులకవిటి గ్రామానికి చెందినవారు. తల్లిదండ్రులు సరోజినినాయుడు, కృష్ణమూర్తినాయుడు. తుహిన్ కుమార్ విశాఖపట్నంలో సెయింట్ ఎలోషియస్‌లో పాఠశాల విద్య, అక్కడే కృష్ణా కళాశాలలో ఇంటర్ చదివారు. న్యాయశాస్త్రం ప్రవేశాల నిమిత్తం నిర్వహించిన లాసెట్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు పొందారు. విశాఖపట్నం ఎన్‌బీఎం న్యాయ కళాశాల నుంచి ఎల్‌ఎల్‌బీ పట్టా అందుకున్నారు. 1994 మార్చి 9న బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. విశాఖలోని సీనియర్ న్యాయవాది మంగు రామదాసు(ఎంఆర్‌డీ) వద్ద జూనియర్ న్యాయవాదిగా పనిచేశారు. ఏడాదిన్నర తర్వాత ప్రాక్టీసును హైదరాబాద్ హైకోర్టుకు మార్చారు. సీనియర్ న్యాయవాది కొతూరు వినయ్‌కుమార్ ఆఫీసులో జూనియర్‌గా చేరారు. 2000-04 మధ్య హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా పనిచేశారు. ఆ తర్వాత సీనియర్ న్యాయవాది సరసాని సత్యంరెడ్డి, న్యాయవాది సి.శ్రీనివాసబాబా ఆఫీసులకు సంబంధించిన కేసులను హైకోర్టులో వాదించారు. 2010-14 మధ్య గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ తరపున హైకోర్టులో స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేశారు. 2016-17లో హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు అన్ని విభాగాలకు సంబంధించిన కేసులను వాదించిన అపార అనుభవం ఉంది.

## షార్ప్ షూటర్లు వచ్చారన్న జర్నలిస్టు అజ్ఞాతంలోకి

ఈనాడు, అమరావతి: మాజీ సీఎం జగన్‌ను అంతం చేయడానికి అమెరికా నుంచి 200 మంది షార్ప్ షూటర్లు వచ్చారని, ఆయన పర్యటించే ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తున్నారంటూ జులై 20న 99 టీవీ ఛానల్‌లో చెప్పిన పత్రి వాసుదేవన్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఫోన్ స్విచాఫ్ చేశారు. ఆయన వెనుక ఎవరైనా ఉన్నారా? ఉద్దేశపూర్వకంగా చెప్పారా అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రజల్లో అనుమానాలు రేకెత్తించేలా... వర్గాలు, ప్రాంతాల మధ్య ఘర్షణ సృష్టించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని గుంటూరుకు చెందిన జనసేన నేత యర్రంశెట్టి సాయినాథ్ ఫిర్యాదు మేరకు జులై 22న నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు రావాలని వాసుదేవన్‌కు పోలీసులు 41ఏ నోటీసు ఇవ్వడానికి జులై 26న హైదరాబాద్ వెళ్లారు. అప్పటికే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పోలీసులు ఈ విషయాన్ని ఛానల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సీఈఓ, ముగ్గురు సీనియర్ జర్నలిస్టుల స్టేట్‌మెంట్ తీసుకున్నారు. వాసుదేవన్‌ను జులై 29న విచారణకు గుంటూరు పంపుతామని వారు చెప్పడంతో పోలీసులు వచ్చేశారు. ఆ రోజు విచారణకు రాకపోవడంతో ఆ విషయాన్ని ఛానల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. అదేరోజు ఛానల్ చీఫ్ ఎడిటర్ భావనారాయణ నల్లపాడు స్టేషన్‌కు వచ్చి స్టేట్‌మెంట్ ఇచ్చారు. వాసుదేవన్ కథనంపై తమకెలాంటి సమాచారం లేదని, ఆయన వద్ద ఎలాంటి ఆధారాలున్నాయో తెలియదని చెప్పినట్లు సమాచారం. వాసుదేవన్ వ్యాఖ్యల వీడియోను పరిశీలించిన పోలీసులు.. గతంలో ఆయన చేసిన విశ్లేషణలనూ పరిశీలిస్తున్నారు. ఆయన అందుబాటులో లేరని, చట్టపరంగా తదుపరి చర్యలు తీసుకుంటామని నల్లపాడు సీఐ వంశీధర్ తెలిపారు.

## మచిలీపట్నం సెషన్స్ కోర్టు తరలింపు పిటిషన్‌పై విచారణకు సుప్రీం నిరాకరణ

ఈనాడు, దిల్లీ: కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం సెషన్స్ కోర్టును అవనిగడ్డకు తరలించడాన్ని సవాల్ చేస్తూ బూరగడ్డ అశోక్‌కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. "కొత్త కోర్టు ఎప్పుడు ఏర్పాటు చేసినా.. న్యాయవాదులు దాన్ని వ్యతిరేకిస్తుంటారు. కోర్టులున్నది కక్షి దారుల కోసం తప్పితే న్యాయవాదుల కోసం కాదు. మేం ఇంటివద్దే న్యాయం అందించాలని, గ్రామ న్యాయాలయాలు ఏర్పాటు కావాలని చెబుతున్నాం" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ శుక్రవారం ఈ కేసు విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు. దాంతో పిటిషనర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. మచిలీపట్నం 5వ అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టును అవనిగడ్డకు తరలిస్తూ ఏపీ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని పిటిషనర్ సవాల్ చేశారు. ఇదే అంశాన్ని సవాల్ చేస్తూ మచిలీపట్నం బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టేసింది.

## జాతీయ పురస్కారాల్లో తెలుగు సినిమా మెరుపులు

ఈనాడు, సినిమా విభాగం: జాతీయ పురస్కారాల్లో మరోమారు తెలుగు సినిమా కీర్తి పతాకం రెపరెపలాడింది. వివిధ విభాగాల్లో 7 పురస్కారాలు దక్కాయి. ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'భగవంత్ కేసరి' నిలిచింది. 'హను-మాన్' చిత్రం ఉత్తమ యాక్షన్ డైరెక్షన్(నందు, పృథ్వీ), యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్ విభాగాల్లో పురస్కారాలు గెలుచుకోగా, 'ఊరూ పల్లెటూరు...'(బలగం) పాటకు ఉత్తమ గేయ రచయితగా కాసర్ల శ్యామ్‌కు అవార్డు దక్కింది. 'బేబి' చిత్రానికి ఉత్తమ నేపథ్య గాయకుడిగా పీవీఎన్ ఎస్ రోహిత్, ఉత్తమ స్క్రీన్‌ప్లేకి గాను సాయి రాజేశ్ నీలంకు పురస్కారాలు దక్కాయి. బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ విభాగంలో 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నటించిన ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి అవార్డు గెలుచుకున్నారు. తెలుగు దర్శక నిర్మాతలు రూపొందించిన 'యానిమల్', 'వాతి(సార్)' చిత్రాలకూ కొన్ని పురస్కారాలు దక్కాయి. ఈసారి జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం షారుక్ ఖాన్(జవాన్), విక్రాంత్ మాస్సే(ట్వల్త్ ఫెయిల్)లకు దక్కింది. రాణీముఖర్జీ(మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే) ఉత్తమ నటిగా నిలిచారు. 'ట్వల్త్ ఫెయిల్' జాతీయ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఉత్తమ దర్శకుడిగా సుదీప్తో సేన్(ది కేరళ స్టోరీ) అవార్డు గెలుచుకున్నారు. శుక్రవారం దిల్లీలో పురస్కారాలను ప్రకటించారు.

# కార్యకర్తలను రెచ్చగొట్టి మాపైకి ఉసిగొల్పడం దారుణం

● జగన్‌పై పోలీసు అధికారుల సంఘం ఆగ్రహం

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: నేరాలు చేసిన వారిని పరామర్శించడానికి వచ్చిన వైకాపా అధినేత జగన్ శాంతిభద్రతల రక్షణ కోసం కష్టపడి విధులు నిర్వర్తిస్తున్న పోలీసులను నిందించడాన్ని పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం నెల్లూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'గతంలో జగన్ పర్యటనలో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకుని.. పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేసి మేం విధులు నిర్వర్తిస్తుంటే.. ఏదో ఒక అలజడి సృష్టించాలనే దురుద్దేశంతో కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసుల మీదకు వదలడం హేయమైన చర్య' అని పేర్కొన్నారు. 'మాజీ ముఖ్యమంత్రి జగన్ నెల్లూరు పర్యటనలో పోలీసులను ఇష్టానుసారంగా నిందించడం దారుణం. ఉద్దేశపూర్వకంగా కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులపై దాడులు చేయడానికి ప్రోత్సహించడాన్ని ఖండిస్తున్నాం. హెడ్‌కానిస్టేబుల్ మాలకొండయ్య చెయ్యి విరగడానికి కారణమైన వారిపై చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాం. 'పోలీసు అధికారులు డబ్బులు వసూలు చేసి రాజకీయ నాయకులకు పంచుతున్నారని ఆరోపించడం, ఉద్యోగులు రిటైర్ అయినా.. ఎక్కడ ఉన్నా తీసుకువచ్చి శిక్షిస్తామంటూ బెదిరించడం సిగ్గు చేటని.. దీన్ని పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందని నిరసన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి తురకా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు.. సంఘం ప్రతినిధులు



# రాబడులు శుభసూచికం

(మొదటి పేజీ తరువాయి)

**ఇవీ మైలు రాళ్లు:** జీఎస్టీ నికర వసూళ్లు 2024 జులైతో పోలిస్తే గత జులైలో 12.12% మేర అధికంగా వచ్చాయి.

● జీఎస్టీ మొత్తం వసూళ్లలో 14% మేర వృద్ధి ఉంది.

● ఈ జులైలో ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.1,226 కోట్లు సాధించారు. కిందటేడాదితో పోలిస్తే ఇది 14.47% అధికం. వస్తు, సేవల వినియోగం పెరగడంతో పాటు తగిన పర్యవేక్షణ వల్ల ఈ ఫలితాలు వచ్చాయని వాణిజ్య పన్నుల శాఖ విశ్లేషిస్తోంది.


| సంవత్సరం | జీఎస్టీ మొత్తం వసూళ్లు | జీఎస్టీ నికర వసూళ్లు (జులై నెలకు సంబంధించి, అంకెలన్నీ రూ.కోట్లలో) |
|---|---|---|
| 2018 | 2,026 | 1,560 |
| 2019 | 2,138 | 1,685 |
| 2020 | 2,138 | 1,780 |
| 2021 | 2,730 | 2,214 |
| 2022 | 3,409 | 2,364 |
| 2023 | 3,593 | 2,755 |
| 2024 | 3,346 | 2,613 |
| 2025 | 3,803 | 2,930 |

● ఐజీఎస్టీ సర్దుబాటు తర్వాత రూ.1,704 కోట్లు రాష్ట్రానికి వచ్చాయి. కిందటి ఏడాది జులైతో పోలిస్తే ఇది 10.69% అధికం.

● జీఎస్టీ, పెట్రోలియం ఉత్పత్తులు, లిక్కర్‌పై వ్యాట్, వృత్తి పన్ను.. ఇలా అన్నీ కలిపి 2024 జులైలో రూ.4,044 కోట్ల రాబడి సాధించగా, ఈ ఏడాది జులైలో రూ.4,493 కోట్లు వసూలయ్యాయి. అంటే 11.11% మేర వృద్ధి నమోదైంది.

● ఇలాంటి సానుకూల ఫలితాలు రావడానికి పన్నులు ఎగ్గొట్టకుండా నిఘా పెంచడం, ఐజీఎస్టీ సర్దుబాట్లను గాడిలో పెట్టడంతో పాటు పెట్రోలియం ఉత్పత్తులపై రాబడి పెరగడం కూడా కారణమని వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు విశ్లేషించారు. వృత్తి పన్నులో 55% వసూళ్లు సాధించామని పేర్కొన్నారు.

# ట్రంపెడు సుంకాల మోత




(మొదటి పేజీ తరువాయి)

తొలగించుకునేందుకు తగిన ప్రయత్నాలు చేయడం లేదని మండిపడ్డారు.

**కెనడా, బ్రెజిల్‌లకు వడ్డింపు:** సిరియాపై అత్యధికంగా 41శాతం టారిఫ్‌ను విధించారు. దాదాపు 70 దేశాలపై.. ఉన్న సుంకాలను పెంచారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై సుంకాన్ని 25 నుంచి 35 శాతానికి పెంచారు. బ్రెజిల్‌పై ఇప్పటికే ఉన్న 10 శాతం సుంకాలకు అదనంగా 40 శాతం కలిపారు. పాకిస్థాన్‌కు మాత్రం 29% నుంచి 19 శాతానికి తగ్గించారు. ఆఫ్రికాలోని లెసోతో దేశానికి 50% టారిఫ్ పడుతుందని తొలుత బెదిరించినా ఇప్పుడు 15 శాతానికి తగ్గించారు. తైవాన్‌కు 20%, స్విట్జర్లాండ్‌కు 39% పడుతుంది. ఇక జాబితాలో లేని దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై 10 శాతం సుంకం ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. ట్రంప్ ఇదివరకు విధించిన గడువు ఆగస్టు 1 కావడంతో ముందే వివిధ దేశాలు, కూటములు అమెరికాతో ఒప్పందాలు ఖరారు చేసుకున్నాయి. అమెరికా అనుసరిస్తున్న 'రక్షణాత్మకవాదం'లో ఇది కొత్తదశగా చెబుతున్నారు.

**రవాణాలో ఉన్నవాటికి మినహాయింపు:** ప్రస్తుతం రవాణాలో ఉన్న సరకులకు, ఆ నెల 7లోగా నౌకల్లోకి తరలించినవాటికి కొత్త టారిఫ్ నుంచి సడలింపు ఉంటుందని 'భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య' డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ తెలిపారు. అక్టోబరు 5లోగా అమెరికాలో వినియోగించేందుకు ఆమోదం పొందిన సరకుకు కూడా ప్రతీకార సుంకాలు పడబోవన్నారు. ఇప్పటికే నౌకల్లో వెళ్తున్న, కొద్దిరోజుల్లో వెళ్లబోతున్నవాటికి ఆ మేరకు ఉపశమనం లభిస్తుందని చెప్పారు. ప్రపంచంలో వేర్వేరు దేశాలకు విభిన్న సుంకాలు ఉండటంతో వీటిని అమలు చేయడం అమెరికా కస్టమ్స్ అధికారులకూ సవాలేనని చెబుతున్నారు. అమెరికా కంపెనీలకూ కొన్ని ఇబ్బందులు తప్పవని 'ఆసియా సొసైటీ పబ్లిక్ ఇన్‌స్టిట్యూట్' సీనియర్ ఉపాధ్యక్షురాలు వెండీ కట్లర్ చెప్పారు.

**ట్రంప్‌నకు నోబెల్ బహుమతి ఇవ్వాలి: శ్వేతసౌధం**

ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలనే డిమాండ్‌ను శ్వేతసౌధం పునరుద్ఘాటించింది. ఆయన సగటున నెలకు ఒకటి చొప్పున దేశాల మధ్య శాంతి ఒప్పందాలు కుదుర్చుతున్నారని చెప్పింది. ఇప్పటికే ఆయనకు నోబెల్ శాంతి బహుమతి రావాల్సిందని పేర్కొంది.

# నేడు 2 ఎన్‌హెచ్‌లు జాతికి అంకితం

పాల్గొననున్న కేంద్ర మంత్రి గడ్కరీ, సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పరిధిలోని జాతీయ రహదారుల(ఎన్‌హెచ్)కు సంబంధించి రూ.5,233 కోట్ల విలువైన పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి కేంద్ర రహదారి రవాణ, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శనివారం శంకుస్థాపలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. విస్తరణ పూర్తయిన మదనపల్లె-పీలేరు జాతీయ రహదారి, కర్నూలు-మండ్లెం వరకు పూర్తయిన మరో జాతీయ రహదారిని ప్రారంభించి జాతికి అంకితమివ్వనున్నారు. అదే సమయంలో రూ.2,381 కోట్ల విలువైన 27 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు.


# ఈనాడు

## ట్రంప్ రాజేస్తున్న అనిశ్చితి జ్వాలలు

మొత్తం ప్రపంచమంతా తన అడుగుజాడల్లో నడుచుకోవాలని అమెరికా ఎప్పుడూ గుడ్లురుముతుంటుంది! తనకు గిట్టని దేశాలతో మిగిలిన వారూ తెగదెంపులు చేసుకోవాలని మొండిపట్టు పడుతుంటుంది కూడా. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక అగ్రరాజ్య ఆధిపత్య పోకడలు ఇంకా ఎక్కువయ్యాయి. ట్రంప్ ఏకపక్ష విధానాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రగతికి ప్రతిబంధకాలవుతున్నాయి. ముఖ్యంగా ఆయన బాదుతున్న ప్రతీకార సుంకాలు- సాఫీగా సాగుతున్న అంతర్జాతీయ వాణిజ్యాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఆ క్రమంలో మిత్రదేశం అంటూనే ఇండియాపై 25శాతం టారిఫ్‌లను ప్రకటించిన ట్రంప్- రష్యాతో వర్తకం నెరపుతోందన్న అక్కసుతో భారతావనిపై అదనంగా జరిమానాల విధింపునకూ సిద్ధమయ్యారు. ఇండియా, రష్యా ఆర్థిక వ్యవస్థలు నిర్జీవమైనవి అంటూ పిల్లి శాపనార్థాలు పెడుతూ తన వదరుబోతుతనాన్ని మరోసారి బయటపెట్టుకున్నారు. దానికితోడు భారతదేశంపై ఎప్పుడూ విద్వేషం వెళ్లగక్కుతూ ఉగ్రవాదాన్ని ఎగుమతి చేస్తున్న పాకిస్థాన్‌లో ఉన్నాయో లేదో తెలియని చమురు నిల్వల వెలికితీతకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పాక్ సైన్యాధిపతి ఆసిం మునీర్‌కు శ్వేతసౌధంలో ఆతిథ్యమివ్వడం మొదలు స్వలాభమే పరమావధిగా తాచుపాములకు ట్రంప్ పాలుపోస్తున్నారు. అందువల్ల స్వీయ భద్రత పట్ల భారత్ సదా అప్రమత్తంగా ఉండక తప్పదు!

అమెరికా ఉత్పత్తులపై ఇండియా చాలా ఏళ్లుగా విపరీతంగా వాణిజ్య సుంకాలు విధిస్తోందని ట్రంప్ ఎప్పటి నుంచో గుండెలు బాదుకుంటున్నారు. వాటిని వీలైనంత వరకు తగ్గించి తమ సాగు, పాడి ఉత్పత్తులకు భారతీయ విపణిలోకి తలుపులు బార్లా తెరవాలని ఆయన పట్టుబడుతున్నారు. తన గొంతెమ్మ కోరికలకు తగిన వాణిజ్య ఒప్పందానికి ఇండియాను ఒప్పించేలా ఒత్తిడి పెంచడానికే ట్రంప్ తాజాగా సుంకాల వడ్డనకు దిగారనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. అమెరికా ఆశించింది జరిగితే- అక్కడి అధిక రాయితీల చలవతో భారీగా పోగుపడుతున్న సరకులు, ఇతర ఉత్పత్తులు అనేకం మన మార్కెట్‌ను ముంచెత్తుతాయి. దానివల్ల ఎనిమిది కోట్ల మంది పాడి రైతులతో కలిపి గ్రామీణ భారతంలోని 70కోట్ల జనజీవితాలు దెబ్బతింటాయి. పైగా అగ్రరాజ్య జన్యుమార్పిడి పంటల వల్ల మన ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో స్వదేశీ రైతులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమలకు ఎలాంటి నష్టం వాటిల్లనివ్వబోమని కేంద్రం స్పష్టంచేయడం హర్షణీయమే. జాతీయ ప్రయోజనాలపై ప్రతికూల ప్రభావం పడకుండా వాషింగ్టన్‌తో వాణిజ్య ఒప్పందాన్ని జాగ్రత్తగా పట్టాలకెక్కించడంలో న్యూదిల్లీ నేర్పుగా నెగ్గుకురావాలి!

స్థానిక వాతావరణ పరిస్థితులు, ఇతర అనుకూలతల దృష్ట్యా ఒక దేశంలో పండే పంటలు, తయారయ్యే వస్తూత్పత్తులు మరోచోట విరివిగా లభించకపోవచ్చు. అలాంటి వాటి ఎగుమతులూ దిగుమతుల ద్వారానే అన్ని దేశాలూ ప్రగతి బాటలో స్థిరంగా ముందుకు సాగగలుగుతాయి. ఆ విధమైన స్వేచ్ఛా వాణిజ్య వాతావరణం పాదుకొనడం వల్లే 1950-2014 మధ్య ప్రపంచ వర్తక పరిమాణం 4500శాతం పెరిగింది. పరస్పర సహకారంతో సమష్టిగా పురోగమించాలనే అంతర్జాతీయ కట్టుబాట్లకు, విశ్వకల్యాణ స్ఫూర్తికి ట్రంప్ తూట్లు పొడుస్తున్నారు. స్వప్రయోజనాలకోసం ఇష్టారీతిగా సుంకాల కొరడా ఝుళిపిస్తున్నారు. కొంతకాలంగా 'బ్రిక్స్' కూటమిపై పళ్లు నూరుతున్న ఆయన బ్రెజిల్‌పై టారిఫ్‌లను 50శాతానికి పెంచారు. పదుల కొద్దీ దేశాలపై సుంకాల భారాన్ని మరింత పెంచాలని తాజాగా నిర్ణయించారు. అంతర్జాతీయ సరఫరా గొలుసులను దెబ్బతీస్తున్న ట్రంప్ ఒంటెత్తు పోకడలు- భవిష్యత్తుపై అనిశ్చితిని రాజేస్తున్నాయి!



చదువు ప్రధాన లక్ష్యం విషయ సేకరణ, వాస్తవాలను కంఠతా పట్టడం కాదు. చదువంటే సరైన పద్ధతిలో తార్కికంగా ఆలోచించేలా మనసుకు శిక్షణ ఇవ్వడం.

– ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే

ప్రఖ్యాత రసాయన శాస్త్రవేత్త

## మనలోనే ఉన్నాడు!

పంచభూతాత్మకమైన ఈ సృష్టి చిత్రాతిచిత్రమైంది. సృష్టికర్త పరమాత్మ. ఆయన మనతో మాట్లాడుతూనే ఉంటాడు. మనకు వినే ఓపికా, తీరికా ఉండవు. నాభిలో కస్తూరిని ఉంచుకుని, దానికోసం గడ్డిలో వెతికే లేడిలా ఎక్కడెక్కడో స్వామికోసం అన్వేషిస్తూంటాం. ఆయన మనలోనే ఉన్నాడు. 'బుద్ధి' అనే శక్తి ద్వారా హెచ్చరిస్తూంటాడు. అంతరాత్మ ప్రబోధం నిత్యం జరుగుతూనే ఉంటుంది. దాన్ని గ్రహించి అప్రమత్తులం కాకపోవడం మన అవివేకం, అజ్ఞానం. లోచూపు ఉంటేనే ఆయన కనపడతాడు. తన ఇష్టులతోనే మాట్లాడతాడు. ఇష్టులంటే ఎవరు? ప్రతిఫలాపేక్ష వీడి, కర్మచేస్తూ ఫలితం ఆయనకే వదిలేసేవారు. వారినే భక్త శిఖామణులంటాం!

భగవంతుడి కళ్లు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. రెప్పవాల్చకుండా ఆయనలా చూస్తుంటే మనం దర్శనం కోసం వెళ్లి కళ్లు మూసుకుంటాం. ఇంకా అజ్ఞానపు చీకట్లు, ఇక్కట్ల వలలో పడి కొట్టుమిట్టాడుతుంటాం. ఒక గురువు శిష్యుడికి హితబోధ చేస్తున్నాడు 'దేవుడు కనిపిస్తాడు, వినిపిస్తాడు. అది గ్రహించి నిన్ను నువ్వు కాపాడుకో నాయనా!' అని. శిష్యుడో సారి అడవిలో వెళ్తుంటే ఓ ఏనుగు ఘీంకరిస్తూ అతనికెదురైంది. బెదిరిపోయి, భయంతో పరిగెత్తి ఆశ్రమానికి చేరాడు. గురువు దగ్గరికెళ్లి 'దేవుడంతటా ఉన్నాడన్నారు, ఆ ఏనుగులోనూ ఉండుంటే అది నా వెంట ఎందుకు పడింది గురువుగారూ'! అని అడిగాడు. గురువు బదులిస్తూ 'నువ్వు మూర్ఖంగా ఎదురెళ్తోంటే అది ఘీంకరించింది. అది నీకు హెచ్చరికే. పైగా ఏనుగుపైన ఉన్న మావటివాడు నిన్ను 'తప్పుకో' అని చెబుతూనే ఉన్నాడు. ఆయనా దేవుడే, కానీ నువ్వే వినిపించుకోలేదు. అదే అజ్ఞానం' అన్నారు.



### అంతర్యామి

హరిని అరిగా అహంకారంతో దూషించి, కన్న కొడుకు ప్రహ్లాదుణ్ని చిత్రహింసలు పెట్టిన హిరణ్యకశిపుడు- ఆ బాలుడితో శ్రీహరి చెప్పించిన పలుకుల విలువను అర్థం చేసుకోలేకపోయాడు. సృష్టిలో ప్రతి అణువు నుంచీ మనకు భగవత్సందేశం వినిపిస్తూనే ఉంటుంది. నేడు దొరికిన ఆహారంతో సంతృప్తి చెందమంటాయి పశుపక్ష్యాదులు. తనలాగా పరోపకారవ్రతం ఆచరించమంటుంది వృక్షం. నిశ్చలంగా ఉండమంటుంది పర్వతం. నిర్మలంగా జీవన ప్రవాహం కొనసాగనీ అంటుంది నది. తన దగ్గరికొచ్చి నామస్మరణంతో మనశ్శాంతి పొందమంటుంది దేవస్థానం. నీలోని దేవుడు నిన్ను పలకరిస్తున్నాడు వినమంటుంది ధ్యానం. 'నేను నీవాణ్నే' అంటాడు సాటి మనిషి. తల్లి, తండ్రి, గురువు, మిత్రుడు ఏదో సందర్భంలో మనకు దారి చూపుతుంటారు, సలహాలిస్తారు. సూచనలిస్తారు. వీళ్లంతా దేవుళ్లు కారా? ప్రత్యక్షమై ఎదుట అలంకారమూర్తిగా నిలుచుంటేనే నమ్మాలా? అందుకు కావాల్సిన యోగ్యత, తపన, భక్తిప్రపత్తులు, ఆత్మసమర్పణ భావం, ఆర్తి, శరణాగతి అనే లక్షణాలు మనలో ఉండాలి కదా! అటువంటి పరిణతి సాధించినవారితో పూర్వయుగాలలో ఏదో రూపంలో మాధవుడు మాట్లాడాడు. ఆధ్యాత్మికతలో పరాకాష్ఠ పొందిన వారి సన్నిధిలో ఆ సకలగుణనిధి సందర్శనమవుతుంది. సంపూర్ణ విశ్వాసంతో సంస్మరణ చేసే సాధుగుణ సంపన్నులకి సర్వేశ్వర సాక్షాత్కారం సర్వదా సంప్రాప్తమవుతుంది. ఇది సర్వకాలీన సత్యం.

– చిమ్మపూడి శ్రీరామమూర్తి



## మొబైల్ ఈ-ఓటింగ్‌కు మనం సిద్ధమేనా?

**స్మార్ట్‌ఫోన్ సాయంతో ఓటేయవచ్చా అని గతంలో ఎవరైనా ప్రశ్నిస్తే ఏమో భవిష్యత్తును ఎవరు ఊహించగలరనే సమాధానం వచ్చేది. కొన్నాళ్ల కిందటి వరకు కేవలం ఆలోచనల్లో ఉన్న ఆ భావన ఇప్పుడు వాస్తవరూపం దాల్చడానికి అతి చేరువలో ఉంది. ఇటీవల బిహార్ మున్సిపల్ ఎన్నికల్లో యాప్ సాయంతో ఓటేసే ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా చేపట్టారు కూడా. వైవిధ్యాలకు నెలవైన మన దేశం మొబైల్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానాన్ని అందిపుచ్చుకునేందుకు సిద్ధంగా ఉందా? ఉంటే అందులోని బలహీనతలు, సమస్యలు, ప్రమాదాలేంటి అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.**

నెల క్రితం బిహార్ మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ యాప్‌ను వినియోగించారు. 26 జిల్లాల్లోని 51వేల మంది ఓటర్లు ఇందులో పాల్గొన్నారు. ఈ ప్రయోగంలో ఉపయోగించిన యాప్‌ను 'సిడాక్' రూపొందించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం వల్ల వయోవృద్ధులు, దివ్యాంగులు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు తమ ఓటు హక్కును సులువుగా వినియోగించుకోగలుగుతారని యాప్‌కు రూపకల్పన చేసిన నిపుణులు చెబుతున్నారు. మొబైల్ ఈ-ఓటింగ్ విధానం దేశానికి కొత్తకాదు. 2011లో గుజరాత్‌లోని గాంధీనగర్ పురపాలక ఎన్నికల్లో 1,582 మంది ఓటర్లు ఈ పద్ధతిలో ఓటేశారు. 2021 సంవత్సరంలో తెలంగాణలోని ఖమ్మంలోనూ ఈ-ఓటింగ్‌ను ప్రయోగాత్మకంగా నిర్వహించారు. ఈ సంవత్సరం బిహార్‌లో చేసిన ప్రయోగం మరింత విస్తృతమైనది. అయితే, ఈ ప్రక్రియ ఏమేరకు సురక్షితం, ఏమేరకు పారదర్శకం అన్నది నిగ్గుదేలాల్సి ఉంది.



### చట్టం ఒప్పుకొంటుందా?

మొబైల్ ఈ-ఓటింగ్ పద్ధతిలో ప్రయోజనాలున్నాయనడంలో సందేహం లేదు. భారత్‌లో దాదాపు 95 కోట్ల మంది ఇంటర్నెట్‌ను వాడుతున్నారు. రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతున్న డిజిటల్ పరిజ్ఞానం ప్రభుత్వానికి ప్రజలకూ మధ్య సరికొత్త సేతువులు నిర్మిస్తోంది. డిజిటల్ సదుపాయాల విస్తరణతో పరిపాలనకు సంబంధించిన సాధనాలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. ఇప్పటికే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను వినియోగిస్తున్న మన దేశంలో మొబైల్ ఈ-ఓటింగ్ సహజమైన ముందడుగే. ముఖ్యంగా ఓటింగ్ నాడు స్థానికంగా అందుబాటులో ఉండనివారు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు ఈ సదుపాయాన్ని సమర్థంగా వినియోగించుకుని తమ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవచ్చు. అయితే బిహార్ మున్సిపల్ ఎన్నికల ప్రయోగానికి సంబంధించి అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుతం ప్రపంచంలో ఒక్క ఎస్టోనియా దేశంలో మాత్రమే ఇంటర్నెట్ సాయంతో ఓటేసే విధానం అమలులో ఉంది. భారత్‌లో ఎస్టోనియా తరహాలోని చట్టపరమైన, సాంకేతికపరమైన, వ్యవస్థాగతమైన అనుకూలతలు లేవు. ఎస్టోనియాలో బలమైన జాతీయ డిజిటల్ గుర్తింపు చట్టాలున్నాయి. క్రమం తప్పని ప్రజా ఆడిటింగ్ వ్యవస్థలు, ప్రజల్లో విస్తృత డిజిటల్ పరిజ్ఞానం అక్కడి ప్రత్యేకతలు. అన్నిటికీ మించి వ్యవస్థలపై ప్రజావిశ్వాసం బలంగా ఉంది. అక్కడితో పోలిస్తే భారత్‌లో బలమైన డేటా పరిరక్షణ చట్టాలు లేవు. దేశంలో ఎన్నికల ప్రక్రియ 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం పరిధిలో ఉంది. మొబైల్ యాప్‌ల సాయంతో ఓటేయడానికి ఈ చట్టం అనుమతించట్లేదు. బిహార్‌లో జరిగిన ప్రయోగానికి పూర్వం చట్టాన్ని సవరించడంపై చర్చ చేయలేదు. బిహార్ ప్రయోగాన్ని గురించి విస్తృత ప్రచారం జరగలేదు. డేటా సేకరణ, నిల్వ, చెరిపివేతలను గురించిన మార్గదర్శకాలపై బహిరంగ చర్చ నిర్వహించలేదు. యాప్ ద్వారా ఓటువేసే ప్రక్రియలో సోర్స్ కోడ్‌పై ఆడిట్ జరపవచ్చా, ఈ పద్ధతిలోని బలహీనతలేంటి అన్న అంశాలపై దృష్టి పెట్టలేదు.

మొబైల్ ఈ-ఓటింగ్ ప్రక్రియలోని మరో సమస్య గోప్యత. పోలింగ్ బూత్‌కు వెళ్లి భౌతికంగా ఓటేసే ప్రక్రియలో అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. రహస్యంగా ఓటేసేందుకు అవకాశం లభిస్తుంది. యాప్ ఆధారిత ఓటింగ్‌లో మూడో వ్యక్తి ప్రమేయానికి అవకాశాలు ఎక్కువ. ఓటరుపై ఒత్తిడి చేయడం, ప్రభావం చూపడం వంటివి జరిగే అవకాశాలూ ఎక్కువే. ఈ కారణంతోనే డిజిటల్ పరిజ్ఞానంలో గణనీయ ప్రగతి సాధించిన నార్వే, స్విట్జర్లాండ్ వంటి దేశాలు డిజిటల్ ఓటింగ్ పద్ధతిని ఉపసంహరించుకున్నాయి. డిజిటల్ ఓటింగ్ పద్ధతిలో అందరినీ కలుపుకొని పోవచ్చన్న వాదన ఉన్నప్పటికీ, ఈ పద్ధతిలో పెద్ద సంఖ్యలో ఓటర్లకు అవకాశం దక్కకుండాపోయే పరిస్థితి ఉంది. మనదేశంలో స్మార్ట్‌ఫోన్ వాడకం అన్ని వర్గాల్లో సమానంగా లేదు. డిజిటల్ అక్షరాస్యత అత్యల్ప స్థాయిలో ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, వయోవృద్ధుల్లో, మహిళల్లో డిజిటల్ అవగాహన చాలా తక్కువ. అలాంటప్పుడు మొబైల్ ఈ-ఓటింగ్ వల్ల ప్రజాస్వామ్యానికి జరిగేది నష్టమే కదా అన్న వాదనను తోసిపుచ్చలేం.

### జనామోదం లభిస్తుందా?

వాస్తవానికి గడిచిన కొన్నేళ్లలో డిజిటల్ ప్రక్రియల్లో భారత్ ముందడుగు వేసింది. ఎన్నికల సంఘం స్వయంగా రిమోట్ ఓటింగ్ విధానాన్ని ప్రతిపాదించింది. డిజిటల్ ఓటింగ్‌ను క్రమంగా కొన్ని వర్గాల్లో ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉంది. సైన్యంలో పనిచేసేవారు, వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం మొబైల్ ఈ-ఓటింగ్ విధానాన్ని అమలు చేయవచ్చు. అయితే అందుకోసం చట్టపరమైన, వ్యవస్థాగతమైన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. మొబైల్ ఈ-ఓటింగ్ సాధ్యమేనా అన్నది కాదు ప్రశ్న. ప్రస్తుత పరిస్థితుల్లో అది అభిలషణీయమా అన్నదే అసలు విషయం. కేవలం అనుకూలంగా, అధునాతనంగా ఉన్నంత మాత్రాన ఏ ప్రక్రియపైనా ప్రజలకు నమ్మకం ఏర్పడదు. పారదర్శకత, తనిఖీకి అవకాశం, పౌరులకు విశ్వాసం కలిగించే ఇతర అంశాలు ఉన్నప్పుడే ఏ ప్రక్రియకైనా జనామోదం లభిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం చట్టానికి, పౌర విధానాలకు తగినట్లు ఉండాలే తప్ప సాంకేతిక పరిజ్ఞానానికి అనువుగా చట్టం ఉండకూడదు. ఎన్నికల ప్రక్రియలో నవ్యతను ప్రవేశపెట్టడం కేవలం ఒక సాంకేతిక సమస్య కాదు. మొబైల్ ఈ-ఓటింగ్ ప్రక్రియకు భవితవ్యం ఉండాలంటే ప్రజాస్వామ్య బద్ధమైన ఏకాభిప్రాయం దానికి ప్రాతిపదిక కావాలి. దానిపై చట్టపరమైన స్పష్టత ఉండాలి. ప్రజలు లోతుగా చర్చించి ఆమోదం తెలపాలి. బిహార్ మున్సిపల్ ఎన్నికల్లో జరిగిన ప్రయోగం మొదటి మెట్టు మాత్రమే. ఇకపై మరింత జాగ్రత్తగా మొబైల్ ఈ-ఓటింగ్ దిశగా ప్రయాణం సాగాలి.

– పూల దేవేంద్ర, పరిశోధకులు, 'సెస్'

వానల కోసం ఎదురు చూస్తాం. సరేలెమ్మని ఆపకుండా రోజుల తరబడి వాన కురిస్తే ఇవేం వానలురా బాబూ.. అని విసుక్కుంటాం. మన మనుగడకు మూడు కాలాలూ ఆరు రుతువులూ అవసరమే. చక్రంలా అవి తిరుగుతూ ఉండాల్సిందే. వసంతమైనా, శిశిరమైనా ఎల్లకాలమూ ఉండిపోవు. వానొచ్చినా ఎండొచ్చినా కాదు పొమ్మనడం మన చేతిలోనూ లేదు. అలాగే జీవితం కూడా.

కష్టసుఖాల జమిలి కాపురం జీవితం.. అన్నారు. అది ఎప్పుడు, ఏది ఇచ్చినా స్వీకరించగలిగే స్థితిలో మనముండాలి. గెలుపోటములైనా సుఖదుఃఖాలైనా పొంగిపోకూడదు, కుంగిపోనూకూడదు. వచ్చే మబ్బు పోయే మబ్బు లాంటివే అవి కూడా. నీలాకాశంలా నిబ్బరంగా

## మంచైనా చెడైనా...

నిలబడగలగడం మనిషి కర్తవ్యం. ఆర్థర్ ఆషే అని లెజెండరీ అమెరికన్ టెన్నిస్ క్రీడాకారుడు ఉండేవాడు. 1983లో ఆయనకు గుండె ఆపరేషన్ సందర్భంగా రక్తం ఎక్కించారు. ఆ రక్తం ద్వారా ఆయనకు ఎయిడ్స్ సంక్రమించింది. ఈ విషయం ప్రపంచం అంతా తెలిసిపోయింది. అభిమానులు ఎంతో ఆందోళన చెందారు. ఎందరో ఆర్థర్ పరిస్థితికి జాలి పడ్డారు, దుఃఖించారు. ఉత్తరాల ద్వారా తమ ఆవేదనని తెలియపరిచారు. వాటిల్లో ఒకదాని సారాంశం ఇలా ఉంది..



'మీకే ఎందుకు ఇలా అయింది... అలాంటి భయంకరమైన వ్యాధిని దేవుడు మీకు ఇవ్వడం ఏంటి?' అంటూ తీవ్రవిచారం వ్యక్తంచేశాడు ఓ అభిమాని. ఆర్థర్ అతడికి ఇలా సమాధానం ఇచ్చాడు... 'మిత్రమా! మీ ఉత్తరం నన్ను ఆలోచింపజేసింది. ఒక్క విషయం మీకు స్పష్టం చేయాలనుకుంటున్నాను. అయిదు కోట్ల మంది పిల్లలు టెన్నిస్ ఆడటం మొదలుపెడితే... అయిదు లక్షల మంది మాత్రమే ప్రొఫెషనల్ టెన్నిస్‌లోకి వచ్చారు. వారిలో 50 వేలమంది సర్క్యూట్ దశకు చేరుకున్నారు. వారిలో 5 వేలమంది మాత్రమే గ్రాండ్ స్లామ్ స్థాయికి రాగలిగారు. ఆ అయిదు వేల మందిలోనూ మళ్లీ 50 మంది మాత్రమే వింబుల్డన్ దాకా వచ్చారు. వారిలో నలుగురే సెమీఫైనల్స్‌కి చేరుకుంటే ఇద్దరే ఫైనల్స్‌కి వచ్చారు. ఆ ఇద్దరిలో నేను ఒక్కణ్నే టైటిల్ గెలుచుకున్నాను. అప్పుడు నేను దేవుణ్ని ఈ ప్రశ్న అడగలేదు. అయిదు కోట్ల మందిలో ఇంతటి అదృష్టాన్ని నాకు మాత్రమే ఎందుకిచ్చావు అని అడగనే లేదు కదా. మరి అలాంటప్పుడు ఈ కష్టాన్ని నాకెందుకిచ్చావని మాత్రం ఎలా అడగగలను?'

నిజమే కదా... సంతోషంగా ఉన్నప్పుడు ప్రపంచంలో ఇంతమంది కష్టాలు పడుతోంటే నేనే ఎందుకు ఇంత సుఖంగా ఉన్నానని ఎప్పుడైనా అనుకుంటామా? కష్టమొచ్చినప్పుడు మాత్రమే ఎందుకు అనుకోవాలి? ఎవరి జీవితమైనా కష్టసుఖాల కలయికే. దాన్ని యథాతథంగా స్వీకరించడమే ధర్మం. ఏ గెలుపూ శాశ్వతం కాదు. ఏ దుఃఖమూ నిరంతరం ఉండదు. జీవితంలో కలిగే ఏ మార్పునైనా స్వీకరించడానికి, సుఖదుఃఖాలను సమానంగా ఎదుర్కొనడానికి సిద్ధపడి ఉంటే, ఆ వ్యక్తి ఎల్లప్పుడూ ఉత్సాహంగానే ఉంటాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా జీవితాన్ని కొనసాగిస్తాడు.

– డాక్టర్ సుంకర గోపాలయ్య




## ఎఫ్‌డీఐలు తగ్గాయ్!

**ఆర్థిక వృద్ధికి, సాంకేతికతల బదిలీకి, ఉద్యోగాల సృష్టికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐలు) ఎంతో తోడ్పడతాయి. ముఖ్యంగా మౌలిక వసతుల అభివృద్ధికి అవి చాలా అక్కరకొస్తాయి. అందుకే, అన్ని దేశాలు ఎఫ్‌డీఐలను ఆకర్షించడానికి ప్రయత్నిస్తుంటాయి. అయితే, 2023తో పోలిస్తే నిరుడు ఆయా ప్రాంతాల్లో ఎఫ్‌డీఐలు తగ్గాయి. 2023లో ప్రపంచవ్యాప్తంగా 1.76 లక్షల కోట్ల డాలర్ల ఎఫ్‌డీఐలు ప్రవహిస్తే, 2024లో అవి 11శాతం తగ్గి 1.49 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లోనూ ఎఫ్‌డీఐలు 22శాతం మేర క్షీణించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పెద్దగా మార్పు లేదు. ఆయా ప్రాంతాల్లో 2023, 24ల్లో ఎఫ్‌డీఐల ప్రవాహం... (కోట్ల డాలర్లలో)**

| | 2023 | 2024 |
|---|---|---|
| ఐరోపా | 43,900 | 18,200 |
| ఉత్తర అమెరికా | 28,000 | 34,300 |
| ఆఫ్రికా | 5,500 | 9,700 |
| లాటిన్ అమెరికా, కరేబియన్ | 18,700 | 16,400 |
| ఆసియా | 62,200 | 60,500 |

(ఆధారం: వరల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ రిపోర్ట్-2025)

## పంట చేలల్లో అటవీ ఛాయలు

పంటలతో పాటు చెట్లనూ పెంచడమే ఆగ్రో ఫారెస్ట్రీ. దీనిద్వారా కలపను, పండ్లను, పశుగ్రాసాన్ని పొందవచ్చు. ఆగ్రో ఫారెస్ట్రీ భూసారాన్ని పెంచుతుంది. నీటిని సంరక్షిస్తుంది. వన్యప్రాణి ఆవాసాన్ని సృష్టిస్తుంది. నడవాగా మారి విభిన్న వన్యప్రాణి ప్రాంతాలను కలుపుతుంది. జీవవైవిధ్యాన్ని పెంపొందిస్తుంది. కర్బన ఉద్గారాల శోషణకు తోడ్పడుతుంది. తద్వారా భూతాపాన్ని తగ్గించడానికి, వాతావరణ మార్పులను నిరోధించడానికి వీలుంటుంది. దీని ద్వారా ఆర్థిక, సాంఘిక, పర్యావరణ ప్రయోజనాలూ సిద్ధిస్తాయి. సాధారణ అటవీ ప్రాంతాన్ని పోలిన ఆవరణ వ్యవస్థలను, జీవవైవిధ్యాన్ని కొంతమేరకైనా ఆగ్రో ఫారెస్ట్రీ సృష్టిస్తుంది. రైతులు ఒకే రకమైన ఆదాయంపై ఆధారపడకుండా వారికి విభిన్న రాబడి మార్గాలను కల్పిస్తుంది. భిన్నమైన ఆహార ఉత్పత్తులను అందించడం వల్ల స్థానిక సమాజాలకు పౌష్టికాహారం, ఆహార భద్రత లభిస్తుంది. బహుళ ప్రయోజనాలదృష్ట్యా అమెరికా, ఐరోపాల్లో ఆగ్రో ఫారెస్ట్రీకి పెద్దపీట వేస్తున్నారు. ఆగ్నేయ ఆసియా, మధ్య, దక్షిణ అమెరికాల్లోనూ అది ఎక్కువగా విస్తరించి ఉంది.



**రైతుల ఆదాయాన్ని పెంచడానికి, అటవీ ప్రాంతానికి బయటి భూముల్లో పచ్చదనం విస్తరణకు ఆగ్రో ఫారెస్ట్రీని (వ్యవసాయ భూముల్లో అడవుల పెంపకాన్ని) కేంద్రం మేలిమి మార్గంగా భావిస్తోంది. దానికి మరింత ఊతమిచ్చేందుకు ఇటీవల ప్రత్యేక ముసాయిదా నిబంధనలను జారీ చేసింది. విధానపరంగా అనవసర ఇబ్బందులను తొలగించి, సాగులో చెట్ల పెంపకాన్నీ చేర్చేలా రైతులను ప్రోత్సహించడం వాటి ప్రధాన ఉద్దేశం.**

### మొదటి అడుగు మనదే కానీ...

ఇండియాలోనూ ఆగ్రో ఫారెస్ట్రీని మరింత ప్రోత్సహించేందుకు కేంద్రం ఇటీవల ముసాయిదా నిబంధనలు తెచ్చింది. అందులో భాగంగా తమ భూముల్లో పెంచిన చెట్లను నరికి, అమ్ముకోవడానికి ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను సులభతరం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కలప ఆధారిత పరిశ్రమల మార్గదర్శకాలు-2016 ప్రకారం కొలువుతీర్చిన రాష్ట్ర స్థాయి కమిటీ ఆగ్రో ఫారెస్ట్రీని ప్రోత్సహించడానికి, వ్యాపారపరమైన కలప జాతి చెట్లను వ్యవసాయ భూముల్లో పెంచడానికి ఆయా రాష్ట్రాలకు అనుగుణమైన నిబంధనలను రూపొందిస్తుంది. చెట్లను నరకడానికి, రవాణాకు సంబంధించిన విధివిధానాలను సరళతరం చేయడానికి సలహాలిస్తుంది. వ్యవసాయ కమతాల్లోని చెట్లు, భూమి, యాజమాన్యం వివరాలను ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేసుకుని చెట్ల కొట్టివేతకు, తరలింపునకు అనుమతి పొందవచ్చు. దాన్ని అటవీశాఖ పర్యవేక్షిస్తుంది.

ప్రపంచంలోనే మొదటిసారి ఆగ్రో ఫారెస్ట్రీ విధానాన్ని 2014లో ఇండియా అమలులోకి తెచ్చింది. కానీ చాలా కారణాల వల్ల దేశీయంగా అధిక శాతం రైతులు పంటలతో పాటు చెట్ల పెంపకానికి అంతగా మొగ్గు చూపట్లేదు. నిజానికి ఆగ్రో ఫారెస్ట్రీ అనేది దీర్ఘకాలిక వ్యాపకం. దానికి అధిక పెట్టుబడి అవసరం అవుతుంది. ఫలసాయం కోసం ఎక్కువ కాలం వేచిచూసే స్థోమత చాలా మంది రైతులకు ఉండదు. ఆగ్రో ఫారెస్ట్రీ పంట విధానాలూ దానివల్ల కలిగే లాభాలపై పూర్తిస్థాయి అవగాహన లేదు. సరైన మార్కెటింగ్ సౌకర్యాల కొరత, భూమి కౌలు కాలం సమస్యలు, చిన్న కమతాలు తదితర కారణాల వల్లా దేశీయంగా ఆగ్రో ఫారెస్ట్రీ ఆదరణ పొందలేదు. ఈ సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. కలపనిచ్చే టేకు, ఏగిస, జిట్రేగి, చెన్నంగి; పేపరు పరిశ్రమలో ఉపయోగించే సరుగుడు, సుబాబుల్, నీలగిరి, ఎంతో విలువైన చందనం, అగర్‌వుడ్‌ను ఇచ్చే అక్విలేరియా, కోకో, రబ్బరు వంటి అటవీ, అటవీయేతర, ఔషధ సంబంధ మొక్కలను రైతులు పెంచేలా చూడాలి. ఈ జాతులను పెంచడం వల్ల కలప దిగుమతిని తగ్గించి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయవచ్చు. అడవుల్లో చెట్లను అక్రమంగా నరకడాన్ని, తరలించడాన్ని తగ్గించవచ్చు.

### ఆదాయం... పచ్చదనం

ఆగ్రో ఫారెస్ట్రీని ప్రోత్సహించడానికి, దాన్ని విస్తృతం చేయడానికి ఆయా నేలలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మార్గదర్శకాలను రూపొందించాలి. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో దాన్ని ప్రాధాన్య అంశంగా చేర్చాలి. ఆగ్రో ఫారెస్ట్రీని అనుసరిస్తున్న రైతులకు ప్రోత్సాహకాలను, రాయితీలను అందించాలి. అటవీ హక్కులను కల్పించిన నేలల్లో, పోడు భూముల్లో ఆగ్రో ఫారెస్ట్రీకి ఊతమివ్వడం అటు రైతుల ఆదాయానికీ, ఇటు అటవీ ఆచ్ఛాదన పెంపునకూ తోడ్పడుతుంది. ఆగ్రో ఫారెస్ట్రీలో భాగంగా రోడ్లు, కాలువల పక్కన, బీడు భూముల్లో చెట్లను పెంచడానికి పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. తద్వారా, రైతుల ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపరచడంతో పాటు దేశానికి హరిత ఛత్రాన్ని పెంచొచ్చు. కాలుష్య నివారణలో జాతీయ అంతర్జాతీయ లక్ష్యాలను సాధించవచ్చు.

– ఎం.రామ్ మోహన్

అటవీ డివిజనల్ అధికారి, జన్నారం, కవాల్ టైగర్ రిజర్వ్, మంచిర్యాల జిల్లా



## క్వీన్ ఆఫ్ వయోలిన్

వయోలిన్‌ను దేని కోసం ఉపయోగిస్తారు? అసలు అదంటే ఏంటి? ఏదైనా ఆటబొమ్మా? లేదంటే తినేదా..? నాలుగైదేళ్ల వయసులో వయోలిన్ గురించి ఇంతకంటే ఎక్కువగా ఎవరికీ తెలియదు కదూ! కానీ ఓ నేస్తం అయితే ఎంచక్కా దాన్ని పట్టుకుని వాయించడం నేర్చుకుంది.. ఇంతకీ తనెవరంటే..!

కేరళలోని గురువాయూర్‌కి చెందిన గంగా శశిధరన్‌కి పన్నెండేళ్లు. ప్రస్తుతం ఆరో తరగతి చదువుతోంది. తండ్రి శశిధరన్ ప్రైవేట్ ఉద్యోగి. తల్లి కృష్ణవేణి కూడా వయోలిన్ వాద్యకారిణి. చిన్నప్పటి నుంచి అమ్మను చూస్తూ ఉండటంతో గంగకి కూడా వయోలిన్ మీద ఆసక్తి పెరిగింది. అలా తనకు నాలుగేళ్లు ఉన్నప్పుడే వయోలిన్ వాయించడం నేర్చుకోవడం మొదలుపెట్టింది. వయోలిన్ విద్వాంసుడు బాలగోపాల్‌ను చూసి మరింత ఆసక్తి పెంచుకుంది. తను ఇప్పటి వరకు వందల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చింది. తన మొదటి అంతర్జాతీయ ప్రదర్శన దుబాయ్‌లో జరిగింది. గంగ వయోలిన్ వాయిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలోనూ తెగ వైరల్ అయ్యాయి. తనకు ఇన్‌స్టాలో 1.27 లక్షల ఫాలోవర్లు ఉన్నారు. తన ప్రతిభతో అవార్డులు కూడా అందుకుంది. కేరళలో వయోలిన్ వాయించడంలో ఇంతటి ఘనత సాధించిన వాళ్లలో తనే చిన్నదట. గంగకు వయోలిన్ వాయించడంతో పాటు పాటలు పాడటం అంటే కూడా చాలా ఇష్టమట. అందుకే కర్ణాటక సంగీతం నేర్చుకుంటోంది. భవిష్యత్తులో బాగా చదివి పైలట్ అవుతానంటోంది. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే చదువుకుంటూ ఇవన్నీ నేర్చుకోగలుగుతున్నాను అంటోంది మన నేస్తం.

హాయ్! బుజ్జీ

– దాట్ల దేవా



**అక్షరాల చెట్టు**

ఈ అక్షరాలతో అర్థవంతమైన పదం తయారు చేయండి.

INDIVIDUAL


శ్రీవాణి టికెట్ల జారీని పరిశీలిస్తున్న తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి

## ఏరోజుకారోజు శ్రీవాణి టికెట్ల జారీ ప్రారంభం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవాణి టికెట్లపై ఏరోజుకారోజు శ్రీవారి దర్శనం కల్పించేందుకు తితిదే చేపట్టిన సమయ మార్పు శుక్రవారం నుంచి ప్రారంభమైంది. స్థానిక అన్నమయ్య భవనం ఎదురుగా ఉన్న శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రానికి భారీగా చేరుకున్న భక్తులకు ఉదయం 10 గంటల నుంచి శ్రీవాణి టికెట్లను ఆఫ్‌లైన్‌లో జారీ చేశారు. వీరికి సాయంత్రం 4.30 గంటలకు శ్రీవారి దర్శనం కల్పించారు. తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్వయంగా శ్రీవాణి టికెట్ల జారీని పరిశీలించారు. ప్రస్తుతం శ్రీవాణి దర్శన టికెట్లను రోజూ ఆన్‌లైన్‌లో 500, ఆఫ్‌లైన్‌లో తిరుపతి విమానాశ్రయంలో 200, తిరుమలలోని శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రంలో 800 జారీ చేస్తున్నారు. ప్రస్తుతానికి ఆఫ్‌లైన్‌లో టికెట్లు పొందిన భక్తులకు ఏరోజుకారోజు శ్రీవారి దర్శనం చేసుకునే వెసులుబాటును ప్రయోగాత్మకంగా కల్పించారు. ఆన్‌లైన్‌లో శ్రీవాణి టికెట్లు పొందిన భక్తులకు మాత్రం ఉదయం 10 గంటలకే శ్రీవారి దర్శనం కల్పిస్తున్నారు. త్వరలో క్యూలైన్‌లోనే వివరాల నమోదు.. https://epaper.eenadu.net లో

## కానిస్టేబుళ్ల నియామక ఫలితాలు నిలిపేయాలంటూ కేసు

### కొట్టేసిన సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో పోలీసు నియామక పరీక్ష ఫలితాలను నిలువరించాలని కోరుతూ వి.శ్రీనివాసరావు సహా 73మంది అభ్యర్థులు దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఫలితాలను ప్రభుత్వం శుక్రవారమే విడుదల చేసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకొని పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ బాలచంద్ర వరాలేలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నియామక పరీక్షలు జూన్ 1నే పూర్తయ్యాయని, జులై 14వరకు పిటిషనర్లు ఎస్‌ఎల్‌పీ దాఖలుచేయలేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇప్పుడు ఫలితాలు వెల్లడించినందున ఈ కేసు నిరర్థకమవుతుందని చెప్పారు. దీంతో ధర్మాసనం ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## రాష్ట్ర ప్రభుత్వమే ఒక్కో రైతుకు రూ.20 వేలు ఇవ్వాలి: షర్మిల

ఈనాడు, అమరావతి: అన్నదాతా సుఖీభవ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుకు నేరుగా రూ.20 వేల చొప్పున ఇవ్వాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు ఇస్తుందని చంద్రబాబు ఊదరగొట్టి.. తీరా గెలిచాక కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో ముడిపెట్టి నాలుక మడతేశారని ఒక ప్రకటనలో విమర్శించారు.

# పోలీసులుగా టెకీలు.. బీ స్కూల్ పట్టభద్రులు

- కానిస్టేబుల్ నియామక ఫలితాలు విడుదల చేసిన హోంమంత్రి
- మొత్తం 6,024 పోస్టుల భర్తీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన 6,024 మందిలో 810 మంది (13.44%) బీటెక్, ఎంటెక్, బీసీఏ లాంటి సాంకేతిక కోర్సులు చేసిన పట్టభద్రులే. ఈ పోస్టులకు కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ కాగా.. ఎంపికైన మొత్తం అభ్యర్థుల్లో 4,051 మంది (67.24%) డిగ్రీ, అంతకుమించి చదివినవారే. ఎంబీఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎల్‌ఎల్‌బీ, ఎంఏ లాంటి ఉన్నతవిద్య చదివినవారూ ఎక్కువగానే ఉన్నారు. అభ్యర్థులు సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న కానిస్టేబుళ్ల నియామక ఫలితాలను హోంమంత్రి వంగలపూడి అనిత.. మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, పోలీసు నియామక మండలి ఛైర్మన్ రాజీవ్‌కుమార్ మీనాతో కలిసి శుక్రవారం విడుదల చేశారు.


ఫలితాలు విడుదల చేస్తున్న హోం మంత్రి అనిత. చిత్రంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, పోలీసు నియామక మండలి ఛైర్మన్ రాజీవ్‌కుమార్ మీనా

### సెప్టెంబరు నుంచి శిక్షణ

'ఎంపికైన అభ్యర్థులందరికీ సెప్టెంబరు నుంచి శిక్షణ ప్రారంభించి 9 నెలల్లో పూర్తిచేస్తాం. వెంటనే పోస్టింగు లిస్తాం' అని హోంమంత్రి అనిత ప్రకటించారు.

### వైకాపా వదిలేసింది.. కూటమి పట్టాలెక్కించింది

కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం 2022 నవంబరులో అప్పటి వైకాపా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రాథమిక రాతపరీక్ష నిర్వహించి, ఎంపిక ప్రక్రియను సగంలో నిలిపేసింది. అభ్యర్థులు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి రాగానే.. న్యాయపరమైన చిక్కులన్నింటినీ అధిగమించి దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షలు, తుది రాతపరీక్ష నిర్వహించింది. ఇప్పుడు ఫలితాలు విడుదల చేసింది.

| విద్యార్హత | ఎంపికైన అభ్యర్థులు |
|---|---|
| బీటెక్, బీసీఏ, ఎంటెక్ | 810 |
| ఎంఎస్సీ | 114 |
| ఎంబీఏ | 60 |
| ఎంకాం | 29 |
| ఎల్‌ఎల్‌బీ | 2 |
| ఎంఏ | 35 |
| బీఎస్సీ | 1,805 |
| బీకాం | 645 |
| బీఏ | 484 |
| ఇతర డిగ్రీలు | 67 |
| డిప్లొమా | 110 |
| ఇంటర్మీడియట్/ తత్సమాన | 1,816 |
| ఇతరులు★ | 47 |
| మొత్తం | 6,024 |

★ ఇతరులు: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు పదోతరగతి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల పరీక్షలు రాస్తే చాలు. ఉత్తీర్ణులు కావాల్సిన అవసరం లేదు.

### రాష్ట్ర టాపర్‌కు 168 మార్కులు

◆ 6,100 పోస్టులకు (సివిల్-3,580, ఏపీఎస్పీ-2,520) గాను 6,024 భర్తీ అయ్యాయి. బీసీ-సీ, బీసీ-ఈ కేటగిరీల్లో అర్హులైన అభ్యర్థులు రాకపోవడంతో 76 పోస్టులు (సివిల్-66, ఏపీఎస్పీ-10) భర్తీకాలేదు. మొత్తం 4,59,182 మంది ప్రాథమిక రాతపరీక్ష రాశారు. సగటున ఒక్కో పోస్టుకు 75 మంది పోటీపడ్డారు.

◆ మొత్తం 200 మార్కులకు గాను 168 మార్కులతో విశాఖ జిల్లా అచ్యుతాపురానికి చెందిన గండి నానాజీ సివిల్ విభాగంలో మొదటిర్యాంకు సాధించారు. విజయనగరానికి చెందిన గొర్లె రమ్యమాధురి 159 మార్కులతో మహిళల్లో అగ్రస్థానంలో నిలిచారు. అనకాపల్లి సమీపంలోని పూడిమడకకు చెందిన మేరుగ అచ్యుతరావు 144.5 మార్కులతో ఏపీఎస్పీ విభాగంలో టాపర్‌గా నిలిచారు.


నానాజీ ◆ రమ్యమాధురి ◆ అచ్యుతరావు

◆ సివిల్ విభాగంలో మొత్తం 3,580 కానిస్టేబుల్ పోస్టులకు గాను 1,063 మంది (29.69%) మహిళా అభ్యర్థులు ఎంపికయ్యారు.

◆ ఉద్యోగాలకు ఎంపికైన అర్హుల జాబితాను పోలీసు నియామక మండలి వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. సందేహాలుంటే 9441450639, 9100203323 నంబర్లలో సంప్రదించొచ్చు.

## అన్నదమ్ములు ముగ్గురికీ పోలీసు కొలువులు


కొలువులు సాధించిన సోదరులు

గుత్తి, న్యూస్‌టుడే: సాధారణంగా కుటుంబంలో ఒకరికో, మహా అయితే ఇద్దరికో ఒకేలాంటి ఉద్యోగాలు వస్తాయి. కానీ, అనంతపురం జిల్లా గుత్తికి చెందిన ముగ్గురు సోదరులూ ఒకేసారి కానిస్టేబుల్ కొలువులు సాధించారు. వాళ్ల తండ్రి కూడా పోలీసే! గుత్తి పట్టణంలోని జెండాగేరికి చెందిన మహబూబ్ దౌలా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌గా అనంతపురంలో పనిచేస్తున్నారు. పెద్ద కుమారుడు మహ్మద్ అలీ, రెండో కుమారుడు మహ్మద్ గౌస్ డిగ్రీ చదివారు. చిన్నబ్బాయి మహ్మద్ సమీర్ బీటెక్ చదివారు. అలీ, గౌస్ ఎస్‌ఐ పోస్టులకు ప్రయత్నించినా కొద్దితేడాలో చేజారింది. ఈసారి ముగ్గురూ కలిసి కానిస్టేబుల్ కొలువులకు ప్రయత్నించి విజయం సాధించారు. రోజూ పరేడ్‌గ్రౌండ్స్‌లో చేసిన సాధనతోనే తమకు ఉద్యోగాలు వచ్చాయని 'న్యూస్‌టుడే'తో ఆనందాన్ని పంచుకున్నారు.

### అక్కాతమ్ముళ్లు.. కలిసి సాధించారు!


రేవతి తిరుమలయ్య

పెనుమూరు, న్యూస్‌టుడే: కానిస్టేబుల్ ఫలితాల్లో చిత్తూరు జిల్లాకు చెందిన అక్కాతమ్ముళ్లు ఒకేసారి కొలువులు సాధించారు. పెనుమూరు మండలం కామచిన్నయ్యపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన చంగల్రాయులు, జగద దంపతుల కుమార్తె రేవతి, కుమారుడు తిరుమలయ్య ఇటీవల జరిగిన కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలకు హాజరయ్యారు. రేవతి 113 మార్కులు సాధించి సివిల్ విభాగంలో, తిరుమలయ్య 118 మార్కులతో ఏఆర్ విభాగంలో ఉద్యోగాలు సాధించారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోనే తాము విజయం సాధించామని వారు పేర్కొన్నారు.

## జగన్‌పై కేసు నమోదు చేస్తాం

- శాంతిభద్రతల సమస్యలు సృష్టించేందుకే రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- హోంమంత్రి వంగలపూడి అనిత

ఈనాడు, అమరావతి: 'మీ మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపైకి మా వాళ్లను పంపించి హత్యలు చేయించడం మొదలుపెడితే..'' అంటూ నెల్లూరు జిల్లా పర్యటనలో రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన వైకాపా అధినేత జగన్‌పై తప్పనిసరిగా కేసు నమోదు చేస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టించేందుకే ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. కానిస్టేబుల్ ఫలితాల విడుదల సందర్భంగా శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యేపై వైకాపా నేత ప్రసన్నకుమార్ రెడ్డి దుర్భాషలాడితే ఖండించకపోగా.. ఆయనకు మద్దతుగా పరామర్శకు వెళ్లిన జగన్ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా అడ్డుకునేందుకు జగన్ శాంతిభద్రతల సమస్యలు ఉన్నట్లు సృష్టిస్తున్నారని, ఆ క్రమంలోనే తన మనుషులతో తప్పుడు మెయిళ్లు, లేఖలు పంపిస్తున్నారని చెప్పారు.

### అది మా అంతర్గత నిర్ణయం: డీజీపీ

'వీఆర్ (వేకెన్సీ రిజర్వ్) శాంక్షన్ పోస్టుల్లో భాగమే. పోలీసు సిబ్బందిలో అందరికీ పోస్టింగులు ఇవ్వాలా? వెయిటింగ్‌లో ఉంచాలా? అనేది మా అంతర్గత అంశం. పరిపాలనపరమైన సర్దుబాటులో భాగంగా నిర్ణయాలు తీసుకుంటాం. దీనిలో ఇతరుల జోక్యం, ఆరోపణలు సరికాదు' అని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా చెప్పారు. ''ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీ (అప్పా) కోసం నూజివీడు దగ్గర 95 ఎకరాల భూమి తీసుకున్నాం. త్వరలోనే అక్కడ భవనాలు నిర్మిస్తాం. గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం భూమి కేటాయించింది. ఆ పనులూ త్వరలోనే ప్రారంభిస్తాం. బాలికల అదృశ్యం కేసుల్లో సత్వర చర్యల కోసం ప్రత్యేకంగా ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం'' అని తెలిపారు.

# అర్హులైన ప్రతి రైతుకూ పథకం అందాలి

- అన్నదాతా సుఖీభవ కింద 46.85 లక్షల మంది రైతులకు లబ్ధి
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు సీఎం దిశానిర్దేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రప్రభుత్వం శనివారం ప్రారంభిస్తున్న అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ పథకానికి అర్హులైన రైతులందరి పేర్లు లబ్ధిదారుల జాబితాలో ఉండేలా చూడాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ పథకం కింద 46,85,838 మంది రైతులకు ఏటా రూ.20వేల చొప్పున లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులకు తొలివిడతలో రూ.7వేల చొప్పున జమచేస్తున్నామని, రాష్ట్రప్రభుత్వం రూ.2,342.92 కోట్లు, కేంద్రం రూ.831.51 కోట్లు చొప్పున ఇస్తున్నాయని తెలిపారు. సీఎం శుక్రవారం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, తెదేపా ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాతా సుఖీభవ పథకానికి అర్హుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో లేకపోతే 155251 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని, రైతుకు మేలుచేసే ఈ కార్యక్రమంలో పార్టీ యంత్రాంగమంతా పాల్గొనాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేకూరుస్తున్న లబ్ధిని రైతులకు వివరించాలన్నారు.

### వైకాపా కుట్రల్ని ప్రజలకు వివరించండి

''వైకాపా అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని నాశనం చేసింది. ఇప్పుడూ అభివృద్ధికి విఘాతం కలిగించేలా కుట్రలు పన్నుతోంది. వాటివల్ల ఎలాంటి నష్టం జరుగుతోందో ప్రజలకు వివరించాలి. గతంలో మనం అధికారంలో ఉన్నప్పుడు చేసిన మంచి చెప్పుకోలేకపోయాం. ఆ తప్పులు మళ్లీ జరగకూడదు. మనం అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

### త్వరలో మిగతా నామినేటెడ్ పదవుల భర్తీ

పార్టీలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని చంద్రబాబు తెలిపారు. ''నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టిసారించాం. ఇప్పటికే చాలావరకు భర్తీ చేశాం. మిగిలినవీ త్వరలో చేసేస్తాం'' అని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా ఉండేది కార్యకర్తలేనని, ఈ విషయాన్ని జిల్లా, నియోజకవర్గ నేతలు గుర్తుపెట్టుకోవాలని తెలిపారు.

### మంచి చేస్తే ప్రజలు మర్చిపోరు

''మనం చేసిన మంచి ఎక్కడికీ పోదని, మనతోనే ఉంటుందని సింగపూర్ పర్యటనలో స్పష్టమైంది. ఉమ్మడి రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో లబ్ధి పొందినవారు ఇప్పుడు పెద్ద ఎత్తున సింగపూర్‌లో స్థిరపడ్డారు. సుమారు 40వేల మంది తెలుగు ప్రజలు అక్కడున్నారు. వారినుంచి అద్భుతమైన స్వాగతం లభించింది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు అందరినీ వేధించింది. వారు చెడగొట్టిన బ్రాండ్‌ను తిరిగి నిర్మించేందుకు శ్రమిస్తున్నాం'' అని చంద్రబాబు చెప్పారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### రైతుల ఖాతాల్లో రూ.7 వేల చొప్పున జమ

ఈనాడు, అమరావతి: అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక, నిధుల మంజూరుకు సంబంధించి వ్యవసాయ శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. కుటుంబం యూనిట్‌గా మూడు విడతల్లో రూ.20 వేల నగదును రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. తొలి విడత కింద ఖరీఫ్ సాగుకు ఆగస్టు 2న పీఎం కిసాన్ రూ.2 వేలు, అన్నదాతా సుఖీభవ కింద రూ.5 వేలు కలిపి రూ.7 వేలు చెల్లిస్తారు. రెండో విడతగా రబీ సాగుకు రూ.7 వేలు (కేంద్రం రూ.2 వేలు, రాష్ట్రం రూ.5 వేలు), మూడో విడతగా వేసవిలో మరో రూ.6 వేలు (కేంద్రం రూ.2 వేలు, రాష్ట్రం రూ.4 వేలు) అందజేస్తారు.


బాపట్ల జిల్లా పర్చూరు నుంచి తొలిసారి స్వచ్ఛంద సేవకు వచ్చిన భక్తులు

## అమ్మ సేవకు

తిరుమల తరహాలో విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కూడా స్వచ్ఛందంగా సేవ చేసేందుకు భక్తులకు, భక్త బృందాలకు అవకాశం కల్పించారు. వీరి కోసం www.kanakadurgamma.orgలో వాలంటీర్ విభాగంలో ఆధార్, అడ్రస్, ఫోన్ నంబరుతో నమోదు చేసుకోవచ్చని నూతనంగా అవకాశం కల్పించారు. దీంతో భక్తుల నుంచి దుర్గమ్మ సేవకు విశేష స్పందన వస్తుంది. ఐదు రోజులలోనే దాదాపు 250 మందికి పైగా భక్తులు స్వచ్ఛందంగా సేవ చేసేందుకు నమోదు చేసుకున్నారు. దుర్గమ్మను దర్శించుకునేందుకు నిత్యం సుమారు 50 వేలు, శని, ఆదివారాల్లో లక్ష, పర్వదినాల్లో 2 నుంచి 4 లక్షల వరకూ వచ్చే భక్తులకు సేవ చేస్తూ అమ్మ సన్నిధిలో గడిపేందుకు భక్తిభావంతో ముందుకు వస్తున్న వారికి వసతి, ఆహారం, తాత్కాలిక ఐడీ కార్డు దేవస్థానం అందిస్తుంది. – ఈనాడు, అమరావతి

## తనిఖీకి హాజరుకాని వారి పింఛన్లు తాత్కాలికంగా నిలిపివేత

ఈనాడు, అమరావతి: ప్రభుత్వం చేపడుతున్న దివ్యాంగుల కేటగిరీ, ఆరోగ్య పింఛన్ల తనిఖీకి హాజరుకాని వారి పింఛను తాత్కాలికంగా నిలిపివేస్తూ గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ(సెర్ప్) అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జిల్లాల వారీగా వైద్య బృందాలను నియమించి ఈ రెండు కేటగిరీలకు సంబంధించిన పింఛన్లను ప్రభుత్వం తనిఖీ చేయిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు 5 లక్షల మందికిపైగా పింఛన్లు తనిఖీ చేయగా.. 16 వేల మంది వైద్య బృందాల పరిశీలనకు హాజరుకాలేదు. దీంతో వారి సెల్‌ఫోన్‌కు సమాచారం అందించి నగదు పంపిణీ తాత్కాలికంగా నిలిపివేశారు.



**మీరు ప్రతిభావంతులైనా.. అవి ఉండాల్సిందే**

మీరు గొప్ప ప్రతిభావంతులు కాకపోయినా, నేర్చుకోవాలన్న తపన బలంగా ఉంటే.. మీలోని లోపాలను అధిగమించగలుగుతారు. తద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారు. నేర్చుకోవాలన్న తపన, జిజ్ఞాస లేకపోతే మాత్రం మీరెంతటి సహజసిద్ధ ప్రతిభావంతులైనా.. సాదాసీదా ఫలితాలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.
– జేమ్స్ క్లియర్, రచయిత

### ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో

# 'అన్నదాతా సుఖీభవ' ఇవ్వొద్దు

- ప్రభుత్వానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ఆదేశాలు

ఈనాడు, అమరావతి: 'అన్నదాతా సుఖీభవ' పథకం కింద పెట్టుబడి సాయాన్ని పులివెందుల, కడప రెవెన్యూ డివిజన్లతోపాటు రాష్ట్రంలో మరో మూడు మండలాలు, రెండు గ్రామాల పరిధిలోని రైతుల ఖాతాల్లో జమ చేయవద్దని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ప్రభుత్వాన్ని ఆదేశించారు. వీటి పరిధిలోని గ్రామపంచాయతీ, మండల పరిషత్తు, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని పేర్కొంటూ వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి శుక్రవారం లేఖ రాశారు. ఇప్పటికే కొనసాగుతున్న కార్యక్రమంగా పీఎం కిసాన్ 20వ విడత నిధులను విడుదల చేయొచ్చన్నారు. అయితే ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పాల్గొనకూడదని, అధికార పార్టీ విజయాలను ప్రచారం చేసేలా రాజకీయ ప్రసంగాలు చేయకూడదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిశాక మాత్రమే ఆయా ప్రాంతాల్లో 'అన్నదాతా సుఖీభవ' నిధుల్ని పంపిణీ చేయాలని సూచించారు.

### ఎన్నికలు జరిగే ప్రాంతాలు

పంచాయతీలు (2) : కొండపి(ప్రకాశం జిల్లా), కడియపులంక (తూర్పుగోదావరి)

ఎంపీటీసీలు (3) : చిత్తూరు జిల్లా రామకుప్పం మండల పరిధిలో మనీంద్రం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు-1, పల్నాడు జిల్లా కారంపూడి మండలం వేపకంపల్లి

జడ్పీటీసీ స్థానాలు (2) : వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండే ప్రాంతాలు: ◆ కొండపి, కడియపులంక గ్రామ పంచాయతీలు ◆ రామకుప్పం, విడవలూరు, కారంపూడి మండలాలు ◆ పులివెందుల, కడప రెవెన్యూ డివిజన్లు.

## రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీకి ఊతం

- తిరుపతి, అనంతపురం, విశాఖ, కొప్పర్తి, నెల్లూరుల్లో క్లస్టర్లు
- పాలసీని విడుదల చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ కాంపొనెంట్ల (విడిభాగాలు) తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, ఏపీ ఆర్థికాభివృద్ధికి ఊతమివ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక పాలసీని విడుదల చేసింది. కేంద్రం అమలు చేసే ప్రభుత్వ ఎలక్ట్రానిక్ కాంపొనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్(ఈసీఎంఎస్)తో దీన్ని సమన్వయం చేయనుంది. ఇందులో భాగంగా తిరుపతి, అనంతపురం, విశాఖపట్నం, కొప్పర్తి, నెల్లూరుల్లో స్పెషలైజ్డ్ కాంపొనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు (సీఎంసీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో పీసీబీ, డిస్‌ప్లే, ఆప్టో ఎలక్ట్రానిక్స్, పాసివ్ కంపోనెంట్స్‌పై దృష్టి సారిస్తారు.

◆ ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి ఖర్చులో అసమానతల తగ్గింపు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ప్లగ్ అండ్ ప్లే మాన్యుఫ్యాక్చరింగ్‌కు అనువైన వాతావరణం, ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించడం, సప్లై చైన్ వ్యవస్థలో భాగస్వాముల్ని చేయడం. నైపుణ్యం కలిగిన వారిని తయారు చేయడం ఈ విధాన ప్రధాన లక్ష్యం.

◆ ఆప్షన్1 కింద ఐదేళ్లలో రూ.250 కోట్ల పెట్టుబడి ఒప్పందంతో తొలుత ఏర్పాటయ్యే 10 సంస్థలకు.. నిర్దేశించిన మొత్తంలో 50% రాయితీని రెండు సమాన వాయిదాల్లో చెల్లిస్తారు. ఆప్షన్ 2 కింద ఈసీఎంఎస్ (ఎలక్ట్రానిక్ కాంపొనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్) కింద కేంద్రం ఆమోదించిన రాయితీకి 100% మ్యాచింగ్ రాయితీని ఆరు నెలల్లోపు ఇస్తారు.

◆ ఈసీఎంఎస్ కింద కేంద్ర ఆమోదిత సంస్థలకు భూమి విలువలో 75% డిస్కౌంట్ ఇస్తారు. లేదా నిర్మించి సిద్ధంగా ఉన్న ఏపీఐఐసీ భవనాలకు 50% అద్దె మినహాయింపు ఇస్తారు.

◆ పాలసీ ప్రకటించిన తేదీ నుంచి ఆరేళ్లపాటు విద్యుత్తు సుంకంలో 100% మినహాయింపు ఉంటుంది.

◆ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ పాలసీ 4.0 ప్రకారం విద్యుత్తు బిల్లులు, ఎస్‌జీఎస్‌టీ, స్టాంపు రుసుము, రిక్రూట్‌మెంట్ సహాయం అమలు చేస్తారు.

◆ ఐదేళ్లలో రూ.1,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదన లేదా కనీసం 1,000 మందికి ఉపాధి కల్పించే వాటిని మెగా ప్రాజెక్టులుగా గుర్తించి టైలర్ మేడ్ రాయితీలు ఇస్తారు.

◆ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ కాంపొనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ (4.0) అమలుకు ఏపీఈడీబీ (ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు) నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.

## మెగా డీఎస్సీ తుది 'కీ' విడుదల

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీ తుది 'కీ' ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. రాష్ట్ర ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జూన్ 6 నుంచి జులై 2 వరకు 89 విభాగాల్లో మెగా డీఎస్సీ నిర్వహించింది. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక 'కీ'ని విడుదల చేసిన తర్వాత అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు స్వీకరించారు. వీటిని పరిశీలించిన నిపుణుల బృందం తుది 'కీ'ని రూపొందించింది. తుది 'కీ'పై ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించరు. దీని ప్రకారం ఫలితాలు ఉంటాయి.

# మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు జగనే

## అవినీతి సొమ్మును కేంద్ర దర్యాప్తు సంస్థలు కక్కిస్తాయి

విశాఖలో ధ్వజమెత్తిన కూటమి నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సి.ఎం. రమేష్. చిత్రంలో భీమిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు

విశాఖపట్నం (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: 'మద్యం కుంభకోణంలో నిందితులను స్వాతిముత్యాలుగా పరిచయం చేసిన జగన్.. మీరెవరైనా ఆణిముత్యాలా? ఈ కేసులో వేళ్లన్నీ మీవైపే చూపిస్తున్నాయి. త్వరలోనే ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా తేలడం ఖాయం' అని కూటమి నేతలు పేర్కొన్నారు. శుక్రవారం విశాఖలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో అనకాపల్లి భాజపా ఎంపీ సి.ఎం. రమేష్ మాట్లాడుతూ 'జగన్ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ, ఈడీ విచారణ చేయాలని కోరుతున్నాం. అవినీతి సొమ్మును కేంద్ర దర్యాప్తు సంస్థలు కక్కిస్తాయి. నెల్లూరులో జగన్ చేసిన పరామర్శ యాత్ర అరాచకానికి పరాకాష్ఠ. ప్రజలు వైకాపాకు ఇచ్చిన సీట్లు 11 అయితే, తాజాగా దొరికిన మద్యం అవినీతి సొమ్ము రూ.11 కోట్లు' అని ఎద్దేవా చేశారు.

మద్యం కుంభకోణంలో జగన్ దోషిగా తేలడం ఖాయమని భీమిలి తెదేపా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 'జగన్ పర్యటనను అడ్డుకోవాలని ప్రభుత్వం భావిస్తే అసలు ఆయన కాలు బయట పెట్టలేరు. వైకాపా హయాంలో ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబును బయటకు రానివ్వకుండా గేటుకు తాళం వేసి, హౌస్ అరెస్టు చేశారు. ఇప్పుడు మేము అలా చేయడం లేదు. మా కూటమి పార్టీలకు ప్రజాస్వామ్యంపై గౌరవం ఉండటంతో అలా చేయట్లేదు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై చంద్రబాబు కక్ష సాధిస్తున్నారని జగన్ చెప్పడం హాస్యాస్పదం' అని విమర్శించారు. పెందుర్తి జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ 'ఎమ్మెల్యేల ఇళ్లపైకి మావాళ్లను పంపి హత్యలు చేయిస్తే' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన జగన్ నిజమైన ఫ్యాక్షన్ లీడర్ అనిపించుకున్నారని ధ్వజమెత్తారు.

# షేర్ల పేరుతో రూ.1.74 కోట్లు హాంఫట్!

- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ట్రాప్ చేసిన మోసగాళ్లు
- విజయవాడ, గుంటూరు, పలు రాష్ట్రాల్లో మ్యూల్ ఖాతాలు
- కాంబోడియా నుంచి ఆపరేషన్
- ఐదుగురు అరెస్టు.. రూ.41.20 లక్షలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఎస్పీ జగదీష్ తదితరులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: సైబర్ నేరాల గురించి ఎంతగా ప్రచారం చేస్తున్నా ఇప్పటికీ లక్షలాది స్కాంల బారిన పడుతూనే ఉన్నారు. ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి ఇలాగే నేరగాళ్లు రూ.1.74 కోట్లు కొట్టేశారు. అనంతపురం జిల్లా రాయదుర్గం పోలీసులు రాష్ట్రాలు దాటి నిందితులను అరెస్టు చేసి, వారినుంచి రూ.41.20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ పి.జగదీశ్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాయదుర్గం మండలం వేపరాళ్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నరసింహప్ప వర్క్ ఫ్రమ్ హోం పద్ధతిలో పనిచేస్తున్నాడు. ఆయనకు షేర్‌మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం అలవాటు. ఏప్రిల్‌లో షేర్లపై ఫేస్‌బుక్‌లో వచ్చిన ఓ ప్రకటనకు ఆకర్షితుడయ్యాడు. సైబర్ నేరగాళ్లు కాంబోడియా నుంచి నిర్వహిస్తున్న వాట్సప్ గ్రూపులో చేరాడు. స్కామర్లు వాట్సప్ ద్వారా పంపిన వీఐపీ 66 బజాజ్ ఇన్వెస్ట్‌మెంట్, కే 26 జీరోదహా మార్కెట్ ఇన్‌సైట్స్ అనే ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేసుకుని, ఇన్వెస్ట్‌మెంట్ ప్రారంభించాడు. ముందుగా రూ.12 లక్షలు పెట్టాడు. రూ.5.50 లక్షల లాభం చూపించి.. ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో అతను ఆత్మవిశ్వాసంతో ఏప్రిల్ 15 నుంచి మే 14 దాకా విడతలవారీగా 1.74 కోట్లు పెట్టుబడి పెట్టాడు. ఆ తర్వాత అందులో కనిపించిన రూ.3.40 కోట్లు విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించాడు. పన్ను, బ్రోకరేజ్ కింద 40% డబ్బులు చెల్లిస్తేనే విత్‌డ్రా అవకాశమిస్తామని అవతలి నుంచి సమాధానం వచ్చింది. దీంతో అనుమానం వచ్చి.. అనంతపురం సైబర్ విభాగ పోలీసులను ఆశ్రయించాడు.

### దర్యాప్తు సాగిందిలా..

జిల్లా ఎస్పీ జగదీశ్ ఈ కేసును సీరియస్‌గా పరిగణించి కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో సీఐలు జయనాయక్, వెంకటరమణ, షేక్‌జాకీర్, ఎస్సైలు నాగమధు, గుర్నాథరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. బాధితుడి డబ్బులు 13 బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లినట్లు గుర్తించారు. దిల్లీ, పుణె, సూరత్, గుణ (మధ్యప్రదేశ్), పట్నా, సమస్తీపుర్ (బిహార్), నువాపాడా (ఒడిశా), బెంగళూరు, గుంటూరు, విజయవాడల్లో మ్యూల్ ఖాతాలకు చేరినట్లు గమనించారు. విజయవాడకు సంబంధించిన ఓ ఖాతాను లోతుగా విచారించారు.

### నేరం జరిగిన తీరిదీ..

విజయవాడలో ఓ ప్రైవేటు బ్యాంకు మేనేజర్, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పద్మమూర్తి పలువురి మాక్ మ్యూల్ ఖాతాలు తెరిచారు. వాటి పాస్‌బుక్, ఏటీఎం కార్డులను ఎన్టీఆర్ జిల్లాకే చెందిన కొంగతి కృష్ణ సేకరించి, హైదరాబాద్‌కు చెందిన సాపిరెడ్డి కేదండరామ దుర్గాసాయి ప్రసాద్‌కు చేరవేసేవాడు. ఇతను దిల్లీలోని శ్యామ్ జీ అలియాస్ భావనేష్ గోయల్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన దర్శిత్‌ప్రీంగ్‌లకు చేర్చేవాడు. ఇలా దిల్లీ కేంద్రంగా మ్యూల్‌ఖాతాల్లోని డబ్బులను ఇంటర్నెట్ బ్యాంకింగ్‌తో వేరే ఖాతాల్లోకి మార్చారు. కొట్టేసిన డబ్బును క్రిప్టో కరెన్సీ ద్వారా దేశం దాటించేందుకు నేరగాళ్లు ప్రయత్నం చేశారు. ఇదంతా ఛేదించిన పోలీసులు.. ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ప్రైవేటుబ్యాంకు మేనేజర్, ఈ మోసానికి పాల్పడిన ప్రధాన నిందితులను అరెస్టుచేయాల్సి ఉంది. నిందితుల నుంచి నగదు, 8 సెల్‌ఫోన్లు, కారు, 20 ఏటీఎం కార్డులు, 15 సిమ్‌కార్డులు, ఐదు బ్యాంకు పాస్‌బుక్స్, రెండు రౌటర్లను స్వాధీనం చేసుకున్నారు.

## మేజిస్ట్రేట్లకు సర్క్యులర్‌పై కొరిజెండమ్ జారీ

'తీవ్రంగా పరిగణిస్తాం', 'కోర్టుధిక్కరణ'కు బాధ్యులన్న అంశాల తొలగింపు

ఈనాడు, అమరావతి: సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన కేసుల విషయంలో తాము జారీచేసిన సర్క్యులర్‌లోని సూచనలను అందరు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్లు తు.చ. తప్పకుండా పాటించాలని, వాటిని ఉల్లంఘిస్తే 'చాలా తీవ్రంగా' పరిగణిస్తామని, 'కోర్టుధిక్కరణ' చర్యలకు బాధ్యులవుతారంటూ గతంలో హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) ఎస్.కమలాకరరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. తాజాగా జులై 31నాటి సర్క్యులర్‌లోని పేరాలను సవరిస్తూ (కొరిజెండమ్) ఉత్తర్వులు జారీచేశారు. 'తీవ్రంగా పరిగణిస్తాం', 'కోర్టుధిక్కరణ' బాధ్యులవుతారంటూ పేర్కొన్న విషయాలను పూర్తిగా తొలగించారు. వాటికి బదులుగా మేజిస్ట్రేట్లు 'శాఖాపరమైన' చర్యలకు బాధ్యులవుతారని పేర్కొన్నారు.

## పర్యాటక అభివృద్ధికి దోహదపడేలా కొత్త బార్ల విధానం

మంత్రివర్గ ఉపసంఘం భేటీలో నిర్ణయం

ఈనాడు, అమరావతి: పర్యాటక అభివృద్ధికి దోహదపడేలా నూతన బార్ల విధానాన్ని రూపొందించాలని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు పర్యాటకశాఖతో సమన్వయం చేసుకుని వారి సూచనలను పొందుపరచాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న బార్ల విధానం గడువు ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో నూతన విధాన రూపకల్పన కోసం కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్‌లతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం సమావేశమైంది. రాష్ట్రంలో పారిశ్రామిక కారిడార్ విస్తరణ జరుగుతున్న నేపథ్యంలో బార్లను రీలొకేట్ చేసే అంశంపైనా చర్చ జరిగింది.


## ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ లక్ష్మీనారాయణ కన్నుమూత



కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ వీసీ గంగిశెట్టి లక్ష్మీనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ అమెరికాలో శుక్రవారం మృతి చెందినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈయన 2005 నుంచి 2008 వరకు ద్రవిడ విశ్వవిద్యాలయం వీసీగా పనిచేశారు. తులనాత్మక ద్రావిడ సాహిత్యంపై పలు పరిశోధనలు, ప్రచురణలు చేపట్టి జాతీయ సాహిత్య అవార్డు అందుకున్నారు. వర్సిటీకి యూజీసీ గుర్తింపు తీసుకొచ్చారు.

## న్యాయస్థానాల బయట అరవడం.. లోపల ఏడవడం చెవిరెడ్డికే చెల్లింది

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



ఈనాడు, అమరావతి: 'ఇక్కడే ఇల్లు తీసుకుంటా.. మీ అంతు చూస్తా.. లేపేస్తా.. అంటూ సిట్ అధికారులను బెదిరిస్తూ గొంతు చించుకొని అరిచారు.. ఇప్పుడు లిక్కర్ కుంభకోణంతో నాకు సంబంధం లేదని న్యాయస్థానాల ముందు ఏడుస్తున్నారు.. అధికారం అడ్డుపెట్టుకుని మద్యం, బియ్యం, ఇసుక లాంటి కుంభకోణాల్లో అందినకాడికి దోచుకుని.. ఇప్పుడు నాకు ఏ పాపమూ తెలియదంటున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఏడుపు చూస్తే నవ్వొస్తుంది' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఎద్దేవా చేశారు. కుంభకోణాలు ఎలా చేయాలో, ఎలా నటించాలో తాడేపల్లి ప్యాలెస్‌లో చెవిరెడ్డికి శిక్షణ ఇచ్చినట్లు ఉందని శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు.

## నీటి ప్రాజెక్టులు సత్వరమే పూర్తిచేయాలి

- మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వరరావు, అక్కినేని భవానీప్రసాద్, లక్ష్మీనారాయణ

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంపకాలపై ప్రజలను మభ్యపెట్టి రాజకీయాల కోసం వాడుకోవడం విచారకరమని మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలో విలేకర్లతో మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం ప్రారంభించిన ప్రాజెక్టులు ఇప్పుడు ఏ స్థితిలో ఉన్నాయి? ఏ కాంట్రాక్టర్ల లబ్ధి కోసం ఈ ప్రాజెక్టులు కట్టారు..? ఏయే ప్రాజెక్టులు నిర్మాణదశలో ఆగిపోయాయనే అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వడానికి ప్రాజెక్టుల సందర్శనకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం, దానివల్ల జరుగుతున్న నష్టం.. ఏది సాధ్యం? ఏది అసాధ్యం.. దేనికి అనుమతులు ఉన్నాయి? దేనికి లేవు.. అనేదానిపై ప్రజలకు అవగాహన కల్పించాలని నీటిపారుదల రంగ నిపుణులకు సూచించారు. రాయలసీమలో ప్రాజెక్టుల గురించి చర్చించేందుకు రైతుసంఘాల నాయకులు, సాగునీటి రంగ నిపుణులు, విశ్రాంత ఇంజినీర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ మిత్రులు వస్తే ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. రైతు సేవాసమితి అధ్యక్షుడు అక్కినేని భవానీప్రసాద్ మాట్లాడుతూ.. ఎవరు మాట్లాడినా రాయలసీమకు నీళ్లు ఇవ్వాలని చెబుతామని, గత పాతికేళ్లుగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయడానికి నిర్దిష్ట ప్రణాళికను ప్రకటించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉందన్నారు. సాగునీటిరంగ నిపుణుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు పర్యటనలకు వెళుతున్నామని.. తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు, విశ్రాంత ఇంజినీర్లనూ ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.

## పర్యాటక సంస్థకు రూ.1.60 కోట్ల జరిమానా


- హనీమూన్‌కి వెళ్లిన వైద్య దంపతుల మృతి వ్యవహారంలో..
- చెన్నై వినియోగదారుల కమిషన్ ఉత్తర్వులు



విభూష్ణియ, లోకేశ్వరన్

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: హనీమూన్‌కి వెళ్లిన వైద్య దంపతులు ప్రమాదానికి గురై మృతి చెందిన ఘటనకు సంబంధించి పర్యాటక సంస్థకు చెన్నై వినియోగదారుల కమిషన్ రూ.1.60 కోట్ల భారీ జరిమానా విధించింది. డాక్టర్ విభూష్ణియా, డాక్టర్ లోకేశ్వరన్‌కు 2023 జూన్‌లో వివాహమైంది. జీటీ హాలిడేస్ సంస్థ ఏర్పాట్లతో ఆ దంపతులు హనీమూన్‌కు ఇండోనేసియా వెళ్లారు. అక్కడి సముద్రంలో మోటారు బోట్‌లో వారిద్దరూ ఫొటోషూట్‌లో పాల్గొన్న సమయంలో అకస్మాత్తుగా నీట మునిగి, చనిపోయారు. దీనిపై చెన్నై పూందమల్లి సమీప చెన్నీర్‌కుప్పంకు చెందిన విభూష్ణియా తండ్రి తిరుజ్ఞానసెల్వం వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో ఆ ప్రాంతంలో పలు ప్రమాదాలు జరిగినా సంబంధిత సంస్థకు చెందిన గైడ్ నిర్లక్ష్యం, సేవాలోపం కారణంగా వారిద్దరూ అలల్లో కొట్టుకుపోయి మృతిచెందారని తెలిపారు. సంస్థ సేవాలోపాన్ని పరిశీలించి రూ.1.50 కోట్ల నష్ట పరిహారం, కుమార్తె, అల్లుడిని కోల్పోవడంతో తనకు ఏర్పడిన మానసిక ఒత్తిడికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. విచారణ జరిపిన చెన్నై వినియోగదారుల కమిషన్.. పర్యాటక సంస్థ సేవాలోపం కారణంగా ఇద్దరూ మృతి చెందారని తేల్చింది. బాధిత కుటుంబానికి రూ.1.50 కోట్ల పరిహారం, తిరుజ్ఞానసెల్వం అనుభవించిన మానసిక ఒత్తిడికి రూ.10 లక్షలు ఇవ్వాలని గురువారం ఉత్తర్వులిచ్చింది.

## మండలిలో రమ్మీ ఆడిన మంత్రికి క్రీడలశాఖ



ముంబయి: శాసన మండలిలో ఆన్‌లైన్ రమ్మీ ఆడారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మహారాష్ట్ర మంత్రి, ఎన్సీపీ ఎమ్మెల్యే మాణిక్‌రావ్ కోకాటే మంత్రిత్వశాఖను మహారాష్ట్ర ప్రభుత్వం మార్చింది. వ్యవసాయశాఖ నుంచి ఆయన్ను తప్పించి క్రీడలు, యువజన సంక్షేమ మంత్రిత్వశాఖ బాధ్యతలను అప్పగించింది. ఇప్పటివరకు క్రీడల మంత్రిగా ఉన్న దత్తాత్రేయ భరణెను వ్యవసాయశాఖకు మార్చింది. ఈ మేరకు గురువారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. సభలో కూర్చొని రమ్మీ ఆడారంటూ కోకాటేపై వచ్చిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశమైంది.

## భర్త నపుంసకత్వంపై భార్య ఆరోపణలు పరువునష్టం కాదు

- బాంబే హైకోర్టు స్పష్టీకరణ

ముంబయి: విడాకులు తీసుకునే క్రమంలో భర్త నపుంసకత్వంపై భార్య చేసిన ఆరోపణలు పరువు నష్టం కిందకు రావని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ఒక మహిళ తన ప్రయోజనాలను కాపాడుకునే క్రమంలో చేసే ఇలాంటి వ్యాఖ్యలు న్యాయ విచారణ ప్రక్రియలో భాగమేనని స్పష్టం చేసింది. హిందూ వివాహ చట్టం ప్రకారం భర్త నపుంసకత్వంపై భార్య చేసే ఆరోపణలు సందర్భోచితం కావచ్చని, విడాకులు పొందేందుకు అవే కారణం కూడా కావచ్చని అభిప్రాయపడింది. విడాకులు, భరణం కోరుతూ న్యాయస్థానంలో వేసిన పిటిషన్లతో పాటు ఎఫ్ఐఆర్‌లో తన నపుంసకత్వంపై చేసిన ఆరోపణలు బహిరంగమయ్యాయని, అవి తన పరువుకు నష్టం కలిగించాయని పేర్కొంటూ తన మాజీ భార్య, ఆమె కుటుంబ సభ్యులపై ఓ వ్యక్తి పరువునష్టం కేసు పెట్టాడు. దీన్ని ధర్మాసనం కొట్టివేసింది.

## ఎఫ్-35 కొనుగోలు ఒప్పందానికి భారత్ బ్రేకులు!



ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 25 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అగ్రరాజ్యంతో ఎఫ్-35 యుద్ధ విమానాలు సహా రక్షణ రంగ ఒప్పందాల ఆమోదం విషయంలో భారత్ ముందుకు వెళ్లాలనుకోవడం లేదని అంతర్జాతీయ మీడియా సంస్థ బ్లూమ్‌బర్గ్ ఓ కథనంలో పేర్కొంది. అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగించాలని భారత్ కోరుకొంటోందని, అగ్రరాజ్యం నుంచి కొనుగోళ్లను పెంచే మార్గాలను అన్వేషిస్తోందని బ్లూమ్‌బర్గ్ తెలిపింది. సహజవాయువు కొనుగోళ్లను, కమ్యూనికేషన్ పరికరాలు, బంగారం దిగుమతులను పెంచే అంశాన్ని పరిశీలిస్తోందని, అయితే కొత్త రక్షణ ఒప్పందాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆమోదించే అవకాశం లేదని పేర్కొంది. ఎఫ్-35 యుద్ధ విమానాల కొనుగోలుపై ఆసక్తి లేదని అమెరికా అధికారులకు భారత్ చెప్పినట్లు తెలిపింది.

## రష్యా సమీపంలోకి అమెరికా అణు జలాంతర్గాములు!

మోహరింపునకు ట్రంప్ ఆదేశం

వాషింగ్టన్: రష్యాకు చేరువలోని సముద్ర జలాల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని తమ నౌకాదళాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించారు. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వెదేవ్ చేస్తున్న హెచ్చరికలకు ప్రతిస్పందనగా ఈ చర్యను చేపట్టినట్లు ఆయన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ప్రకటించారు. "ఒకవేళ ఆ రెచ్చగొట్టే వ్యాఖ్యల వెనుక ఏదైనా ఉద్దేశాలు ఉంటే వాటికి సన్నద్ధమయ్యేందుకు ఇలా చేశా. మాటలు ముఖ్యం. వాటివల్ల కొన్నిసార్లు అవాంఛిత పరిణామాలు తలెత్తవచ్చు. ప్రస్తుత అంశంలో ఇలాంటివి జరగవని ఆశిస్తున్నా" అని తెలిపారు. ఉక్రెయిన్ అంశంలో కాల్పుల విరమణకు 10 రోజుల్లో ముందుకు రావాలని ట్రంప్.. రష్యాకు హెచ్చరిక చేసిన నేపథ్యంలో మెద్వెదేవ్ స్పందించారు. రష్యా వద్ద సోవియట్ హయాం నాటి అణు దాడి సామర్థ్యం ఉందన్నారు.

### సైన్యంలోకి రష్యా హైపర్‌సోనిక్ క్షిపణి

కొత్తగా అభివృద్ధి చేసిన ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ క్షిపణుల ఉత్పత్తిని ప్రారంభించామని రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం తెలిపారు. వాటిని తమ సైన్యంలో ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. బెలారస్‌లోనూ వీటిని ఈ ఏడాది చివర్లోగా మోహరిస్తామని చెప్పారు.



### కష్టమైన పనులతోనే ఉన్నత శిఖరాలకు..

మీరు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనుకుంటున్నారా..? అయితే- కష్టమైన పనులనే ఎక్కువగా ఎంచుకోండి. కఠిన సంభాషణల్లో పాలుపంచుకోండి. కష్టమైన పుస్తకాలు చదవండి. ఇతరులకు సాధ్యం కాని చిక్కు సమస్యలను పరిష్కరించండి. అధిక సందర్భాల్లో కఠిన నిర్ణయాలు తీసుకోండి.

– బ్రామ్‌వాన్ జెనెబ్టెన్, మైండ్ కోచ్

## మాలేగావ్ దర్యాప్తులో వైరుధ్యాలు

- ఏటీఎస్, ఎన్ఐఏ తీరును తప్పుపట్టిన కోర్టు
- భాగవత్ విషయంలో ఒత్తిడి లేదని స్పష్టీకరణ

ముంబయి: ఉత్తర మహారాష్ట్రలోని మాలేగావ్ పేలుళ్ల కేసులో రెండు దర్యాప్తు సంస్థల అభియోగపత్రాల్లో తీవ్ర వైరుధ్యాలు ఉన్నాయని ప్రత్యేక న్యాయస్థానం పేర్కొంది. 2008 నాటి ఘటనలో ఏడుగురు నిందితులూ నిర్దోషులని పేర్కొంటూ గురువారం వెలువరించిన 1,036 పేజీల తీర్పు శుక్రవారం అందుబాటులోకి వచ్చింది. ఆర్డీఎక్స్‌తో ఉన్న బాంబును పుణెలోని ఓ ఇంట్లో అమర్చారని మహారాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక దళం (ఏటీఎస్) చెబితే.. దానిని ఇందౌర్‌లో ఓ మోటారు బైకుకు అమర్చి మాలేగావ్‌కు తరలించారని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పేర్కొందని గుర్తుచేసింది. తగిన ఆధారాలు లేకుండా అభియోగాలు మోపడాన్ని తప్పుబట్టింది. ఒకరికి శిక్ష పడాలంటే ఏయే అంశాలు తిరుగులేని రీతిలో ఉండాలో గుర్తుచేసింది. దేశ ఐక్యత, భద్రతకు సంబంధించిన కేసే అయినా సాక్ష్యాల ప్రమాణాలను తక్కువ చేయడానికి చట్టం అంగీకరించదని ప్రత్యేక న్యాయమూర్తి లహోటీ స్పష్టం చేశారు. కేసును మొదట ఏటీఎస్ విచారించగా తర్వాత ఎన్ఐఏ రంగంలో దిగింది.

- ఆరెస్సెస్ అధిపతి మోహన్ భాగవత్ ప్రమేయమేమీ లేకపోయినా ఈ కేసులో ఆయనను అరెస్టు చేయాల్సిందిగా తనపై ఒత్తిడి వచ్చిందని ఏటీఎస్ మాజీ అధికారి మెహబూబ్ ముజావర్ చెప్పడాన్ని న్యాయస్థానం తోసిపుచ్చింది. దీనిలో ఒత్తిడేమీ కనిపించలేదని వ్యాఖ్యానించింది. భాగవత్‌ను అరెస్టు చేస్తే ఈ కేసుకు 'కాషాయ ఉగ్రవాదం' రంగు తీసుకురావచ్చనే ఉద్దేశంతో అలా చేశారన్న వాదనతో ఏకీభవించలేమంది.
- మాలేగావ్ పేలుళ్ల కేసులో కాషాయ ఉగ్రవాదం ఉందనే కోణాన్ని చూపించడానికి యూపీఏ సర్కారు ప్రయత్నించిందని, ముజావర్ చెప్పిన విషయాలు దిగ్భ్రాంతికరమని భాజపా జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఆరోపించారు. సంఘ్‌లో ఉన్నత స్థాయివారిపై కాంగ్రెస్ ప్రతీకార వైఖరిని ఇది చాటుతోందని విమర్శించారు.
- మాలేగావ్ పేలుళ్ల కేసు సహా పలు సందర్భాల్లో దర్యాప్తును రాజకీయ ఉద్దేశాలు ప్రభావితం చేస్తున్న విషయాన్ని తాను డీజీపీల సదస్సులో ప్రస్తావించినట్లు ముంబయి మాజీ పోలీసు కమిషనర్ సత్యపాల్‌సింగ్ చెప్పారు.

## ఎనిమిది మందిని పెళ్లాడి.. తొమ్మిదో పెళ్లికి సిద్ధమైన కిలేడి!



సమీరా ఫాతిమా

నాగ్‌పుర్: అవివాహితులైన ధనవంతులే ఆమె లక్ష్యం. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ల ద్వారా వారి వివరాలు సేకరిస్తుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడుతుంది. ఆ తర్వాత.. విధి లేని పరిస్థితుల్లో తాను విడాకులు తీసుకోవాల్సి వచ్చిందని, ఓ బిడ్డతో కలిసి ఒంటరిగా ఉంటున్నట్లు చెబుతుంది. అలా మానసికంగా దగ్గరై వివాహం దాకా తీసుకువెళుతుంది. ఇలా ఒకటీ, రెండు కాదు.. ఏకంగా 8 పెళ్లిళ్లు చేసుకుంది. తొమ్మిదో పెళ్లి కోసం పావులు కదుపుతూ జులై 29న పోలీసులకు చిక్కింది. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన సమీరా ఫాతిమా బాగోతమిది. ఉపాధ్యాయిని అయిన ఈమె అక్రమ మార్గాల్లో ఎక్కువ డబ్బు సంపాదించేందుకు ఈ పంథాను ఎంచుకుంది. కొన్ని రోజులు కాపురం చేశాక.. పథకం ప్రకారం డబ్బు డిమాండ్ చేస్తుంది. అవసరమైతే బెదిరింపులకు దిగే ఈమెకు వసూళ్ల నిమిత్తం ప్రత్యేక గ్యాంగు కూడా ఉంది. సమీర తన నుంచి రూ.50 లక్షలు బలవంతంగా వసూలుచేసినట్లు ఆమె మాజీ భర్తల్లో ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

## 'సవరణ'పైనే రగడ

- ఎస్ఐఆర్‌పై చర్చకు విపక్షాల పట్టు
- సోమవారానికి వాయిదా పడిన ఉభయ సభలు

దిల్లీ: బిహార్ ఓటర్ల జాబితాకు సంబంధించిన ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) అంశమే శుక్రవారం కూడా పార్లమెంటు ఉభయ సభలను కుదిపేసింది. దీంతో ఎలాంటి కార్యక్రమాలు జరగకుండానే లోక్‌సభ, రాజ్యసభ సోమవారానికి వాయిదా పడ్డాయి. ఎస్ఐఆర్‌పై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో దిగువ సభలో ఎలాంటి కార్యక్రమాలు జరగలేదు. రాజ్యసభలోనూ అవే దృశ్యాలు పునరావృతమయ్యాయి. సభ సమావేశం కాగానే డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్, ఇతర సమస్యలపై నిబంధన 267 కింద 30 వాయిదా తీర్మానాలు తనకు అందాయని, వాటిని తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. దీంతో విపక్ష సభ్యులు ఆందోళన ప్రారంభించారు. నినాదాలు చేశారు. ఆ సమయంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా మాట్లాడేందుకు డిప్యూటీ ఛైర్మన్ అవకాశం కల్పించారు. ఎస్ఐఆర్‌పై చర్చను అనుమతించాలని ఎంపీ కోరారు. ఈ అంశం న్యాయపరిధిలో ఉన్నందున చర్చకు తాను అనుమతించలేనంటూ డిప్యూటీ ఛైర్మన్ సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ మళ్లీ సమావేశమైనపుడు కొందరు తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే ఎంపీలు వెల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. కొంతమంది ఎంపీలు ఎలాగోలా వెల్‌లోకి ప్రవేశించి నినాదాలిచ్చారు. భద్రతా సిబ్బంది తమను అడ్డుకోవడాన్ని తీవ్రంగా తప్పుబడుతూ ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో సభ వాయిదా పడింది.

### సభలో భద్రతా బలగాలా: ఖర్గే ఆగ్రహం

సభలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బంది సహా ఇతర బలగాలు ఉండటాన్ని తప్పుబడుతూ రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే.. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు లేఖ రాశారు. ప్రజా సమస్యలకు సంబంధించిన కీలక ప్రశ్నలను సభ్యులు లేవనెత్తినప్పుడు భద్రతా సిబ్బందిని వెల్‌లోకి అనుమతించొద్దని ఆ లేఖలో ఖర్గే కోరారు. పారా మిలిటరీ దళాలు సభను స్వాధీనంలోకి తీసుకున్నాయని కాంగ్రెస్ నేత, ఆ పార్టీ చీఫ్ విప్ జైరాం రమేశ్ ఆరోపించారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

## అణుబాంబు లాంటి ఆధారాలున్నాయ్

- ఈసీ భాజపాకు ఓట్ల చౌర్యం చేస్తోందన్న రాహుల్ గాంధీ



దిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. భాజపా కోసం ఈసీ 'ఓటు చోరీ' చేస్తోందని నిరూపించడానికి తమ వద్ద 'అణు బాంబు' లాంటి ఆధారాలున్నాయని శుక్రవారం పేర్కొన్నారు. దాన్ని పేల్చినప్పుడు ఈసీకి తలదాచుకోవడానికి దేశంలో స్థానం ఉండబోదని ఎద్దేవాచేశారు. "ఇది రాజద్రోహం కంటే తక్కువేమీ కాదు. మీరు పదవీ విరమణ చేసి ఉండవచ్చు. మరెక్కడైనా ఉండవచ్చు. మేం మిమ్మల్ని కనుగొంటాం" అని రాహుల్ హెచ్చరించారు. బిహార్‌లో ఓటర్ల ముసాయిదా జాబితాను ఈసీ విడుదల చేసిన రోజే రాహుల్ ఈ వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. "నేను దీన్ని తేలిగ్గా చెప్పడం లేదు. మా వద్ద వంద శాతం ఆధారాలున్నాయి. మేం వీటిని వెల్లడించిన వెంటనే భాజపా కోసం ఈసీ ఓట్ల చోరీ చేస్తోందన్న విషయం దేశ ప్రజలందరికీ అవగతమవుతుంది. 2023 మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయం నుంచి అవకతవకలు జరిగాయని కాంగ్రెస్‌కు అనుమానం ఉంది. ఆ తర్వాత గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఇదే పునరావృతమైంది. ఓటర్ల జాబితాల సవరణ జరిగి కోట్లాదిమంది కొత్త ఓటర్లు నమోదు అయ్యారు. పూర్తి సమాచారం తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే ఈసీ నుంచి సహకారం అందలేదు. ఆరు నెలలు సొంత దర్యాప్తు అనంతరం 100% సాక్ష్యాలు సేకరించి ఓ 'అణు బాంబు' తయారు చేశాం. దాన్ని పేల్చిన రోజు ఈసీకి దేశంలో చోటు ఉండదు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. రాహుల్ భారత్ వ్యతిరేక భాషను ఉపయోగించి ఎన్నికల సంస్థను కించపరిచారని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు.

### అవి బాధ్యతారహిత వ్యాఖ్యలు: ఈసీ

రాహుల్ వ్యాఖ్యలను ఈసీ కొట్టిపారేసింది. ఆయన ఆరోపణలు బాధ్యతారహితమైనవని, విచారకరమైనవని పేర్కొంది. ఆధారాలు లేని వ్యాఖ్యలను పట్టించుకోవద్దని సంస్థలోని అధికారులకు ఈసీ సూచించింది. బాంబులా విస్ఫోటమవ్వడానికి బదులు నీరులా ప్రవహించండంటూ రాహుల్‌పై భాజపా విమర్శలు గుప్పించింది. ఒకవేళ మీరు బాంబు పేల్చితే మేం రాజ్యాంగాన్ని కాపాడతామని దీటుగా సమాధానమిచ్చింది.

## బిహార్‌లో తగ్గిన ఓటర్లు 65 లక్షలు

- ముసాయిదా జాబితా విడుదల
- సవరణకు సెప్టెంబరు 1 వరకు గడువు



పట్నా: బిహార్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల సంఘం శుక్రవారం ప్రచురించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పూర్తవటంతో దీనిని వెలువరించింది. జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో ఓటర్ల సంఖ్య 7.93 కోట్ల నుంచి 7.28 కోట్లకు తగ్గింది. ఇంటింటికీ వెళ్లి సిబ్బంది ఇచ్చిన దరఖాస్తులను నింపి తగిన పత్రాలతో సమర్పించనందుకు పట్నాలో అత్యధికంగా 3.95 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. మధుబనిలో 3.52 లక్షలు, తూర్పు చంపారణ్‌లో 3.16 లక్షలు, గోపాల్‌గంజ్‌లో 3.10 లక్షల ఓటర్లను తీసివేశారు. 38 జిల్లాల ముసాయిదాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబరు 1 వరకు ఈసీ గడువిచ్చింది. అర్హుల పేర్లను జాబితాలో చేర్చడానికి, అనర్హులను తొలగించడానికి పౌరులు, రాజకీయ పార్టీలు ఆలోగా ప్రతిపాదనలు చేయొచ్చని తెలిపింది. సవరణకు ముందు విదేశీ ఓటర్లు ఎంతమంది ఉన్నారు, తాజా జాబితాలో వారిని ఉంచారా లేదా అనేది తెలపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

**ఎన్టీఆర్ కలెక్టరేట్:** పీ-4 విధానంలో పేదరిక నిర్మూలనలో మేము సైతం అని రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు ముందుకువచ్చారు. మార్గదర్శకులుగా వ్యవహరించడానికి అంగీకారాన్ని తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశతో సొసైటీ ప్రతినిధులు శుక్రవారం సమావేశమయ్యారు. తమ బాధ్యతగా

# పీ-4లో 33,505 కుటుంబాల దత్తత

పలు బంగారు కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 86,398 బంగారు కుటుంబాలు ఉండగా, ఇప్పటికి 4,279 మంది మార్గదర్శకులుగా ముందుకు వచ్చి, 33,505 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు వివరించారు. రోజ్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. రోజ్ సొసైటీ అడ్వైజరీ ఛైర్‌పర్సన్ అడుసుమిల్లి సీతామహాలక్ష్మి, ప్రెసిడెంట్ సూరపనేని ఉషారాణి, కార్యదర్శి ఘంటసాల లక్ష్మి తదితరులున్నారు.



# రైతుకు కలిమి.. పైరుకు బలిమి

## అన్నదాత సుఖీభవ సొమ్ము జమ నేడు

### జిల్లాకు రూ.80.77 కోట్ల లబ్ధి

- ★ అన్నదాత సుఖీభవకు: 1,18,629 మంది
- ★ విడుదలయ్యే సొమ్ము: రూ. 59. 31 కోట్లు
- ★ పీఎం కిసాన్ లబ్ధిదారులు: 1,07,275
- ★ వారికి జమ చేసేది: రూ. 21. 46 కోట్లు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

**నే**డు కూటమి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేయనుంది. ఎప్పుడెప్పుడా అని అన్నదాతలు ఎదురు చూస్తున్న తరుణంలో సొమ్ములు నేడు బ్యాంకు ఖాతాల్లో పడతాయి. కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం కిసాన్ కింద రూ. 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వ పథకం అన్నదాత సుఖీభవ కింద రూ. 5 వేలు కలిపి ఒక్కో రైతుకు మొదటి విడత రూ. 7 వేలు మంజూరు చేశారు. ఆ డబ్బు ఖరీఫ్‌లో పంటల సాగుకు కర్షకులకు ఉపయోగపడతాయి.

**ఏడాదికి మూడు విడతల్లో..** జిల్లాలో అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాలకు రూ. 80. 77 కోట్లు జమ చేయనున్నారు. అందులో అన్నదాత సుఖీభవ (ఏడీఎస్‌బీ) కింద రూ. 59. 31 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ. 21. 46 కోట్లు మంజూరు చేశారు. ఏడాదిలో మూడు విడతల్లో సొమ్ము ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలు రైతులతో ఈకేవైసీలు పూర్తి చేయించారు. అర్హుల జాబితా ప్రదర్శించారు. నెల ముందే సొమ్ము విడుదల చేయాల్సి ఉన్నా.. అర్హులైన మరింత మందికి లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో జాప్యం చేశారు.

| నియోజకవర్గాల వారీగా నిధులు (రూ.కోట్లలో) | |
|---|---|
| నందిగామ | 20.72 |
| జగ్గయ్యపేట | 17.04 |
| తిరువూరు | 22.79 |
| మైలవరం | 20.19 |
| వి.సెంట్రల్ | 0.02 |
| వి.తూర్పు | 0.01 |

**గ్రీవెన్స్‌కు అవకాశం..** సొమ్ము రాని రైతులకు నెల రోజుల పాటు గ్రీవెన్స్‌కు అవకాశం కల్పించారు. రైతుల పేర్లలో తప్పులు దొర్లినా, ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్ల అనుసంధానంలో పొరపాట్లు చోటుచేసుకున్నా సొమ్ము జమ కాదు. ఇటువంటి రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే.. ఆయా తప్పులు సరి చేసి సొమ్ము మంజూరయ్యేలా చూస్తారు. ఈ నెల 2 నుంచి నెల రోజుల వరకు గ్రీవెన్స్‌కు అవకాశం ఉందని నందిగామ ఏవో గింజుపల్లి నాగేశ్వరరావు తెలిపారు.

## 6న స్పోర్ట్స్ అండ్ గైడ్స్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

**ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం:** ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రత్యేక కేటగిరీ స్కౌట్స్ అండ్ గైడ్స్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 6న ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. ఈ కేటగిరీలో 66 మంది ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికవగా భారత్ స్కౌట్స్ విభాగం ప్రతినిధులు పత్రాలు పరిశీలించి ప్రాధాన్య క్రమాన్ని ఇస్తారని తెలిపారు.

## ఎరక్కపోయి వస్తే.. ఇరుక్కుపోవాల్సిందే





**ప్రా**ణాపాయంలో ఉన్న వారిని ఆస్పత్రికి తరలించే అంబులెన్స్‌కి ప్రతి సెకను సమయం చాలా విలువైనది. సాయంత్రం సమయంలో ఎరక్కపోయి బెంజిసర్కిల్ కూడలిలోకి వస్తే అంతే సంగతులు. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సిందే. అంబులెన్స్‌ని బయటకు తప్పించే దారి లేక ట్రాఫిక్ క్లియర్ అయ్యే వరకు వేచి చూడాల్సిందే. శుక్రవారం సాయంత్రం బెంజిసర్కిల్ వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన అంబులెన్స్‌లు ఇవి. - ఈనాడు, అమరావతి

# ఏ వీధి చూసినా వ్యర్థాలే!

## ఆటోనగర్‌కు మోక్షం ఎప్పుడో?

ఆటోనగర్, న్యూస్‌టుడే

ఆటోనగర్ చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ప్రజాప్రతినిధులు చెప్పి మూడు నెలలు పూర్తవుతున్నా.. నేటికీ అడుగులు పడడం లేదు. గత వైకాపా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఆటోనగర్‌లో అభివృద్ధి కుంటుపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు క్రమేణా పెరుగుతున్నాయి. కార్మికులకు పని దొరుకుతోంది. చెత్త సమస్య మాత్రం వేధిస్తోంది. ఏ రోడ్డు చూసినా వ్యర్థాలతో నిండిపోతోంది. అపరిశుభ్ర వాతావరణంలో పని చేసి అనారోగ్యం బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

### రోజూ 30 - 35 టన్నుల ఉత్పత్తి

ఆటో నగర్‌లో రోజూ సుమారు 30 నుంచి 35 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. 48 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. చెత్తను గుంటూరు సమీపంలోని జిందాల్ ప్లాంట్‌కు పంపుతున్నారు. సాధారణ లారీలో కేవలం 10 టన్నుల చెత్త మాత్రమే తీసుకెళ్లవచ్చు. రోజూ రెండు లారీలతో తరలించినా.. ఇంకా 15 టన్నుల వ్యర్థాలు మిగిలిపోతున్నాయి. ఫలితంగా ఎక్కడి చెత్త అక్కడే గుట్టలుగా పేరుకుపోతోంది. అదే కాంపాక్ట్ లారీ అయితే ఒకసారి సుమారు 40 టన్నుల చెత్త తరలించవచ్చు. ఫలితంగా రోజూ చెత్త తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపవచ్చు.

### మూడు నెలల కిందట చర్చలు

ఆటో నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై మేలో పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపీ కేశినేని శివనాథ్, సీఆర్డీఏ కమిషనర్, ఏపీఐఐసీ జెడ్ఎం తదితర అధికారులతో సమావేశమయ్యారు. చెత్త రోడ్ల మీద ఉండటానికి వీల్లేదని, కాంపాక్ట్ లారీ కొని జిందాల్ ప్లాంట్‌కు చెత్త తరలించాలని సూచించారు. ఏపీఐఐసీ జెడ్ఎం స్పందిస్తూ.. ఆ లారీ విలువ సుమారు రూ.60 లక్షల వరకు ఉంటుందని, అన్ని నిధులు తమ వద్ద లేవని చెప్పగా, ఆ వాహనాన్ని తాను సమకూర్చుతానని మంత్రి బదులిచ్చారు. ఇప్పటి వరకు అది అందుబాటులోకి రాలేదు.



ఫైర్ స్టేషన్ మార్గంలో పేరుకుపోయిన వ్యర్థాలు

### కాంపాక్ట్ లారీ కొంటేనే పరిష్కారం

కాంపాక్ట్ లారీ మంజూరు చేయాలని ఏపీఐఐసీ జెడ్ఎం బాబ్జీ పురపాలక సంఘం అధికారులతో పాటు స్వచ్ఛ సర్వేక్షణ్ అధికారులకు లిఖిత పూర్వకంగా వినతి పత్రాలు రాశారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని మంత్రి నారాయణతో చర్చిస్తే చెత్త సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

# నాకేం తెలియదు.. అంతా సక్రమంగానే చేశా!

- పోలీసు కస్టడీలో డాక్టర్ నమ్రత 'సృష్టి' కథలు
- తొలిరోజు 3-4 గంటలపాటు సాగిన విచారణ

ఈనాడు, హైదరాబాద్
రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే

సరోగసీ ముసుగులో శిశువిక్రయాలకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను శుక్రవారం గోపాలపురం పోలీసులు ఐదురోజుల కస్టడీకి తీసుకున్నారు. సికింద్రాబాద్ ఉత్తరమండలం డీసీపీ కార్యాలయానికి తీసుకెళ్లే సమయంలో తనకేం తెలియదని వీళ్లంతా తనను ఇబ్బంది పెడుతున్నారంటూ మీడియాతో డాక్టర్ నమ్రత చెప్పటం గమనార్హం. ఉదయం వైద్యపరీక్షల అనంతరం పోలీసు భద్రత మధ్య ఆమెను డీసీపీ కార్యాలయానికి తరలించారు. సుమారు 3-4 గంటల పాటు డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ పర్యవేక్షణలో నమ్రత నుంచి వివరాలు రాబట్టే ప్రయత్నం చేశారు. కొద్దిసేపు సమాధానం చెప్పేందుకు మొండికేసినట్టు సమాచారం. ఆ తరువాత తనకేం తెలియదని అంతా సక్రమంగానే ఉందంటూ పొడిపొడిగా జవాబులిచ్చినట్టు తెలిసింది. దేశవ్యాప్తంగా సృష్టి ఆసుపత్రుల వివరాలు.. అక్కడ పనిచేసే సిబ్బంది గురించి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో చికిత్స కోసం వచ్చిన రోగులకు సంబంధించిన రికార్డులు మాయం చేయటంపై పోలీసుల ప్రశ్నకు ఆమె ఆచితూచి స్పందించినట్టు తెలిసింది. తనకేం తెలియదని.. తన పేరిట క్లినిక్ నిర్వహించట్లేదంటూ బుకాయించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. వైద్యవృత్తిని చేపట్టాక తాను నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తూ వస్తున్నానని, ఏమైనా రుజువులు ఉంటే చూపమని డిమాండ్ చేయటం పోలీసులను ఆశ్చర్యానికి గురిచేసింది. తొలిరోజు విచారణ అనంతరం ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించి మహిళా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం రెండోరోజు ఉదయం మరోసారి ఆమెను విచారించనున్నారు. ఈకేసులో కీలకమైన విశాఖపట్నం సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ మేనేజర్ కల్యాణి, అస్సాం నివాసి సంతోషిలను ఐదురోజుల కస్టడీకి న్యాయస్థానం అనుమతినిచ్చింది. శిశువుల కొనుగోలు, దంపతులకు అప్పగింత సమాచారం కల్యాణి వద్ద ఉండటంతో ఆమె నుంచి రాబట్టే సమాచారం కీలకం కానుంది. పోలీసుల విచారణలో బయటకు వచ్చే అంశాలు కేసును ఏ మలుపు తిప్పుతుందనేది ఆసక్తిగా మారింది.

### విజయవాడ బాధితురాలి ఫిర్యాదు..

తెలుగురాష్ట్రాల్లో సరోగసీ ముసుగులో సంతానం లేని దంపతులను మోసగించిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతపై బాధితుల నుంచి నగర పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. తాజాగా విజయవాడకు చెందిన ఒక మహిళ నుంచి రూ.7లక్షలు తీసుకొని ముఖం చాటేసినట్టు బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. అనారోగ్య సమస్యలతో ఆమె గర్భ సంచి తొలగించారు. అమ్మ పిలుపు కోసం ఆశపడిన బాధితురాలు తన కుటుంబసభ్యురాలి సహాయంతో సరోగసీకి సిద్ధమైంది. మూడు నెలల క్రితం డాక్టర్ నమ్రతను కలిస్తే వైద్యపరీక్షలు, కన్సల్టేషన్ ఫీజుల పేరిట రూ.7లక్షలు గుంజినట్టు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారని సమాచారం. నగరానికి చెందిన మరో మహిళ కూడా పోలీసులకు ఫోన్ చేసి రూ.25లక్షలు నష్టపోయానని చెప్పినట్లు తెలిసింది.



డాక్టర్ నమ్రతను విచారణకు తీసుకుని వెళ్తున్న గోపాలపురం పోలీసులు

### పోలీస్ కస్టడీకి తరలింపు..

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ ప్రధాన నిందితురాలు డా.నమ్రతను పోలీసులు 5 రోజుల కస్టడీకి తరలించారు. అద్దె గర్భం కేసులో అరెస్టయి చంచల్‌గూడ మహిళా జైల్లో ఉంటున్న ఆమెను ఆగస్టు 1 నుంచి 5 వరకు పోలీసులు కస్టడీ విచారణకు న్యాయస్థానం అనుమతిచ్చింది. దీంతో శుక్రవారం ఉదయం గోపాలపురం పోలీసులకు మహిళా జైలు అధికారులు నమ్రతను అప్పగించారు. పోలీసులు భారీ బందోబస్తుతో మీడియాకు కనిపించకుండా నమ్రతను తరలించారు.

# భాజపాపై దుష్ప్రచారం.. కేసు నమోదు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : భాజపా పరువుప్రతిష్ఠలకు భంగం కలిగేలా ఫేస్‌బుక్‌లో అసభ్య పదజాలం, మార్ఫింగ్ ఫొటోలతో దుష్ప్రచారం చేస్తున్న వారిపై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ పార్టీ నాయకుడు కిలారు దిలీప్.. గత నెల 27న ఫేస్‌బుక్ చూస్తుండగా అసభ్యకరమైన సందేశంతో ఉన్న గ్రూప్‌ను గమనించారు. అందులో భాజపా పరువుకు భంగం కలిగేలా మార్ఫింగ్ ఫొటోలు, అసభ్యకరమైన సందేశాలను గుర్తించారు. భాజపాను, పార్టీ నాయకులను అవమానించేలా ఉన్నాయి. ఆ గ్రూప్‌ను తయారు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనగా.. వారు కేసు నమోదు చేశారు.

# ఇసుక కుంభకోణం వివరాలు నా దగ్గర ఉన్నాయి

## విచారణకు పిలిస్తే వివరిస్తా.. మైలవరం ఎమ్మెల్యే వెల్లడి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో ఇసుక కుంభకోణం పెద్దదని.. ఆ వివరాలు తన వద్ద ఉన్నాయని.. సిట్ విచారణకు పిలిస్తే వాటిని వారికి వివరిస్తానని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నం శక్తి నగర్‌లో శుక్రవారం ఆయన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అనంతరం మీడియాతో మాట్లాడారు. నాడు రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా నాయకులు ఇసుక అక్రమ రవాణా ద్వారా రూ.వేల కోట్లు దోచుకున్నారని దానిపై విచారణ చేయాలని కోరారు. మద్యం కుంభకోణంపై సిట్ విచారణ జరుగుతుందని కలుగుల్లో ఉన్న రూ.కోట్లు బయటకు వస్తున్నాయన్నారు. కొద్ది రోజుల్లోనే ప్రధాన సూత్రధారి పాత్ర కూడా బయటకు వస్తుందన్నారు.

☛ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మరణాన్ని తట్టుకోలేక చనిపోయారని అనారోగ్యం తదితర కారణాలతో మృతి చెందిన వారిని కూడా పరామర్శించిన జగన్.. తన పాలనలో నకిలీ మద్యం తాగి మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జగన్ వైకాపా నాయకుల పరామర్శ పేరుతో నిబంధనలను అతిక్రమించి చేస్తున్న కార్యక్రమాలు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నాయని విమర్శించారు.



మీడియాతో మాట్లాడుతున్న వసంత కృష్ణప్రసాద్

# రిజిస్ట్రేషన్ సేవలు మరింత పారదర్శకం

గాంధీనగర్ : ఆటోమ్యుటేషన్ ప్రక్రియ ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు మరింత పారదర్శకం అయ్యాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కొత్త విధానంలో ఒకే చోట ఒకే సమయంలోనే ఆటో మ్యుటేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 17 కార్పొరేషన్ల పరిధిలో ఈ సేవలు శుక్రవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. గాంధీనగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి ఆటోమ్యుటేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. తొలి రోజు 700 మంది ఈ సేవలు పొందారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఆస్తి రిజిస్ట్రేషన్ తర్వాత యజమాని పేరు మారాలంటే.. వివిధ పత్రాలతో పాటు రోజుల తరబడి సమయం పట్టేదని చెప్పారు. తాజా విధానం వల్ల సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని వెల్లడించారు. ఈ సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఆటో మ్యుటేషన్ ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. దీన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఎం.రవీంద్రనాథ్, దుర్గాప్రసాద్, ఎం.డి.ఆరిఫ్, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆటోమ్యుటేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు

# బంగారం గొలుసుల దోపిడీ

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో శుక్రవారం దొంగలు హల్‌చల్ చేశారు. రోడ్డుపై వెళ్తున్న మహిళల మెడలోని బంగారు గొలుసులు బలవంతంగా లాక్కొని ఇద్దరు యువకులు పరారయ్యారు. స్థానిక కేవీఆర్ కళాశాల ప్రాంతంలో నివాసం ఉంటున్న కంచేటి లక్ష్మి పని నిమిత్తం వార్డు సచివాలయానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా.. కళాశాల సమీపంలోకి రాగానే ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చారు. ఆమెను గమనించి మళ్లీ వెనక్కి వెళ్లి వచ్చి వీపుపై కొట్టాడు. ఆమె వెనక్కి తిరిగి చూసుకునే లోగా మెడలోని 30 గ్రాముల బంగారం గొలుసును బలవంతంగా లాక్కొని పరారయ్యారు. ఆమె కేకలు వేయగా. . ఒకరు వారిని పట్టుకునేందుకు స్కూటీపై వెళ్లినా ప్రయోజనం లేకపోయింది.

☛ పట్టణంలోని రామన్నపేట రోడ్డు.. నంది విగ్రహం సెంటర్లో మరో మహిళ మెడలో బంగారం గొలుసు లాక్కొని పరారయ్యారు. లింగాలపాడు గ్రామానికి చెందిన మండలపు కుమారి తన అత్తతో కలిసి స్కూటీపై నందిగామ వచ్చింది. పని ముగించుకొని స్వగ్రామం వెళ్తుండగా.. ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి వెంబడించారు. స్కూటీ వెనుక కూర్చున్న అత్త మెడలోని 32 గ్రాముల బంగారం గొలుసు లాక్కొని పారిపోయారు. కె.వి.ఆర్ కళాశాల వద్ద దుండగుల దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. బాధితులు ఫిర్యాదు మేరకు సీఐ నాయుడు, సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా నిందితుల్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితురాలు లక్ష్మి



ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దుండగులు

# మరింత తగ్గిన కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నది దిగువన ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం శుక్రవారం మరింత తగ్గింది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 2,18,543 క్యూసెక్కుల మేర రాగా, 30 గేట్లను 5 అడుగులు, మిగతా 40 గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తారు. 2,01,500 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేశారు. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు 17,043 క్యూసెక్కులు ఇచ్చారు. రాత్రి 9 గంటలకు స్వల్పంగా పెరిగింది. ఎగువ నుంచి 2,07,201 క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 1,89,625 క్యూసెక్కులు విడుదల చేశారు. కాల్వలకు స్వల్పంగా పెంచి 17,576 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వలకు 10,271, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 7,105, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.



# వామపక్షాల ఏకీకరణ అవసరం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: వామపక్షాల ఏకీకరణ అవసరమని, తెలుగు రాష్ట్రాల్లో సమస్యలపై వామపక్ష పార్టీలు ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ అన్నారు. గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో మోటూరు హనుమంతరావు 24వ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అభాగ్యులు, పీడిత, బడుగు వర్గాల గొంతుకగా పని చేసేది వామపక్ష నాయకులేనన్నారు. సమాజంలో వివిధ అంశాలపై భిన్నాభిప్రాయాలకు చోటు ఉండాలన్నారు. మీడియాలో కొత్త తరం వారికి ఉత్సాహం, ప్రోత్సాహం ఉండాలన్నారు. ప్రస్తుత జర్నలిజంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, వీటిని ప్రజాశక్తి అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం శ్రీకాకుళం గిరిజన ప్రాంతాల్లో సమస్యలపై కథనాలు రాసిన ఆంధ్రజ్యోతి విలేకరి గేదెల మాధవరావుకు మోటూరు హనుమంతరావు 24వ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును న్యూస్ క్లిక్ ప్రధాన సంపాదకుడు ప్రబీర్ పుర్కాయస్థ, వి.ఆర్.బొమ్మారెడ్డి ఉత్తమ జర్నలిస్టులుగా ఎంపికైన ఎం.శివాజీ, పి.రాజశేఖర్‌లకు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ప్రముఖ జర్నలిస్టులు తెలకపల్లి రవి, నల్లి ధర్మారావు, బి.తులసీదాస్‌లు ప్రదానం చేశారు.



మాధవరావుకు అవార్డును ప్రదానం చేస్తున్న ప్రబీర్ పుర్కాయస్థ, లక్ష్మణరావు, రవి తదితరులు

# ఆధునిక వైద్య విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే మేలు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఆధునిక వైద్య విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. మూడు రోజుల పాటు లబ్బీపేట ఎస్.ఎస్.కన్వెన్షన్‌లో నిర్వహించే ఇండియన్ నెఫ్రాలజీ సొసైటీ సదరన్ ఛాప్టర్ 44వ వార్షిక సదస్సును శుక్రవారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఉపకులపతి మాట్లాడుతూ... ఆధునిక వైద్య చికిత్స విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, నవీన ఔషధాల గురించి అవగాహన పెంపొందించుకునేందుకు సదస్సు చక్కటి వేదికగా నిలుస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు మాట్లాడుతూ.. ఈ సదస్సు వైద్య చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. నెఫ్రాలజిస్టు డాక్టర్ నలమాటి అమ్మన్న మాట్లాడుతూ.. నెఫ్రాలజీకి సంబంధించి ఆధునిక చికిత్సా విధానాలు, సవాళ్లు, నూతన ఆవిష్కరణల గురించి చర్చిస్తామన్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి 600 మందికి పైగా నిపుణులు వివిధ అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. డాక్టర్ జి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్, వైద్యులు అమ్మన్న, శ్రీహరిరావు

### బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -99 రిటైల్ ధర 121 చికెన్ విత్ స్కిన్ - 175, చికెన్ స్కిన్‌లెస్ - 200.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 105, 113, 124 చికెన్ విత్ స్కిన్ - 200 చికెన్ స్కిన్‌లెస్ - 210.

### నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

# త్వరలో ఆర్టీసీ ఐకాస

విజయవాడ బస్ స్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ గవర్నరుపేట-1, 2 డిపోల స్థలాన్ని లులూ సంస్థకు కేటాయించొద్దని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ విజయవాడ జోన్ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు త్వరలో ఆర్టీసీలోని అన్ని యూనియన్లను కలుపుకొని జేఏసీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో అర ఎకరా ఆర్టీసీ స్థలాన్ని మున్సిపల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ఇచ్చారని, ఆ స్థలంతోపాటు 4.15 ఎకరాల విలువైన స్థలాన్ని లులూ మాల్‌కు కట్టబెట్టే విధానం మానుకునేంత వరకు పోరాటం చేస్తామన్నారు. పాత బస్టాండ్ స్థలాన్ని 1959లో ప్రభుత్వం కేటాయించిన రేటు రూ.4.6 లక్షలకు ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వానికి రుసుము చెల్లించి తీసుకుందన్నారు. ఆర్టీసీ స్థలాలు ప్రైవేటు సంస్థలకు ఇచ్చే ఆలోచన మానుకోవాలని పిలుపునిచ్చారు.



ఈయు నాయకుల నిరసన

# తిరువూరు

• తిరువూరు • మైలవరం



? కొండపల్లి గాయత్రీ నగర్‌కు వస్తున్న కొండ నీరు దిగువనున్న డ్రెయినేజీలోకి వెళ్లడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందిగా ఉంది. మురుగు వాసన, దోమలు వస్తున్నాయి. **-శ్రీకాంత్, కొండపల్లి** ✔ జాతీయ రహదారికి అనుసంధానంగా నిర్మించిన కాలువ దాదాపుగా పూడుకుపోయింది. ఈ విషయాన్ని ఎన్‌హెచ్‌ఏఐ నిర్వహణ సిబ్బంది తెలియజేశాం. వారు స్పందించడం లేదు. కొన్ని సందర్భాల్లో పురపాలిక ఆధ్వర్యంలోనే పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నాం. మరోసారి వాళ్లకు తెలియజేస్తాం. **- శ్రీను, పారిశుద్ధ్య మేస్త్రీ**
**– న్యూస్‌టుడే, కొండపల్లి,**

## జోనల్ స్థాయి పోటీకి ఎంపిక


ఎస్కే సమీరా

**మైలవరం, న్యూస్‌టుడే:** సమాచార హక్కు చట్టం 2005 అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ బీఎస్సీ విద్యార్థిని షేక్ సమీరా జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇల్లా రవి తెలిపారు. సహ చట్టం ఏర్పాటై ఇరవై ఏళ్లు గడిచిన సందర్భంగా పలు దశల్లో నిర్వహించిన పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి జోనల్ స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థినిని కళాశాల సిబ్బంది అభినందించారు.

## కంప్యూటర్..ప్రింటర్ బహూకరణ

**వెల్వడం(మైలవరం):** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ఐడీబీఐ బ్యాంకు అధికారులు మండలంలోని వెల్వడంలో గల ప్రాథమిక పాఠశాలకు మూడు లాప్‌టాప్‌లు, ఒక ప్రింటర్‌ను బహూకరించినట్లు ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్‌వీ సుధారాణి తెలిపారు. పాఠశాలలో అమర్చిన ప్రింటర్‌ను శుక్రవారం బ్యాంకు జీఎం సతీష్‌కృష్ణ, ఏజీఎం వి.చందన్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో చంద్రాల బ్రాంచి మేనేజరు వి.బంగారుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

**జి.కొండూరు, న్యూస్‌టుడే:** మండలంలోని వెంకటాపురంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం మండల స్థాయి అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. సంపద తయారీ కేంద్రం, ఇంటింటా చెత్త సేకరణ, తాగునీటి శుద్ధి, మురుగు కాల్వల నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల పరిశుభ్రత తదితర అంశాలపై సర్వే చేశారు. కార్యక్రమంలో డీపీవో పి.లావణ్యకుమారి, ఎంపీడీవో టీవీ రామకృష్ణనాయక్, ఈవోపీఆర్డీ కే శ్రీనివాసరావు, స్వచ్ఛ సర్వేక్షణ బృంద సభ్యుడు సుధీర్, డీపీఆర్‌సీ నాగేశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

**గొల్లపూడి, న్యూస్‌టుడే:** పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఉపాధి అవకాశాలను మెరుగు పరిచి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో వ్యవసాయ ఆధారిత జీవనోపాదుల శిక్షణ ముగింపు కార్యక్రమం గొల్లపూడిలోని ఓ హోటల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెర్ప్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు మహిళల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు మహిళా సాధికారతకు తోడ్పడుతున్నాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పీ4 కార్యక్రమంలో భాగస్వాములై బంగారు కుటుంబాలకు మార్గదర్శకులు కావాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన 2047 లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్.వి.నాంచారరావు, అసిస్టెంట్ డైరెక్టర్ మహిత తదితరులు పాల్గొన్నారు.

## వివాదాలు తలెత్తకుండా రీసర్వే పూర్తి చేయండి

**జి.కొండూరు, న్యూస్‌టుడే:** సరిహద్దు వివాదాలు తలెత్తకుండా భూముల రీసర్వే పారదర్శకంగా చేపట్టాలని జేసీ ఇలక్కియా సూచించారు. మండలంలో వెంకటాపురం, చెవుటూరు గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను ఆమె శుక్రవారం పర్యవేక్షించారు. రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి రీసర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న జేసీ ఇలక్కియా

## బాధితురాలికి న్యాయం చేయాల్సిందే


మైలవరం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతూ

**మైలవరం, న్యూస్‌టుడే:** స్థానిక పంచాయతీలో పారిశుద్ధ్య పనులను కార్మికులు బహిష్కరించారు. మూడు రోజుల కిందట పారిశుద్ధ్య కార్మికురాలు బిజిలీ భవానిపై దాడి చేసిన కటారు ఉమామహేశ్వరరావుపై కేసు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉదయం పంచాయతీ కార్యాలయం ఎదుట నల్ల రిబ్బన్లు ధరించి నినాదాలు చేశారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకొని బాధితురాలికి న్యాయం జరిగేలా, దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదుకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. చర్యలు తీసుకునే వరకు పంచాయతీలో పనులు చేసేది లేదంటూ నోటీసు బోర్డులో విధుల బహిష్కరణ నోటీసులు అంటించారు. కార్యక్రమంలో వీరయ్య, చంద్ర రావు, శివ తదితరులు పాల్గొన్నారు.

**విస్సన్నపేట, న్యూస్‌టుడే:** మైలవరంలో పంచాయతీ కార్మికురాలిపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ విస్సన్నపేటలో శుక్రవారం సీఐటీయూ నాయకులు, పంచాయతీ కార్మికులు ప్రధాన రహదారిలో ప్రదర్శన చేశారు.

### క్షమాపణతో సమ్మె విరమణ

**మైలవరం, న్యూస్‌టుడే:** పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడికి పాల్పడిన తెదేపా నాయకుడు కటారు ఉమామహేశ్వరరావు, పెద్దల సమక్షంలో శుక్రవారం బాధితురాలికి క్షమాపణ చెప్పడంతో సమ్మె విరమిస్తున్నట్లు కార్మిక సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. యథావిధిగా తమ విధులు నిర్వర్తిస్తామని ప్రకటించింది.

## మస్తరు తప్పదు.. మస్కా కుదరదు

### కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు జారీ

న్యూస్‌టుడే, గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు బలోపేతం చేసింది. ఇప్పటికే పనుల నిర్వహణ, కూలీల హాజరు నమోదులో కొత్త యాప్‌లు అమలు చేస్తుండగా, తాజాగా శ్రామికులకు ఇకపై రెండు పూటలా మస్తర్ నమోదు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇకపై గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో పాల్గొంటున్న జాబ్‌కార్డు కలిగిన శ్రామికులు కొత్త నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం పని ప్రదేశంలో ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు క్షేత్ర సహాయకులు ఆధారంగానే కూలీలకు వేతనాలు చెల్లిస్తారు.

**అవకతవకలు సరిదిద్దేందుకే..** ఉపాధి పనుల మస్తర్ల నమోదులో జరుగుతున్న అవకతవకలను నివారించడమే లక్ష్యంగా కేంద్రం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు క్షేత్ర సహాయకులు ఎన్ఎంఎంఎస్(నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) ద్వారా ఉదయం, మధ్యాహ్నం ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసేవారు. ఈ విధానంలో కూలీలు ఒకపూట పని చేసి రెండు పూటలు చేసినట్లు నమోదు చేసుకునే వారు. దీంతో సామాజిక తనిఖీలు జరిగినపుడు మస్తర్లలో లోపాలు ఉండడంతో క్షేత్ర సహాయకులకు జరిమానాలు విధించే వారు. ఇప్పటికే పలు మండలాల్లో నిర్వహించిన ప్రజావేదికల్లో రికవరీలు, జరిమానాలు విధించారు. కొత్త విధానంలో ఉదయం, సాయంత్రం మస్తర్ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉన్న నేపథ్యంలో తప్పనిసరిగా కూలీలు పని ప్రదేశంలో ఉండాల్సి వస్తుంది. ఈ విధానం వల్ల మస్తర్ నమోదు చేసుకుని పని ఎగ్గొట్టే పరిస్థితి ఉండదని అధికారులు భావిస్తున్నారు.

**నూతన విధానంలో ఇలా..** పని చేసే ప్రదేశంలో ఉదయం 9, సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే ఫొటోలు తీయాలి. వాటిని రెండు సార్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటిని పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించి ఎంపీడీవోలకు నివేదిక పంపుతారు. అన్ని గ్రామాల నుంచి వచ్చిన సమాచారంతో 20 శాతం ఫొటోలను ఇప్పటి వరకు 15 రోజులు మాత్రమే భద్రపరిచే విధానం ఉండేది. ఇకపై జిల్లా అధికారులు శాశ్వత పద్ధతిలో భద్రపరుస్తారు. వచ్చే వారం నుంచి క్షేత్రస్థాయిలో కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తామని ఉపాధి హామీ ఏపీవోలు తెలిపారు.


గంపలగూడెం మండలంలో ఉపాధి పనుల్లో పాల్గొన్న శ్రామికులు

**తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ఇలా..**

| మండలం | గ్రామాలు | జాబ్‌కార్డులు | శ్రామికులు |
| --- | --- | --- | --- |
| తిరువూరు | 20 | 9,237 | 15,843 |
| గంపలగూడెం | 24 | 13,263 | 24,558 |
| ఎ.కొండూరు | 21 | 11,598 | 21,684 |
| రెడ్డిగూడెం | 12 | 9,514 | 16,063 |
| విస్సన్నపేట | 12 | 11,372 | 19,572 |

## రాయితీపై దాణా పంపిణీ

**కొండపల్లి, న్యూస్‌టుడే:** కొండపల్లి పశువైద్యశాల వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సబ్సిడీపై పశుదాణా విక్రయాలను పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, జనసేన నాయకుడు అక్కల గాంధీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారిణి స్వాతి అయ్యప్ప మాట్లాడుతూ ఎస్సీ పాడిరైతులకు 50 శాతం సబ్సిడీతో సమీకృత దాణాని విక్రయిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో పశువులకు గురక వ్యాధి రాకుండా ఉండటానికి టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అఫ్సర్, ప్రకాశ్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సేద్యంతో అధిక ఆదాయం

**మైలవరం, న్యూస్‌టుడే:** ప్రకృతి సేంద్రియ పద్ధతులతో వ్యవసాయం చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం గడించవచ్చని జడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది పేర్కొన్నారు. మండలంలోని మొర్సుమిల్లిలో పొలం గట్లపై కంది, కూరగాయల సాగుపై క్షేత్రసాగు నిర్వహించారు. పలువురు రైతుల పొలాల గట్లపై వాటిని నాటించారు.

## వరినాట్లు వేసి..ఉత్సాహపరిచి

**గానుగపాడు(తిరువూరు), న్యూస్‌టుడే:** ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కొద్దిసేపు వరినాట్లు వేసి శ్రామికులను ఉత్సాహపరిచారు. మండలంలోని గానుగపాడులో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయనకు గ్రామ సమీపానికి రాగానే రహదారి పక్కనే మాగాణిలో వరి నాట్లు వేస్తున్న కూలీలను కనిపించారు. వెంటనే కారు దిగి వారి వద్దకు చేరుకుని కుటుంబ వివరాలు, బాగోగులపై ఆరాతీశారు. ఆపై వారితో కలిసి పొలంలో దిగి వరి మొక్కలు నాటి ఉత్సాహపరిచారు. తనకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టమని..శ్రామికులతో కలిసి తాను వరి నాట్లు వేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. తదుపరి పొలం గట్టుపైకి చేరి కూలీలు అన్నం తింటుండగా ఆయన కూడా వారితోనే కూర్చుని సమస్యలు తెలుసుకున్నారు.


మాగాణిలో కూలీలతో కలిసి వరి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

## కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాల్సిందే


మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

**తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే:** పంట సాగు హక్కు పత్రాలు (సీసీఆర్సీ) కలిగిన కౌలు రైతులందరికి 2025-26 ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అవసరమైన పంట రుణాలు బ్యాంకుల నుంచి కచ్చితంగా మంజూరు చేయాలని ఆర్డీవో కె.మాధురి స్పష్టంచేశారు. తిరువూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, ఎ.కొండూరు మండలాల పరిధిలోని వాణిజ్య, గ్రామీణ, సహకార బ్యాంకుల అధికారులు, వ్యవసాయాధికారులతో కౌలు రైతులకు పంట రుణాల మంజూరుపై సమావేశం నిర్వహించారు. సీసీఆర్సీ తీసుకున్న ప్రతి రైతుకు పంటల సాగుకు పెట్టుబడికి అవసరమైన నిర్దేశిత రుణం బ్యాంకుల నుంచి అందించాలన్నారు. రెవెన్యూ డివిజన్‌లోని 74 గ్రామాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 10,932 మంది కౌలు రైతులకు సీసీఆర్సీలు ఇవ్వాల్సి ఉండగా నూరుశాతం అందజేసినట్లు తెలిపారు.

## మట్టి గణపతినే పూజిద్దాం


అవగాహన కల్పిస్తున్న నాయకులు చిట్టిబాబు, గాంధీ, విగ్రహాల తయారీదారులు

**ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే:** పర్యావరణ పరిరక్షణ కోసం రానున్న వినాయక చవితికి మట్టి ప్రతిమలను పూజిద్దామని కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, జనసేన నాయకుడు అక్కల గాంధీలు పేర్కొన్నారు. శుక్రవారం కొండపల్లిలో బొమ్మల తయారీదారులు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కొండపల్లికి చెందిన సుంకర శ్రీనివాసరావు గత కొన్ని సంవత్సరాలుగా మట్టి ప్రతిమలను తయారుచేసి భక్తులకు అవగాహన కల్పించడం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. మట్టి ప్రతిమలను చెరువు బావులలో నిమజ్జనం చేస్తే నీటిలో కరిగిపోయి పర్యావరణానికి హాని జరగదని వివరించారు.

## చక్రాల కుర్చీల వితరణ

**మైలవరం, న్యూస్‌టుడే:** లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం సభ్యుడు బండి నగేష్, కుమారుడు రఘురాం పుట్టినరోజు సందర్భంగా వెల్వడానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు చక్రాల కుర్చీ వితరణగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ ఎస్వీ నివృతరావు, క్లబ్ నాయకులు వెంకటేశ్వరరావు, నాగభూషణం, రామిరెడ్డి, హరీష్ కుమార్, బాలగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనతో పేదలకు ఆర్థిక భరోసా

### పండగలా స్పౌజ్ పింఛన్ల పంపిణీ


తిరువూరు: చౌటపల్లిలో స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన తెదేపా నాయకులు

**గంపలగూడెం, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు శుక్రవారం పండగ వాతావరణంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎ.కొండూరు 143, గంపలగూడెం 189, తిరువూరు రూరల్ 132, తిరువూరు అర్బన్ 49, విస్సన్నపేట 157 మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ఛైర్మన్ శావల దేవదత్, తెదేపా మండలాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే:** మైలవరం నియోజకవర్గంలో 989 మందికి స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం ఇబ్రహీంపట్నం శక్తినగర్‌లో సామాజిక పింఛన్లతోపాటు నూతనంగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. పింఛను సొమ్ముతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు.

**జి.కొండూరు, న్యూస్‌టుడే:** మండలంలోని లబ్ధిదారులకు తెదేపా నాయకులు స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీవీ రామకృష్ణనాయక్, తెదేపా మండల కార్యదర్శి లంకా రామకృష్ణ, కుంటముక్కల సొసైటీ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరి, ఎంపీటీసీ సభ్యురాలు సందిపాము జయలక్ష్మీ పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం గ్రామీణం: ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీలోని లబ్ధిదారులకు పింఛను అందజేశారు. కార్యక్రమంలో ఎన్నెస్పీ 10 డీసీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, రెడ్డిగూడెం పీఏసీఎస్ ఛైర్మన్ వి.సుబ్బారెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాట్ల పరిశీలన

**గోపాలపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే:** ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం గోపాలపురం గ్రామంలోని ఎస్.ఎన్.కల్యాణ మండపంలో శనివారం నిర్వహించనున్న గిరిజన న్యాయ జాగృతి సదస్సుకు న్యాయ, రెవెన్యూ శాఖల అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం మచిలీపట్నం జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి జి.గోపి ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా పరిపాలనా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సుకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి, జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పాల్గొంటారని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఏకైక గిరిజన మండలమైన ఎ.కొండూరు ప్రజలకు ఆరోగ్యం, హక్కులు, పరిష్కారాలు తదితర అంశాలపై న్యాయపరమైన అవగాహన, సేవలు అందించేందుకు సదస్సు జరగనుంది. ఆర్డీవో మాధురి, తిరువూరు న్యాయస్థానం జడ్జీలు ఎ.సింధూర, కె.సూర్యతేజ, రెవెన్యూ, న్యాయశాఖల సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి గోపి, పక్కన ఆర్డీవో మాధురి, తిరువూరు జడ్జీలు సింధూర, సూర్యతేజ

## రాజ్యలక్ష్మి అమ్మవారికి అభిషేకాలు

**ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే:** మండలంలోని ఊటుకూరు కోదండ రామాలయంలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా రాజ్యలక్ష్మి అమ్మవారికి అర్చకులు రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అలంకరణ, అర్చన చేయగా భక్తులు దర్శించుకున్నారు.

## హజ్ యాత్రకు దరఖాస్తుల గడువు పొడిగింపు

**తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే:** హజ్ యాత్రకు దరఖాస్తుల గడువు మరో వారం పొడిగించినట్లు రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ ఎస్‌కే.అబ్దుల్‌హుస్సేన్ తెలిపారు. వాస్తవంగా జులై నెలాఖరుతో గడువు ముగియగా శుక్రవారం విజయవాడలో నిర్వహించిన హజ్ కమిటీలో సమావేశంలో ఆగస్టు 7వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా హజ్ యాత్ర కోసం విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి వెళ్లే వారికి ఏపీ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తుందన్నారు.

## ధర్నా విజయవంతానికి పిలుపు

**ఎ.కొండూరు, న్యూస్‌టుడే:** విజయవాడ ధర్నా చౌక్‌లో శనివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మండలంలోని ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు తీర్మానించారు. ఎ.కొండూరులో శుక్రవారం సాయంత్రం ఫ్యాప్టోలో భాగమైన రెండు సంఘాల నాయకులు సమావేశమై ధర్నాకు ఉపాధ్యాయుల సమీకరణపై చర్చించారు. నాయకులు ఎస్.జార్జ్‌వాషింగ్టన్, వెంకటదుర్గారావు, పి.లీల, జ్ఞానప్రసూన, ఇషాక్, శామ్యూల్, సురేష్, శ్రీనివాసరావు, రామ్‌నాయక్ పాల్గొన్నారు.

## ఎన్టీటీపీఎస్ ఆసుపత్రిని ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వొద్దు

**ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే:** ఎన్టీటీపీఎస్ ఆసుపత్రిని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పే విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ మండల శాఖ కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ..ప్రైవేటు ఏజెన్సీలకు ఎన్టీటీపీఎస్ ఆసుపత్రి నిర్వహణను అప్పగిస్తే ఉద్యోగులకు, కార్మికులకు సరైన వైద్యం అందదన్నారు.

## మైలవరం ఏఎంసీ వైస్ ఛైర్మన్ నియామకం

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** మైలవరం మార్కెట్ యార్డు(ఏఎంసీ) వైస్ ఛైర్మన్‌గా రెడ్డిగూడెం మండలంలోని రెడ్డికుంట గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు చేబ్రోలు రాజును నియమించినట్లు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ


నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

**తిరువూరు, న్యూస్‌టుడే:** విద్యుత్తు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, సర్దుబాటు, సర్‌ఛార్జీలు ఎత్తివేయాలని కోరుతూ సీఎంకు అందజేయనున్న వినతిపత్రాలపై శుక్రవారం పట్టణంలోని ప్రజలు, వినియోగదారుల నుంచి సీపీఎం నాయకులు సంతకాలు సేకరించారు. పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ మీటర్లతో కలిగే ఇబ్బందులను వినియోగదారులకు వివరించారు. సీపీఎం నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎ.రవి, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన

**జి.కొండూరు, న్యూస్‌టుడే:** చెరువుమాధవరానికి చెందిన లారీ డ్రైవర్ దేరంగుల గోపి గురువారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మృతుడి బంధువులు గురువారం రాత్రి సమయంలో సైతం పోస్టుమార్టం చేయడానికి వీలు లేదని నిరాకరించి గోపి కుటుంబాన్ని ఆదుకోవాలని సంఘటనా స్థలంలోనే మృతదేహం ఉంచి నిరసన తెలిపారు. జి.కొండూరు ఎస్సై కే సతీష్‌కుమార్, సీఐ చంద్రశేఖర్ రంగంలోకి దిగి మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించి మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించేందుకు అంగీకరించారు. అనంతరం గుత్తేదారు, లారీ యజమానులతో మైలవరం సీఐ కార్యాలయంలో జరిపిన చర్చలు సఫలం కావడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.


నిరసన వ్యక్తం చేస్తున్న మృతుడి తరఫు బంధువులు

## ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

**ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే:** తల్లిదండ్రులు మందలించడంతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన కాచవరంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి సాయి తేజ(19) చిన్నతనం నుంచి అమ్మమ్మ నడకుదిటి సావిత్రి ఇంట్లో ఉంటూ కూలికి వెళ్తుండేవాడు. ఇటీవల వ్యసనాలకు బానిసై పనులకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలో ఉదయం బయటకెళ్లి తిరిగి వచ్చి తలుపు వేసుకున్నాడు. పింఛను కోసం వెళ్లి వచ్చిన అమ్మమ్మ తలుపు కొట్టగా ఎంతసేపటికీ తీయలేదు. దీంతో కిటికీలోనుంచి చూడగా గదిలోని ఫ్యానుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహాన్ని దింపి శవపరీక్ష నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడికి గాయాలు

**భవానీపురం, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు గాయపడినట్లు భవానీపురం స్టేషన్ పోలీసులు తెలిపారు. గొల్లపూడి మైలురాయి సెంటర్ వద్ద పి.వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అతడు రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారం కూరగాయల వ్యాపారం చేస్తుంటారు. గత నెల 28వ తేదీ మధ్యాహ్నం సమయంలో కుమారుడు యశ్వంత్‌కుమార్‌తో కలిసి ఇంటికి వెళ్తున్నారు. భవానీపురం కనకదుర్గ పైవంతెన వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో వారిద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని గొల్లపూడిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

**భవానీపురం, న్యూస్‌టుడే:** భర్త వేధిస్తున్నాడని భార్య భవానీపురం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గొల్లపూడిలోని జైన్ కాలనీలో సిద్ధిజైన్, దర్పన్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇరవై ఏళ్ల కిందట వివాహమైంది. కొన్నాళ్లుగా భర్త అదనపు కట్నం తీసుకు రావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఈతరం

youthpage@eenadu.in



చేనేత అంటే పొట్ట కూటి కోసం వస్త్రాలు నేసే ఉపాధి కాదు.. ఇది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటే కళ! సౌకర్యాన్ని, ఆధునికతను ఒంటికి చుట్టే ఈ వృత్తిలోనే రకరకాల ప్రయోగాలు చేస్తున్నాడు గూడ పవన్. ఆ నైపుణ్యానికే జాతీయ యువ చేనేత పురస్కారానికి ఎంపికయ్యాడు.

## పట్టు వదల్లేదు.. ప్రతిభ మురిసింది!

యాదాద్రి భువనగిరి జిల్లాలోని పుట్టపాక గ్రామం అంటే పట్టు చీరలు, అద్భుత నేతకారుల నిలయం. ఈ గ్రామం నుంచి రెండు పద్మశ్రీ అవార్డులు, 10 జాతీయ అవార్డులు, 20కి పైగా రాష్ట్రస్థాయి అవార్డులు దక్కాయి. ఆ స్ఫూర్తితో తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని చేనేతలో ప్రయోగాలు చేస్తున్నాడు పవన్.

**ప్రకృతి రంగులతో..**

సాధారణంగా పట్టు నూలును రంగులు అద్దడానికి రకరకాల రసాయనాలు వినియోగిస్తుంటారు. దీంతో ఈ వృత్తిలో పని చేసేవారికి ఇబ్బందికరంగా ఉంటుంది. దాంతోపాటు రంగు వెలిసిపోవడానికి ఆస్కారం ఉంటుంది. ఈ సమస్యలకు చెక్ పెట్టే పరిష్కారం ఆలోచించాడు పవన్. దాని కోసం ప్రకృతి నుంచి సేకరించిన బంతి పూలు, దానిమ్మ పండ్లు, మంజిష్ఠ వేర్లు, ఇండిగో నీలం, చావల్ కుడిపొడి, బెల్లం, వనమూలికలతో తయారు చేసిన సహజ సిద్ధ రంగులను ఉపయోగిస్తున్నాడు. వీటిని మల్బరీ పట్టు దారానికి అద్ది, జాతీయ భౌగోళిక గుర్తింపు(జీఐ ట్యాగ్) పొందిన 'తేలియా రుమాల్' డిజైన్‌తో పట్టుచీరలను మగ్గంపై నేస్తున్నాడు. దాంతోపాటు తను నేసిన ఒక చీరలో ప్రాచీన, సంప్రదాయాలను ప్రతిబింబించేలా హోమగుండం, రథం పీట, పల్లకీ, చక్రం, వజ్రం, మల్లెపువ్వు బంతిపువ్వు మధ్యలో తదితర 16 వస్తువులతో డిజైను రూపొందించాడు.

**ఆరునెలల కష్టం..**

ముందు ప్రకృతి నుంచి సేకరించిన పదార్థాలను ఎండబెట్టి, 20 రోజుల పాటు మగ్గబెట్టాడు. తర్వాత వాటిని పొడిచేసి, సహజసిద్ధ రంగులు తయారు చేశాడు. ఈ రంగులను మల్బరీ పట్టు దారానికి అద్ది తేలియా రుమాల్ డిజైన్‌తో పట్టుచీర నేశాడు. రంగుల మిశ్రమంలో రకరకాల ఆకృతులు వచ్చేలా డిజైన్ చేశాడు. ప్రాచీన సంప్రదాయం, భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ఆరునెలలు శ్రమించి చీరను తయారు చేశాడు. చీర ముడతలు పడకుండా మృదువైన పట్టును వాడాడు. తల్లిదండ్రుల నుంచి చేనేత వృత్తిని వారసత్వంగా అందిపుచ్చుకున్న పవన్, ఇందులోనే తన ప్రత్యేకత చూపించాలని పట్టుదలతో బీటెక్ డిగ్రీని సైతం మధ్యలోనే ఆపేశాడు. ప్రస్తుతం దక్కిన గుర్తింపుతో భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలు చేస్తానంటున్నాడు. జాతీయ స్థాయిలో 'యంగ్ వీవర్ పురస్కారం' సాధించిన పవన్, ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నాడు రాష్ట్రపతి చేతులమీదుగా ఈ పురస్కారం అందుకోనున్నాడు. ఈ ఏడాది భారత ప్రభుత్వ టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ జాతీయ చేనేత పురస్కారం-2024 ప్రకటించింది.

– కొండ శ్రీనివాస్‌గౌడ్, సంస్థాన్ నారాయణపురం

## క్లిక్‌మనిపిస్తే.. డబ్బు!

సెల్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు.. కుర్రకారు ఆగుతారా? ఏ సుందర దృశ్యం కనిపించినా క్లిక్‌మనిపిస్తుంటారు. ఆనక ఏ సామాజిక మాధ్యమాల్లోనో పంచుకుంటారు. ఇదే పని చేస్తూ డబ్బులు సంపాదించవచ్చనే విషయం మీకు తెలుసా? దానికోసమే ఈ యాప్‌లు ఉన్నాయి.




- **షటర్‌స్టాక్ కంట్రిబ్యూటర్:** భారత్‌లో టాప్ స్టాక్ ఫొటో కంపెనీ. మీ చిత్రాలకు డబ్బులు చెల్లించడమే కాదు.. వాటిని ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకున్న ప్రతిసారీ రాయల్టీ ఇస్తారు.
- **అడోబ్‌స్టాక్ కంట్రిబ్యూటర్:** ఫొటోగ్రఫీ ప్రొఫెషనల్స్ అత్యధికంగా సొమ్ము చేసుకునే యాప్ ఇది. బాగా నాణ్యంగా ఉండే ఫొటోలు అమ్ముడవుతాయి. యాప్ లేదా వెబ్‌సైట్ నుంచి అప్‌లోడ్ చేయొచ్చు.
- **స్నాప్‌వైర్:** మనం తీసిన ఫొటోల్ని అవసరం ఉన్న బ్రాండ్లకు అమ్మి పెడుతుందీ యాప్. మనకో మార్కెట్ ప్లేస్ చూపిస్తుంది. అమ్మగా వచ్చిన మొత్తం పే పాల్ నుంచి చెల్లిస్తారు.
- **ఫోప్ (Foap):** యూజర్‌ఫ్రెండ్లీగా ఉంటుంది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. ఎలాంటి ఫొటోలు తీయాలో 'మిషన్' కూడా అప్పజెప్తుతారు. వాళ్లు కోరినట్టు క్లిక్‌మనిపిస్తే చాలు.
- **ట్వంటీ20:** ఇందులో రోజూ ఫొటోలు అప్‌లోడ్ చేస్తూ డబ్బు సంపాదించవచ్చు. తరచూ 'ఫొటో ఛాలెంజెస్' పెడుతుంటారు. అందులో మీ ఫొటో బాగుంటే.. పంట పండినట్టే.

## ఆఫీసులో జాతిరత్నాలు



ప్రతి ఆఫీసులో కొన్ని జాతిరత్నాలుంటాయి. కొందరు నవ్వు తెప్పించేవాళ్లైతే, ఇంకొందరు విసుగు పుట్టించేవాళ్లు. అయితే పదండి.. ఇలాంటి వాళ్లు మీ కార్యాలయంలో ఉన్నారో, లేదో వెతికేద్దాం.

**కాఫీ బ్రేక్ కమెడియన్:** కాఫీ మెషిన్ దగ్గర జోకులు, లంచ్‌లో పంచ్‌లతో అందర్నీ నవ్విస్తాడు. సాధారణ సంఘటనల్ని కూడా స్టాండప్ కామెడీలా మార్చేసే దిట్ట.

**డ్రామా కింగ్/క్వీన్:** ప్రతి విషయాన్నీ సినిమాటిక్‌గా మార్చేస్తారు. ఆఫీసులో సర్వర్ డౌన్ అయితే 'ఇది సమస్య కాదు మిత్రమా.. శత్రువులు మన కంపెనీపై ప్రకటించిన యుద్ధం' అని డైలాగ్ వదులుతారు. వీళ్లు ఆఫీసులో ఉంటే డల్ మూమెంట్ అనేదే ఉండదు.

**గాసిప్ గురూజీ:** గాసిప్‌లు మోయడంలో ఛాంపియన్. టీం లీడర్ కొన్న కొత్త కారు, మీటింగ్‌లో మేనేజర్‌కి జూనియర్ ఇచ్చిన రివర్స్ లెక్చర్.. అన్నీ విన్నట్టే చెబుతారు. వీళ్ల మాటల్లో నిజం 50%, మసాలా 50% ఉంటాయి.

**స్నాక్ స్మగ్లర్:** ఈ జాతి వాళ్ల బ్యాగుల్లో బిస్కెట్స్, చిప్స్, లడ్డూలు.. ఓ దుకాణమే ఉంటుంది. సమావేశంలో బాస్ సీరియస్‌గా చెప్తుంటే, వీళ్లు చప్పుడు చేయకుండా చిప్స్ ప్యాకెట్ లాగించేస్తుంటారు. వీళ్లు లేకపోతే ఆఫీసులో చాలామందికి తాత్కాలికంగా ఆకలి తీరదు.

**బిజీ బాద్‌షా:** ఫోన్‌లో ఏదో టైప్ చేస్తూ, డాక్యుమెంట్ తెరిచి సీరియస్‌గా చూస్తూ కనిపిస్తుంటారు. కానీ దగ్గరికెళ్తే ఇన్‌స్టాలో రీల్స్ చూస్తూనో, వాట్సప్‌లో ఫ్రెండ్ చాటింగ్ చేస్తూనో దొరికిపోతుంటారు. ఏమీ చేయకుండానే అన్నీ చేస్తున్నట్టు నటించడంలో వీళ్లు ఆస్కార్ గెలుస్తారు.

**లీవ్ లెజెండ్:** సెలవులు పెట్టడంలో ఈ ఉద్యోగి ప్రపంచరికార్డు హోల్డర్. ఏం చేస్తాడో, ఎలా ఒప్పిస్తాడోగానీ బాస్‌ని కాకా పట్టి కోరినన్ని సెలవులు పెట్టేస్తాడు. సెలవుల కోసం కథలు అల్లడంలో వీళ్లు షేక్స్‌పియర్‌లే.

**కాపీ-పేస్ట్ ప్రిన్స్:** ప్రెజెంటేషన్స్, ఈమెయిళ్లు, నివేదికలు.. అన్నీ కాపీ కొడతారు. గూగుల్‌లో వెతికి, వికీపీడియా నుంచి లాగేసి, 'సర్.. నా సొంత ఆలోచన' అంటూ పేటెంట్ తీసుకుంటారు.

- నక్క కిరణ్

## జపాన్‌లో అంతే...

మొగుడు బయటికెళ్లి సంపాదించుకొని రావాలి.. అర్ధాంగి ఇంటి బాగోగులు చూడాలి.. ఇదే కదా సాధారణంగా జరిగేది. జపాన్‌లో దీన్ని తూచా తప్పకుండా పాటిస్తారు. ఇంకాస్త వివరంగా చెప్పాలంటే.. భర్త సంపాదించుకొని వచ్చిన మొత్తం జీతమంతా భార్యకే ఇచ్చేస్తాడు. తిరిగి తన ఖర్చుల కోసం కొంత మొత్తం పాకెట్‌మనీగా తీసుకుంటాడు. దీన్నే 'ఒకోజుకాయ్' అంటారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఈ సంప్రదాయాన్ని జపాన్‌లో 88శాతం కుటుంబాలు పాటిస్తున్నాయట. ఇలా చేయడం వల్ల ఎవరి పాత్ర ఏంటో స్పష్టంగా తేలిపోతుంది.



బయటికి వెళ్లి పని చేసి సంపాదించడం భర్త బాధ్యత, సంసారాన్ని చక్కదిద్దడం భార్య పని అని. సంపాదన మొత్తం భాగస్వామికి ఇవ్వడం ఇద్దరి మధ్య పారదర్శకత, నమ్మకం పెరిగేలా చేస్తుంది. ఇదేదో బాగానే ఉంది కదూ.. మరింకెందుకు ఆలస్యం కుర్ర జంటలూ, పెళ్లి చేసుకోబోతున్న యువతా.. వెంటనే ఈ పద్ధతిని పాటించండి మరి.

## ట్రెండు మారినా.. ఫ్రెండు మారడు!

హేయ్ ఈతరం గ్యాంగ్! ఈ ఆదివారం దోస్తులతో రచ్చ చేయడానికి ఫ్రెండ్‌షిప్ డే వచ్చేస్తోంది. ఈరోజు చాలా ప్రత్యేకం! ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకోవడం, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడమే కాదు మామా.. అన్నివేళలా మన వెంటే ఉండే వాళ్లతో మనసు విప్పి మాట్లాడే సందర్భం ఇది. 'నువ్వు నా జీవితంలో ప్రత్యేకం' అని గుర్తు చేసుకునే సమయం. బెస్టీకి ఒక హగ్ ఇచ్చి, 'మామా.. నీవు లేకపోతే నా కథ కంప్లీట్ కాదురా' అని చెప్పి తీరాల్సిన వేళ.

మనం జీవితంలో ఒక్కసారి మధుర క్షణాల్ని గుర్తు చేసుకుంటే.. అందులో అత్యధికం స్నేహితులు మన వెంట ఉన్ననాటివే అయ్యుంటాయి. అందులోనూ కాలేజీ స్నేహం కిర్రాక్. లాస్ట్ బెంచ్‌లో గుసగుసలు, క్యాంటీన్‌లో గంటలకొద్దీ గాసిప్స్ చెప్పుకోవడాలు, కాలేజీ ఫెస్ట్‌లో గ్రూప్ డాన్స్‌తో స్టేజీని షేక్ చేసిన రోజులు, క్లాస్ బంక్ కొట్టి బైక్‌మీద ఊరంతా తిరిగిన వేళలు.. ఎన్నిసార్లు తలచుకున్నా పెదాలపై నవ్వులు విరబూస్తూనే ఉంటాయి. అక్కడే ఒకడు నోట్స్ పంచుకుంటే, ఇంకొకడు ప్రేమకు రాయబారం నడుపుతాడు. మరొకడు మన మీదే జోకులు వేసి నవ్విస్తాడు. ఈ దోస్తీ కాలేజీ గోడల మధ్యే ఆగిపోదు. కెరియర్‌కి చేదోడులా కూడా నిలుస్తుంది. ఒకడు స్టార్టప్ ఐడియా చెబితే, ఇంకొకడు 'మామా.. ఇది తప్పకుండా హిట్ అవుతుంది' అంటూ బూస్ట్ ఇస్తాడు. పైకెదిగిన ఇంకొకడు మిత్రుడికి నిచ్చెన మెట్లలా మారతాడు. ఇలా కడదాకా తోడు ఉండే వాళ్లు ఎందరో. జీవితంలో ఎన్ని ఒత్తిళ్లు వచ్చిపడ్డా, కష్టాలు చుట్టుముట్టినా.. అండగా ఉంటూ ఓదార్పు మాటలతో అన్నీ సెట్ చేసేవాళ్లు తప్పకుండా ఉంటారు. అందుకే ఈరోజు మన వెన్నంటే ఉండేవాళ్లను అస్సలు మర్చిపోవద్దు.

- సహకారం: డా.వనిత ద్యాప

**రేపే.. స్నేహితుల దినోత్సవం**



**ఈ స్నేహితుల దినోత్సవాన్ని మరింత ప్రత్యేకం చేయడానికి ఇలా చేద్దాం..**

- **దోస్తీ రీల్:** దగ్గరి స్నేహితులతో కలిసి ట్రెండింగ్‌లో ఉన్న పాటతో ఒక రీల్ షూట్ చేద్దాం. దాన్ని 'ఈతరం దోస్తీ' అంటూ సామాజిక మాధ్యమాల్లో ట్యాగ్ చేద్దాం.
- **క్యాంటీన్ రీయూనియన్:** అప్పటి గ్యాంగ్‌తో కలిసి కాలేజ్ క్యాంటీన్‌లో హ్యాంగ్‌అవుట్ ప్లాన్ చేద్దాం. టీ, సమోసా, క్లాసులకు ఎగనామం పెట్టిన రోజులు గుర్తు చేసుకుందాం.
- **స్నేహితుడికో లేఖ:** బెస్టీకి స్వదస్తూరీతో ఒక లేఖ రాయి. మీ ఇద్దరి స్నేహం ఎంత ప్రత్యేకమో అందులో వివరించు.
- **దోస్తీ ఫ్లాష్‌బ్యాక్:** నీ గ్యాంగ్‌తో కలిసి దిగిన పాత ఫొటోలను కొలాజ్ చేసి, 'ఈ రోజులు మళ్లీ రావు' అంటూ సామాజిక మాధ్యమాల్లో పెట్టెయ్.
- **మీమ్ గేమ్:** నీ ఫ్రెండ్‌కి నచ్చేలా పర్సనలైజ్డ్ మీమ్ సృష్టించి వాట్సప్‌లో పంపు. నవ్వులు గ్యారెంటీ!

## నేనూ.. నాలుగో సింహమే!

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

**కానిస్టేబుల్ ఫలితాల్లో సత్తా**

**విజయవాడలో 250, కృష్ణాలో 149 మంది ఎంపిక**


ప్రజలకు రక్షణ కల్పించడంలో, శాంతి భద్రతలు పరిరక్షించడంలో పోలీసుల పాత్ర ఎనలేనిది. ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి శక్తివంచన లేకుండా పని చేస్తుంటారు. అలాంటి డిపార్ట్‌మెంట్‌లో చేరడానికి నేటి యువత ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. కఠోర సాధన చేసి, వివిధ అంచెల్లో నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపి.. ఫలితాల్లో సత్తా చాటారు. కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. తమ కలను నిజం చేసుకున్నారు. లక్ష్యాన్ని సాధించి.. అందరికీ ఆదర్శంగా నిలిచారు. కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియకు 2022, అక్టోబరులో నోటిఫికేషన్ విడుదల చేశారు. 2023లో ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించగా.. రాష్ట్రవ్యాప్తంగా 4,59,182 మంది హాజరయ్యారు. ఇందులో అర్హత సాధించిన వారికి 2024, డిసెంబరులో ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం ఫలితాలు విడుదలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్‌లో 250 మంది, కృష్ణా జిల్లాలో 149 మంది సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

**హోంగార్డుల ప్రతిభ:** ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన హోంగార్డులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. విజయవాడ నగరంలో 24 మంది, కృష్ణాజిల్లాలో 8 మంది అదృష్టం తలుపుతట్టింది. ఈ 32 మంది కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. పై అధికారుల సూచనలు పాటించి.. ప్రతిభ చాటారు. పరీక్షల్లో విజయం సాధించారు.

**మూడో ప్రయత్నంలో గెలిచా: ఖాసిం, హోంగార్డు**

కానిస్టేబుల్ ఉద్యోగం కోసం రెండు సార్లు పరీక్షలు రాశాను. విజయం సాధించకపోయాను. 2018లో హోంగార్డుగా చేరాను. ఒక పక్క హోంగార్డుగా పనిచేస్తూనే.. 2022లో నోటిఫికేషన్ రావడంతో మూడోసారి దరఖాస్తు చేశాను. పై అధికారుల సూచనలు తీసుకున్నాను. పరీక్షల్లో బాగా ఉపకరించాయి. కానిస్టేబుల్‌గా ఎంపికవడం సంతోషంగా ఉంది.

**అధికారుల సూచనలతో: సాయి, హోంగార్డు**



నేను బీఎస్సీ కంప్యూటర్స్ చదివాను. 2016లో కానిస్టేబుల్ కోసం దరఖాస్తు చేశా. 3 మార్కుల తేడాతో ఉద్యోగం మిస్ అయ్యింది. 2018లో హోంగార్డుగా చేరాను. పలు విభాగాల్లో పనిచేశా. 2016లో పొందిన శిక్షణను గుర్తు చేసుకుంటూ.. స్వయంగా సాధన చేశాను. క్రైం ఏడీసీపీ రాజారావు చక్కని సూచనలు సలహాలు ఇచ్చారు. వాటిని అనుసరించాను. ఆయన సహకారంతో కానిస్టేబుల్ అయ్యాను.

**అదుర్స్.. అక్కాచెల్లెళ్లు..**



వాళ్ల మేనమామలు, సోదరి, రక్త సంబంధీకులు పోలీస్‌శాఖలో ఉద్యోగులే. వారి స్ఫూర్తితోనే తామూ పోలీసు లవ్వాలని ధృడంగా సంకల్పించుకున్నారు.. విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన అక్కాచెల్లెళ్లు అంగిడి శ్రావణి, అంగిడి సరస్వతి. తొలి ప్రయత్నం 2016లో చేసినా సఫలీకృతం కాలేదు. అయినా పట్టువదలకుండా 2024లో జరిగిన పరీక్షల్లో నెగ్గి శుక్రవారం విడుదలైన ఫలితాల్లో మహిళా కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరి సోదరి అంగిడి మాధవి కూడా 2014లో మహిళా కానిస్టేబుల్ ఎంపికయ్యారు. తదుపరి హెచ్‌సీగా పదోన్నతి పొంది నూజివీడు డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శ్రావణి, సరస్వతి ఇద్దరూ ఎంఎస్సీ చదివారు. ఎస్సై ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యం ఉందని, భవిష్యత్‌లో సాధిస్తామని న్యూస్‌టుడేకి తెలిపారు. తండ్రి వెంకటేశ్వరరావు మృతి చెందడంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లను తల్లి లక్ష్మి రెక్కల కష్టంతో చదివించి పోషించారు. లక్ష్మి పదేళ్ల కిందట గ్రామంలోని రామానగరం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా చేరింది. తాము ఉద్యోగాల్లో చేరగానే తమ తల్లికి కష్టం లేకుండా చూసుకుంటామని తెలిపారు. – పుట్రేల(విస్సన్నపేట), న్యూస్‌టుడే

## భక్తులకు అసౌకర్యం కలగకుండా దసరా ఏర్పాట్లు



సమీక్షిస్తున్న సీపీ రాజశేఖరబాబు

**విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే :** దసరా మహోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి, దేశ విదేశాల నుంచి భక్తులు నగరానికి వస్తారని.. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం అయ్యేలా చూడాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో దసరా ఉత్సవాలపై దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అధికారులు, పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. సీపీ మాట్లాడుతూ.. క్యూలైన్లు, స్నాన ఘాట్లు, ప్రసాదం కౌంటర్ల వద్ద రద్దీని తగ్గించి.. త్వరితగతిన అమ్మవారి దర్శనం అయ్యేలా చూడాలని సూచించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా వ్యవహరించాలని కోరారు. మెరుగైన సౌకర్యాలు అందించడం, ట్రాఫిక్, బందోబస్తుపై సమీక్షించారు. కార్యక్రమంలో డీసీపీలు కె.జి.వి.సరిత, తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎస్.వి.డి.ప్రసాద్, దుర్గగుడి ఈవో శీనానాయక్, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ఎ.వి.ఎల్.ప్రసన్నకుమార్, కె.కోటేశ్వరరావు, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'వైకాపా పాలనలో మాఫియా రాజ్యమేలింది'



మాట్లాడుతున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

**గొల్లపూడి, న్యూస్‌టుడే:** వైకాపా పాలనలో ఇసుక, మద్యం విక్రయాల్లో భారీ అవినీతి జరిగిందని, మాఫియా రాజ్యమేలిందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఇసుకలో 1.22 కోట్ల టన్నుల అక్రమ తవ్వకాలు జరిగాయని, 2.69 కోట్ల టన్నుల వివరాలు తేలాల్సి ఉందన్నారు. మొత్తం విలువ రూ.4వేల కోట్లకు పైగా ఉంటుందన్నారు. ఇసుకలో వైవీ సుబ్బారెడ్డి, అతని కుమారుడు కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. కృష్ణాజిల్లా నుంచి నెలకు రూ.22 కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు కప్పం కట్టారని వెల్లడించారు. మంత్రుల నివాసాల మీదకు వైకాపా నాయకులను పంపిస్తామని, హత్యలు మొదలు పెడతామని జగన్ మాట్లాడటం తగదన్నారు. అలాంటి మాటలకే 11 సీట్లకు పరిమితం అయ్యారన్నారు. గత ప్రభుత్వంలో కంటెయినర్లతో డబ్బులను తరలించారని, బెంగళూరు ప్యాలెస్‌లో ఎంతెంత నల్లధనం దాచారో తేల్చాల్సి ఉందన్నారు. ప్రజల ఆస్తులను దోచిన వారిని శిక్షించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తుందని తెలిపారు.



## ఇంద్రకీలాద్రిపై శ్రావణ సందడి

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా దుర్గమ్మ దర్శనానికి భక్తులు తరలి రావడంతో పండగ శోభ నెలకొంది. ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. దుర్గమ్మకు ప్రీతిపాత్రమైన కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో ఉభయదాతలు పాల్గొన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక కుంకుమార్చనలో మహిళలు హాజరయ్యారు. అమ్మవారి నివేదనను పురస్కరించుకొని ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాలయ దర్శనం టిక్కెట్లు(రూ.500), వీఐపీ ప్రొటోకాల్ నిలిపివేశారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు, మెట్ల మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. దేవస్థానం సిబ్బందితో పాటు ఇంజినీరింగ్ అధికారులు క్యూలైన్ల పర్యవేక్షణ విధులను నిర్వహించారు. దుర్గమ్మ దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది. 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. లిఫ్టు మార్గం క్యూలైను రద్దీ ఎక్కువ కావడంతో వృద్ధులు, దివ్యాంగులకు అధిక ప్రాధాన్యం కల్పించారు. సేవా సిబ్బంది భక్తులను క్యూలైన్లో పంపేందుకు సహకరించారు.



కుంకుమార్చనలో ఉభయదాతలు



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

## వంశీ అనుచరుల ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు

**5న తీర్పు వెలువరించనున్న విజయవాడ 12వ ఏడీజే కోర్టు**

**ఈనాడు - అమరావతి:** గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్‌లోని ఆస్తికి సంబంధించి వైకాపా నేత వల్లభనేని వంశీ, అతని అనుచరుల జోక్యం, బెదిరింపుల కేసులో నిందితులు ఓలుపల్లి మోహనరంగా, అనగాని రవి ముందస్తు బెయిల్ పిటిషన్లపై తీర్పు ఈనెల 5న వెలవడనుంది. ఈ కేసులో ఇప్పటికే వంశీకి బెయిల్ వచ్చిన విషయం విదితమే. వైకాపా హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో భూవివాదాన్ని పరిష్కరిస్తానని పిలిచి, అక్రమ పద్ధతుల్లో తన బినామీలుగా ఉన్న అనుచరుల పేర్లతో రాయించుకున్నారని గన్నవరం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. విజయవాడకు చెందిన హైకోర్టు న్యాయవాది సుంకర కృష్ణమూర్తి ఆయన సతీమణి సీతామహాలక్ష్మి గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో వంశీ ఏ1గా ఉన్నారు. ఈ కేసులో విజయవాడలోని 12వ ఏడీజే (అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి) కోర్టులో శుక్రవారంతో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో తుది ఉత్తర్వుల నిమిత్తం న్యాయాధికారి సునీల్ మంగళవారానికి వాయిదా వేశారు.

## పాలిటెక్నిక్ కళాశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

**రూ.27లక్షలతో అభివృద్ధి పనులు**

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థులు రెండేళ్లలో దాదాపు రూ.27 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. మెటలర్జీ విభాగం పూర్వ విద్యార్థి, పారిశ్రామికవేత్త నూతక్కి రంగారావు నేతృత్వంలో హైదరాబాద్ సంఘం రూ.10,17,598 వెచ్చించి మెకానికల్ వర్కుషాపునకు మరమ్మతులు చేయించింది. 1977-81 బ్యాచ్ సివిల్ విద్యార్థులు పరమహంస, సత్యనారాయణ, ధనుంజయరావు, వేణుగోపాల్ తదితరులు రూ.8,55,000 వెచ్చించి సివిల్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రయోగశాలలకు మరమ్మతులు చేయించారు. ఆలూరు సురేష్ నేతృత్వంలో మెకానికల్ పూర్వ విద్యార్థులు రూ.5,33,576 ఖర్చు చేసి మెకానికల్, మెటలర్జీ ప్రయోగశాలలు ఏర్పాటు చేయించారు. ఎలక్ట్రికల్ పూర్వ విద్యార్థులు రామచంద్రరావు, నీలకంఠేశ్వరరావు, వెంకటేశ్వరరావు, గిరిజా కుమారి, నారాయణ మూర్తి, భానుమూర్తి తదితరులు ప్రయోగశాలను పునర్నిర్మాణం చేయడమే కాకుండా యంత్రాలు సమకూర్చారు. ఇంకా మరికొందరు చేయూతనిచ్చారు. పూర్వ విద్యార్థులకు ప్రిన్సిపల్ ఎం.విజయసారథి కళాశాల తరపున అభినందించారు. ఈ నెల మూడో తేదీన నిర్వహించే పూర్వ విద్యార్థుల సంఘం సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానించారు.



ఎలక్ట్రికల్ విభాగానికి అందించిన యంత్రం



మెకానికల్ వర్కుషాపు పైకప్పునకు మరమ్మతులు

## కృష్ణామిల్క్ యూనియన్‌పై అసత్యప్రచారం.. కేసు నమోదు

**సూర్యారావుపేట:** కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్, డైరెక్టర్ల ఫొటోలతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి, దాని ద్వారా అసభ్యకరమైన సందేశాలు పంపుతున్న వారిపై యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. తాడికొండ రమేష్‌బాబు అనే వ్యక్తి.. చలసాని ఆంజనేయులు, డైరెక్టర్ల ఫొటోలతో నకిలీ వైకాపా గుర్తింపు కార్డులు సృష్టించారు. వాటితో వాట్సాప్ గ్రూప్ తయారు చేసి దుష్ప్రచారం చేస్తున్నారని గుర్తించారు. అలాగే 'కొడాలి ప్రమీల' అనే పేరుతో గుర్తు తెలియని మహిళ తన పరువుకు నష్టం కలిగించేలా నకిలీ అసభ్యకరమైన వీడియోలు సృష్టించి గ్రూపుల్లో పెట్టారు. దీనిపై చలసాని గత నెల 27న సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోలర్ స్కేటింగ్ ఇన్‌లైన్ హాకీలో ప్రతిభ

**భారత జట్టులో స్థానం దక్కించుకున్న శ్రీకార్తీక్**

**బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే :** ఇటీవల దక్షిణ కొరియాలోని జెచియోన్‌లో నిర్వహించిన ఆసియా రోలర్ స్కేటింగ్ ఇన్‌లైన్ హాకీ ఛాంపియన్‌షిప్‌లో స్థానిక నలంద విద్యానికేతన్‌లో 12వ తరగతి చదువుతున్న కామినేని శ్రీకార్తీక్ కాంస్య పతకాన్ని సాధించినట్లు ప్రిన్సిపల్ మాదల పద్మజ తెలిపారు. ఆ ప్రతిభ ఆధారంగా ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత జట్టులో స్థానాన్ని సంపాదించుకున్నాడని తెలియజేశారు. శుక్రవారం నగరానికి చేరుకున్న శ్రీకార్తీక్‌ను నలంద విద్యాసంస్థల ఛైర్మన్ ఎ.విజయబాబు, ప్రిన్సిపల్, సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి పి.రమేశ్, కోచ్ పి.ఆనంద్ అభినందించారు.



శ్రీకార్తీక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ పద్మజ, రమేశ్, ఆనంద్

# వసుంధర

vasundhara@eenadu.in

## అనాథలు... అక్కాచెల్లెళ్లు అయితే!

నమ్మలేని నిజం



అది 1970... దక్షిణ కొరియాలో నివసిస్తోన్న ఓ కుటుంబం. మద్యానికి అలవాటు పడిన భర్త నుంచి దూరంగా తీసుకెళ్లి తన కూతురైన 'యున్-సూక్'ను బాగా పెంచాలని నిర్ణయించుకుంటుంది ఆ తల్లి. అదే సమయంలో తన సవతి కూతురైన 'పాక్ నామ్ షిన్'ను భర్త దగ్గరే వదిలేసి వెళ్తుంది. అయితే, ఆయన రెండేళ్లకు రైలు ప్రమాదంలో చనిపోతాడు. అప్పటికి నామ్‌షిన్‌కు ఐదేళ్లు మాత్రమే. దాంతో ఆ పాపను అనాథాశ్రమంలో చేరుస్తారు అక్కడివాళ్లు. తనకు తొమ్మిదేళ్లు వచ్చేటప్పటికి, అమెరికాకు చెందిన దంపతులు దత్తత తీసుకుంటారామెను. తన పేరుని హోలీ హోయల్ ఓబ్రియన్‌గా మారుస్తారు. మరోవైపు... అమ్మ తీసుకెళ్లిన ఆ పాప యున్ కూడా, తల్లి మరణంతో మరో అనాథాశ్రమంలో చేరాల్సి వస్తుంది. అయితే, 1976లో యున్‌ని కూడా ఓ అమెరికా జంట దత్తత తీసుకుని, మీగన్ హ్యూస్ అని పేరు పెడతారు. అలా ఆ అక్కాచెల్లెళ్లు ఇద్దరూ దత్తత బిడ్డలుగా పెరుగుతారు. ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియదు. తమ తమ జీవన ప్రయాణాల్లో సాగిపోతుంటారు.

నాలుగు దశాబ్దాల తరవాత... ఫ్లోరిడాలోని ఓ ఆసుపత్రి. ఇద్దరు నర్సులు కొత్తగా అక్కడ చేరారు. ఒకే ఫ్లోర్, ఒకే షిఫ్ట్... దాంతో పరిచయమవ్వటానికీ ఎక్కువ సమయం పట్టలేదు వాళ్లకి. అంతే తొందరగా స్నేహితులూ అయ్యారు. ఒకరి నేపథ్యాలు మరొకరికి తెలిసినట్లే ఉండేవి. పోలికలు సహజమే అనుకున్నారు. కానీ, స్నేహితులూ, చుట్టుపక్కల వాళ్లు... మీలో దగ్గరి పోలికలు ఉన్నాయి అంటుంటే... ఏదో చిన్న సందేహం. అప్పుడు వాళ్లకు వచ్చిన ఆలోచన... డీఎన్ఏ టెస్ట్. అనుకున్నదే తడవుగా పరీక్ష చేయించేసుకున్నారు. ఫలితం... పాజిటివ్. ఇంకేముంది, చిన్నప్పుడు విడిపోయిన అక్కాచెల్లెళ్లం అని తెలుసుకున్నారు. మనసాగలేదు. ఒకరినొకరు హత్తుకున్నారు. ఆశ్చర్యం, ఆనందం, కన్నీళ్ల రూపంలో ఒక్కసారే బయటకు వచ్చేశాయి. అప్పటికే పెళ్లి, విడాకులు జరిగిపోయిన వారి జీవితాల్లో... ఇది ఓ పెద్ద వెలుగు. అమ్మానాన్నలను కోల్పోవటం, అనాథలుగా, దత్త పుత్రికలుగా పెరగటం ఒకెత్తయితే, అనుకోకుండా ఒకే వృత్తిని ఎంచుకోవటం, ఒకే ఆసుపత్రిలో విధులు నిర్వర్తించటం, తిరిగి కలుసుకోవటం... కాకతాళీయమే, అని ఎవరైనా అన్నా నమ్మలేం కదా!

## మీకు తెలుసా?

మగవారితో పోలిస్తే, ఆడవాళ్లకు ఎక్కువ నిద్ర అవసరం అవుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. అమ్మాయిలు సహజంగానే మల్టీ టాస్కింగ్ చేయటంలో ముందుంటారు. అందుకే, పగలంతా అలసిపోయిన వారి మెదడుకు అదనంగా కనీసం 20నిమిషాల నిద్ర కావాల్సివస్తుందట.



సంస్థలో ఎంతమంది మహిళలున్నారన్నది కాదు, వాళ్లు ఏ స్థాయిలో ఉన్నారన్నది ముఖ్యం. 50 శాతం మహిళలున్నా, వాళ్లంతా జూనియర్ స్థాయిలో పనిచేస్తే లాభం లేదు. వాళ్లు పైస్థాయిలో ఉంటేనే అసలైన ప్రభావం కనిపిస్తుంది. మా సంస్థ సీఈఓ ఆసియన్ అమెరికన్ మహిళ. సంస్థలో ప్రతి స్థాయిలో మహిళలు ఎక్కువగా కనిపిస్తారు. తెలివైన బృందంకంటే వైవిధ్యమైన బృందం మెరుగ్గా పనిచేస్తుందని పరిశోధనలూ చెబుతున్నాయి.

- సునీతా నాయక్, కంట్రీ లీడ్ ఇండియా, స్టేట్ స్ట్రీట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్.

## ఆ కుటుంబాల బాధ తీర్చాలని...



ఎక్కడైనా ఓ ప్రమాదం జరిగిందా...? హత్యో, ఆత్మహత్యో చోటు చేసుకుందా?... ఎన్నెన్నో ఊహాగానాలు, మరెన్నో అనుమానాలు... అక్కడ ఫోరెన్సిక్ నిపుణులు రంగంలోకి దిగాకే అసలు నిజాలు బయటకు వస్తాయి. అప్పుడు హత్య... ఆత్మహత్యగా, ప్రమాదం కాస్తా హత్యగానూ మారొచ్చు. ఇంతటి కీలకమైన విభాగంలో రాణిస్తున్నారు డాక్టర్ మేజర్ కారుణ్య.

చిన్నప్పటి నుంచీ చేసే పనిలో వైవిధ్యం ఉండాలని కోరుకునేదాన్ని. అందుకు తగ్గట్లుగానే కెరియర్‌ని ఎంచుకున్నా. మాది హైదరాబాద్. నాన్న జాన్ శామ్యూల్ ప్రిన్సిపల్‌గా పనిచేసేవారు. అమ్మ మీరా ఓ ప్రైవేట్ పాఠశాలను నిర్వహించేవారు. ఇద్దరికీ సేవాభావం ఎక్కువ. పేద విద్యార్థులెందరికో ఉచితంగా చదువు చెప్పించారు. వాళ్ల స్ఫూర్తితోనే సైన్యంలోకి వెళ్లాలనుకున్నా. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లలోని ఎంబీ మెడికల్ సెంటర్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశాక ఆర్మీలో వైద్యురాలిగా చేరా.

### అనుభవాలన్నీ ప్రత్యేకమే...

నాకు సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలనుండేది. దాంతో ఆ ప్రవేశ పరీక్షలన్నీ రాసేదాన్ని. 2017 జూన్‌లో సైన్యంలో కెప్టెన్‌గా చేరా. మొదట పుణెలో నేషనల్ డిఫెన్స్ అకాడమీలో ఉద్యోగం. తర్వాత అసోం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని చైనా సరిహద్దు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించా. ఈ అనుభవాలన్నీ ప్రత్యేకమే. వైద్య సాయం అందించడానికి ప్రయాణం మొదలుపెడితే... ఒక్కోసారి నాలుగైదు కిలోమీటర్ల దూరాన్ని చేరుకోవడానికీ రెండు మూడు రోజులు పట్టొచ్చు. గడ్డకట్టే చలిలో ఎత్తైన కొండలు ఎక్కాలి. క్రిటికల్ కేసులయితే అంత మంచులోనూ వారిని ఆసుపత్రికి తరలించాలి. ఇలా చాలా విధులు సాధారణ సేవలకు కాస్త భిన్నంగానే ఉంటాయి. కాకపోతే అవన్నీ ప్రత్యేకమే. హిమాలయాలతోపాటు అనేక క్లిష్టమైన పర్వతాలు ఎక్కా. నాలుగేళ్లపాటు సేవలందించాక మేజర్‌గా పదోన్నతి అందుకున్నా. తర్వాత ఫోరెన్సిక్ మెడిసిన్‌లో పీజీ చేయాలనే ఆలోచనతో మళ్లీ పుస్తకాలతో కుస్తీ పట్టా. స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి... ఆదిలాబాద్ రిమ్స్ వైద్య కళాశాలలో నేర నిర్ధరణలో కీలకమైన ఫోరెన్సిక్ విభాగంలో చేరా. ప్రస్తుతం జూడా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగానూ కొనసాగుతున్నా.

### ఎన్నెన్నో అనుభవాలు...



కారుణ్య

సాధారణంగా ఎవరికైనా చావు అన్నా, మృతదేహం అన్నా తెలియని భయం ఉంటుంది. నాకూ ఒకప్పుడు అలానే ఉండేది. అయితే, ఎంబీబీఎస్‌లో కడావర్(మృతదేహం)కి పరీక్షలు నిర్వహించడంతో శవాలంటే భయం పోయింది. వాస్తవానికి చాలా సందర్భాల్లో మృతదేహాలను గుర్తించలేకపోవడంతో వారి కుటుంబాలకు చివరి చూపు కూడా దక్కని పరిస్థితి. మరణించింది ఎవరు? ఆడా? మగా... వయసెంత? హత్యా, ప్రమాదమా... వంటి అనేక సందేహాలకు ఫోరెన్సిక్ పరీక్ష ద్వారా సమాధానం లభిస్తుంది. ఆ కుటుంబాలకు ఊరట దక్కుతుంది. ఆ మధ్య ఓ వ్యక్తిని ఖననం చేశాక... అది హత్యే అన్న ఆరోపణలు వచ్చాయి. దాంతో తిరిగి ఆ బాడీ వెలికితీశారు. అప్పుడు దాన్ని పరిశోధించి... అది ఆత్మహత్య అనే ఆధారాలను అందించా. గొంతు కోయడం వల్ల రక్తస్రావమై మరణం ఎలా సంభవిస్తుంది? ఎంతవరకు గొంతు కోసుకుంటే మృతి చెందుతారు అనే కోణంలో చేసిన పరిశోధన పత్రాలను గతేడాది జాతీయ స్థాయిలో జరిగిన సదస్సులో ప్రదర్శించి, రెండో స్థానం సాధించా. తాజాగా వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలో జరిగిన తెలంగాణ ఫోరెన్సిక్ మెడిసిన్ అకాడమీ రాష్ట్రస్థాయి సదస్సులో మూడో బహుమతి అందుకున్నా.

– ఎం.ఎం.మిర్జాభేగ్, ఆదిలాబాద్

## శోధిత

## ఇవి తింటే... పీడకలలే!



పడుకుంటే నిద్ర పట్టట్లేదా? పట్టినా పీడకలలు వేధిస్తున్నాయా... అయితే, మీరు రాత్రిపూట తినే ఆహారం మీద శ్రద్ధ పెట్టాల్సిందే. ఎందుకంటారా... రాత్రి వేళల్లో తీసుకునే ఆహారమే ఇందుకు కారణమవుతోందట. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలు పెరిగాయి. దాంతో ఎప్పుడంటే అప్పుడు కావాల్సినవి తెప్పించుకుని తినే అమ్మాయిల సంఖ్యా పెరిగింది. ఫలితంగా... డెయిరీ ఉత్పత్తులు, ప్రత్యేకించి చీజ్... వంటివి అర్ధరాత్రి దాటాక కూడా తినేస్తున్నారు. ఇది లాక్టోజ్ ఇంటాలరెన్స్‌కి కారణమై ఈ పరిస్థితికి దారితీస్తుందని ఫ్రాంటియర్స్ తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ఇవి జీర్ణప్రక్రియపై ప్రతికూల ప్రభావం చూపించి, గ్యాస్, కడుపునొప్పితోపాటు మనకొచ్చే కలల మీదా ప్రభావం చూపిస్తున్నాయి. ఈ పరిశోధనకోసం యాక్వాన్ యూనివర్సిటీ వాళ్లు కొంతమంది విద్యార్థులను సర్వే చేశారు. రాత్రిళ్లు వాళ్లు తినే ఆహారం, నిద్ర నాణ్యత, ఎలాంటి కలలు వస్తున్నాయన్నదీ పరిశీలించారు. అందులో ఎక్కువమంది ప్రత్యేకించి మహిళలు పీడకలలు, నిద్రలేమి వంటివి ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. రాత్రి వేళల్లో తీపి, మసాలాలు, డెయిరీ ఉత్పత్తులు తినేవారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటోందట. అందుకే, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలనీ, నిద్రకు ముందు తేలికైన ఆహారాన్ని తీసుకోవాలనీ సూచిస్తున్నారు పరిశోధకులు.

## బంగారం - వెండి



1న ముగింపు

| | బంగారం (24క్యా) | ఆర్నమెంట్ (22క్యా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,02,250 | 91,900 | 1,13,681 |
| విజయవాడ | 97,990 | 91,500 | 1,13,200 |
| ప్రొద్దుటూరు | 99,200 | 91,310 | 1,13,200 |
| రాజమహేంద్రవరం | 99,820 | 91,150 | 1,23,000 |
| విశాఖపట్నం | 99,460 | 91,500 | 1,18,000 |
| తమిళనాడు | ----- | 91,500 | 1,23,000 |

## బాత్రూమ్‌లో దాక్కుంటున్నారు!


ఇదో ట్రెండ్



పాలకోసం ఏడ్చే పాపాయి. తనని ఊరడిస్తోంటే స్టవ్ మీద కుక్కర్ విజిల్స్. ఇంతలో భర్త ఏదో కనిపించడం లేదని పిలుపు. ఓవైపు 'అమ్మా బస్సు వచ్చే టైమైంది. ఇంకా జడలు వేయలేదు' అని కూతురంటోంటే... మరోవైపు 'నీకే పనీ సరిగా చేయడం రాదనే అత్తగారు'... వీటన్నింటి మధ్యా క్షణం తీరిక లేకుండా ఆ ఇల్లాలు పరుగులు తీస్తూనే ఉంటుంది. అందరికీ అన్నీ సమకూర్చి ఒక్క క్షణం కూర్చుందాం అనుకునేలోగా డోర్ బెల్ మోగుతుంది. విసిగిపోయిన ఆమె వెంటనే పరుగు తీస్తుంది... బాత్రూమ్‌లోకి! ఎవరి పిలుపులూ, శబ్దాలు లేకుండా ఆ చోటు ప్రశాంతంగా కనిపిస్తుందామెకి. స్థిమితపడ్డా అనిపించాక తిరిగి బయటకు వస్తుంది. ఓ వెబ్ సిరీస్‌లోని సీన్ ఇది. నిజానికి ప్రపంచవ్యాప్తంగా ఇదో ట్రెండ్ కూడా. పేరేంటో తెలుసా? బాత్రూమ్ క్యాంపింగ్! అంటే కాలకృత్యాల కోసం కాకుండా బాత్రూమ్‌లో ఎక్కువసేపు గడపడమన్నమాట.

భర్త బాత్రూమ్‌కి వెళ్తుంటాడు. అతని చేతిలో మొబైల్‌ని చూసి... ఛార్జర్‌నీ చేతిలో పెడుతుంది భార్య. సోషల్‌మీడియా స్క్రోలింగ్‌లో పడి గంటలు గంటలు బాత్రూమ్‌లో గడిపేస్తున్నారని చెబుతూ సరదాగా చేసిన రీల్ ఇది! అయితే దీనికీ బాత్రూమ్ క్యాంపింగ్‌కీ చాలా తేడా ఉంది. ఇక్కడ వీళ్లు తెలియక సమయం గడపరు. చదువు, ఆఫీసు ఒత్తిళ్లు, అమ్మానాన్నలు, పెద్దవాళ్ల గొడవలను వినలేనివాళ్లు... ఇలా మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నవాళ్లు ఎంచుకుంటున్న మార్గం. ఆ సమయం మనసు ప్రశాంతతకు ఓ పాట వినాలనుందా వింటారు. ధ్యానం చేస్తారు. లేదా శూన్యంలోకి చూస్తూ అయినా గడిపేస్తారు. అక్కడ బాధించడానికీ, ఒత్తిడి పెంచడానికీ ఎవరూ ఉండరు. దీంతో దాన్నో సురక్షిత ప్రదేశంగా భావించి ఇలా చేస్తున్నారట. దీనిమీద ఎన్నో హాస్యంతో కూడిన వీడియోలు వస్తున్నాయి కానీ... ఇంటెడు చాకిరీ చేసినా 'నువ్వు ఖాళీనేగా' అన్న మాటలు, తన మాటకు విలువివ్వని సందర్భాల్లో ఆడవాళ్లు, అమ్మాయిలు ఆ కన్నీటిని రెప్ప దాటించే స్థలమూ అదే! నిజానికి ఇలాంటివాళ్లకి అది ట్రెండ్ కాదు. సెల్ఫ్ కేర్ పాయింట్, తమని తాము రక్షించుకునే ప్రదేశం. కాబట్టి, ఆ రెండో కోణాన్నీ అర్థం చేసుకోవడం ఎంత ముఖ్యమో ఈ ట్రెండ్ పరోక్షంగా చెబుతున్నట్టు లేదూ?

## కురులకు ముత్యాల సిరులు!







ఓవైపు పేరంటాలు, మరోవైపు పెళ్లి పిలుపులు. హడావుడంతా మనదే! దుస్తులు, నగలు... వీటితో సిద్ధమైనట్టేనా? పూర్తి లుక్ ఆకర్షించాలంటే కురులకీ గ్లామర్ హంగులద్దాలి. వేడుకేదైనా సంప్రదాయ దుస్తుల్లో సిద్ధమైనా ఆధునిక అమ్మాయినే అనిపించుకోవాలన్నది నేటి అమ్మాయిల తత్వం. అందుకే పట్టు చీర, ఓణీ కట్టినా, లెహెంగాలో సిద్ధమైనా కురుల విషయంలో మాత్రం ఆధునికతకే ప్రాధాన్యమిస్తారు. కాస్త చిన్న, మధ్యస్థ పొడవుంటే హెయిర్ లీవ్‌కి మించిన ఉత్తమ మార్గం మరొకటి ఉంటుందా చెప్పండి? అలాగని ఓ పఫ్, రెండు క్లిప్పులతో వదిలేస్తే మాత్రం ఏం బాగుంటుంది? అందుకే కురులనీ ఆకర్షించేలా చేసేందుకు ఎన్నో ఆప్షన్లు. ఈ పెరల్ క్లిప్స్ అలాంటివే. నల్లని కురులపై తెల్లగా మెరుస్తూ భలే అందంగా ఉన్నాయి కదూ? వాటి ఆకర్షణని మరింత పెంచేస్తూ కుందన్లు, రంగుల రాళ్లు, గవ్వలు వగైరా మరింత జత కుదిరాయి. చూడటానికి భారీతనం తెస్తూ చక్కగా ఉన్నాయి కానీ... ఇవి దగ్గరుంటే సిద్ధమవడమూ చిటికేసినంత సేపే! కర్ల్స్, మెస్సీ, స్ట్రెయిట్... ఏరకంగా స్టైలింగ్ చేసుకుంటూ హెయిర్ లీవ్ చేసినా సరే! చివర్లో వీటిని తగిలించేస్తే చాలు. కురులకే కాదు... మీకూ స్టైలిష్ లుక్‌ని ఇస్తాయి. ప్రత్యేకంగా కనిపించేలా చేస్తాయి. త్వరలో వేడుక ఉందా? స్పెషల్‌గా కనిపించడం తప్పనిసరా? అయితే ఇంకేం ఈ పెరల్ యాక్సెసరీలను తెచ్చేసుకోండి. చిటికెలో సిద్ధమైపోండి.

## గ్యాడ్జెట్



కుళాయిలు, ఫాసెట్‌లు... వంటివాటిని డీప్‌క్లీన్ చేయాలంటే కాస్త కష్టమే. మూలల్లోని మురికి అంత త్వరగా వదలదు. ఆ పని సులువు చేసేందుకు సాయపడుతుందీ 'ఫ్లెక్సిబుల్ గ్యాప్ క్లీనింగ్ బ్రష్'. దీని మృదువైన పళ్ల వల్ల ట్యాప్‌లపై గీతలు పడకుండానూ ఉంటాయి. ఫ్లెక్సిబుల్ కాబట్టి, కష్టతరమైన చోట్లా తేలిగ్గా క్లీన్ చేసుకోవచ్చు.

## కుంకుడుకాయ రసం... బూడిద చాలుగా!

పాతే కొత్తగా!



మారిన జీవనశైలిలో భాగంగా... రసాయన ఉత్పత్తుల వాడకం ఎక్కువైంది. ముఖ్యంగా గిన్నెలను శుభ్రం చేయడానికి వాడే సబ్బు, లిక్విడ్... పేరేదైనా అది హానికరమే. ఆఖరికి అందుకోసం వాడే స్క్రబ్బర్ కూడా ప్లాస్టిక్కే. మానవ శరీరంలో మైక్రోప్లాస్టిక్స్ ఆనవాళ్లు పెరుగుతున్నాయంటే కారణం ఇవి కాదూ! ప్లేట్లు, గ్లాసులపై పేరుకున్న కెమికల్స్ ఆహారంతో పాటు నేరుగా పొట్టలోకే వెళ్తున్నాయి. మరి మానేద్దామంటే ప్రత్యామ్నాయం ఏది? ఇంతకీ, చిన్నప్పుడు, అమ్మ, అమ్మమ్మ... వాళ్లు వేటితో తోమేవారు? ఈ సందేహం మీకూ వచ్చిందా? నిజానికి అప్పట్లో వంట అంతా పొయ్యిలమీదే ఎక్కువ చేసేవారు కాబట్టి అన్నీ మసిపట్టి ఉండేవి. ముఖ్యంగా ఇసుక, బూడిద, ఎర్రమట్టి, చింతపండు, కొబ్బరి పొట్టు, బియ్యం కడిగిన నీళ్లు, కుంకుడుకాయలు... ఇలా పాత్ర రకాన్ని బట్టి ఒక్కోదాన్ని ఎంచుకునేవారు. స్క్రబ్బర్‌కి బదులు కొబ్బరి, బీర పీచుల్ని వాడేవారట. ఆ పాత రోజులు ఇప్పుడు మళ్లీ వస్తున్నాయి. పిడకల నుంచి వచ్చే బూడిదలో కాస్త బేకింగ్ సోడా, వినెగర్ కలిపి... పాత్రల్ని శుభ్రం చేయడానికి కొందరు వాడుతుంటే, ఇంకొందరు మైదా, కాస్త వినెగర్, నిమ్మరసం కలిపిన మిశ్రమంతో స్టీలు పాత్రలు రుద్ది తళతళ మెరిపిస్తున్నారు. కొబ్బరిపొట్టులో కాస్త వంటసోడా, వినెగర్, కుంకుడుకాయ రసం కలిపి దానితో గిన్నెల్ని తోముతున్నారు. ఇవన్నీ మురికినీ, మరకల్నీ ప్రభావవంతంగా వదిలిస్తాయి. రసాయనాల హానీ ఉండదు. ఓసారి మనమూ ప్రయత్నించి చూద్దాం. పోయేదేముంది?

## ఆమె ఏడవడం చూసి... భయమేసింది!



శరణ్య

చిన్నప్పట్నుంచీ సినిమాలంటే ఆసక్తి... అద్దం ముందు నిలుచుని డైలాగ్స్ చెప్పేదట శరణ్య ప్రదీప్. అనుకోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. ఫిదాతో అరంగేట్రం చేసిందామె. అలా మొదలైన ఆమె ప్రయాణం ఇటీవల గద్దర్ అవార్డును అందుకునే వరకూ చేరింది. ఆమెను 'వసుంధర' పలకరించగా...

మాది నిజామాబాద్. నాన్న నవీన్ గౌడ్, ప్రైవేట్ ఉద్యోగి. అమ్మ శైలజ, గృహిణి. ఖాళీ సమయాల్లో టైలరింగ్ చేసేది. నేను ట్యూషన్లు చెబుతూ బీఎస్సీ చదువుకున్నా. మంచి ఉద్యోగం చేయాలి... నా కాళ్లపై నేను నిలబడాలి అని కలలు కనేదాన్ని. డిగ్రీ రెండో ఏడాదిలో మా లెక్చరర్ ఒకరు 'లోకల్ ఛానెల్లో న్యూస్ ప్రెజెంటర్‌గా అవకాశం ఉంది. పాకెట్ మనీకి పనికొస్తాయి. ప్రయత్నించొచ్చు కదా' అన్నారు. సరే అని వెళ్లాను. ఆ ఉద్యోగం నాకు ఇంకో ప్రపంచాన్ని పరిచయం చేసింది. రోజుకో కొత్త విషయం తెలుసుకోవడం మంచిగా అనిపించేది. అయితే దీన్నో పార్ట్ టైమ్ పనిలానే భావించాను. డిగ్రీ తర్వాత ఎమ్మెస్సీ చేయాలనుకున్నా. కానీ ఛానెల్ హెడ్ సలహాతో హైదరాబాద్‌లో ఒక అవకాశం వచ్చింది. నచ్చిన ఉద్యోగం, మంచి ఆర్గనైజేషన్ అని వెంటనే చేరిపోయా.

### ఆడిషన్‌లోనే బాగా చేశావ్...

అమ్మానాన్నల నుంచి దూరంగా వచ్చి పని చేయడం అదే మొదటిసారి. హాస్టల్‌లో ఉండాలంటే చాలా భయపడ్డా, ఆఫీసులో ప్రతిదీ సంకోచమే. ఆఖరికి నీళ్లు అడగాలన్నా కంగారు పడేదాన్ని. అలాంటి పరిస్థితుల్లోనే ప్రదీప్‌తో పరిచయమైంది. అతని వల్ల కొన్ని రోజుల్లోనే ఆ వాతావరణం అలవాటైపోయింది. పరిచయం, ప్రేమ, తర్వాత పెళ్లి. ఆయనో స్క్రిప్ట్ రైటర్, డైరెక్టర్. తన ప్రోత్సాహంతోనే సినిమాల్లోకి వచ్చా. ఫిదాకోసం ఆడిషన్లు జరుగుతున్నాయని తెలిసి... తనే నన్ను తీసుకువెళ్లారు. అప్పటికే ప్రేమమ్ సినిమా చూశా... అందులో సాయిపల్లవి నటన నన్ను చాలా ఆకట్టుకుంది. ఫిదాలో తనే హీరోయిన్ అని తెలిసి వెళ్లాను. పైగా, కాలేజీ డేస్ నుంచి శేఖర్ కమ్ముల సినిమాలు చాలానే చూశా. 'హ్యాపీడేస్' అంటే ఇష్టం. ఆయన దర్శకత్వం కూడా ఇంకో కారణం. ఇలా అన్నీ కలిసొచ్చాయి. దాదాపు మూడుసార్లు ఆడిషన్లు చేసి రేణుక పాత్రకు నన్ను సెలెక్ట్ చేశారు. ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా... ఆ పేరుతోనే నన్ను గుర్తుపడతారు. సినిమా తీస్తున్నప్పుడు ఓ సీన్‌లో 'ఎప్పుడూ అమ్మాయే ఎందుకు ఇల్లు విడిచి వెళ్లాలే... అబ్బాయి రావొచ్చుగా' అన్న డైలాగ్ ఉంటుంది. అది చెబుతున్నప్పుడు సాయిపల్లవి నిజంగానే ఏడ్చింది. ఆమెను చూస్తూ, నా డైలాగ్స్ మరచిపోయా. దాదాపు 12 టేక్స్ తర్వాత చెప్పగలిగా. విసిగిపోయారో ఏమో డైరెక్టర్ 'ఆడిషన్‌లోనే ఈ సీన్ బాగా చేశావు, ఇప్పుడేంటి ఇలా అన్నారు'. ఆమె సీన్‌లో లీనమైన ఘటనను ఎప్పటికీ మరచిపోలేను. తర్వాత శైలజారెడ్డి అల్లుడు, దొరసాని, జాను, భామాకలాపం లాంటి సినిమాల్లో నటించా. 2024లో విడుదలైన 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' పద్మ పాత్రకి ఉత్తమ సహాయనటిగా గద్దర్ అవార్డు వచ్చింది. ఇలాంటి మంచి, గుర్తింపు తెచ్చే పాత్రలను ఇంకా చేయాలనేదే నా కోరిక.

## మెరుగైన రక్త ప్రసరణకు వజ్ర ముద్ర



మ్యాట్‌పైన కాళ్లు చాచి ప్రశాంతంగా కూర్చోండి. ఆపై వజ్రాసనం, పద్మాసనం లేదా రెండు కాళ్లను దగ్గరగా మడుచుకుని కూర్చోండి. ఇప్పుడు చూపుడువేలును చాచి ఉంచి మిగిలిన వేళ్లను లోపలివైపునకు మడవండి. మెల్లగా మధ్య వేలి గోటి పక్కగా బొటనవేలు కొనను అన్చి... ఉంగరం, చిటికెన వేళ్లను మధ్య వేలు పక్కన చేర్చండి. ఈ స్థితిలో చేతుల్ని మోకాళ్లపైన ఆనించాలి. ఈ ముద్రలోకి చేరుకోగానే కళ్లను మూసి ఉంచి శ్వాస మీద ధ్యాస పెట్టండి. ఇలా 30 నిమిషాలు అభ్యసించండి. అంతసేపు చేయలేని వారు 10 నిమిషాల చొప్పున రోజులో మూడుసార్లు చేయొచ్చు.

**ఉపయోగాలు:** రక్తప్రసరణ వ్యవస్థ మెరుగవుతుంది. గుండెకు బలం చేకూరుస్తుంది. ఉదరం, ప్లీహానికి బలాన్నిస్తుంది. క్లోమాన్ని శక్తిమంతం చేస్తుంది.

**ఆహారం:** రక్తప్రసరణ మెరుగుపడేందుకు ఒమేగా- 3 కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు, అధికంగా లభించే... విటమిన్ 'సి', నైట్రేట్లు లభ్యమయ్యే... ఆకుకూరలు, నారింజ, వెల్లుల్లి, నట్స్ మొదలైనవి తీసుకోవాలి.



### సుప్త వజ్రాసన

మ్యాట్‌పైన కాళ్లు చాచి నిదానంగా కూర్చోండి. నెమ్మదిగా రెండు కాళ్లను ఒకదాని తర్వాత ఒకటి వెనక్కి మడిచి, మోకాళ్లపైన కూర్చోండి. మడాలను వెనక్కు చాచి ఉంచి, రెండు మడాల మధ్యలో అమరే విధంగా కూర్చొని, వెన్నెముకను నిటారుగా ఉంచండి. ఇప్పుడు రెండు మోచేతులను వెనక వైపుగా నేలపై ఆన్చి ఊతం తీసుకోండి. చేతుల సహాయంతో వీపును, తలను నెమ్మది నెమ్మదిగా నేలపై ఆన్చే ప్రయత్నం చేయండి. తర్వాత ప్రశాంతంగా అలాగే పడుకొని నెమ్మదిగా రెండు చేతులను తల వెనక కలిపి ఉంచాలి. ఆపై కళ్లుమూసి, శ్వాస మీద ధ్యాస పెట్టండి. ఇలా 12-20 సెకన్లు ఉండే ప్రయత్నం చేయండి. ఆపై నెమ్మదిగా మోచేతులను నేలకు ఆన్చి ఆ ఊతంతో శరీరాన్ని పైకి లేపి వజ్రాసనానికి రావాలి. తర్వాత కాళ్లు చాచి విశ్రాంతి తీసుకోండి.

**జాగ్రత్తలు:** వెన్ను, మోకాళ్ల సర్జరీలు అయిన వాళ్లు, గర్భిణులు చేయరాదు.

**ఉపయోగాలు:** మెరుగైన జీర్ణక్రియకు తోడ్పడుతుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. ప్రశాంతతను ఇస్తుంది.

**ఆహారం:** ప్రొటీన్, విటమిన్లు, ఫైబర్, ఖనిజాలు అధికంగా ఉండే పదార్థాల్ని తీసుకోవాలి. పాలకూర, చిక్కుళ్లు, తృణ ధాన్యాలు, బీన్స్, పప్పుధాన్యాలను ఎక్కువగా తీసుకోండి.

- శిరీష, యోగ గురు


## కాదంటున్నారా..! అవుననిపించొచ్చు...



ఇంటాబయటా రాణిస్తూ... విజయవంతమైన జీవితం గడుపుతున్నా... కీలక అంశాల్లో మహిళల నిర్ణయాల్ని పరిగణనలోకి తీసుకోరు. పనిచేసే చోట ఇలాంటి వైఖరి పదేపదే ఎదురైతే ఆత్మవిశ్వాసం కోల్పోయే ప్రమాదమూ ఉంది. ఈ సమస్యను అలానే వదిలేస్తే మానసిక సంతులత దెబ్బతింటుంది. అందుకే ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు మూడు అంశాల్ని మననం చేసుకోండి. 1.ఇది మీ ఒక్కరికే ఎదురైన సమస్యా? 2.ఎందుకు కాదంటున్నారు? 3.అవును, సరే అని ఎలా అనిపించుకోవాలి. మొదటి రెండు విషయాల మీదా అవగాహన ఎప్పుడైతే తెచ్చుకుంటామో... అప్పుడు మన వాదనను బలంగా వినిపించే అవకాశం దక్కించుకున్నవారమవుతాం. ఇందుకు ఏం చేయాలంటే... మీరు పనిచేస్తున్న విభాగం, లేదా చెప్పాలనుకుంటున్న అంశం మీద పట్టు సంపాదించుకోవాలి. ఎంతలా అంటే నిద్రలో లేపి అడిగినా కచ్చితమైన సమాచారం ఇచ్చేంతగా. సాంకేతికతను అందిపుచ్చుకుని ఎప్పటికప్పుడు అప్‌టుడేట్‌గా ఉండాలి. చేస్తున్న వర్క్‌లో లోతుపాతులను గమనించుకుని, మీ బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నించాలి. అహర్నిశలు కష్టపడినా... సంస్థ చూసేది ఉత్పాదకతే. కాబట్టి ఆ విషయంలో లోటు లేకుండా కష్టపడాలి. ఇవన్నీ మిమ్మల్ని నలుగురిలో ఒకరిగా నిలబెడతాయి. ఇకపోతే మూడో అంశం... ఆఫీసుల్లో కొత్త ప్రాజెక్టులు వచ్చినప్పుడో, సమావేశాల్లోనో ఇలాంటి సందర్భాలు ఎదురవుతాయి. అలాంటప్పుడు మీరు మాట్లాడాలి అనుకుంటే... విషయావగాహనతో, లెక్కలు, గతానుభవాలని ప్రస్తుతానికి ఉదాహరణగా చూపిస్తూ... పరిష్కార మార్గాలు చెప్పినట్లయితే... మీ ఆలోచనల్ని తిరస్కరించేవారుంటారా! ఒక్కసారి ప్రయత్నించి చూడండి.

# ఛాంపియన్

భారత్ 224 ఆలౌట్.. ఇంగ్లాండ్ 92/0.. చివరి టెస్టులో రెండో రోజు రెండు గంటల ఆట చూశాక.. ఈ మ్యాచ్‌లో ఇక టీమ్‌ఇండియా పోటీలో ఉంటుందని ఎవ్వరూ అనుకుని ఉండరేమో! కానీ తొలి సెషన్లో తేలిపోయినా.. తర్వాతి రెండు సెషన్లలో గొప్పగా పుంజుకున్న భారత్.. మ్యాచ్ ఇంగ్లాండ్ చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకుంది. బుమ్రా లేని వేళ ప్రధాన పేసర్‌గా బాధ్యత తీసుకున్న మహ్మద్ సిరాజ్ అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో ఇంగ్లిష్ బ్యాటర్లకు కళ్లెం వేస్తే.. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ధనాధన్ బ్యాటింగ్‌తో జట్టులో ఆశలను నిలిపి ఉంచాడు. 8 వికెట్లు చేతిలో ఉన్న భారత్.. 52 పరుగుల ముందంజలో ఉంది. బౌలింగ్ అనుకూల పరిస్థితుల్లో మూడో రోజంతా భారత బ్యాటర్లు నిలవగలిగితే సిరీస్‌ను సమం చేసేందుకు మంచి అవకాశాలే ఉంటాయి.



సిరాజ్ 4/86

## సిరాజ్ అలా.. ఆకాశ్ ఇలా

ఇంగ్లాండ్‌తో మూడో టెస్టులో ఓపెనర్ డకెట్‌ను ఔట్ చేశాక భారత ఫాస్ట్‌బౌలర్ సిరాజ్ హద్దులు దాటి సంబరాలు చేసుకోవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అందుకు అతడిపై జరిమానా కూడా పడింది. అయితే అదే బ్యాటర్‌తో శుక్రవారం మరో భారత పేసర్ ఆకాశ్‌దీప్ వ్యవహరించిన తీరు చర్చనీయాంశమైంది. ఆకాశ్ బంతిని ఫైన్‌లెగ్ వైపు రివర్స్ స్కూప్ చేయబోయిన డకెట్.. వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఈ వికెట్‌తో ముందు గాల్లోకి పంచ్ విసిరి సంబరాలు చేసుకున్న ఆకాశ్‌దీప్.. తర్వాత పెవిలియన్‌కు వెళ్తున్న డకెట్ భుజం చేయి వేసి, ఏదో చెబుతూ వెళ్లాడు. అందుకు డకెట్ కూడా బదులిచ్చాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం నడిచిన సంకేతాలేమీ కనిపించలేదు కానీ.. డకెట్‌కు ఆకాశ్ ఇలా వీడ్కోలు ఇవ్వడం మాత్రం అందరి దృష్టినీ ఆకర్షించింది.

# ఆశలు నిలిచాయ్

- దెబ్బ కొట్టి.. దెబ్బ తిన్న ఇంగ్లాండ్ • 92/0 నుంచి.. 247 ఆలౌట్
- గొప్పగా పుంజుకున్న భారత్ • తొలి ఇన్నింగ్స్‌లో 224.. రెండో ఇన్నింగ్స్‌లో 75/2



డకెట్, ఆకాశ్‌దీప్

లండన్

భారత్, ఇంగ్లాండ్ మధ్య సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే అయిదో టెస్టు రసవత్తరంగా సాగుతోంది. రెండో రోజు భారత్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకే ఆలౌట్ చేసి, ధనాధన్ బ్యాటింగ్‌తో మ్యాచ్‌పై పట్టు బిగించేలా కనిపించిన ఇంగ్లాండ్.. మహ్మద్ సిరాజ్ (4/86), ప్రసిద్ధ్ కృష్ణ (4/62)ల ధాటికి 247 పరుగులకే ఆలౌటై, 23 పరుగుల స్వల్ప ఆధిక్యంతో సరిపెట్టుకుంది. క్రాలీ (64; 57 బంతుల్లో 14×4), డకెట్ (43; 38 బంతుల్లో 5×4, 2×6), బ్రూక్ (53; 64 బంతుల్లో 5×4, 1×6) రాణించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్.. శుక్రవారం ఆట చివరికి 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (51 బ్యాటింగ్; 49 బంతుల్లో 7×4, 2×6) విలువైన ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. రాహుల్ (7), సుదర్శన్ (11) ఔటయ్యారు. జైస్వాల్‌కు తోడుగా ఆకాశ్‌దీప్ (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

**ఉదయం టపటపా.. సాయంత్రం ధనాధన్:** శుక్రవారం ఉదయం 204/6తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్.. మిగతా 4 వికెట్లు కోల్పోవడానికి ఎంతో సమయం పట్టలేదు. ముందు రోజు పట్టుదలతో పోరాడిన కరుణ్ నాయర్ (ఓవర్ నైట్ 52), వాషింగ్టన్ సుందర్ (ఓవర్‌నైట్ 19).. ఉదయం ఎంతోసేపు నిలవకపోవడంతో భారత్ అనూహ్యంగా కుప్పకూలింది. కరుణ్ ఇంకో 5 పరుగులే చేసి టంగ్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగగా.. సుందర్ ఓవర్‌నైట్ స్కోరుకు 7 పరుగులు జోడించి అట్కిన్సన్‌కు వికెట్ ఇచ్చేశాడు. సిరాజ్ (0), ప్రసిద్ధ్ (0)లను ఊడ్చేయడానికి అట్కిన్సన్‌కు ఎంతో సమయం పట్టలేదు. కేవలం 6 పరుగుల వ్యవధిలో భారత్ నాలుగు వికెట్లు కోల్పోయింది. రెండో రోజు 5.4 ఓవర్లు మాత్రమే ఆడి 20 పరుగులే జోడించి ఇన్నింగ్స్‌ను ముగించింది భారత్. అట్కిన్సన్ 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. అయితే సాయంత్రం రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటింగ్ భిన్నంగా సాగింది. జైస్వాల్ దూకుడైన ఆటతో ఇంగ్లిష్ బౌలింగ్‌ను తుత్తునియలు చేశాడు. ఆరంభం నుంచి బౌండరీల వేటలో దూసుకెళ్లిన అతను.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతడి ధాటికి భారత్ 12వ ఓవర్లోనే 50 దాటింది. అయితే అంతకంటే ముందు రాహుల్.. టంగ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తర్వాత సుదర్శన్ సహకారంతో జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. కానీ ఆట చివర్లో సుదర్శన్.. అట్కిన్సన్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోవడంతో భారత్ కొంత అసంతృప్తితో ఆటను ముగించింది. ఆ వికెట్ పడకపోతే రెండో రోజు భారత్‌దే స్పష్టమైన పైచేయి అయ్యేది.

**ముందు బజ్‌బాల్.. ఆ పై ధమాల్:** రెండో రోజు ఉదయం భారత్‌ను త్వరగా ఆలౌట్ చేసిన ఉత్సాహంతో తొలి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇంగ్లాండ్.. బ్యాటుతో రెచ్చిపోయింది. సిరీస్‌లో నాలుగో టెస్టులో మినహా బాజ్‌బాల్ ఆట ఆడేందుకు పెద్దగా అవకాశం దక్కించుకోలేకపోయిన ఇంగ్లిష్ జట్టు.. శుక్రవారం మాత్రం ఆ శైలిలోనే ఆడింది. ఓపెనర్లు డకెట్, క్రాలీ వన్డే తరహాలో ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. రన్‌రేట్ 7-8 మధ్య సాగింది. డకెట్, క్రాలీ పోటాపోటీగా బౌండరీలు బాదారు. డకెట్ రెండు సిక్సర్లు కూడా బాదాడు. 12 ఓవర్లకే స్కోరు 92కు చేరుకుంది. ఓపెనర్లిద్దరూ అర్ధశతకాల ముంగిట నిలిచారు. ఈ ఊపు చూస్తే ఇంగ్లాండ్ 400-500 మధ్య స్కోరు చేస్తుందా, భారత్‌కు ఇన్నింగ్స్ ఓటమి తప్పదా అన్న ఆలోచనలు కలిగాయి. కానీ ఆకాశ్‌దీప్.. 13వ ఓవర్లో డకెట్‌ను ఔట్ చేసి భారత్‌కు కాస్త ఉపశమనాన్నిచ్చాడు. అయితే మరో ఓపెనర్ క్రాలీ నిలకడగా ఆడుతూ అర్ధశతకం పూర్తి చేసుకోవడం.. పోప్ (22) సైతం క్రీజులో కుదురుకోవడంతో ఇంగ్లాండ్ 129/1తో పటిష్ట స్థితికి చేరుకుంది. అయితే క్రాలీని ప్రసిద్ధ్ ఔట్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. తర్వాత ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో పెద్ద భాగస్వామ్యమే నమోదవలేదు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఆ జట్టు పైచేయి సాధించకుండా చూశారు. ముఖ్యంగా సిరాజ్ బౌలింగ్ అద్భుతం. అతను మెరుపు వేగంతో సంధించిన బంతులకు పోప్, రూట్ (29), బెతెల్ (6)వికెట్ల ముందు దొరికిపోయారు. ప్రసిద్ధ్ సైతం వికెట్లు తీయడంలో సిరాజ్‌తో పోటీ పడ్డాడు. అతను ఒకే ఓవర్లో జేమీ స్మిత్ (8), ఒవర్టన్ (0) వికెట్లు తీసి ఇంగ్లాండ్‌ను దెబ్బ కొట్టాడు. అయితే బ్రూక్ పోరాడడంతో ఇంగ్లాండ్.. భారత్ స్కోరును దాటింది. అర్ధశతకం పూర్తి చేసుకున్న అతణ్ని సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. వోక్స్ బ్యాటింగ్‌కు రాకపోవడంతో 9 వికెట్లకే ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.



ప్రసిద్ధ్ 4/62

### వోక్స్ ఔట్

భారత్‌తో అయిదో టెస్టులో తొలి రోజు గాయపడి మైదానాన్ని వీడిన ఇంగ్లాండ్ పేసర్ క్రిస్ వోక్స్ మిగతా ఆటకు దూరమయ్యాడు. ఫీల్డింగ్ చేస్తూ కింద పడడంతో అతడి భుజానికి తీవ్ర గాయమైంది. భుజం స్థానభ్రంశం చెందడంతో అతను మ్యాచ్‌లో మళ్లీ బరిలోకి దిగే అవకాశం లేకపోయింది. వోక్స్ మైదానాన్ని వీడాక ఇంగ్లాండ్ నలుగురు స్పెషలిస్టు బౌలర్లతోనే భారత్‌ను తొలి ఇన్నింగ్స్‌లో కట్టడి చేయగలిగింది. అయితే వోక్స్ లేకపోవడం రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌కు కలిసొచ్చే విషయమే.

**భారత్ తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ ఎల్బీ (బి) అట్కిన్సన్ 2; రాహుల్ (బి) వోక్స్ 14; సుదర్శన్ (సి) స్మిత్ (బి) టంగ్ 38; శుభ్‌మన్ రనౌట్ 21; కరుణ్ నాయర్ ఎల్బీ (బి) టంగ్ 57; జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 9; జురెల్ (సి) బ్రూక్ (బి) అట్కిన్సన్ 19; సుందర్ (సి) ఒవర్టన్ (బి) అట్కిన్సన్ 26; ఆకాశ్‌దీప్ నాటౌట్ 0; సిరాజ్ (బి) అట్కిన్సన్ 0; ప్రసిద్ధ్ (సి) స్మిత్ (బి) అట్కిన్సన్ 0; ఎక్స్‌ట్రాలు 38 **మొత్తం:** (69.4 ఓవర్లలో ఆలౌట్) **224**

**వికెట్ల పతనం:** 1-10, 2-38, 3-83, 4-101, 5-123, 6-153, 7-218, 8-220, 9-224

**బౌలింగ్:** వోక్స్ 14-1-46-1; అట్కిన్సన్ 21.4-8-33-5; టంగ్ 16-4-57-3; ఒవర్టన్ 16-0-66-0; బెతెల్ 2-1-4-0

**ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలీ (సి) జడేజా (బి) ప్రసిద్ధ్ 64; డకెట్ (సి) జురెల్ (బి) ఆకాశ్ 43; పోప్ ఎల్బీ (బి) సిరాజ్ 22; రూట్ ఎల్బీ (బి) సిరాజ్ 29; బ్రూక్ (బి) సిరాజ్ 53; బెతెల్ ఎల్బీ (బి) సిరాజ్ 6; స్మిత్ (సి) రాహుల్ (బి) ప్రసిద్ధ్ 8; ఒవర్టన్ ఎల్బీ (బి) ప్రసిద్ధ్ 0; అట్కిన్సన్ (సి) ఆకాశ్ (బి) ప్రసిద్ధ్ 11; టంగ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (51.2 ఓవర్లలో ఆలౌట్) **247**


**వికెట్ల పతనం:** 1-92, 2-129, 3-142, 4-175, 5-195, 6-215, 7-215, 8-235, 9-247

**బౌలింగ్:** సిరాజ్ 16.2-1-86-4; ఆకాశ్‌దీప్ 17-0-80-1; ప్రసిద్ధ్ 16-1-62-4; జడేజా 2-0-11-0

**భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ బ్యాటింగ్ 51; రాహుల్ (సి) రూట్ (బి) టంగ్ 7; సుదర్శన్ ఎల్బీ (బి) అట్కిన్సన్ 11; ఆకాశ్‌దీప్ బ్యాటింగ్ 4; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (18 ఓవర్లలో 2 వికెట్లకు) **75**; **వికెట్ల పతనం:** 1-46, 2-70; **బౌలింగ్:** అట్కిన్సన్ 6-2-26-1; టంగ్ 7-1-25-1; ఒవర్టన్ 5-1-22-0



## టెస్టు జట్టు నుంచి బుమ్రా విడుదల



బుమ్రా

**లండన్:** పని భార నిర్వహణలో భాగంగా ఇంగ్లాండ్‌తో చివరి టెస్టుకు దూరమైన జస్‌ప్రీత్ బుమ్రా.. స్వదేశానికి వచ్చేస్తున్నాడు. ఈ మ్యాచ్‌తోనే సిరీస్ ముగియనుండడంతో అతణ్ని జట్టు నుంచి విడుదల చేశారు. ఈ విషయాన్ని బీసీసీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. కొన్నేళ్లుగా బుమ్రా గాయాలతో పోరాడుతున్నాడు. గత ఏడాది చివర్లో ఆస్ట్రేలియా పర్యటనలో గొప్పగా రాణించినప్పటికీ.. సిరీస్ చివర్లో గాయం తిరగబెట్టి నాలుగైదు నెలల పాటు మైదానానికి దూరమయ్యాడు. దీంతో ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో అతణ్ని మూడు మ్యాచ్‌ల్లో మాత్రమే ఆడించాలని ముందే నిర్ణయించారు. దీని ప్రకారమే బుమ్రా తొలి, మూడు, నాలుగు టెస్టుల్లో ఆడాడు. చివరి టెస్టులోనూ అతను ఆడతాడని ఒక దశలో వార్తలు వచ్చినా.. అతణ్ని బరిలోకి దించే సాహసం జట్టు యాజమాన్యం చేయలేదు.

**ఆసియా కప్ ఆడతాడా?:** ఇంతకీ బుమ్రాను మళ్లీ అంతర్జాతీయ క్రికెట్లో ఎప్పుడు చూస్తామన్నది ప్రశ్న . టీమ్‌ఇండియా వచ్చే నెల 9 నుంచి ప్రతిష్టాత్మక ఆసియా కప్ టీ20 టోర్నీలో ఆడనుంది. నాలుగో టెస్టు ముగిశాక, ఈ టోర్నీ మొదలవడానికి ముందు బుమ్రాకు నెలన్నర విశ్రాంతి లభిస్తోంది. మరి సెప్టెంబరు 9న టోర్నీ ఆరంభ సమయానికి బుమ్రా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉంటాడా.. ఆ టోర్నీలో ఆడతాడా అన్నది ఆసక్తికరం. ఆసియా కప్ ముగిశాక, అక్టోబరులో భారత జట్టు.. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ఆడాల్సి ఉంది. తర్వాత దక్షిణాఫ్రికాతో టెస్టులున్నాయి. మరి వీటిలో బుమ్రా ఆడే మ్యాచ్‌లు ఏవో.. పనిభార నిర్వహణలో భాగంగా ఏయే మ్యాచ్‌లకు అతణ్ని పక్కన పెడతారో చూడాలి.

## భారత ఫుట్‌బాల్ కోచ్‌గా జమీల్



ఖలీద్ జమీల్

**దిల్లీ:** భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు చీఫ్ కోచ్‌గా ఖలీద్ జమీల్ ఎంపికయ్యాడు. చీఫ్ కోచ్ రేసులో స్టీఫెన్ కాన్‌స్టంటైన్, స్టెఫాన్ టర్కోవిచ్‌లను వెనక్కి నెట్టిన 48 ఏళ్ల జమీల్‌ను అత్యున్నత పదవి వరించింది. దిగ్గజ ఆటగాడు విజయన్ సారథ్యంలోని ఏఐఎఫ్ఎఫ్ సాంకేతిక కమిటీ ముగ్గురి పేర్లతో జాబితాను తయారు చేయగా.. మాజీ అంతర్జాతీయ ఆటగాడు జమీల్‌కు ఎగ్జిక్యూటివ్ కమిటీ పచ్చజెండా ఊపింది. కాన్‌స్టంటైన్ భారత జట్టు మాజీ చీఫ్ కోచ్ కాగా.. స్లొవేకియా జాతీయ జట్టుకు టర్కోవిచ్ సేవలు అందించాడు. జాతీయ జట్టుకు భారతీయుడు చీఫ్ కోచ్‌గా నియమితుడవటం 13 ఏళ్లలో ఇదే తొలిసారి. పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా పనిచేసిన చివరి భారతీయుడు సావియో మెదీరా. 2011 నుంచి 2012 వరకు అతను చీఫ్ కోచ్‌గా వ్యవహరించాడు. 2017 ఐ-లీగ్‌లో ఐజ్వాల్ ఫుట్‌బాల్ క్లబ్‌ను జమీల్ విజేతగా నిలిపాడు. ప్రస్తుతం ఇండియన్ సూపర్ లీగ్‌లో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు.

## పన్నెండేళ్ల అమ్మాయికి ప్రపంచ స్విమ్మింగ్ కాంస్యం



జిడి


**సింగపూర్:** పన్నెండేళ్ల వయసుకే అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్న చైనా యువ స్విమ్మర్ యు జిడి.. ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో బోణీ కొట్టింది. ఈ పోటీల్లో ఆమెకు కాంస్యం దక్కింది. 4×200 మీటర్ల ఫ్రీస్టైల్ రిలే రేసులో మూడో స్థానం సాధించిన చైనా బృందంలో జిడి సభ్యురాలు. క్వాలిఫయింగ్‌లో పోటీ పడ్డ జిడి.. ఫైనల్లో బరిలోకి దిగలేదు. కానీ ఆమె జట్టు కాంస్యం గెలవడంతో తనకూ పతకం దక్కింది. 200 మీ. బటర్‌ఫ్లై, 200 మీ. వ్యక్తిగత మెడ్లీ రేసుల్లో జిడి త్రుటిలో పతకం చేజార్చుకుంది. ఈ రెండు రేసుల్లోనూ ఆమె నాలుగో స్థానంలో నిలిచింది. జిడి 400 మీ. వ్యక్తిగత మెడ్లీ రేసులో బరిలోకి దిగాల్సి ఉంది.

## ప్రపంచ టీటీకి భారత జట్ల అర్హత

**దిల్లీ:** ప్రతిష్ఠాత్మక ప్రపంచ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీటీసీ)కు భారత పురుషులు, మహిళల జట్లు అర్హత సాధించాయి. ఖాట్మండులో జరిగిన దక్షిణాసియా ప్రాంతీయ ఛాంపియన్‌షిప్‌లో విజేతలుగా నిలిచిన భారత జట్లకు డబ్ల్యూటీటీసీ బెర్తులు లభించాయి. అయిదు దేశాల రౌండ్ రాబిన్ లీగ్ టోర్నీలో భారత జట్లు అజేయంగా నిలిచి సంపూర్ణ ఆధిపత్యం కనబరిచాయి. ఆసియా తరపున పురుషులు, మహిళల్లో ఒక్కో విభాగానికి 16 కోటా బెర్తులు ఉన్నాయి. మధ్య ఆసియా, దక్షిణాసియా, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా ప్రాంతీయ ఛాంపియన్ జట్లు నేరుగా డబ్ల్యూటీటీసీకి అర్హత సాధిస్తాయి. ఆకాశ్ పాల్, రోనిత్ భాంజా, అనిర్బన్ ఘోష్, అభినంద్, దివ్యాంష్ శ్రీవాస్తవలతో కూడిన భారత పురుషుల జట్టు 3-0తో.. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మాల్దీవులపై విజయాలు నమోదు చేసింది. కృత్విక సిన్హా, సెలెనా దీప్తి సెల్వకుమార్, తనీషా కొటేచా, సయాలి వాణి, సిండ్రెల దాస్‌లతో కూడిన భారత మహిళల బృందం 3-0తో.. నాలుగు ప్రత్యర్థి జట్లను చిత్తుచేసింది.

## ఆత్మహత్య ఆలోచనలొచ్చాయి

- ఎవరినీ మోసం చేయలేదు • విడాకుల అనంతర వేదనపై చాహల్



చాహల్

**దిల్లీ:** విడాకుల అనంతరం తాను తీవ్ర మనోవేదనను అనుభవించినట్లు టీమ్‌ఇండియా సీనియర్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ తెలిపాడు. ఒక దశలో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన కూడా చేసినట్లు అతను వెల్లడించాడు. తన భార్య ధనశ్రీ వర్మతో నాలుగేళ్ల వైవాహిక బంధానికి చాహల్ గత ఏడాది తెరదించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో తనను కొందరు మోసగాడిగా అభివర్ణించారని, కానీ తాను ఎవరినీ మోసం చేయలేదని చాహల్ తెలిపాడు. ఒక పాడ్‌కాస్ట్‌లో విడాకుల గురించి అతను మాట్లాడాడు. 'విడాకుల తర్వాత నన్ను మోసగాడిగా అభివర్ణించారు. కానీ నా జీవితంలో ఎవ్వరినీ నేను మోసం చేయలేదు. నాకు ఇష్టమైన వాళ్లతో నమ్మకమైన వ్యక్తిగానే ఉన్నా. ఎవరి గురించైనా హృదయం నుంచే ఆలోచించా. నేను ఎవరో ఒకరితో ఫొటోలు దిగితే వాళ్లతో సంబంధం కలపడం సరి కాదు. నాకు ఇద్దరు తోబుట్టువులున్నారు. మహిళలను ఎలా గౌరవించాలో నాకు తెలుసు. విడాకులు ఒక్క రోజులో తీసుకున్న నిర్ణయం కాదు. మేం విడిపోవడం ఖాయమయ్యే వరకు విషయం బయట పెట్టకూడదనుకున్నాం. సామాజిక మాధ్యమాల్లో మామూలు జంటలాగే కనిపించాం. కానీ మా మధ్య సమస్య మాత్రం పెరుగుతూ పోయింది. ఒక బంధానికి రాజీ చాలా అవసరం. ఇద్దరూ ఎప్పుడూ తీరిక లేకుండా ఉంటుంటే దూరం పెరుగుతుంది. విడాకుల తర్వాత నాకు ఆత్మహత్య ఆలోచనలు వచ్చాయి. నేను జీవితంలో అలసిపోయాను. రోజూ రెండు గంటల పాటు ఏడ్చేవాడిని. రెండు గంటలే నిద్రపోయేవాడిని. ఇలా 40 రోజుల పాటు సాగింది. కుంగుబాటుకు గురయ్యాను. నాకు చాలా సన్నిహితంగా ఉన్న వాళ్లకే నేనెలాంటి బాధ అనుభవించానో తెలుసు. ఒక దశలో ఆట నుంచి విరామం తీసుకోవాలా అని కూడా ఆలోచించాను" అని చాహల్ పేర్కొన్నాడు.

## మెస్సి చేతిలో క్రికెట్ బ్యాట్



మెస్సి

**ముంబయి:** అర్జెంటీనా దిగ్గజ ఫుట్‌బాలర్ లియోనెల్ మెస్సి క్రికెట్ మ్యాచ్ ఆడే అవకాశముంది. ఈ ఏడాది ముంబయిలో మెస్సితో మ్యాచ్ ఆడించేందుకు ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే డిసెంబరు 14న వాంఖడే స్టేడియంలో సెవెన్ ఎ సైడ్ క్రికెట్ మ్యాచ్‌లో స్టార్ ఫుట్‌బాలర్ బరిలో దిగొచ్చు. మెస్సి జట్టుతో మహేంద్రసింగ్ ధోని లేదా విరాట్ కోహ్లి బృందం తలపడొచ్చు. సచిన్ తెందుల్కర్, రోహిత్‌శర్మతో సహా భారత తాజా, మాజీ ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో ఆడే అవకాశముంది. ఇందుకోసం ఓ ఈవెంట్ నిర్వహణ సంస్థ డిసెంబరు 14న వాంఖడే స్టేడియం కోసం ముంబయి క్రికెట్ సంఘం (ఎంసీఏ)ను సంప్రదించింది. మ్యాచ్ ఖరారయ్యాక నిర్వాహకులు పూర్తి షెడ్యూల్‌ను రూపొందిస్తారని ఎంసీఏ వర్గాలు తెలిపాయి. డిసెంబరు 13 నుంచి 15 వరకు భారత్‌లో పర్యటించే మెస్సి.. దిల్లీ, కోల్‌కతాకు వెళ్లే అవకాశముంది. 2011లో కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో వెనిజువెలాతో స్నేహపూర్వక మ్యాచ్ కోసం మెస్సి తొలిసారిగా భారత్‌కు వచ్చాడు. 14 ఏళ్ల తర్వాత మరోసారి అతను భారత్‌కు రానున్నాడు.

## తరుణ్, లక్ష్యసేన్ జోరు

### సెమీస్‌లో భారత ఆటగాళ్లు

**మకావు:** మకావు ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్, తరుణ్ మన్నెపల్లి జోరు కొనసాగుతోంది. వరుస విజయాలతో సత్తాచాటుతున్న లక్ష్యసేన్, తరుణ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో రెండో సీడ్ లక్ష్యసేన్ 21-14, 18-21, 21-14తో షువాన్ చెన్ (చైనా)పై గెలుపొందాడు. 63 నిమిషాల పాటు సాగిన పోరులో అన్ని రంగాల్లోనూ ప్రత్యర్థిపై లక్ష్యసేన్ పైచేయి సాధించాడు. మరో క్వార్టర్స్‌లో తరుణ్ 21-12, 13-21, 21-18తో హు ఆన్ (చైనా)ను చిత్తుచేశాడు. 75 నిమిషాల మ్యాచ్‌లో తరుణ్, ఆన్ హోరాహోరీగా తలపడ్డారు. ఒత్తిడిని అధిగమిస్తూ కీలక సమయాల్లో పాయింట్లు రాబట్టిన తరుణ్‌ను విజయం వరించింది. సెమీస్‌లో ఆల్వి ఫర్హాన్ (ఇండోనేసియా)తో లక్ష్యసేన్, జస్టిన్ హో (మలేసియా)తో తరుణ్ తలపడనున్నారు. మరోవైపు భారత స్టార్ డబుల్స్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి పోరాటానికి తెరపడింది. క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ 14-21, 21-13, 20-22తో చూంగ్ జియాన్- మహ్మద్ హైకాల్ (మలేసియా) జంట చేతిలో పోరాడి ఓడింది.

## పాక్‌దే తొలి టీ20



అయూబ్ 57

**లాడర్‌హిల్ (అమెరికా):** వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ శుభారంభం చేసింది. గురువారం తొలి మ్యాచ్‌లో పాక్ 14 పరుగుల తేడాతో నెగ్గి.. మూడు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సయిమ్ అయూబ్ (57; 38 బంతుల్లో 5×4, 2×6) సత్తాచాటడంతో మొదట పాక్ 6 వికెట్లకు 178 పరుగులు సాధించింది. షమర్ జోసెఫ్ (3/30) మూడు వికెట్లతో మెరిశాడు. అనంతరం మహ్మద్ నవాజ్ (3/23), సయిమ్ అయూబ్ (2/20)ల దెబ్బకు విండీస్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లకు 164 పరుగులే చేయగలిగింది. జాన్సన్ చార్లెస్ (35; 36 బంతుల్లో 2×4, 2×6), జువెల్ ఆండ్రూ (35; 33 బంతుల్లో 1×4, 3×6)), జేసన్ హోల్డర్ (30 నాటౌట్; 12 బంతుల్లో 4×6), షమర్ జోసెఫ్ (21 నాటౌట్; 12 బంతుల్లో 1×4, 2×6) పోరాడినా ఫలితం లేకపోయింది.

## ఫైనల్లో లాకి

**ఏథెన్స్ (గ్రీస్):** అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్ లాకి ఫైనల్లో ప్రవేశించాడు. 110 కిలోల పురుషుల ఫ్రీస్టైల్ విభాగంలో లాకి.. జపాన్, ఇరాన్ ప్రత్యర్థులను ఓడించి తుదిపోరుకు చేరాడు. తొలి పోరులో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన అతడు జపాన్ రెజ్లర్ హాంటో హయాషిని ఓడించాడు. తర్వాత 8-0తో ముర్తాజ్ (జార్జియా)ను చిత్తు చేశాడు. సెమీస్‌లో ఇరాన్‌కు చెందిన అమీర్‌హొసేన్ 15-7తో ఆధిపత్యం చెలాయించాడు. ఆ తర్వాత ప్రత్యర్థిని తిప్పేసి విజయాన్ని అందుకున్నాడు.

## కివీస్ చేతిలో జింబాబ్వే చిత్తు

**బులవాయో:** జింబాబ్వేతో తొలి టెస్టులో న్యూజిలాండ్ ఘనవిజయం సాధించింది. మూడు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్‌లో కివీస్ 9 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసి.. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 31/2తో శుక్రవారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 165 పరుగులకు ఆలౌటైంది. మ్యాట్ హెన్రీ (3/51), ఒరూర్క్ (3/28), మిచెల్ సాంట్నర్ (4/27) ధాటికి జింబాబ్వే బ్యాటర్లు చేతులెత్తేశారు. సీన్ విలియమ్స్ (49; 66 బంతుల్లో 6×4) టాప్ స్కోరర్. అనంతరం కివీస్ 2.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి విజయానికి కావాల్సిన 8 పరుగులు సాధించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు తీసిన పేసర్ హెన్రీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. తొలి ఇన్నింగ్స్‌ల్లో జింబాబ్వే 149, కివీస్ 307 పరుగులకు ఆలౌటయ్యాయి. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (2025-27)లో ఈ మ్యాచ్ భాగం కాదు. 2016 తర్వాత కివీస్, జింబాబ్వే టెస్టు మ్యాచ్‌లో తలపడటం ఇదే ప్రథమం.

# మహిళలకు ఉచిత బస్సు పథకంపై
# ఆర్టీసీ సన్నద్ధత



జీరో టికెట్ల జారీపై విజయవాడ నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న నెల్లూరు జిల్లా కండక్టర్లు. చిత్రంలో జిల్లా ఆర్టీసీ రవాణాధికారిణి షమీన్

**తొలుత మూడు నెలలు అధిక రద్దీ ఉంటుందని అంచనా**

**స్పేర్ బస్సులు, బడి బస్సులు కూడా వినియోగం**

**జోన్లవారీగా అధికారులు, డిపో మేనేజర్లతో సమీక్షలు**

**ఈనాడు, అమరావతి:** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఈ నెల 15 నుంచి ఆరంభించనుండటంతో.. దీనికి ఏపీఎస్‌ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. ఎక్కువ బస్సులు అందుబాటులో ఉండేలా చూడటం, అదనపు డ్రైవర్లను సమకూర్చుకోవడం, కండక్టర్లకు శిక్షణపై అధికారులు దృష్టిపెట్టారు. సంస్థలో 11,449 బస్సులు ఉండగా, ఇందులో పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు కలిపి 8,548 (74 శాతం) ఉన్నాయి. పథకం అమలులో ఇవే కీలకం కానున్నాయి. సాధారణంగా ప్రతి డిపోలో కొన్ని బస్సులు స్పేర్ కింద పక్కన పెడతారు. ఆగస్టు 15 నుంచి ఈ బస్సులనూ రోడ్డెక్కించనున్నారు. అలాగే రాష్ట్రమంతటా గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ 371 బడి బస్సులు నడుపుతోంది. ఇవి ఆయా నగరాలు, పట్టణాలకు సమీపంలోని గ్రామాలకు ఉదయం వెళ్లి విద్యార్థులను బడులకు తీసుకొస్తాయి. మళ్లీ సాయంత్రం బడుల నుంచి ఊళ్లకు తీసుకెళ్తాయి. మిగిలిన సమయమంతా డిపోలోనే ఉంటాయి. ఇకపై మిగిలిన సమయంలో ఈ బస్సులనూ ఇతర రూట్లలో నడపనున్నారు.

**ప్రయాణికులతో సహనంగా వ్యవహరించండి**

పథకం మొదలయ్యాక తొలి మూడు నెలలు అధిక రద్దీ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఎక్కువ మంది మహిళలు బస్సుల్లో ప్రయాణానికి ఆసక్తి చూపిస్తారని, దీనివల్ల అన్ని బస్సుల్లో రద్దీ పెరుగుతుందని భావిస్తున్నారు. దీంతో డ్రైవర్లు, కండక్టర్లకు అధికారులు తగిన సూచనలు చేస్తున్నారు. రద్దీ సమయంలో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేసినా సహనంగా వ్యవహరించాలని పేర్కొంటున్నారు.

**మహిళలకు వేరుగా టికెట్లు**

ఉచిత ప్రయాణం అమలు ఉన్న బస్సుల్లో మహిళలకు వేరుగా జీరో టికెట్లు ఇవ్వనున్నారు. మగవారికి సాధారణ టికెట్లు, మహిళలకు జీరో టికెట్లు ఇస్తారు. భర్త, భార్య ప్రయాణిస్తే.. భర్తకు ఛార్జీ ఉండే టికెట్, భార్యకు జీరో టికెట్ రెండూ వేర్వేరుగా జారీ చేస్తారు. జీరో టికెట్ల జారీపై కండక్టర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుత టిమ్స్‌లలో కొత్తగా ఉమెన్ ఫ్రీ టికెట్ అనే ఆప్షన్ తీసుకొస్తున్నారు.

**మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం**

ఉచిత బస్సు పథకంపై మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, అనిత, సంధ్యారాణితో కూడిన మంత్రివర్గ ఉప సంఘం ఈ నెల 4న సమావేశం కానుంది. ఆ తర్వాత 6న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ పథకంపై నిర్ణయం తీసుకొని అధికారికంగా విధివిధానాలు ప్రకటించనున్నారు. ఈ పథకానికి 'స్త్రీశక్తి' అనే పేరు పెట్టారంటూ సామాజిక మాధ్యమాల్లో ఓ టికెట్ చక్కర్లు కొడుతోంది. అది డమ్మీ టికెట్ అని, పథకం పేరు ఖరారు కాలేదని అధికారులు చెబుతున్నారు.




# రొయ్య రైతుల్లో కలవరం

**25% సుంకాలు, అదనంగా జరిమానాలంటూ ట్రంప్ ప్రకటనపైనా ఎగుమతిదారుల్లో ఆందోళన**

**ఆ దేశానికి ఎగుమతయ్యే రొయ్య ఉత్పత్తుల్లో రాష్ట్ర వాటానే ఎక్కువ**

ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్-భీమవరం: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల బాదుడు రాష్ట్రంలోని ఆక్వా రైతుల్ని, ఎగుమతిదారుల్ని కలవరపెడుతోంది. మన రాష్ట్రం నుంచి రొయ్యల ఎగుమతులు అధిక శాతం అమెరికాకు వెళ్లడమే ఇందుకు కారణం. ప్రధాన మార్కెట్‌కు ఎగుమతులు తగ్గితే పరిశ్రమ మనుగడ ఎలా..? అనే అయోమయం నెలకొంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆక్వా రంగానికి సుంకాలు కూడా తోడైతే.. నిండా నష్టాలే అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏకంగా 25 శాతం సుంకం, దానిపై అదనంగా జరిమానాలంటూ ట్రంప్ చేసిన ప్రకటన ఎగుమతిదారుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. అదనం అంటే ఎంతనే దానిపై స్పష్టత కరవైంది. ఐదేళ్లుగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రంగం.. ట్రంప్ ప్రతీకార సుంకాలతో దిక్కుతోచని స్థితికి చేరింది.

రాష్ట్ర ఎగుమతుల్లో ఆక్వా రంగానిది రెండో స్థానం. రాష్ట్రంలో రొయ్యలు, చేపల సాగు అధికం. సుమారు 16 లక్షల కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి ఉన్నాయి. 2.50 లక్షల ఎకరాల్లో ఏటా సుమారు 7 లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ సాగు అధికం.

**రూ.60,524 కోట్ల ఎగుమతులు.. అమెరికాకే రూ.21 వేల కోట్లు**

దేశ వ్యాప్తంగా 2023-24లో రూ.60,524 కోట్ల సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు జరిగితే అందులో అమెరికాకే రూ.21 వేల కోట్ల సరకు పంపారు. ఇందులో రొయ్యలే 2.93 లక్షల టన్నులు ఉండటం గమనార్హం. అందులో అధిక శాతం ఏపీ నుంచి ఎగుమతి అయ్యేవే.

**ఇప్పటికే ధరల్లో కోత.. మళ్లీ వాతలు**

ఏప్రిల్‌లోనే ట్రంప్ సుంకాల బాదుడుపై సంకేతాలు ఇచ్చినా.. తాత్కాలికంగా 90 రోజుల విరామం ప్రకటించారు. ఈలోగా రొయ్యల ధరలు పతనమయ్యాయి. వ్యాపారులు కిలోకు రూ.100 వరకు కోత పెట్టారు. ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి.. వ్యాపారులతో మాట్లాడటంతో 100 కౌంటు రూ.260 వరకు చేరింది.

- ట్రంప్ ప్రకటనతో రొయ్యల వ్యాపారులు.. కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపేశారు. లారీలు రావడం లేదని రైతులకు సమాచారం అందించారు. కొన్నిచోట్ల ట్రేడర్లు కిలోకి రూ.40 వరకు తగ్గించి అడుగుతున్నారు.

**ఈక్వెడార్ 14%.. భారత్ 33%**

- రొయ్యల ఎగుమతుల్లో ఏపీకి ప్రధాన పోటీదారు ఈక్వెడార్. అధిక పరిమాణంలో రొయ్యలను ఉత్పత్తి చేస్తూ తక్కువ ధరలకే అమెరికా, చైనా మార్కెట్లకు ఎగుమతి చేస్తోంది. ఈక్వెడార్ నుంచి ఎగుమతులపై అమెరికా సుంకం 10%. అదనపు సుంకాలు కలిపితే 14% మాత్రమే.
- భారత్‌పై సుంకాలు 25%.. దీనికి యాంటి డంపింగ్ డ్యూటీ, కౌంటర్ వెయిలింగ్ కూడా కలిపితే మొత్తంగా 33% అవుతుంది.
- అంటే ఈక్వెడార్‌తో పోలిస్తే.. సుమారు 19% అదనం.. పోటీని తట్టుకుని ఎగుమతులు చేసేదెలా అనే ప్రశ్న ఎగుమతిదారుల్లో వ్యక్తమవుతోంది.
- మునుపెన్నడూ లేని విధంగా ఇప్పటికే ఈక్వెడార్ ఎగుమతుల్లో భారత్‌ను వెనక్కి నెట్టిందని వివరిస్తున్నారు. సుంకం తగ్గింపు దిశగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అమెరికాతో చర్చలు జరిపేలా చూడాలని కోరుతున్నారు.

# మద్యం కుంభకోణం వెనుక పెద్ద కుట్ర

**ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదనలు**

- నిందితులకు ఈ నెల 13 వరకు రిమాండ్ పొడిగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ఏసీబీ కోర్టు

**ఈనాడు, అమరావతి:** 'మద్యం కుంభకోణం వెనుక చాలా పెద్ద కుట్ర ఉంది. నిందితులు దాదాపు రూ.3,500 కోట్ల మేర అక్రమాలకు పాల్పడ్డారు. దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదు. ఇంకా పలువురిని అరెస్టు చేయాల్సి ఉంది. వారు విదేశాలకు పారిపోయారు. ఈ దశలో రిమాండ్‌లో ఉన్న నిందితులకు బెయిల్ ఇవ్వొద్దు. ఇస్తే సాక్షులను బెదిరించే ప్రమాదం ఉంది. రిమాండ్‌ను పొడిగించండి' అని ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ వాదించారు. మద్యం కేసులో ఇప్పటికే అరెస్టైన 12 మంది నిందితులకు విధించిన రిమాండ్ గడువు శుక్రవారంతో ముగియనుండడంతో, వారిని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వీరికి రిమాండ్ పొడిగించాలని ప్రాసిక్యూషన్ తరఫున రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. రాజమహేంద్రవరం జైలు నుంచి వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, గుంటూరు జైలు నుంచి బాలాజీ యాదవ్, నవీన్ కృష్ణ, విజయవాడ జైలు నుంచి రాజ్ కెసిరెడ్డి, చాణక్య, శ్రీధర్‌రెడ్డి, దిలీప్, బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను కోర్టుకు తీసుకొచ్చారు.

**అన్నీ కట్టుకథలే.. ఏ31 తరఫు వాదనలు**

కుంభకోణం అని సిట్ కట్టుకథలు అల్లుతోందనీ, ఎలాంటి కుట్రా లేదని ఏ31గా ఉన్న ధనుంజయరెడ్డి తరఫు న్యాయవాది మన్మథరావు వాదించారు. పిటిషనర్‌కు బెయిల్ ఇస్తే విదేశాలకు పారిపోతారని అనడం అర్థరహితమన్నారు. నేరుగా కోర్టులో ప్రవేశపెట్టడంపైనా అడ్డంకులు సృష్టిస్తున్నారని వాదించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి జోక్యం చేసుకుంటూ.. ఏదైనా అనుకోని అవాంతరాలు ఎదురైతే తప్ప నిందితులను నేరుగానే కోర్టులో ప్రవేశపెట్టాలన్నారు.

■ ఇరువైపులా వాదనలు విన్న ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు.. నిందితులకు ఈనెల 13 వరకు రిమాండ్ విధించారు. నిందితులను తిరిగి కారాగారాలకు తీసుకెళ్లే సమయంలో చెవిరెడ్డి హడావుడి చేశారు. తనను ఈ కేసులో అన్యాయంగా ఇరికించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆ నగదు ఫొటోలు తీయండి**

శంషాబాద్‌లో స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్ల నోట్ల కట్టలను ఫొటోలు తీయించాలని మద్యం కేసు దర్యాప్తు అధికారిగా వ్యవహరిస్తున్న శ్రీహరిని పిలిచి ఏసీబీ కోర్టు న్యాయాధికారి ఆదేశించారు.

**ఎక్కడ డబ్బు దొరికినా మద్యం సొమ్ము అంటున్నారు: రాజ్ కెసిరెడ్డి**



'హైదరాబాద్ శివారు శంషాబాద్ మండలంలోని ఫామ్‌హౌస్‌లో స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్లు నా సొమ్మే అని సిట్ చెబుతోంది. ఎక్కడ డబ్బు దొరికినా మద్యం సొమ్మేనని అంటున్నారు. ఆ నగదు నేను వరుణ్‌కు ఇచ్చినట్లు చెబుతున్నారు. అదే నిజమైతే.. వాటిపై నా వేలిముద్రలు ఉండాలి కదా. 2024 జూన్‌లో ఆ డబ్బు వరుణ్‌కు ఇచ్చినట్లు సిట్ చెబుతోంది. ఆ నోట్లపై ఉన్న నంబర్లను రికార్డు చేయాలి. వాటిని ఆర్బీఐ ఎప్పుడు ముద్రించిందో తనిఖీ చేయాలి' అని రాజ్ కెసిరెడ్డి.. న్యాయాధికారి దృష్టికి తీసుకొచ్చారు. ఆ డబ్బుతో తనకు సంబంధం లేదన్నారు.



**జైలులో వసతులు కల్పించండి..**

– వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి

'నాకు జైలులో వసతులు కల్పించాలని రెండుసార్లు మీ దృష్టికి తెచ్చాను.. బయట నుంచి ఆహారాన్ని అనుమతించాలి. చంద్రబాబు రాజమహేంద్రవరం జైలులో ఉన్నప్పుడు అన్ని వసతులూ కల్పించారు' అని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు.

**మద్యం కేసుతో సంబంధం లేదు..**

– చెవిరెడ్డి భాస్కరరెడ్డి

తన కుటుంబం మద్యం కారణంగా ఎంతో నష్టపోయిందనీ, తనకు తాగుడు అలవాటు కూడా లేదని.. కనీసం వ్యాపారం కూడా చేయలేదని వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి.. కోర్టులో చెప్పారు. 12 ఏళ్లుగా వేద పాఠశాలను నడుపుతున్నాననీ, తాను ఏ తప్పూ చేయలేదని దైవసాక్షిగా చెబుతున్నానని అన్నారు.



కోర్టు వద్ద మీడియాకు వేలు చూపించి ఆవేశంగా మాట్లాడుతున్న చెవిరెడ్డి

# సత్యసాయి ఉత్సవాలకు ప్రధాని మోదీకి ఆహ్వానం

**ఈనాడు, దిల్లీ:** భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని ట్రస్ట్ సభ్యులు ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ఇతర ట్రస్టీలు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, ర్యూకో హీరా, ఎస్ఎస్ నాగానంద్, నిమీష్ పాండ్యలు పార్లమెంటు భవన్‌లో శుక్రవారం ప్రధానిని కలిశారు. నవంబరు 23 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల గురించి ట్రస్ట్ సభ్యులు ప్రధానికి వివరించారు.



ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానిస్తున్న సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ర్యూకోహీరా, ఎస్ఎస్ నాగానంద్, నిమీష్ పాండ్య, జస్టిస్ రామసుబ్రమణియన్

# ప్రభుత్వ పథకాల్లో మాజీ సీఎంల ఫొటోలు వద్దు: హైకోర్టు

**చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో మాజీ ముఖ్యమంత్రుల ఫొటోలు, రాజకీయ నేతల పేర్లు ఉపయోగించకూడదని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. 'ఉంగళుడన్ స్టాలిన్' పథకంపై ప్రకటనల్లో మాజీ సీఎం కరుణానిధి, ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరుల ఫొటోలు ఉండటాన్ని వ్యతిరేకిస్తూ అన్నాడీఎంకే ఎంపీ సీవీ షణ్ముగం మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎం.ఎం.శ్రీవాస్తవ, జస్టిస్ సుందర్‌మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట శుక్రవారం విచారణకు వచ్చింది. అనంతరం న్యాయమూర్తులు జారీచేసిన ఉత్తర్వుల్లో.. ప్రభుత్వ ప్రకటనల్లో ముఖ్యమంత్రి ఫొటో ఉపయోగించవచ్చని, పార్టీ సైద్ధాంతిక నేతలు, మాజీ ముఖ్యమంత్రులు, జీవించి ఉన్న నేతల ఫొటోలు ఉపయోగించడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని పేర్కొన్నారు. అధికార పార్టీ పేరు, గుర్తు ఉపయోగించడం సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ ఉత్తర్వులకు విరుద్ధమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించనున్న, అమల్లో ఉన్న పథకాలపై ప్రకటనల్లో రాజకీయ నేతల పేరు, మాజీ ముఖ్యమంత్రుల ఫొటోలు ఉపయోగించకూడదన్నారు. అనంతరం విచారణ ఆగస్టు 13కు వాయిదా వేశారు.

# ఫ్రిజ్ శుభ్రంగా... మనం భద్రంగా!

**ఇంట్లో ఫ్రిజ్ ఉందా? దాన్ని సరిగా శుభ్రం చేస్తున్నారా? లేదంటే.. సూక్ష్మజీవులకు అది ఆవాసంగా మారుతుంది. వస్తువులు పాడవకుండా వాడేది కాస్తా.. మన ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది!**

- చాలా ఇళ్లలో రిఫ్రిజిరేటర్ చూడ్డానికి శుభ్రంగానే కనిపిస్తుంది. కానీ డోర్ తీస్తే మాత్రం అపరిశుభ్రత తాండవిస్తుంది.
- 'సైన్స్ డైరెక్ట్' నిర్వహించిన అధ్యయనంలో ఫ్రిజ్‌లో సరైన రీతిలో ఆహారాన్ని నిల్వ చేయకపోతే.. అతిసారం, పోషకాహార లోపాలు పెరిగే అవకాశం ఉందని తేలింది.
- 2022లో 'రీసెర్చ్‌గేట్'లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం ఆహారం 4 గంటల కంటే ఎక్కువ సమయం సరైన ఉష్ణోగ్రతలో ఉండకపోతే అది పాడవుతుంది.
- 'ఇండియన్ మెడికల్ అసోసియేషన్' ఆధ్వర్యంలో మన దేశంలోని ప్రధాన నగరాల్లో నిర్వహించిన సర్వేలో చాలామంది ఇళ్లలో ఫ్రిజ్ శుభ్రతకు అంతగా ప్రాధాన్యత ఇవ్వట్లేదని వెల్లడైంది.

**ఈ లోపాలే శాపాలు...**

- ఫ్రిజ్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోవడం వల్ల బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లు పెరుగుతాయి.




- పరాన్నజీవులు ఆహారాన్ని కలుషితం చేసి గ్యాస్ట్రో ఎంటరైటిస్, లివర్ ఇన్ఫెక్షన్లు, బరువు తగ్గడం వంటి సమస్యలను కలిగిస్తాయి.
- సరిగ్గా నిల్వ చేయని ఆహారంలో ఫంగస్ వల్ల ఉత్పత్తయ్యే మైకోటాక్సిన్ రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది.
- రిఫ్రిజిరేటర్ లోపల అపరిశుభ్ర వాతావరణంలో 'లిస్టిరియా మోనోసైటోజీన్స్' బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది గర్భిణులు, నవజాత శిశువులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై దుష్ప్రభావం చూపుతుంది.
- కొన్ని సందర్భాల్లో మెనింజైటిస్, సెప్సిస్ వంటి ప్రమాదకరమైన జబ్బులు కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది.
- వండిన ఆహారాన్ని మూతలు పెట్టకుండా నిల్వ చేయడం వల్ల బ్యాక్టీరియా ఒక ఆహార పదార్థం నుంచి మరో దానికి సంక్రమిస్తుంది.

–డా. ఎంవీ రావు, సీనియర్ జనరల్ ఫిజీషియన్

**శుభ్రం చేసేటప్పుడు...**

- ఫ్రిజ్‌ను శుభ్రం చేయడానికి ముందు.. అందులో నుంచి అన్ని ఆహార పదార్థాలను తొలగించండి.
- ఫ్రిజ్‌ను విద్యుత్ సరఫరా నుంచి డిస్‌కనెక్ట్ చేయండి.
- ఫ్రిజ్ డోర్‌పై ఉన్న రబ్బరు సీల్స్‌ను వెచ్చని నీటితో, సబ్బుతో శుభ్రం చేయండి. ఒక పాత టూత్‌బ్రష్‌ను ఉపయోగించి సీల్స్‌లోని చిన్న గాడులను శుభ్రం చేయొచ్చు.
- ఫ్రిజ్ లోపల దుర్గంధాన్ని తొలగించడానికి.. ఒక ఓపెన్ బాక్స్ బేకింగ్ సోడాను ఉంచండి. దీనిని మూడు నెలలకు ఒకసారి మార్చాలి.
- ఇప్పుడొస్తున్న ఫ్రిజ్‌లలో టెంపరేచర్ ఎంత ఉందనేది కూడా చూపిస్తుంది. దీన్ని చూస్తూ నియంత్రణలో ఉంచుకోవచ్చు.




- ప్రతి రెండు వారాలకు ఒకసారి ఫ్రిజ్‌ను శుభ్రం చేయాలని, డీఫ్రాస్ట్ చేయాలని 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' సిఫార్సు చేస్తోంది. వర్షాకాలంలో ఇది చాలా ముఖ్యం.
- శుభ్రమైన ఫ్రిజ్‌తో ఆహార వృథాను, కరెంట్ వాడకాన్ని తగ్గించవచ్చు. కలుషిత ఆహార బాధలను నివారించొచ్చు.
- పచ్చి మాంసం, కూరగాయలు, వండిన ఆహారాన్ని గట్టి కవర్లలో, వేర్వేరు ఎయిర్‌టైట్ కంటైనర్లలో నిల్వ చేయాలి. మాంసం, సీఫుడ్‌ను ఫ్రీజర్‌లో ఉంచండి.
- తేమ అధికంగా ఉండే వర్షాకాలంలో.. ఫ్రిజ్‌లో ఫంగస్, బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశం ఉంది. రెగ్యులర్ డీఫ్రాస్టింగ్, శుభ్రత దీనిని నివారిస్తుంది.
- పచ్చళ్లు, కూరలను ఎయిర్‌టైట్ కంటెయినర్లలో నిల్వ చేయండి. తద్వారా ఫ్రిజ్‌లో వాసనలు వ్యాపించవు.
- డ్రై ఫ్రూట్స్, చనా దాల్, కొబ్బరి వంటి వాటిని ఫ్రిజ్‌లో నిల్వ చేసేటప్పుడు ఎయిర్‌టైట్ బ్యాగ్‌లను వాడాలి.
- ఆహారాలు నిల్వ ఉంచిన గిన్నెలపై కచ్చితంగా మూతలు పెట్టాలి.
- ఆహారాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేసి, కాలం చెల్లిన ఆహారాన్ని బయట పడేయాలి.
- ఫ్రిజ్‌లో పెట్టే ముందు కూరగాయలు, మాంసం, పాల ఉత్పత్తులను శుభ్రంగా కడగాలి.
- సెలవుల్లో లేదా ఎక్కువ కాలం ఫ్రిజ్ ఉపయోగించనప్పుడు.. దాన్ని ఆపివేయండి లేదా హాలిడే మోడ్‌ను ఉపయోగించండి.
- ఆహార అవశేషాలు, ధూళి, ఫంగస్‌లను తొలగించడానికి వెనిగర్ లేదా బేకింగ్ సోడా ఉపయోగించి షెల్ఫ్‌లు, డ్రాయర్లను కడగాలి.

- ఈనాడు, హైదరాబాద్

# ప్రజ్వల్ రేవణ్ణ దోషి

**పనిమనిషిపై అత్యాచారం కేసులో బెంగళూరు న్యాయస్థానం తీర్పు • నేడు శిక్ష ఖరారు**

**బెంగళూరు:** ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు నమోదైన కేసులో హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం దోషిగా శుక్రవారం ప్రకటించింది. ఇప్పటికే విచారణను పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే ఈ మేరకు తీర్పు వెలువరించారు. శనివారం శిక్ష ప్రకటించనున్నట్లు తెలిపారు. తీర్పు ప్రకటించిన వెంటనే ప్రజ్వల్ కన్నీరు మున్నీరుగా విలపించారు. న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన అనంతరమూ వెక్కివెక్కి ఏడ్చారు. కోర్టు నుంచి ఆయనను పోలీసులు పరప్పన అగ్రహార కారాగారానికి తరలించారు. 14 నెలలుగా ప్రజ్వల్ కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్నారు. కేఆర్ నగరకు చెందిన మహిళ 2024 ఏప్రిల్ 28న హొళెనరసీపుర ఠాణాలో అత్యాచారం కేసు నమోదు చేసింది. గన్నిగడ ఫాంహౌస్‌లో తనపై అత్యాచారం జరిగిందని బాధితురాలు (47) తన ఫిర్యాదులో వాపోయింది. అనంతరం మరికొన్ని అత్యాచార కేసులు ప్రజ్వల్‌పై నమోదయ్యాయి.

**మొబైల్ ఫోన్‌లో 2,000 వీడియోలు..** ప్రజ్వల్ మొబైల్ ఫోన్‌లో 2,000కుపైగా వీడియోలు ఉన్నాయని దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఆ వీడియోలన్నింటినీ ప్రజ్వల్ స్వయంగా రికార్డు చేసుకున్నట్లు కూడా దర్యాప్తులో తేలింది. గత లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే అత్యాచార ఘటనలు బయటపడ్డాయి. ఫలితాలు వచ్చేసరికి ప్రజ్వల్ విదేశాలకు వెళ్లిపోగా.. కుటుంబ సభ్యుల హెచ్చరికతో చివరకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. అత్యాచార బాధితురాలిని అపహరించిన ఆరోపణలపై ప్రజ్వల్ తల్లి భవాని, పనిమనిషిని లైంగికంగా వేధించిన ఆరోపణలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే రేవణ్ణలపైనా కేసులు నమోదయ్యాయి.

## ఇసుక అక్రమ రవాణాపై ఎమ్మెల్యే కొలికపూడి ఆగ్రహం



చరవాణిలో ఏసీపీని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే

**తిరువూరు :** ఏపీ నుంచి తెలంగాణకు తిరువూరు మండలం మీదుగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకోవడంలేదని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మండిపడ్డారు. గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాను గుర్తించేందుకు సీసీ కెమెరాలను కూడా ఉద్దేశపూర్వకంగానే ప్రాధాన్యంలేని ప్రాంతాల్లో ఏర్పాటు చేశారని ఆగ్రహించారు. కృష్ణానది ఇసుకను మండలంలోని పెద్దవరం గ్రామం మీదుగా తెలంగాణకు అక్రమంగా రాత్రివేళ తరలిస్తున్నారని.. అధికార పార్టీ నాయకులమని చెప్పుకుంటున్న ఇద్దరు ఇందులో కీలకంగా ఉన్నారని ఎమ్మెల్యే వివరించారు. పెద్దవరం గ్రామస్థుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లి ఇసుక నిల్వలను పరిశీలించారు. గ్రామానికి చెందిన ఒకరిద్దరి పేరుతో పదుల సంఖ్యలో ఇసుక లారీలు తీసుకువస్తున్నారని, గ్రామంలోని ఓ చోట నిల్వ చేసి రాత్రి వేళ అక్రమంగా సరిహద్దు దాటించి భారీగా అక్రమార్జన చేస్తున్నారని ఆయన విచారణలో తేలిందన్నారు. అనంతరం మైలవరం ఏసీపీ ప్రసాదరావుతో ఆయన చరవాణిలో మాట్లాడారు. గ్రామంలో ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు సీసీ కెమెరాలు సరిహద్దు ప్రదేశంలో ఎందుకు అమర్చలేదని ప్రశ్నించారు. ఇటీవల తిరువూరులో ఘర్షణలకు పాల్పడిన గంజాయి బ్యాచ్ ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# ఆన్‌లైన్‌లో ఆస్తి పన్ను వివరాలు

**పంచాయతీల్లో నగదు రహిత వసూళ్లు**

**ఈనాడు, అమరావతి:** గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను వివరాలు ఆన్‌లైన్ చేసే ప్రక్రియ పూర్తయింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రజలకు ఆన్‌లైన్‌లోనే డిమాండ్ నోటీసులు జారీ చేయనున్నారు. పన్ను వసూళ్లు నగదురహితంగా చేపట్టనున్నారు. ఆన్‌లైన్, వాట్సప్ ద్వారా వసూళ్లకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. పన్ను విధింపు నుంచి వసూళ్ల వరకు పూర్తి పారదర్శకత కోసం ప్రభుత్వం గత ఏడాదిగా చేస్తున్న ప్రయత్నం కొలిక్కి వచ్చింది. పంచాయతీ రికార్డుల్లో ఉన్న 87 లక్షల ఇళ్లు, భవనాలు, దుకాణాల వివరాలు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. వీటి పునఃపరిశీలన ప్రక్రియ కూడా ఇటీవలే పూర్తయింది. వీటి ద్వారా ప్రజలకు నోటీసులిచ్చి ఆస్తి పన్ను వసూలు చేయనున్నారు. గత ఏడాది (2024-25) రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో పాత బకాయిలతో కలిపి రూ.650 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.750 కోట్లకుపైగా వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లు వైకాపా ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ప్రభుత్వ పర్యవేక్షణ లోపించడంతో ప్రజల నుంచి ఎంత వసూలు చేశారో, పంచాయతీ బ్యాంకు ఖాతాలో ఎంత జమ చేశారో కూడా కార్యాలయాల్లో సరైన లెక్కల్లేవు. చాలామంది కార్యదర్శులు పన్ను మొత్తాన్ని జేబుల్లో వేసుకుని సొంత అవసరాలకు వాడుకున్నారన్న ఫిర్యాదులూ వచ్చాయి. కొన్నిచోట్ల సర్పంచులు వీరికి సహకరించారు. పంచాయతీల ఆదాయ వనరుల్లో అత్యంత కీలకమైన ఆస్తి పన్ను వసూళ్లలో అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టాలని కూటమి ప్రభుత్వం ఏడాదిగా పలు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే స్వర్ణ పంచాయతీ పేరుతో పోర్టల్ ప్రారంభించింది. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఐటీ విభాగం ద్వారా ఇళ్లు, భవనాలు, ఇతర ఆస్తుల వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించారు.

EENADU Vol: 51, Issue: 354 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao


శ్రావణ సంబరం
శ్రావణంలో కూడా
ఆషాఢం తగ్గింపు ధరలు
శ్రావణం KG సేల్
కేజీ చీరల ప్రారంభ ధర
కేవలం ₹150 మాత్రమే
కుటుంబమంతటికీ కమనీయ వస్త్రాలు
SHUBHA VIVAHA COLLECTIONS
SILK SAREE COLLECTIONS
Samudrika Pattu
vastrakala pattu
Saatvika Pattu
Parinaya Pattu
Sampradaya Pattu
GROOM'S COLLECTIONS
Manyavar UVAAM VERSO TATTVA LINEN VOGUE ARVIND
GIZA HOUSE VIBRANT J.HAMPSTEAD Raymond LINEN CLUB OCM DIGJAM
ది చెన్నయ్ షాపింగ్ మాల్
ఎం.జి. రోడ్, విజయవాడ
For More Details: 1800 309 9989


LIFETIME MAINTENANCE
శ్రావణ వైభవం
CMR JEWELLERY
For your golden moments !
అద్భుతమైన శ్రావణానికి అద్వితీయమైన ఆఫర్లు
అన్ని రకాల 22KT(916) హాల్‌మార్క్ బంగారు ఆభరణాలపై
UP TO 50%* V.A. తగ్గింపు
అన్ని రకాల సిల్వర్ వస్తువులపై కేజీకి
₹7500/-* తగ్గింపు
ఈ ఆఫర్ ఆగష్టు 15 వరకు మాత్రమే!
*T&C apply
3% నుండి
సిల్వర్ రెగ్యులర్ ఆర్టికల్స్‌పై తరుగు మజూరీ లేదు
STORES ACROSS ANDHRA PRADESH & TELANGANA
#YourFamilyJeweller
+91 63097 98686
ఎం.జి. రోడ్, విజయవాడ 9133387115

# కిం కర్తవ్యం?

**అమెరికా మోతపై దేశాల మల్లగుల్లాలు • భారత్ నుంచి వెళ్లే సగం వస్తువులపై భారం**

వాషింగ్టన్: వాణిజ్యంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న వడ్డనల నుంచి తమ పరిశ్రమలను కాపాడుకునేందుకు ఏం చేయాలనే విషయంలో ప్రపంచదేశాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు కళ్లెం వేయడంలో సహకరించనందుకు కెనడా సరకులకు 35% టారిఫ్ శుక్రవారం నుంచే పడుతుందని, మెక్సికోతో 90 రోజుల్లోగా చర్చలు జరుపుతామని ట్రంప్ ప్రకటించారు. స్విట్జర్లాండ్‌పై 39% సుంకాలు వేయడం ఎంతో ఆశ్చర్యంతో పాటు నిరుత్సాహాన్ని కలిగిస్తోందని ఆ దేశ వాచీల పరిశ్రమ సమాఖ్య పేర్కొంది. వేల యూరోలు ఖరీదుచేసే విలాసవంతమైన వాచీలను స్విట్జర్లాండ్ తయారుచేసి అమెరికాకు పంపిస్తోంది. అగ్రరాజ్య నిర్ణయం వీటిపై ప్రభావం చూపనుంది. అమెరికా నుంచి తమకు వచ్చే ఉత్పత్తులపై ఇంతవరకు ఉన్న 10% వాణిజ్య రుసుముల్ని ఎత్తివేయాలని కొసావో నిర్ణయించింది. అమెరికాలో తమ వస్తువులను కొనుగోలు చేసేవారిపైనే తాజా భారాన్ని వేయాలని నార్వేలోని ఫర్నీచర్ కంపెనీలు నిర్ణయించాయి. తమ కంపెనీలకు ఏ రూపంలో మద్దతు అందించాలనే విషయంలో దక్షిణాఫ్రికా పలు ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తోంది. థాయ్‌లాండ్, మలేసియా, వియత్నాం, కంబోడియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు తమకు సుంకాలు తగ్గినందుకు హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

## సుంకాలతో అమెరికా కుటుంబాలపై ఏటా రూ.2 లక్షల భారం

• ఎస్‌బీఐ నివేదిక వెల్లడి

ఇంటర్నెట్ డెస్క్: భారత్ సహా ప్రపంచ దేశాలపై అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న భారీ సుంకాలు అమెరికా ప్రజలపైనే గణనీయంగా ప్రభావం చూపుతాయని తాజా నివేదిక వెల్లడించింది. కొత్త సుంకాలతో ద్రవ్యోల్బణం పెరగడం వల్ల కుటుంబాల వార్షిక సగటు ఖర్చు 2,400 డాలర్ల (రూ.2లక్షలు) మేర పెరగనున్నట్లు ఎస్‌బీఐ నివేదిక అంచనా వేసింది. సుంకాల ప్రభావంతో ఆర్థిక భారం అనేది ఆయా ఆదాయ వర్గాలపై భిన్నంగా ఉంటుందని వెల్లడించింది. అల్ప ఆదాయ కుటుంబాలపై 1300 డాలర్ల భారం పడనుండగా.. అధిక ఆదాయ కుటుంబాలు 5 వేల డాలర్లు అదనంగా ఖర్చు చేయాల్సిరావొచ్చని అంచనా వేసింది. స్వల్ప కాలంలో సగటున 2400 డాలర్లు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ దీర్ఘకాలంలో ఈ ప్రభావం తక్కువగానే ఉండవచ్చని తెలిపింది. ఈ వాణిజ్య వివాదంతో భారత్ కన్నా అమెరికా ఆర్థిక వ్యవస్థకే ఎక్కువ నష్టం కలిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేసింది. సుంకాల కారణంగా ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ తదితర రంగాల్లో దిగుమతి వస్తువుల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉండటంతో.. ఇప్పటికే పెరుగుతోన్న ద్రవ్యోల్బణంపై ఇవి మరింత ప్రభావం చూపనున్నట్లు పేర్కొంది. ఖర్చులు పెరగడం, డిమాండు తగ్గడం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని, తద్వారా అమెరికా జీడీపీ వృద్ధి 40 నుంచి 50 బేసిస్ పాయింట్లు తగ్గే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. సుంకాల పెరుగుదలతో ఇరు దేశాలు సవాళ్లను ఎదుర్కొంటాయని ఎస్‌బీఐ తన నివేదికలో పేర్కొంది. అయినప్పటికీ డాలర్ క్షీణించడం, ద్రవ్యోల్బణం పెరగడం, కనిష్ఠ జీడీపీ వృద్ధి అంచనాలతో భారత్ కంటే అమెరికాను ఇవి మరింత బలహీన స్థితిలోకి నెట్టేస్తాయని, భారత్ మాత్రం అంతర్జాతీయ ఒడుదొడుకులను ఎదుర్కొనే సన్నద్ధతతోనే ఉందని అభిప్రాయపడింది.

## ఇంధన కొనుగోళ్లలో దేశ ప్రయోజనాలే ముఖ్యం: భారత్

• అమెరికాతో బంధం కొనసాగుతుందని స్పష్టీకరణ



రణధీర్ జైస్వాల్

ఇంటర్నెట్ డెస్క్: భారత్‌పై 25 శాతం సుంకాలు విధించడంతో పాటు రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో మన దేశం ఆచితూచి స్పందించింది. ఇరు దేశాల భాగస్వామ్యం అనేక మార్పులు, సవాళ్లను విజయవంతంగా అధిగమించిందని తెలిపింది. ఈ భాగస్వామ్యం మరింత బలంగా కొనసాగుతుందని విశ్వసిస్తున్నట్లు పేర్కొంది. అయితే, రష్యాతో సంబంధాలకు కట్టుబడి ఉన్నామని, ఆ దేశంతో తమది స్థిరమైన, కాల పరీక్షలో నెగ్గిన భాగస్వామ్యం అని స్పష్టం చేసింది. తాజా పరిణామాలపై భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఏ దేశంతోనూ భారత్‌కు ఉన్న సంబంధాలను మూడో దేశం కోణంలో చూడవద్దని పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలుకు కట్టుబడి ఉన్నామని, అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా తమ నిర్ణయాలు ఉంటాయన్నారు. దేశ ఇంధన ప్రయోజనాలను కాపాడుకోవడంలో భాగంగా అంతర్జాతీయ మార్కెట్లో అత్యుత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. అమెరికాతో భారత్ రక్షణ సంబంధాలపై స్పందిస్తూ.. ఇరు దేశాలు బలమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇవి బలోపేతమయ్యాయన్న ఆయన.. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

**రష్యా చమురు కొనుగోళ్ల నిలుపుదల వాస్తవం కాదు**

ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పలు దేశీయ ఇంధన సంస్థలు నిలిపివేశాయంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ సీనియర్ అధికారి చెప్పారు. ఇప్పటివరకు అలాంటి ఆదేశాలేమీ ప్రభుత్వం జారీ చేయలేదని ఆయన వెల్లడించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. భారత్‌కు చెందిన ప్రభుత్వ రంగ చమురు సంస్థలు గత వారం రోజులుగా మాస్కో నుంచి ముడిచమురు కొనుగోలు చేయడం లేదంటూ వార్తలు వచ్చాయి. రిఫైనరీ సంస్థలకు చెందిన విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం ప్రచురించింది. అయితే, దీనిపై ఆయా సంస్థల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

## మరి మీరు రష్యాతో వ్యాపారం చేయొచ్చా?

• అమెరికాను ప్రశ్నించిన చైనా

ఇంటర్నెట్‌డెస్క్: రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే దేశాలపై భారీగా సుంకాలు విధిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే హెచ్చరికలు చేస్తుండటంపై చైనా స్పందించింది. వాస్తవానికి రష్యాతో అమెరికానే వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తోందని ఐక్యరాజ్యసమితిలోని బీజింగ్ డిప్యూటీ శాశ్వత ప్రతినిధి గెంగ్ షువాంగ్ పేర్కొన్నారు. అమెరికా హెచ్చరికలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐరాస భద్రతా మండలిలో ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరాల అంశంపై చర్చ సమయంలో అమెరికా ప్రతినిధి చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఇప్పటికే అనేక సందర్భాల్లో చెప్పినట్లే.. తమ దేశం రష్యాకు ఎలాంటి ఆయుధాలను అందించలేదని స్పష్టం చేశారు. రష్యాతో పాటు ఉక్రెయిన్‌తో కూడా సాధారణ వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నామన్నారు. అవి అంతర్జాతీయ చట్టాలకు లోబడే ఉన్నాయని, ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదన్నారు. వాస్తవానికి అమెరికానే ఇప్పటివరకు రష్యాతో వాణిజ్యం కొనసాగించిందని విమర్శించారు. ఇతరులు వాణిజ్య సంబంధాలు కొనసాగించకూడదు కానీ.. మీరు చేయొచ్చా అని ఈసందర్భంగా ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో సంక్షోభం కీలక దశలో ఉందని, దాని పరిష్కారానికి ఇది సరైన సమయమని అభిప్రాయపడ్డారు. ఇతరులపై నిందలు వేసి బలిపశువులను చేయడం మాని.. కాల్పుల విరమణ, కీవ్‌లో శాంతి నెలకొల్పడం అనే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు.



చైనా రాజధాని బీజింగ్‌లో ప్రారంభమైన వరల్డ్ హ్యూమనాయిడ్ రోబో గేమ్స్ సాకర్ పోటీల్లో భాగంగా శుక్రవారం సాధన చేస్తున్న రోబోలు

## శరణార్థులకు అమెరికా కోర్టు అండ

శాన్ ఫ్రాన్సిస్కో: నేపాల్, హోండురస్, నికరాగువా వంటి ఆసియా, మధ్య అమెరికా దేశాల నుంచి అమెరికాకు వచ్చి తాత్కాలిక రక్షిత హోదా పొందిన 60,000 మందిని వెళ్లగొట్టాలని డొనాల్డ్ ట్రంప్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని జిల్లా జడ్జి ట్రైనా ఎల్ థామ్సన్ గురువారం అడ్డుకున్నారు. ప్రకృతి ఉత్పాతాలు, రాజకీయ కల్లోలం వల్ల అమెరికాకు వలసవచ్చిన వారికి తాత్కాలిక రక్షణ హోదా ఇస్తున్నామనీ, ఇప్పుడు వారి స్వదేశాల్లో పరిస్థితులు మెరుగుపడినందున వెంటనే తిప్పిపంపేస్తామని అమెరికా హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ మంత్రి క్రిస్టీ నోమ్ ప్రకటించారు. నేపాల్ నుంచి వచ్చిన 7,000 మందికి తాత్కాలిక రక్షణ హోదా ఆగస్టు 5న ముగిసిపోనున్నది. రాజకీయ అణచివేత వల్ల 25 ఏళ్ల క్రితం అమెరికాకు వలసవచ్చిన 51,000 మంది హోండురాస్ వారు, 3000 మంది నికరాగువా వారికీ సెప్టెంబరు 8న గడువు తీరిపోతుంది. వీరికి జిల్లా జడ్జి థామ్సన్ కొత్త గడువు నిర్దేశించలేదు కానీ, విచారణను నవంబరు 18కి వాయిదా వేశారు. కేసు తేలే వరకు తాత్కాలిక రక్షణ హోదా కొనసాగుతుందన్నారు. హోండురాస్‌లో రాజకీయ హింస, నికరాగువాలో తుపానుల నష్టం ఇంకా కొనసాగుతున్నా, వారిని వెనక్కు పంపేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. తాత్కాలిక రక్షణ హోదా తొలగిస్తే, శరణార్థులు ఉపాధి, ఆరోగ్య బీమా కోల్పోతారనీ, కుటుంబాలకు దూరమవుతారనీ ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. శరణార్థులు ఎక్కువైతే తెల్లజాతివారు మైనారిటీ అయిపోతారనే భయాలను ట్రంప్, నోమ్‌లు వ్యాపింపజేయడం అభ్యంతరకరమన్నారు. శరణార్థులు రెండు నెలల్లో అమెరికా విడిచివెళ్లాలని ఆదేశించడం దారుణమని వారి తరఫు న్యాయవాది అహిలన్ అరుళానందం వ్యాఖ్యానించారు.

## ఇది దిల్లీ పోలీసుల నిర్లక్ష్యమే

• రష్యా మహిళ చిన్నారిని తీసుకెళ్లిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆగ్రహం

దిల్లీ: బిడ్డ సంరక్షణపై భారత్‌కు చెందిన భర్త, రష్యాకు చెందిన భార్య మధ్య కొనసాగుతున్న న్యాయపోరాటంలో దిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరును సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. చిన్నారిని తీసుకుని ఆ మహిళ మన దేశం నుంచి వెళ్లిపోవడంపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి ధర్మాసనం శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఇది దిల్లీ పోలీసుల నిర్లక్ష్యం, వైఫల్యమే'నంటూ మండిపడింది. కుట్రపూరితంగా వ్యవహరించారేమోనన్న అనుమానాన్నీ వ్యక్తం చేసింది. బిడ్డను తీసుకొని దేశం దాటిన రష్యా మహిళను గుర్తించేందుకు ఇంటర్‌పోల్ సహాయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 'ఆ జంట వైవాహిక బంధంలో విభేదాలున్నాయి. బిడ్డ కస్టడీకి సంబంధించిన కేసులు మా వద్ద విచారణలో ఉన్నాయి. చిన్నారి సంరక్షణను ఎవరికి అప్పగించాలన్నది తేల్చక ముందే సుప్రీంకోర్టు కస్టడీ నుంచి ఆ బిడ్డను లాగేసుకుపోయారు' అంటూ ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఇందుకు బాధ్యులైన పోలీసు అధికారులను చట్టం ముందు జవాబుదారీ చేస్తామని హెచ్చరించింది. భర్త ఫిర్యాదుపై వెంటనే స్పందించి ఉంటే.. ఆ మహిళ అంత సులువుగా దేశం దాటి వెళ్లగలిగేవారు కాదని పేర్కొంది. ఆమె జాడ గుర్తించేందుకు రష్యాలోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని, ఇప్పటికే లుకౌట్ నోటీసులు ఇచ్చినందున ఇక మీదట ఇంటర్‌పోల్ సహాయం తీసుకోవాలని విదేశీవ్యవహారాల శాఖను ఆదేశించింది.

ఆమె సరిహద్దు దాటి నేపాల్‌లోకి ప్రవేశించి, అక్కడి నుంచి షార్జా మీదుగా రష్యా వెళ్లినట్లుగా భావిస్తున్నామని గత విచారణ సమయంలో కేంద్రం వెల్లడించింది. "ఆమె పాస్‌పోర్టు జప్తు అయింది. డూప్లికేట్ పాస్‌పోర్టును ఎలా సంపాదించారు. రష్యా రాయబార కార్యాలయం అధికారుల సహాయం లేకుండా ఇది అసాధ్యం" అని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

## నీట్-యూజీ 2025 ప్రశ్నపత్రంలో తప్పులపై పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

దిల్లీ: వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-యూజీ 2025 లోని ప్రశ్నపత్రంలో తీవ్రమైన తప్పులున్నాయంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. మూడు ప్రశ్నల్లోని తప్పుల వల్ల 13 మార్కుల వ్యత్యాసం వస్తోందని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యాజ్యం శుక్రవారం జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదికి ధర్మాసనం సూచించింది.

## దిల్లీ హైకోర్టుకే ఎందుకు... సుప్రీంకోర్టుకు దరఖాస్తు చేయండి

• సీనియర్ న్యాయవాది హోదా కోరుతూ పిటిషన్ వేసిన మాజీ జడ్జికి ధర్మాసనం సూచన

దిల్లీ: ఇతర రాష్ట్రాల్లో జడ్జీలుగా పదవీ విరమణ చేసిన వ్యక్తులు దిల్లీ హైకోర్టులో సీనియర్ న్యాయవాది హోదా కోసం దరఖాస్తు చేసుకోరాదన్న నిబంధన(9బి)ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్నత స్థాయి న్యాయ సేవలు అందించి పదవీ విరమణ చేసిన విజయ్ ప్రతాప్ సింగ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. 'సీనియర్ న్యాయవాది హోదా కోసం దిల్లీ హైకోర్టుకే ఎందుకు..... సుప్రీంకోర్టులో దరఖాస్తు చేసుకోవచ్చు కదా. సుప్రీంకోర్టులో ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్ ధర్మాసనం సూచించింది.

## శశి థరూర్‌పై పరువు నష్టం కేసులో ట్రయల్ కోర్టు విచారణపై స్టే పొడిగింపు

దిల్లీ: 'శివలింగంపై వృశ్చికం' అంటూ ప్రధాని మోదీ లక్ష్యంగా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌పై దాఖలైన పరువు నష్టం కేసులో ట్రయల్ కోర్టు విచారణపై నిలుపుదల ఉత్తర్వుల(స్టే)ను సర్వోన్నత న్యాయస్థానం పొడిగించింది. జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను సెప్టెంబరు 15వ తేదీకి వాయిదా వేసింది. రెగ్యులర్ కేసుల విచారణ జరిగే (మంగళ, బుధ, గురువారాల్లో) ఏదైనా ఒక రోజున విచారణ జరిగేలా చూడాలన్న ఫిర్యాదుదారు, భాజపా నాయకుడు రాజీవ్ బబ్బర్‌పై ధర్మాసనం మండిపడింది.

## పోష్ చట్టాన్ని రాజకీయ పార్టీలకూ వర్తింపజేయాలన్న పిటిషన్ తిరస్కరణ

దిల్లీ: కార్యాలయాల్లో, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే లక్ష్యంతో తీసుకొచ్చిన పోష్ చట్టం-2013 పరిధిలోకి ప్రధాన రాజకీయ పార్టీలనూ తీసుకురావాలన్న పిటిషన్‌ను విచారణకు చేపట్టేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇది పార్లమెంటు పరిధిలోని అంశమని, జోక్యం చేసుకోలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్ ధర్మాసనం పేర్కొంది. మహిళా పార్లమెంటేరియన్లను కలిసి ప్రైవేటు బిల్లు చట్టసభల ముందుకెళ్లేలా ప్రయత్నించండని పిటిషనర్‌కు సూచించింది. హైకోర్టును ఆశ్రయించేందుకు వీలుగా పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించింది.



జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో అమర్‌నాథ్ గుహలకు వెళ్తున్న ఓ మహిళకు సహకరిస్తున్న మౌంటెన్ రెస్క్యూ టీం సభ్యుడు

## భారీ వర్షాలు.. రేపటివరకు అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత

దిల్లీ: భారీ వర్షాల కారణంగా ఆదివారం వరకు అమర్‌నాథ్ యాత్రను నిలిపివేస్తున్నట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పహల్గాం మార్గాన్ని ఇప్పటికే మూసివేసిన అధికారులు శుక్రవారం ఉదయం బల్తాల్ గుండా భక్తులను అనుమతించారు. అయితే వర్షాలు భారీగా కురియడంతో పరిస్థితిని సమీక్షించి బల్తాల్ తోవనూ మూసివేయాలని నిర్ణయించారు. జమ్మూ బేస్ క్యాంప్ భగవతీ నగర్ నుంచి రెండో రోజూ భక్తులను అనుమతించలేదు.

## ఆక్రమిత కశ్మీర్ నుంచి వెళ్లిపోవాలని పాక్‌కు చెబుతూనే ఉన్నాం

• లోక్‌సభకు తెలిపిన విదేశీవ్యవహారాల శాఖ

దిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్మూ కశ్మీర్, లద్దాఖ్‌లలోని కొన్ని ప్రాంతాల్లో పాకిస్థాన్ అక్రమంగా తిష్ఠవేసిందని భారత విదేశీవ్యవహారాల శాఖ తెలిపింది. అన్ని ఆక్రమిత ప్రాంతాల నుంచి వెళ్లిపోవాలని ఇస్లామాబాద్‌కు నిరంతరంగా చెబుతూనే ఉన్నామని లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో విదేశీవ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతాలన్నీ భారతదేశంలో భాగమేనని, కేంద్రప్రభుత్వ అధికారిక మ్యాపులలోనూ ఈ ప్రాంతాలను విస్పష్టంగా చేర్చినట్లు మంత్రి చెప్పారు.


### 'తలపై పెద్ద బరువున్న వ్యక్తి పడిపోవడంతోనే న్యూదిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట'

ఈ ఏడాది ఫిబ్రవరి 15న తలపై పెద్ద బరువు మోస్తున్న వ్యక్తి కిందపడిపోవడంతోనే న్యూదిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగిందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం రాజ్యసభకు తెలిపారు. ఆ తొక్కిసలాటలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. 15 మంది గాయపడ్డారు. ఉన్నతస్థాయి కమిటీ దర్యాప్తులో తేలిన విషయాలను ఓ లేఖ ద్వారా మంత్రి వెల్లడించారు. ఆ సమయంలో రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని, రాత్రి 8.15 తర్వాత బాగా అధికమైందని పేర్కొన్నారు. చాలా మంది ప్రయాణికులు తలపై మూటలతోనే స్టేషన్‌కు వచ్చారని తెలిపారు.

### రైలు టికెట్లలో వృద్ధులకు రాయితీ ఇవ్వాలని స్థాయీ సంఘం సిఫార్సు

రైళ్లలో ప్రయాణించే వృద్ధులకు కనీసం స్లీపర్, థర్డ్ ఏసీ తరగతుల్లోనైనా రాయితీ ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని స్థాయీ సంఘం కోరిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభకు తెలిపారు. వృద్ధులకు రైలు టికెట్లపై రాయితీని పునరుద్ధరించాలని పలువురు ఎంపీలు కూడా సూచించారన్నారు. రైలు ప్రయాణం చౌకగా ఉన్నందున రాయితీలను పునరుద్ధరించడం లేదని వెల్లడించారు.

## సంస్కృతాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలి: భాగవత్



నాగ్‌పుర్: దేశభాషలన్నిటికీ మూలం సంస్కృతమని, ఈ భాషను సమాచార మాధ్యమంగా మార్చి ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు తీసుకోవాలని ఆరెస్సెస్ అధ్యక్షుడు మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. సంస్కృతం మన భావోద్వేగాలను వ్యక్తం చేసే భాషని, ఈ ప్రాచీన భాష గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పేర్కొన్నారు. కనుమరుగవుతోన్న సంస్కృతానికి ప్రచారం కల్పించి, సంరక్షించుకోవాలని ఆయన తెలిపారు. నాగ్‌పుర్‌లోని కవి కాళిదాసు విశ్వవిద్యాలయంలో నూతన భవనాన్ని ప్రారంభించిన ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "భాషను అర్థం చేసుకోవడానికి, మాట్లాడటానికి మధ్య చాలా వ్యత్యాసముంది. నేనూ ఈ ప్రాచీన భాషను నేర్చుకున్నాను, కానీ అనర్గళంగా మాట్లాడలేకపోతున్నాను. సంస్కృత విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం నుంచి ఆదరణ లభిస్తుంది. కానీ ఈ భాషకు ప్రజల నుంచి కూడా మద్దతు ఉండాలి. అది మరింత పెరగాలంటే ప్రజలు తమ దినచర్యలో భాషను ఉపయోగించాలి" అని ఆయన పేర్కొన్నారు.

## హిందువులపై ఉగ్ర ముద్ర వేయాలని కాంగ్రెస్ చూసింది: ఫడణవీస్

నాగ్‌పుర్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాలేగావ్ బాంబు పేలుళ్ల(2008) తర్వాత హిందువులను ఉగ్రవాదులుగా చిత్రీకరించేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఆరోపించారు. ఆరెస్సెస్‌లోని కొందరు నేతలను, హిందుత్వవాదులను లక్ష్యంగా చేసుకున్న ఆ పార్టీ ప్రణాళికా ప్రకారమే వారిపై ఉగ్రవాదులనే ముద్ర వేయాలని చూసిందని పేర్కొన్నారు. నాగ్‌పుర్‌లోని ఓ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. "అప్పటి యూపీఏ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడింది. ప్రపంచంలో ముస్లిం జనాభా ఉన్న ఏ ప్రాంతంలో బాంబు పేలుళ్లు జరిగినా దానికి హిందూ ఉగ్రవాదం, కాషాయ ఉగ్రవాదం లాంటి పదాలను సృష్టించింది. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు వెనక ఉన్న కుట్ర ఇప్పుడు అందరి ముందు బహిర్గతమైంది. దాడి జరిగిన సమయంలో ఇస్లామిక్ ఉగ్రవాదం ఉండేది, ఇప్పుడు కూడా ఉంది. కానీ అందరు ముస్లింలు ఉగ్రవాదులే అని ఎవరూ అనలేదు. అయితే అప్పుడు కాంగ్రెస్ హిందువులందరినీ ఉగ్రవాదులుగా చూపించే ప్రయత్నం చేసింది" అని ఫడణవీస్ అన్నారు. ఈ కేసు దర్యాప్తు సమయంలో ఆరెస్సెస్ ప్రముఖుడు మోహన్ భాగవత్‌ను ఇరికించడానికి కాంగ్రెస్ కుట్ర చేసిందని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ ఆరోపించారు. ఇది ఆరెస్సెస్‌ను, హిందూ మతాన్ని అపఖ్యాతిపాలు చేసేందుకు వేసిన పథకమని ఆయన వ్యాఖ్యానించారు.



## ఉనికికే ప్రమాదం పర్యావరణ అసమతౌల్యం

• అకస్మాత్తుగా రాష్ట్రమే అదృశ్యమైపోవచ్చు
• ఇప్పటికైనా జాగ్రత్త వహించండి
• హిమాచల్‌ప్రదేశ్‌ను హెచ్చరించిన సుప్రీంకోర్టు



దిల్లీ: ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, పర్యాటకాభివృద్ధి కోసం పర్యావరణ సమతుల్యతకు విఘాతం కలిగిస్తే తీవ్ర విపత్తులు ఎదురయ్యే ప్రమాదం ఉందని హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఏదో ఒక రోజు దేశ పటం నుంచి రాష్ట్రమే అకస్మాత్తుగా అదృశ్యం కావచ్చనే ఆందోళననూ వ్యక్తం చేసింది. ఆ విషమస్థితి రాకూడదని భగవంతుడిని కోరుకుంటున్నామని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం పేర్కొంది. హిమాచల్‌ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను 'హరిత ప్రాంతాలు'గా ప్రకటిస్తూ జారీ అయిన అధికారిక నోటిఫికేషన్‌ను సవాల్ చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీనిపై పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.... హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోబోమని జస్టిస్ జె.బి.పార్దీవాలా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. హరిత ప్రాంతాల్లో భవన నిర్మాణాలను అడ్డుకోవడానికి నోటిఫికేషన్ జారీ కావడం వెనుక స్పష్టమైన కారణాలున్నాయని తెలిపింది. ఇప్పటికే జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారుల విస్తరణ, పర్యాటకాభివృద్ధి కోసం, సొరంగ మార్గాల నిర్మాణం పేరుతో అడవులను విపరీతంగా కొట్టివేశారని తెలిపింది. రాబడి ఒక్కటే సర్వస్వం కాదంది. పర్యావరణాన్ని పణంగా పెట్టి ఆదాయం కోసం ప్రకృతిని ధ్వంసం చేస్తే పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ప్రకృతి రమణీయతతో అలరారే రాష్ట్రం ఇప్పటికే మానవుల స్వార్థం, ఉదాసీనత వల్ల ప్రమాదంలో పడిందని పేర్కొంది. కార్చిచ్చులు, అధిక ఉష్ణోగ్రతలు, ఆకస్మిక వరదల వంటి ముప్పులను ఎదుర్కొంటున్న విషయాన్నీ గుర్తుచేసింది. సరైన దిశలో ఇప్పటికైనా తగిన జాగ్రత్తలు చేపట్టాలంది. కేంద్ర ప్రభుత్వంపై కూడా బాధ్యత ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. తాము ప్రస్తావించిన అంశాలపై తీసుకోబోతున్న చర్యలను, కార్యాచరణ ప్రణాళికను వివరిస్తూ సమాధానం దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ప్రజాప్రయోజనాల రీత్యా రిట్ పిటిషన్‌ను నమోదు చేయాలని కోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది.

## దేశంలో 70% వృద్ధులకు ఆర్థిక భద్రత దూరం

• ఉద్యోగ విరమణ తర్వాతా పనిచేయాల్సిన పరిస్థితి
• తాజా అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: దేశంలోని వృద్ధుల్లో 70 శాతం మంది ఆర్థికంగా ఇతరులపై ఆధార పడుతున్నారని, చాలా మంది ఉద్యోగ విరమణ తర్వాతా పనిచేస్తున్నారని 'ఏజింగ్ ఇన్ ఇండియా: ఛాలెంజెస్ అండ్ ఆపర్చ్యునిటీస్' నివేదిక పేర్కొంది. నీతి ఆయోగ్, కేంద్ర సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వశాఖ, జాతీయ మానవ హక్కుల సంఘాలతో కలిసి సంకలా ఫౌండేషన్ ఈ నివేదికను రూపొందించింది. ఆయుర్దాయం పెరిగినప్పటికీ చాలా మంది వృద్ధులు ఆర్థిక, ఆరోగ్య అభద్రతతో జీవిస్తున్నట్లు నివేదిక స్పష్టంచేసింది. నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు..

✦ 6.4 శాతం మంది వృద్ధులు తమ భోజనం పరిమాణాన్ని తగ్గించుకోగా, 5.6 శాతం మంది ఏమీ తినకుండా విశ్రమిస్తున్నారు. 4.2 శాతం మంది వృద్ధులు గత ఏడాదిలో కనీసం ఒక రోజంతా ఆహారం తీసుకోకుండానే ఉన్నారు.

✦ ఒడిశాలో అత్యధికంగా 37.1 శాతం, ఉత్తర్‌ప్రదేశ్‌లో 36.6 శాతం వృద్ధులు తక్కువ బరువుతో ఉన్నారు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాద్రానగర్ హవేలీలో ఇది 40.1 శాతంగా ఉంది.

✦ పంజాబ్‌లోని వృద్ధుల్లో 28 శాతం మంది, చండీగఢ్‌లో 21.5 శాతం మంది స్థూలకాయంతో బాధపడుతున్నారు.

✦ 60 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసున్న వారిలో 35.6 శాతం గుండె సమస్యలతో, 32 శాతం మంది బీపీ, 13.2 శాతం మంది మధుమేహంతో సతమతమవుతున్నారు. గుండె జబ్బుల్లో గోవా (60%), కేరళ (57%) తొలి రెండు స్థానాల్లో ఉండగా, మధుమేహంలో కేరళ (35%), పుదుచ్చేరి (28%), దిల్లీ (26%) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

✦ ఎముకలు, కీళ్ల నొప్పులు కూడా వృద్ధులను అధికంగా పీడిస్తున్నాయి. మొత్తం వృద్ధుల్లో 19 శాతం మందికి ఈ సమస్యలు ఉన్నాయి. తెలంగాణలోని వృద్ధుల్లో 33 శాతం మంది, జమ్మూకశ్మీర్‌లో 22 శాతం మంది, దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లోని వృద్ధులు.. ఎముకలు, కీళ్ల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

✦ 30% మంది పెద్ద వయస్కులు నిరాశతో కుంగుబాటుకు గురవుతుండగా, 8 శాతం మందిలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. వృద్ధ మహిళలు, ముఖ్యంగా వితంతువులు ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. కుటుంబ వ్యవస్థ క్షీణిస్తుండడంతో ఈ సమస్య (ముఖ్యంగా మహిళల్లో) పెరుగుతోంది. 60 ఏళ్లు నిండిన మహిళల్లో 18.7 శాతం మంది, పురుషుల్లో 5.1 శాతం మంది ఏకాకి జీవితాన్ని గడుపుతున్నారు.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో గంగానదికి వరద ప్రవాహం పోటెత్తడంతో రాజాపుర్ ప్రాంతంలో నీట మునిగిన నివాస భవనాలు

## ఇండిగో విమానంలో సహ ప్రయాణికుడికి చెంపదెబ్బ




దాడి చేసిన వ్యక్తిని వారిస్తున్న విమాన సిబ్బంది

దిల్లీ: ముంబయి నుంచి కోల్‌కతాకు వెళుతున్న ఇండిగో విమానంలో శుక్రవారం ఓ ప్రయాణికుడు సహ ప్రయాణికుడిపై భౌతిక దాడికి దిగి చెంపదెబ్బ కొట్టాడు. దాడికి దిగిన వ్యక్తిని విమానం కోల్‌కతాలో దిగిన వెంటనే భద్రతా సిబ్బందికి అప్పగించారు. అతణ్ని నిబంధనలకు విరుద్ధంగా నడుచుకునే వ్యక్తిగా గుర్తించి, ప్రొటోకాల్ ప్రకారం అన్ని ఎయిర్‌లైన్ ఏజెన్సీలకు సమాచారం ఇచ్చినట్లు 'ఇండిగో' ఓ ప్రకటనలో తెలిపింది.

# ఈనాడు సినిమా

# 33 ఏళ్లకు తొలి జాతీయ పురస్కారం


షారుక్ ఖాన్

చిత్రపరిశ్రమలో కొందరు దర్శకులు తాము సిద్ధం చేసుకున్న కథకు, అందులోని పాత్రలకు సరిపోయే నటుల్ని ఎంపిక చేసుకుంటుంటారు. ఇంకొందరు కథానాయకులను దృష్టిలో ఉంచుకొనే పాత్రలను సృష్టిస్తుంటారు. ఇలా రెండు విధానాల్లోనూ ఒదిగిపోయే అద్భుతమైన నటుడు షారుక్ ఖాన్. 'చనిపోయే వరకూ సినిమాల్లోనే ఉంటా. ఏదైనా సినిమా సెట్‌లో యాక్షన్ చెప్పగానే నేను చనిపోవాలి. వాళ్లు కట్ చెప్పాక కూడా నేను పైకి లేవకూడదు. ఇదే నా కోరిక'.. అంటూ ఇటీవలే ఓ సందర్భంలో పంచుకున్నారు షారుక్. ఈ మాటలతో ఆయనకు సినిమాపై ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదే షారుక్‌ను ఎంతో మంది అభిమానులకు దగ్గర చేసి తిరుగులేని స్టార్‌ని చేసింది. ఈ ఏడాది ఉత్తమ నటుడిగా జాతీయ స్థాయిలో నిలబెట్టింది. అట్లీ దర్శకత్వం వహించిన 'జవాన్' సినిమాకు గానూ ఈ పురస్కారాన్ని దక్కించుకున్నారాయన. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో విభిన్నమైన గెటప్పుల్లో ఒదిగిపోయి.. పోరాట ఘట్టాల్లో అదరగొట్టారు షారుక్. 'దీవానా' సినిమాతో వెండితెరపై మెరిసిన ఆయన.. బాలీవుడ్ అగ్రహీరోల్లో ఒకరిగా నిలిచారు. 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే', 'స్వదేశ్', 'చక్‌దే! ఇండియా', 'మై నేమ్ ఈజ్ ఖాన్', 'బాజీగర్', 'దేవదాస్' లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి మెప్పించారు. ఎన్నో వైవిధ్యమైన పాత్రల్ని పోషించి తన నటనతో కట్టిపడేశారు షారుక్. కింగ్ ఖాన్ అంటూ అభిమానులు ప్రేమగా పిలుచుకునే ఈయన పద్మశ్రీతో సహా ఎన్నో పురస్కారాల్ని సొంతం చేసుకున్నారు. దాదాపు 100కి పైగా సినిమాల్లో నటించిన షారుక్ 33ఏళ్ల సినీ కెరీర్‌లో ఇదే తొలి జాతీయ పురస్కారం కావడం విశేషం.

# బుల్లితెర నుంచి ఉత్తమ నటుడిగా...


విక్రాంత్ మాస్సే

బలమైన కథ ఉంటే సరిపోదు దాన్ని భుజాన వేసుకొని నడిపించే బలమైన నటుడు ఉంటేనే ఆ సినిమాకి విజయం వరిస్తుంది. ఇప్పుడీ కోవలోనే.. తన నటనతో 'ట్వెల్త్ ఫెయిల్' సినిమా విజయంలో కీలకంగా నిలిచి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు విక్రాంత్ మాస్సే. ఇప్పుడీ నటనే విక్రాంత్‌ని ఉత్తమ నటుడిగా జాతీయ స్థాయిలో నిలబెట్టింది. తాజాగా శుక్రవారం ప్రకటించిన 71వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఈ అవార్డును సొంతం చేసుకున్నారీయన. ఐపీఎస్ అధికారి మనోజ్ శర్మ జీవితాధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో తన నటనతో ఎంతో మంది ప్రేక్షకులను కదిలించారు విక్రాంత్. ఈ సినిమాను విధు వినోద్ చోప్రా తెరకెక్కించారు. 'ధరమ్ వీర్', 'బాలికా వధు' లాంటి పలు సీరియల్స్‌తో కెరీర్‌ను ప్రారంభించిన విక్రాంత్.. 2013లో 'లూటేరా' సినిమాతో వెండితెరపై మెరిశారు. 'మీర్జాపూర్', 'క్రిమినల్ జస్టిస్', 'బ్రోకెన్ బట్ బ్యూటిఫుల్' లాంటి వైవిధ్యమైన కథలతో ఓటీటీ వేదికగా కూడా సత్తా చాటారు. తనదైన నటనతో మెప్పించే ఆయన 'బ్లాక్ అవుట్', 'గిన్నీ వెడ్స్ సన్నీ', 'సెక్టార్ 36', 'సబర్మతీ రిపోర్ట్' తదితర చిత్రాలతో మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారు.

# మూడు దశాబ్దాలుగా రాణిస్తోంది


రాణీ ముఖర్జీ

ఇంట్లో ఇప్పటికే చాలా మంది సినీరంగంలో ఉండటంతో.. దానికి భిన్నంగా ఉండాలనుకుంది. తల్లి బలవంతంతో పరిశ్రమలోకి అడుగు పెట్టినప్పటికీ.. ఎత్తు తక్కువగా ఉందంటూ కెరీర్ తొలినాళ్లలోనే ఎన్నో సవాళ్లను ఎదుర్కొని అవకాశాలను కోల్పోయింది. కట్ చేస్తే.. హిందీ అగ్రహీరోలు ముగ్గురు ఖాన్‌ల సరసన నటించి.. చిత్రపరిశ్రమకు ఎన్నో హిట్ సినిమాలను అందించింది. ఆమే.. బాలీవుడ్ సీనియర్ కథానాయిక రాణీ ముఖర్జీ. మూడు దశాబ్దాలుగా నటిగా రాణిస్తోన్న ఆమె శుక్రవారం ప్రకటించిన 71వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ నటిగా నిలిచింది. ఆషిమా చిబ్బర్ దర్శకత్వం వహించిన 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' చిత్రానికి గానూ రాణిని ఈ పురస్కారం వరించింది. ఇందులో తన పిల్లల కోసం ఓ దేశంపైనే పోరాటం చేసే తల్లి పాత్రలో ఒదిగిపోయింది రాణి.

జాతీయ స్థాయిలో ఒక్కటంటే ఒక్క పురస్కారానికీ నోచుకోని ఏడాదుల్ని చాలానే చూసింది తెలుగు సినిమా. చివరికి ఉత్తమ ప్రాంతీయ చిత్రం విభాగంలోనూ సరైన సినిమా లేక రిక్తహస్తాలతో మిగిలిపోయిన సందర్భాలున్నాయి. ఇక తెలుగు సినిమా మారదా? అవే డ్యాన్సులు, అవే ఫైట్లేనా? అనే వ్యాఖ్యలు వినిపించేవి. కానీ తెలుగు సినిమా మన కథల్లోని మలుపుల్లాగే అనూహ్యంగా పుంజుకుంది. పడిలేచిన కెరటంలా ఏకంగా అత్యున్నత పురస్కారమైన ఆస్కార్‌నీ ముద్దాడింది. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రతిష్ఠాత్మక పురస్కారాల్లో గత కొన్నేళ్లుగా తెలుగు సినిమా సత్తా చాటుతోంది. 66వ జాతీయ పురస్కారాల్లోనూ ఉత్తమ నటి (కీర్తిసురేశ్: మహానటి) సహా తెలుగు సినిమాలకు ఏడు పురస్కారాలు దక్కాయి. 69వ పురస్కారాల్లో ఉత్తమ నటుడు అల్లు అర్జున్ (పుష్ప: ది రైజ్) సహా మొత్తం 11 విభాగాల్లో గెలిచిన తెలుగు సినిమా శుక్రవారం ప్రకటించిన 71వ జాతీయ పురస్కారాల్లో మరోమారు ఏడింటిని సొంతం చేసుకొంది.

# తెలుగు సినిమా తేజస్సు


'భగవంత్ కేసరి'

"'భగవంత్ కేసరి'కి ఉత్తమ తెలుగు చిత్రంగా దక్కిన జాతీయ గౌరవం మొత్తం చిత్రబృందానికే దక్కుతుంది. నాకెంతో గర్వంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాల్ని తాకే శక్తిమంతమైన కథల్ని అందించాలన్న మా తపనని మరింత బలపరుస్తోంది. ఈ కథని అద్భుతంగా ఆవిష్కరించిన దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, హరీశ్ పెద్ది, కళాకారులు, సాంకేతిక నిపుణులు, ఇతర సిబ్బంది కృషితోనే మాకు ఈ విజయం సాధ్యమైంది".

– బాలకృష్ణ

ఉత్తమ తెలుగు చిత్రంగా 'భగవంత్ కేసరి' నిలిచింది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సాహు గారపాటి, హరీశ్ పెద్ది నిర్మించారు. అడవిబిడ్డ నేలకొండ భగవంత్ కేసరి పాత్రలో ఇందులో బాలకృష్ణ ఒదిగిపోయారు. తెలంగాణ యాసలో ఆయన చెప్పిన సంభాషణలు సినిమాకి హైలెట్‌గా నిలిచాయి. ఇందులో శ్రీలీల ముఖ్యభూమిక పోషించారు. 'ఆడపిల్ల లేడిపిల్ల లెక్క ఉండొద్దు... పులిపిల్ల లెక్క ఉండాలె' అంటూ మహిళా సాధికారతని చాటి చెప్పే కథ, కథనాలతో రూపొందిన ఈ చిత్రం విశేష ఆదరణని సొంతం చేసుకుంది. పాన్ ఇండియా స్థాయిలో సంచలన విజయం సాధించిన 'హను - మాన్' సినిమాకి గానూ రెండు పురస్కారాలు దక్కాయి. ఉత్తమ ఏవీజీసీ(యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్)', ఉత్తమ యాక్షన్ దర్శకత్వం విభాగాల్లో 'హను -మాన్' పురస్కారాల్ని సొంతం చేసుకొంది. ఈ చిత్రానికి యాక్షన్ కొరియోగ్రఫీ చేసిన నందు - పృథ్వీ సంయుక్తంగా జాతీయ పురస్కారం గెలుచుకున్నారు.


'హను–మాన్'


'బేబి'


'బలగం'


సుకృతివేణి


రోహిత్

## కలం బలం

ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ గేయ రచన విభాగాల్లో తెలుగు సినిమాలు ఈసారి జాతీయ పురస్కారాల్ని సొంతం చేసుకొన్నాయి. 'బేబి' చిత్రానికిగానూ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా సాయిరాజేశ్, ఉత్తమ గేయ రచయితగా 'బలగం' చిత్రానికిగానూ ఊరు పల్లెటూరు... అనే పాటకి కాసర్ల శ్యామ్ పురస్కారాలు సొంతం చేసుకొన్నారు. 'బేబి'లోని ప్రేమిస్తున్నా... పాటకిగానూ ఉత్తమ గాయకుడిగా పీవీఎన్ఎస్ రోహిత్‌కు జాతీయ పురస్కారం దక్కింది. దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతివేణి జాతీయ ఉత్తమ బాలనటిగా పురస్కారం గెలిచారు. 'గాంధీ తాత చెట్టు' సినిమాలో నటనకిగానూ ఈ గౌరవం దక్కింది.

## తెలుగు ప్రతిభ...

మన దర్శకనిర్మాతలు ఇతర భాషల్లో తీసిన సినిమాలకు వివిధ విభాగాల్లో పురస్కారాలు దక్కాయి. సందీప్ వంగా దర్శకత్వం వహించిన 'యానిమల్' చిత్రానికి ఉత్తమ నేపథ్య సంగీతం విభాగంలో పురస్కారం దక్కింది. తెలుగు సంగీత దర్శకుడైన హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ పురస్కారాన్ని సొంతం చేసుకొన్నారు. ఇదే సినిమాకి గానూ ఉత్తమ సౌండ్ డిజైన్ విభాగంలోనూ పురస్కారం దక్కింది. ఈ చిత్రానికి సందీప్ వంగా సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా ఓ నిర్మాత. ఉత్తమ సంగీత దర్శకత్వం విభాగంలో 'వాతి(సార్)' చిత్రానికిగానూ జి.వి.ప్రకాశ్‌కుమార్‌కి పురస్కారం దక్కగా, ఆ సినిమాని తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించగా, తెలుగు నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు.




**మన పల్లె జాతీయ స్థాయిలో గెలిచింది..:** "'బలగం' చిత్రంలోని 'పల్లెటూరి' పాటకు గానూ జాతీయ పురస్కారం అందుకోవడం నా సొంత ఊరికి, నా కన్నతల్లికి అవార్డు వచ్చినంత ఆనందంగా ఉంది. ఈ మట్టి పాటతో మన పల్లె జాతీయ స్థాయిలో గెలిచిందనిపించింది. ఈ అవార్డుతో గేయ రచయితగా నాపై మరింత బాధ్యత పెరిగింది". – గేయ రచయిత కాసర్ల శ్యామ్



**జాతీయ అవార్డును ఊహించలేదు..:** "71వ జాతీయ పురస్కారాలు మనకు ఎంతో ప్రత్యేకం. తెలుగు చిత్రసీమకు చాలా విభాగాల్లో పురస్కారాలు దక్కాయి. 'బేబి' కథ రాసుకున్నప్పుడు ఫిల్మ్ ఫేర్ అవార్డు వస్తే చాలనుకున్నా. అలాంటిది ఇప్పుడీ చిత్రంతో ఏకంగా జాతీయ పురస్కారం గెలుచుకుంటానని అసలు ఊహించలేదు. నాకైతే చాలా ఆనందంగా ఉంది". – దర్శకుడు సాయి రాజేశ్



**మా నమ్మకం నిజమైంది..:** "వీఎఫ్ఎక్స్ కేటగిరీలో 'హను-మాన్'కు జాతీయ పురస్కారం వస్తుందని మొదట్నుంచి బలంగా నమ్మాం. అది ఈరోజు నెరవేరింది. అలాగే స్టంట్స్ విభాగంలోనూ నందు - పృథ్వీ మాస్టర్స్‌కు జాతీయ పురస్కారం దక్కడం మరింత ఆనందాన్నిచ్చింది". – దర్శకుడు ప్రశాంత్ వర్మ



**ఈ అవార్డు నాన్నకు అంకితం..:** "మా కష్టానికి ఇప్పుడీ పురస్కారం రూపంలో ఫలితం దక్కింది. ఈ అవార్డును నేను మా నాన్నకు అంకితమిస్తున్నా. ఆయన కూడా ఫైట్ మాస్టరే. పేరు కుంగ్‌ఫూ శేఖర్". – ఫైట్ మాస్టర్ పృథ్వీ

## శక్తిమంతమైన మహిళలకు అంకితం



"భగవంత్ కేసరి' కథ చెప్పినప్పుడే ఈ సినిమా ప్రత్యేకంగా నిలవనుందని బాలకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. ఈరోజు జాతీయ పురస్కారం గెలుచుకోవడంతో ఆ నమ్మకం నిజమైంది. తమ జీవితాల్లో పోరాడి పైకి వచ్చిన ప్రతి మహిళకు ఈ పురస్కారాన్ని అంకితమిస్తున్నా". – అనిల్ రావిపూడి



**మా కష్టానికి ఫలితం దక్కింది..:** "హను-మాన్‌లో 'ఆవకాయ ఆంజనేయ' పాట ఫైట్, బస్సు దోపిడీ ఫైట్ చాలా సవాల్‌గా అనిపించాయి. ఎంతో రిస్క్ చేసి వాటిని చేశాం. ఆ కష్టానికి ఫలితంగా ఇప్పుడు జాతీయ పురస్కారం దక్కడం ఎంతో తృప్తినిచ్చింది". – ఫైట్ మాస్టర్ నందు

## జాతీయ పురస్కార విజేతలు

- **ఉత్తమ చిత్రం:** ట్వెల్త్ ఫెయిల్
- **ఉత్తమ దర్శకత్వం:** సుదీప్తో సేన్ ('ది కేరళ స్టోరీ', హిందీ)
- **ఉత్తమ నటుడు:** షారుక్ ఖాన్ (జవాన్, హిందీ), విక్రాంత్ మాస్సే (ట్వెల్త్ ఫెయిల్, హిందీ)
- **ఉత్తమ నటి:** రాణీ ముఖర్జీ (మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే, హిందీ)
- **ఉత్తమ సహాయ నటుడు:** విజయ రాఘవన్ (పూక్కాలం, మలయాళం), ముత్తుపెట్టాయ్ సోము భాస్కర్ (పార్కింగ్, తమిళం)
- **ఉత్తమ సహాయ నటి:** ఊర్వశి (ఉళ్లొలుక్కు, మలయాళం), జానకీ బోడీవాలా (వష్, గుజరాతీ)
- **ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్:** సుకృతి వేణి (గాంధీ తాత చెట్టు, తెలుగు), కబీర్ ఖండారే (జిప్సీ, మరాఠీ), త్రిష థోసర్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగ్దీప్ (నాల్ 2, మరాఠీ)
- **ఉత్తమ నేపథ్య గాయకుడు:** పీవీఎన్ఎస్ రోహిత్ ('ప్రేమిస్తున్నా.., బేబి')
- **ఉత్తమ నేపథ్య గాయని:** శిల్పారావు ('చెలియా.., జవాన్)
- **ఉత్తమ ఛాయాగ్రహణం:** పసంతను మొహపాత్రో ('ది కేరళ స్టోరీ', హిందీ)
- **ఉత్తమ సంభాషణలు:** దీపక్ కింగ్రానీ ('సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై, హిందీ)
- **ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్):** సాయి రాజేశ్ నీలం (బేబి, తెలుగు), రామ్‌కుమార్ బాలకృష్ణన్ (పార్కింగ్, తమిళం)
- **ఉత్తమ సౌండ్ డిజైన్:** సచిన్ సుధాకరన్, హరి హరన్ మురళీధరన్ (యానిమల్, హిందీ)
- **ఉత్తమ ఎడిటింగ్:** మిథున్ మురళి, (పూక్కాలమ్, మలయాళం)
- **ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్:** మోహన్‌దాస్ (2018, మలయాళం)
- **ఉత్తమ నృత్య దర్శకత్వం:** వైభవ్ మర్చంట్ (రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహాని, హిందీ)
- **ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్:** సచిన్ లవ్లేకర్, దివ్య గంభీర్, నిధి గంభీర్ (సామ్ బహదూర్, హిందీ)
- **ఉత్తమ మేకప్:** శ్రీకాంత్ దేశాయ్ (సామ్ బహదూర్, హిందీ)
- **ఉత్తమ సంగీతం (నేపథ్యం):** హర్షవర్ధన్ రామేశ్వర్ (యానిమల్, హిందీ)
- **ఉత్తమ గేయ రచయిత:** కాసర్ల శ్యామ్ (ఊరు పల్లెటూరు.., బలగం)
- **ఉత్తమ స్టంట్ కొరియోగ్రఫీ:** నందు – పృథ్వీ (హను–మాన్, తెలుగు)
- **ఉత్తమ సంగీత దర్శకత్వం:** జీవీ ప్రకాశ్ కుమార్ (వాతి, తమిళం)
- **ఉత్తమ ప్రజాదరణ చిత్రం:** 'రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ' (హిందీ)
- **ఉత్తమ జాతీయ సమగ్రత, సామాజిక విలువల చిత్రం:** సామ్ బహదూర్ (హిందీ)
- **ఉత్తమ పరిచయ దర్శకుడు:** ఆశిష్ బెండే (ఆత్మపాంప్లేట్, మరాఠీ)
- **ఉత్తమ బాలల చిత్రం:** 'నాల్ 2' (మరాఠీ)
- **ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ చిత్రం:** 'హను–మాన్' (తెలుగు)
- **స్పెషల్ మెన్షన్:** ఎంఆర్ రాజకృష్ణన్, (రీ రికార్డింగ్, యానిమల్)

# న్యాయ వాదుల ప్రేమ ప్రయాణం



రెడీ ఇన్ ఓటీటీ

| | |
|---|---|
| సిరీస్ | 'బియాండ్ ది బార్' |
| నటీనటులు | లీ జిన్ వూక్, జంగ్ చే యోన్ |
| విడుదల | శనివారం |
| ప్లాట్‌ఫామ్ | నెట్‌ఫ్లిక్స్ |

**కథాంశం:** లా పూర్తయిన తర్వాత సీనియర్ న్యాయవాదులు ఉండే అగ్రశ్రేణి న్యాయసంస్థలో చేరుతుంది కాంగ్ హ్యో మిన్(జంగ్ చే యోన్). తన వాదనలతో ప్రత్యర్థులకు వణుకు పుట్టించే యూన్ సియోక్ హున్(లీ జిన్ వూక్) ఈ బృందానికి నాయకత్వం వహిస్తాడు. చట్టపరమైన అంశాలలో ఎంతో అనుభజ్ఞుడైన ఇతడు చాలా కష్టమైన కేసులను కూడా సులువుగా వాదించి, సునాయాసంగా గెలిచేస్తుంటాడు. అలా ఇతనికి సమాజంలో లాయర్‌గా ఎంతో డిమాండ్ ఉంటుంది. కానీ తోటివారి పట్ల ఎప్పుడూ కఠినంగా ప్రవర్తిస్తుంటాడు. అలాంటి న్యాయవాది దగ్గర హ్యో మిన్ శిక్షణ తీసుకుంటుంది. హ్యో మిన్ ఎప్పుడూ తన చుట్టూ ఉండే పరిసరాలలో ఏదో ఒక గందరగోళం సృష్టిస్తుంటుంది. కానీ ఆమె న్యాయశాస్త్రం పట్ల బలమైన అవగాహన ఉన్న నిజాయతీగల అమ్మాయి. అలా తన గురువు యూన్ సియోక్ కింద పనిచేస్తూ సంక్లిష్టమైన కేసులు, వాటి వెనుక ఉన్న కుంభకోణాలను అన్వేషిస్తుంది. ఈ నేపథ్యంలోనే యూన్ సియోక్‌కి, హ్యో మిన్‌కి తరచూ గొడవలు అవుతూ ఉంటాయి. అలా వారు ఘర్షణలు పడుతూనే ఒకరికొకరు తెలియకుండానే దగ్గరై పోతారు. ఎప్పుడూ చిలిపి గొడవలతో సాగే వీరి ప్రయాణంలో ప్రేమ చిగురించిందా? ఏ మాత్రం అనుభవం లేని హ్యో మిన్ అతడి శిక్షణతో పెద్ద తరహా కేసులను వాదించగలిగిందా? లేదా తెలియాలంటే 'బియాండ్ ది బార్' సిరీస్ చూడాల్సిందే. ఈ సిరీస్‌ని లీగల్ డ్రామాగా కిమ్ జే హాంగ్ రూపొందించారు.

# 'అజేయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఏ యోగి' చిత్ర సెన్సార్ వివాదం

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన సినిమా 'అజేయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఏ యోగి'. రవీంద్ర గౌతమ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అనంత్ జోషి ప్రధాన పాత్రలో నటించారు. యోగి ఆదిత్యనాథ్ గురువు మహంత్ పాత్రను పరేశ్ రావల్ పోషించారు. ఇటీవల ఈ చిత్రం సెన్సార్‌కు వెళ్లగా బోర్డు దీనికి సర్టిఫికేట్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ చిత్రానికి సెన్సార్ ఇవ్వడం కుదరదని వెల్లడించింది. దీంతో దర్శక నిర్మాతలు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ పిటిషన్ స్వీకరించే సమయంలో కోర్టు సెన్సార్ బోర్డును కొన్ని ప్రశ్నలు అడిగింది. గత ఎనిమిదేళ్లుగా ప్రజాదరణ పొందుతున్న 'ది మాంక్ హూ బికమ్ చీఫ్ మినిస్టర్' పుస్తకం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించినట్లు దర్శకనిర్మాతలు కోర్టుకు వెల్లడించారు. దీంతో ఈ పుస్తకంపై ఎలాంటి అభ్యంతరాలు లేనప్పుడు దాని ఆధారంగా తెరకెక్కిన సినిమాకు సెన్సార్ వారు ఎందుకు నిరాకరించారో తెలపాలని కోర్టు సెన్సార్ బోర్డును ఆదేశించింది. ఈ మేరకు సెన్సార్ బోర్డుకు నోటీసులు జారీ చేస్తూ వివరణ కోరింది. "జులై 21 నాటి లేఖను మేము పరిశీలించాము. ఈ చిత్రాన్ని సీబీఎఫ్‌సీ వాళ్లు చూడలేదు. ఈ చిత్రం రాజ్యాంగ అధికారానికి సంబంధించినది. ప్రజాక్రమాన్ని ప్రభావితంచేసే అవకాశం ఉన్నందున దరఖాస్తు తిరస్కరించినట్లు కనిపిస్తోంది" అని శుక్రవారం జరిగిన విచారణలో తెలిపింది ధర్మాసనం. సెన్సార్ సర్టిఫికెట్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ నెల 6 నాటికి నిర్ణయిస్తామని సీబీఎఫ్‌సీ ధర్మాసనానికి తెలిపింది. సినిమాను చూడకుండానే సర్టిఫికేషన్ అభ్యర్థనను తిరస్కరించినందుకు న్యాయమూర్తులు సీబీఎఫ్‌సీని మందలించారు. సంభాషణలు, స్క్రిప్ట్‌ను సమీక్షించామని సీబీఎఫ్‌సీ వాదించినప్పుడు కోర్టు ప్రశ్నించింది. "సినిమా చూడటానికి అభ్యంతరం ఏమిటి? మీరు వారిని కట్స్ చేయమని అడగవచ్చు. సినిమా చూడకుండానే దరఖాస్తు ఎలా తిరస్కరించగలరు?" అని ప్రశ్నించింది. ఈ నెల 6వ తేదీ లేదా అంతకంటే ముందుగానే సినిమాను ప్రదర్శిస్తామని సీబీఎఫ్‌సీ కోర్టుకు హామీ ఇచ్చింది.

# బన్.. ఫన్


'బన్ బటర్ జామ్'

రాజు జయమోహన్, ఆద్య ప్రసాద్, భవ్య త్రిఖ ప్రధాన పాత్రధారులుగా తమిళంలో తెరకెక్కిన 'బన్ బటర్ జామ్' తెలుగులోనూ అదే పేరుతో ప్రేక్షకుల ముందుకొస్తోంది. రాఘవ్ మిర్‌దత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. రెయిన్ ఆఫ్ ఏరోస్, సురేశ్ సుబ్రమణియన్ నిర్మాతలు. విష్ణుశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సీహెచ్ సతీష్ ఈనెల 8న ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని దర్శకుడు మెహర్ రమేశ్ విడుదల చేశారు. "ప్రేమ, హాస్యం, భావోద్వేగాల మేళవింపుగా రూపొందిన చిత్రమిది. తమిళంలో ఘన విజయం సాధించింది. తెలుగు ప్రేక్షకుల ఆదరణనీ తప్పకుండా సొంతం చేసుకుంటుంద"ని సినీ వర్గాలు చెప్పాయి. చార్లి, శరణ్య పొన్‌వన్నన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: నివాస్ కె.ప్రసన్న, ఛాయాగ్రహణం: బాబుకుమార్.

# 'ఉదయ్‌పూర్ ఫైల్స్' చిత్రం విడుదల అనుమతి ఉత్తర్వు ఉపసంహరణ

- దిల్లీ హైకోర్టుకు తెలిపిన కేంద్రం


**దిల్లీ:** 'ఉదయ్‌పూర్ ఫైల్స్-కన్హయ్య లాల్ టైలర్ మర్డర్' చిత్రం విడుదలకు అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం దిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఈ నెల 8న ఈ చిత్రం విడుదల కావాల్సి ఉంది. చిత్రం విడుదలకు కేంద్రం అనుమతివ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్, జస్టిస్ తుషార్ రావు ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఉపసంహరణ నిర్ణయాన్ని కేంద్రం తెలియజేయడంతో ఈ కేసులోని ఇరుపక్షాలు ఈ నెల 4న ప్రభుత్వం ఎదుట హాజరై వారి వారి అభ్యర్థనలు తెలపాలని ధర్మాసనం సూచించింది.

# థ్రిల్‌ని పంచే కథతో... మాత్రు


శ్రీరామ్

శ్రీరామ్ ప్రధాన పాత్రధారిగా నటించిన చిత్రం 'మాతృ'. సుగి విజయ్, రూపాలీ భూషణ్ జంటగా నటించారు. ఆమని, నందినిరాయ్ ముఖ్య భూమిక పోషించారు. జాన్ జక్కీ దర్శకత్వం వహించగా, శ్రీ పద్మిని సినిమాస్ పతాకంపై బూర్లె శివప్రసాద్ నిర్మిస్తున్నారు. సైంటిఫిక్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం ఈనెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. నిర్మాత మాట్లాడుతూ "వినూత్నమైన కథతో రూపొందించిన చిత్రమిది. ఆద్యంతం థ్రిల్‌ని పంచే కథనం ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని పంచుతుంది. శేఖర్ చంద్ర సంగీతం చిత్రానికి ప్రధానబలం" అన్నారు. అలీ, పృథ్వీరాజ్, దేవిప్రసాద్, రవి కాలె తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రాహుల్ శ్రీవాస్తవ్.

# ఐటీసీ లాభం రూ.5,343 కోట్లు




దిల్లీ: ఐటీసీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.5343.41 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.5176.99 కోట్లు. ఇదే సమయంలో సంస్థ ఆదాయం రూ.19,350.08 కోట్ల నుంచి రూ.23,129.35 కోట్లకు పెరిగింది. వ్యయాలు కూడా 26.73% పెరిగి రూ.16,752.31 కోట్లుగా నమోదయ్యాయి. 24 మంత్ర ఆర్గానిక్ బ్రాండ్ సంస్థ శ్రేష్ఠ నాచురల్ బయోప్రోడక్ట్స్‌ను ఈ ఏడాది జూన్ 13న కొనుగోలు చేసినందున, ప్రస్తుత ఫలితాలను ఏడాది క్రితంతో పోల్చలేమని సంస్థ వివరించింది. ఐటీసీ ఇన్ఫోటెక్ ఇండియా, సూర్యా నేపాల్, ఐటీసీ హోటల్స్ వంటి గ్రూప్ కంపెనీల పనితీరుతో అన్ని విభాగాల్లోనూ రాణించినట్లు ఐటీసీ వివరించింది.

✦ ఎఫ్ఎంసీజీ విభాగాదాయం రూ.15,354.30 కోట్లుగా ఉంది. ఇందులో సిగరెట్ల వాటానే రూ.9553.86 కోట్లు. బ్రాండెడ్ ప్యాకేజ్డ్ ఫుడ్స్, స్టాపుల్స్, మీల్స్, స్నాక్స్, డెయిరీ, బెవరేజెస్, కేక్‌లు, కాఫీ, విద్యా సంబంధ స్టేషనరీ విభాగాల ఆదాయం రూ.5800.44 కోట్లుగా ఉంది.

✦ వ్యవసాయ విభాగాదాయం రూ.9723.84 కోట్లు కాగా, పేపర్‌బోర్డులు, ప్యాకేజింగ్ ఆదాయం రూ.2116.62 కోట్లుగా నమోదైంది.

✦ ఐటీ సర్వీసులు, ఐటీసీ గ్రాండ్ సెంట్రల్ హోటల్, ఫుడ్ టెక్ నుంచి రూ.1182.59 కోట్ల ఆదాయం లభించింది.

✦ శుక్రవారం ఐటీసీ షేరు 1.14% లాభంతో రూ.416.50 వద్ద స్థిరపడింది.

# ట్రంప్ టారిఫ్ ప్రభావం మనపై ఉంటుందా.. ఉండదా?



మనదేశం నుంచి అమెరికాకు జరుగుతున్న ఎగుమతులపై నూతన సుంకాల ప్రభావంపై వేర్వేరు అంచనాలు వెలువడుతున్నాయి. అమెరికాకు మనదేశం నుంచి వెళ్తున్న 86 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులపై.. ఆ దేశం విధించిన 25% సుంకం వల్ల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని అమెరికా క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్‌తో పాటు పలు వర్గాలు అంచనా వేస్తున్నాయి. సగం మేర ఉత్పత్తులపై ప్రభావం పడొచ్చని మన అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికాకు వెళ్లే మన ఎగుమతులపై ఆగస్టు 7 నుంచి అమల్లోకి వచ్చే టారిఫ్ వల్ల తీవ్ర ప్రభావమే పడొచ్చని మేధో సంస్థ జీటీఆర్ఐ అంటోంది.

## మినహాయింపు జాబితాలో సగం వస్తువులు

అమెరికాకు మనదేశం ఎగుమతి చేస్తున్న వాటిలో సగం వస్తువులు.. సుంకం నుంచి మినహాయించిన విభాగం (ఎక్సెంప్టెడ్ క్యాటగరీ)లో ఉన్నాయి. ఇందులో ఫినిష్డ్ ఫార్మా డ్రగ్స్, ఏపీఐలు, ఇతర కీలక ఔషధ ముడి పదార్థాలు; ఎలక్ట్రానిక్స్ వస్తువులు (కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు), సెమీకండక్టర్లు; ముడి చమురు, రిఫైన్డ్ ఇంధనాలు, సహజ వాయువు, బొగ్గు, విద్యుత్; కీలక ఖనిజాలు వంటివి ఉన్నాయి. సెక్షన్ 232 ఎగ్జెమ్షన్ కింద భారత ఎగుమతుల్లో 48 బి. డాలర్ల విలువైనవి మాత్రమే ఈ టారిఫ్ ప్రభావానికి గురవుతాయి. అమెరికాకు మనదేశం వ్యవసాయ, డెయిరీ, జన్యుమార్పిడి పంటల రంగాల్లో ఎటువంటి సుంకం మినహాయింపు ఇవ్వడంలేదు.

✦మనదేశం నుంచి ఈనెల 7లోపు నౌకల్లోకి చేరి, అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తువులు అక్టోబరు 5లోపు అక్కడికి చేరినా, అదనపు సుంకం పడదు. ప్రస్తుత 10 శాతమే ఉంటుంది.

## అమెరికాకే నష్టం: ఎస్‌బీఐ రీసెర్చ్

భారత్ నుంచి తమ దేశంలోకి వస్తున్న ఉత్పత్తులపై ట్రంప్ 25% టారిఫ్ విధించడం వల్ల, అమెరికాకే నష్టమని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ఇదొక 'నష్టదాయక వ్యాపార నిర్ణయ'ని అభివర్ణించింది. తక్కువ జీడీపీ, అధిక ద్రవ్యోల్బణం, బలహీన డాలరు దిశగా పయనించేలా ఈ నిర్ణయం చేస్తుందని అంచనా వేసింది. ఆర్థికపరంగా చూస్తే భారత్ కంటే అమెరికాకే రేటింగ్ తగ్గే ప్రమాదం ఉందనీ అంటోంది. అమెరికాలో ద్రవ్యోల్బణం 2026 మొత్తం 2 శాతం (లక్ష్యం) కంటే పైనే కదలాడవచ్చనీ అంటోంది. 'ట్రంప్ టారిఫ్‌ల వల్ల ప్రతి అమెరికన్‌పై స్వల్పకాలంలో 2400 డాలర్ల (సుమారు రూ.2 లక్షలకు పైగా) భారం పడొచ్చు. అల్పాదాయ కుటుంబాలు 1300 డాలర్లు (సుమారు రూ.1.13 లక్షలు) కోల్పోవచ్చు. అధికాదాయ వర్గాలకైతే 5000 డాలర్ల (రూ.4.35 లక్షల) వరకు భారం పడొచ్చ'ని తెలిపింది.

**ఫిచ్ మాటా అదే:** సుంకాల ప్రభావం భారత్‌పై తక్కువగానే ఉంటుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. భారత కంపెనీలపై నేరుగా ప్రభావం పరిమితంగానే ఉండొచ్చని పేర్కొంది.

**పెరిగిన నిరుద్యోగిత:** అమెరికా వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ఆ దేశంలో గత నెలలో 73,000 ఉద్యోగాలే వచ్చాయి. మే, జూన్‌లతో పోలిస్తే ఇది తక్కువ. నిరుద్యోగ రేటు 4.2 శాతానికి పెరిగింది.

**25% సుంకం ప్రభావం పడే వస్తువులు**

| రంగం | ఎగుమతుల విలువ(బి.డాలర్లు) |
|---|---|
| జౌళి | 10.3 |
| రత్నాభరణాలు | 12 |
| రొయ్యలు | 2.24 |
| తోలు వస్తువులు, పాదరక్షలు | 1.18 |
| జంతు ఉత్పత్తులు | 2 |
| రసాయనాలు | 2.34 |
| ఎలక్ట్రిక్, మెకానికల్ మెషినరీ | 9 |

## తీవ్ర ప్రభావం ఉండొచ్చు: జీటీఆర్ఐ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకంతో 'ఫర్దర్ మాడిఫైయింగ్ ద రిసిప్రోకల్ టారిఫ్ రేట్స్' పేరిట వెలువడిన అధికారిక ఆదేశాల ప్రకారం.. దాదాపు 70 దేశాలపై టారిఫ్‌లు నిర్ధారించారు. ఇందులో భారత ఎగుమతులపై 25% సుంకం ఉంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదిరితే, ఆయా దేశాలపై టారిఫ్ తగ్గే అవకాశం ఉందనీ తాజా ఆదేశాలు వెల్లడిస్తున్నాయి. 'ప్రస్తుతం విధించిన సుంకాల వల్ల అమెరికాకు వెళ్లే చాలా వరకు భారతీయ వస్తువులపై ప్రభావం ఉంటుంద'ని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.

✦ 2024-25లో అమెరికాకు భారత ఎగుమతులు 86.5 బి. డాలర్లుగా ఉన్నాయి. తాజా పరిణామాల వల్ల 2025-26లో ఇవి 30% తగ్గి 60.6 బి. డాలర్లకు చేరొచ్చన్నది ఒక అంచనా.

✦'నూతన సుంకాల వల్ల దుస్తుల రంగంపై ఎక్కువ ప్రభావం పడనుంది. ఉద్యోగులను భారీగా తొలగించకూడదనుకుంటే, తక్కువ ధరలకు అమెరికాకు దుస్తులను విక్రయించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి' అని దుస్తుల ఎగుమతి ప్రోత్సాహక మండలి(ఏఈపీసీ) ఛైర్మన్ సుధీర్ సెక్రి పేర్కొన్నారు.

# ఈనాడు బిజినెస్

## తనిష్క్ నుంచి సమృద్ధి కలెక్షన్



హైదరాబాద్: టాటా గ్రూపు ఆభరణాల రిటెయిల్ బ్రాండ్ తనిష్క్, వరమహాలక్ష్మి వ్రతాన్ని దృష్టిలో పెట్టుకుని 'సమృద్ధి' కలెక్షన్‌ను విడుదల చేసింది. ఆర్థిక సమృద్ధి, ఆరోగ్యం, విజయం కోసం చేసుకునే ఈ పండగ తెలుగు రాష్ట్రాల సాంస్కృతిక వైభవంలో కీలకమని.. ఈ ఆధ్యాత్మికతలో కీలకమైన సంప్రదాయ దీపం నుంచి ప్రేరణ పొంది ఈ తాజా కలెక్షన్‌ను విడుదల చేసినట్లు తనిష్క్ వెల్లడించింది. ఈ పండగ సందర్భంగా బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.450, వజ్రాభరణాల విలువపై 20% వరకు తగ్గింపు అందిస్తున్నట్లు వివరించింది. తనిష్క్ గోల్డ్ ఎక్స్ఛేంజ్‌నూ కొనుగోలుదారులు ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. ఆగస్టు 7 నుంచి 10 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని అన్ని స్టోర్లలో ఈ ఆఫర్ ఉంటుందని తెలిపింది. సమృద్ధి కలెక్షన్‌లో నెక్లెస్‌లు, గాజులు, చెవిపోగులు తదితరాలున్నాయని తనిష్క్ ప్రాంతీయ బిజినెస్ మేనేజర్ వాసుదేవ రావు తెలిపారు. క్లిష్టమైన నకాషి పని, యాంటిక్ ఫినిష్‌తో రూపొందించిన ఆభరణాల్లో అద్భుత రంగుల రాళ్లు ఉన్నాయని, సూక్ష్మ అంశాలకు సైతం అమిత ప్రాధాన్యం ఇచ్చినట్లు వివరించారు.

## నెలకు రూ.1కే అపరిమిత కాల్స్: బీఎస్ఎన్ఎల్

దిల్లీ: కొత్తగా 4జీ కనెక్షన్ తీసుకునే వారికి రూ.1 కే నెలంతా అపరిమిత కాల్స్, రోజుకు 2జీబీ అధిక వేగం డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పంపుకునే వీలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వరంగ బీఎస్ఎన్ఎల్ ప్రకటించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫ్రీడమ్ పేరిట ఈ పథకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపింది. పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 4జీ సదుపాయాన్ని దేశ పౌరులంతా వినియోగించేందుకే ఈ అవకాశం కల్పిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ సీఎండీ ఎ.రాబర్ట్ జె రవి వివరించారు. దేశమంతా లక్ష 4జీ సైట్లు నిర్మించినట్లు తెలిపారు.

## ఎల్ఐసీ, ప్రభుత్వ బ్యాంకుల్లో వాటా విక్రయంలో ముందడుగు

### మర్చంట్ బ్యాంకర్లు, న్యాయ సలహాదార్ల నియామకం

దిల్లీ: ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇతర ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల్లో మైనారిటీ వాటా విక్రయ ప్రక్రియలో ముందడుగు పడింది. ఇందుకోసం మర్చంట్ బ్యాంకర్లు, న్యాయ సలహాదార్లను నియమించినట్లు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపమ్) కార్యదర్శి అరుణీశ్ చావ్లా పేర్కొన్నారు. 'ఎల్ఐసీ విషయానికొస్తే ఆర్ఎఫ్‌పీ (ప్రతిపాదనలకు విజ్ఞప్తి) ప్రక్రియను పూర్తి చేశాం. మర్చంట్ బ్యాంకర్లు, న్యాయ సలహాదార్లనూ నియమించామ'ని అన్నారు. దీపమ్ తీసుకొచ్చిన రెండు ఆర్ఎఫ్‌పీల ప్రకారం.. మర్చంట్ బ్యాంకర్లు, న్యాయ సలహాదార్లు మూడేళ్ల పాటు సేవలందించాల్సి ఉంటుంది. మరో ఏడాది పాటు కొనసాగించడానికీ వీలుంటుంది. సెబీ నిర్దేశించిన కనీస 25% ప్రజల వాటా నిబంధనను ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు 2026 ఆగస్టు 1 లోగా పాటించాల్సి ఉంది.

**కోడి గుడ్లు**

**2న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)** (100కు రూపాయలలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 430 |
| వరంగల్ | 432 |
| విజయవాడ | 475 |
| గోదావరి | 465 |
| విశాఖపట్నం | 465 |
| చిత్తూరు | 503 |

## సరికొత్త వోల్వో ఎక్స్‌సీ60



దిల్లీ: వోల్వో ఆటో ఇండియా తన ఎక్స్‌సీ60లో ఫేస్‌లిఫ్ట్ వర్షన్‌ను ఆవిష్కరించింది. ప్రారంభ ధర రూ.71.90 లక్షలు. ఈ ఏడాది మొదట్లో అంతర్జాతీయంగా తీసుకొచ్చిన ఈ మోడల్‌ను శుక్రవారం భారత్‌లో ఆవిష్కరించింది. స్టైల్, ఫీచర్ల పరంగా నవీకరించిన ఈ మోడల్‌ను బెంగళూరులోని వోల్వో ప్లాంటులో అసెంబ్లింగ్ చేస్తున్నారు. మిగతా కార్లన్నీ పూర్తిగా తయారైన స్థితి(సీకేడీ)లో దిగుమతి చేసుకుని, విక్రయిస్తున్నారు. ఎక్స్‌సీ 60లో క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ కాక్‌పిట్ ప్లాట్‌ఫాం, 12.3 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, వాయిస్ అసిస్టెంట్, పనోరమిక్ సన్‌రూఫ్, అడాస్ వంటి పలు ఫీచర్లున్నాయి. భారత్‌లో విద్యుత్ కార్ల(ఈవీ) ప్రోత్సాహానికి ఉద్దేశించిన ప్రయోజనాలను వినియోగించుకోవాలని భావించడం లేదని వోల్వో కార్ ఇండియా ఎండీ, జ్యోతి మల్హోత్రా పేర్కొన్నారు. ఈ ఏడాది చివర్లో ఈఎక్స్30 ఈవీని తీసుకురాగలమన్నారు.

## యమహా ఎంటీ-15 బైకులో కొత్త వెర్షన్

**ప్రారంభ ధర రూ.1.69 లక్షలు**



దిల్లీ: యమహా మోటార్ ఇండియా తన ఎంటీ- 15 బైక్‌లో వెర్షన్ 2.0ను తీసుకొచ్చింది. స్టాండర్డ్ రకం ధర రూ.1.69 లక్షలు (ఎక్స్ షోరూం) కాగా.. డీఎల్ఎక్స్ రకం బైకు ధర రూ.1.8 లక్షలు (ఎక్స్ షోరూం). డీఎల్ఎక్స్ ట్రిమ్.. ఐస్ స్ట్రోమ్, వివిడ్ వయొలెట్ మెటాలిక్ రంగుల్లోనూ, స్టాండర్డ్ బైక్ మెటాలిక్ సిల్వర్ సియాన్ రంగులో లభ్యం కానున్నాయి. ఎంటీ-15 డీఎల్ఎక్స్ రకం.. కలర్ టీఎఫ్‌టీ స్క్రీన్‌తో తీసుకొచ్చారు. దీనిని యమహా వై-కనెక్ట్ యాప్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానం చేస్తే... బైక్ నిర్వహణకు సూచనలు, ఇంధన వినియోగ స్థితి, పార్కింగ్ ప్రాంతం, ఇతర హెచ్చరికలను వినియోగదారులు పొందే వీలుంటుంది. 155 సీసీ లిక్విడ్-కూల్డ్ ఇంజిన్, సిక్స్- స్పీడ్ గేర్‌బాక్స్‌తో ఈ కొత్త వెర్షన్ బైక్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు కంపెనీ తెలిపింది.

## హోండా సీబీ 125 హార్నెట్

**ధర రూ.1.12 లక్షలు**



దిల్లీ: హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తన సీబీ 125 హార్నెట్ బైకు ధరను ప్రకటించింది. గత నెలలో కంపెనీ ఆవిష్కరించిన ఈ స్పోర్టీ 125 సీసీ బైకుకు పరిచయ ధర రూ.1.12 లక్షలు (ఎక్స్‌షోరూం, గురుగ్రామ్) అని తెలిపింది. 4.2 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లేతో ఈ బైకును కంపెనీ తీసుకొచ్చింది. దీంతో హోండా రోడ్‌సింక్ యాప్ ద్వారా బ్లూటూత్ కనెక్టివిటీకి వీలుంటుంది. టర్న్ బై టర్న్ నేవిగేషన్, కాల్- ఎస్ఎమ్ఎస్ అలర్ట్‌లు, ఎల్ఈడీ లైటింగ్, ఎల్లాయ్ వీల్స్ లాంటి ప్రత్యేకతలు కూడా ఈ బైక్‌లో ఉన్నాయి.

## అనిల్ అంబానీకి ఈడీ సమన్లు



దిల్లీ: మనీలాండరింగ్ కేసులో ప్రశ్నించేందుకు ఈనెల 5న తమ ఎదుట హాజరు కావాల్సిందిగా రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. ఆయన విదేశాలకు పారిపోకుండా లుకౌట్ సర్క్యులర్‌ను కూడా ఇచ్చింది. అనిల్ గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో, ఈ కేసును నమోదుచేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా అనిల్ అంబానీని ఈడీ ఆదేశించినట్లు తెలుస్తోంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆయన వాంగ్మూలాన్ని ఈడీ నమోదుచేయనుంది. రిలయన్స్ గ్రూప్ కంపెనీలకు చెందిన కొంత మంది ఎగ్జిక్యూటివ్‌లకు కూడా రాబోయే రోజుల్లో సమన్లు జారీ చేయనున్నారు.

✦ గత వారం రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఈడీ సోదాలు నిర్వహించిన అనంతరం.. అనిల్ అంబానీకి సమన్లు జారీ చేసింది. జులై 24 నుంచి మూడు రోజుల పాటు ఈ సోదాలు జరిగాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17,000 కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈడీ ఈ చర్యలు చేపట్టింది.

✦ ఈ నేపథ్యంలో రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా షేర్లు లోయర్ సర్క్యూట్‌కు పడిపోయాయి. రిలయన్స్ పవర్ 5% కుదేలై రూ.50.21 వద్ద, రిలయన్స్ ఇన్‌ఫ్రా 5% క్షీణించి రూ.311.60 దగ్గర స్థిరపడ్డాయి.

✦నకిలీ బ్యాంక్ గ్యారెంటీ కేసులో ఒడిశాకు చెందిన బిస్వాల్ ట్రేడ్‌లింక్, దాని డైరెక్టర్లపై శుక్రవారం ఈడీ సోదాలు నిర్వహించింది. ఒక రిలయన్స్ గ్రూప్ కంపెనీకి రూ.68 కోట్ల బ్యాంక్ గ్యారెంటీని వీరు కల్పించారని ఆరోపణలు వచ్చాయి.

## ఆఫర్ లెటర్ ఇచ్చిన వారిని తప్పక సంస్థలోకి చేర్చుకుంటాం

### కార్మిక శాఖకు టీసీఎస్ వెల్లడి

దిల్లీ: తాము ఆఫర్ లెటర్ ఇచ్చిన సుమారు 600 మంది అనుభవజ్ఞులను తప్పకుండా సంస్థ ఉద్యోగాల్లోకి తీసుకుంటామని కార్మిక శాఖకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రాజెక్టుల లభ్యతకు అనుగుణంగా ఉద్యోగాల్లోకి తీసుకునే ప్రక్రియను వాయిదా మాత్రమే వేశామని, ఆ నియామకాలను రద్దు చేయలేదని ఇ-మెయిల్ ద్వారా తెలియజేసింది. సంస్థ నుంచి ఆఫర్ లెటర్ అందుకున్న అనుభవజ్ఞులను ఉద్యోగాల్లో చేర్చుకోవడంలో టీసీఎస్ చేస్తున్న జాప్యంపై చర్చించేందుకు బుధవారం ముఖ్య లేబర్ కమిషనర్ ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్ (నైట్స్) ప్రతినిధి హాజరుకాగా.. టీసీఎస్ ఇ-మెయిల్ మాత్రమే పంపింది. 'మేము ఆఫర్ లెటర్ ఇచ్చిన వాళ్లందర్నీ సంస్థలోకి చేర్చుకుంటాం. అయితే వ్యాపార గిరాకీకి తగ్గట్లుగా, వీళ్ల చేరిక తేదీలను నిర్ణయిస్తాం. కొంత మందిని వ్యాపార అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేస్తామ'ని టీసీఎస్ అధికార ప్రతినిధి పేర్కొన్నట్లు ఆ ఆంగ్ల వార్తా సంస్థ వివరించింది.

# కార్ల విక్రయ 'గిరాకీకి' బ్రేకులు

- జులైలో స్వల్పంగా పెరిగిన మారుతీ అమ్మకాలు
- తగ్గిన టాటా, హ్యుందాయ్ టోకు సరఫరాలు



దేశీయ విపణిలో గిరాకీ నెమ్మదించడంతో కార్ల తయారీ దిగ్గజ కంపెనీల టోకు సరఫరాలపై ప్రభావం పడింది. ఈ ఏడాది జులైలో మారుతీ సుజుకీ దేశీయంగా 1,37,776 వాహనాలను డీలర్లకు సరఫరా చేసింది. 2024 జులైలో ఈ సంఖ్య 1,37,463. ఈ కంపెనీ ఎగుమతులు 23,985 నుంచి 31,745కు పెరిగాయి. కంపెనీ మొత్తం విక్రయాలు 1,75,041 వాహనాల నుంచి 3 శాతమే పెరిగి 1,80,526గా నమోదయ్యాయి. టాటా మోటార్స్, హ్యుందాయ్‌ల మొత్తం విక్రయాలు తగ్గగా.. మహీంద్రా అండ్ మహీంద్రా, కియా విక్రయాల్లో రెండంకెల వృద్ధి ఉంది.

✦ ఏడాది వ్యవధిలో **మారుతీ సుజుకీ** చిన్న కార్ల విభాగం (ఆల్టో, ఎస్- ప్రెస్సో) అమ్మకాలు 9,960 వాహనాల నుంచి 6,822కు తగ్గగా.. బాలెనో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్‌తో కూడిన కాంపాక్ట్ కార్ల విభాగం అమ్మకాలు 58,682 నుంచి 65,667కు పెరిగాయి. గ్రాండ్ విటారా, బ్రెజా, ఎర్టిగా, ఎక్స్ఎల్6 మోడళ్లతో కూడిన యుటిలిటీ వాహనాల విభాగం అమ్మకాలు 56,302 నుచి 52,773కు తగ్గాయి.

✦ **టాటా మోటార్స్** ప్రయాణికుల వాహనాల మొత్తం విక్రయాలు 4% తగ్గగా.. దేశీయ విక్రయాల్లోనూ 12% క్షీణత ఉంది. 2024 జులైలో ఈ సంస్థ దేశీయంగా 44,725 కార్లను విక్రయించగా.. ఈ ఏడాది జులైలో 39,521 వాహనాలకు పరిమితమైంది. వాణిజ్య వాహనాల మొత్తం అమ్మకాలు 27,042 వాహనాల నుంచి 7% పెరిగి 28,956 వాహనాలకు చేరాయి.

✦**హ్యుందాయ్** దేశీయ అమ్మకాలు 49,013 నుంచి 10% తగ్గి 43,973కు పరిమితమయ్యాయి.

✦**మహీంద్రా అండ్ మహీంద్రా** మొత్తం అమ్మకాల్లో 26 శాతం వృద్ధి ఉంది. ఎగుమతులు 41,623 నుంచి 20% పెరిగి 49,871కు చేరాయి. ట్రాక్టర్ల మొత్తం అమ్మకాలు 27,209 నుంచి 28,708కు చేరాయి.

**జులైలో వాహనాల మొత్తం విక్రయాలు**

| కంపెనీ | 2025 | 2024 | వృద్ధి/ క్షీణత(%) |
|---|---|---|---|
| మారుతీ సుజుకీ | 1,80,526 | 1,75,041 | 3 |
| హ్యుందాయ్ | 60,073 | 64,563 | -7 |
| మహీంద్రా అండ్ మహీంద్రా | 83,691 | 66,444 | 26 |
| టాటా మోటార్స్ | 69,131 | 71,996 | -4 |
| కియా ఇండియా | 22,135 | 20,507 | 8 |
| హోండా కార్స్ ఇండియా | 7,524 | 4,050 | 3 |
| టొయోటా కిర్లోస్కర్ | 32,575 | 31,656 | 3 |
| జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ | 6,678 | 4,575 | 46 |
| అశోక్ లేలాండ్ | 15,064 | 13,928 | 8 |
| బజాజ్ ఆటో | 3,66,000 | 3,54,169 | 3 |
| ద్విచక్రవాహనాలు | | | |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | 88,045 | 67,265 | 31 |
| సుజుకీ మోటార్‌సైకిల్ | 1,13,600 | 1,16,714 | -2.7 |
| టీవీఎస్ మోటార్ | 4,56,350 | 3,54,140 | 29 |
| హీరో మోటోకార్ప్ | 4,49,755 | 3,70,274 | 21 |
| హెచ్ఎంఎస్ఐ | 5,15,378 | ---- | ---- |

## టాటా ఇన్‌స్టిట్యూట్‌తో ఎజిలెంట్ భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: పోషకాహారం, జీవక్రియకు సంబంధించి అత్యాధునిక పరిశోధనలు నిర్వహించేందుకు హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌తో ఎజిలెంట్ టెక్నాలజీస్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. జీవన శైలి వ్యాధులకు సంబంధించి పోషకాహార లోప సమస్యను పరిష్కరించేందుకు ఈ రెండు సంస్థలూ కలిసి పనిచేయనున్నాయి. ప్రభుత్వ మద్దతున్న 'అరుంధ' (అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ యూనిట్ ఆన్ మెటబాలిజం, డెవలప్‌మెంట్ అండ్ ఏజింగ్)కు ఇది తోడ్పడనుంది. డేటా ఆధారిత ఆవిష్కరణలను చేయడం, ప్రజారోగ్య వ్యూహాలను తెలియజేయడంపై ఈ సంస్థలు దృష్టి సారిస్తాయి.

## రూ.100 కోట్లతో మ్యాక్సీవిజన్ కొత్త ఆసుపత్రులు

ఈనాడు, హైదరాబాద్: మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ (మ్యాక్సీవిజన్) చెన్నైలోని పలు ప్రదేశాల్లో, తమిళనాడు రాష్ట్రంలోని ముఖ్యమైన నగరాలు, పట్టణాల్లో నూతన నేత్ర వైద్యశాలలు ఏర్పాటు చేస్తోంది. దీని కోసం రెండేళ్లలో రూ.100 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. ఈ సంస్థ చెన్నైలో నెలకొల్పిన హాస్పిటల్/ విజన్ సెంటర్‌ను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎం.ఎస్.ధోనీ ప్రారంభించారు. మ్యాక్సీవిజన్ సీఎండీ జీఎస్‌కే వేలు, సహ-ఛైర్మన్ కాసు ప్రసాదరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బి.గణేష్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

**ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)**

| కంపెనీ | నికర లాభం/(నష్టం) | | మొత్తం ఆదాయం | |
|---|---|---|---|---|
| | 2025-26 | 2024-25 | 2025-26 | 2024-25 |
| యూపీఎల్ | (176) | (567) | 9216 | 9067 |
| పీసీ జువెలర్ | 162 | 156 | 808 | 440 |
| టాటా పవర్ | 1262 | 1189 | 17464 | 16810 |
| గోద్రేజ్ ప్రాపర్టీస్ | 598 | 519 | 1620 | 1699 |
| జీఎస్‌కే ఫార్మా | 279 | 249 | 849 | 850 |
| హెస్టర్ బయో | 17 | 7 | 84 | 82 |
| అదానీ పవర్ | 3305 | 3913 | 14167 | 15052 |
| వన్‌మొబిక్విక్ | (42) | (6.6) | 271 | 342 |

# కొనసాగిన టారిఫ్ నష్టాలు



**2 రోజుల్లో రూ.7.77 లక్షల కోట్ల సంపద ఆవిరి**

**ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,366 కోట్లు**
**డీఐఐ కొనుగోళ్లు: రూ.3,187 కోట్లు**

**సెన్సెక్స్ ▼586 80600** | **నిఫ్టీ ▼203 24565**

**సమీక్ష**

మనదేశంపై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్‌ల వల్ల, వరుసగా రెండో రోజూ దేశీయ సూచీలు నష్టపోయాయి. ఔషధ, లోహ, ఐటీ షేర్లు డీలాపడటంతో సెన్సెక్స్ 81000 పాయింట్ల దిగువకు చేరింది. నిఫ్టీ 24,600 పాయింట్ల స్థాయిని కోల్పోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 47 పైసలు కోలుకుని 87.18 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.39% నష్టంతో 71.42 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ శుక్రవారం రూ.4.80 లక్షల కోట్లు తగ్గి రూ.444.52 లక్షల కోట్లు (5.09 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది. గత 2 రోజుల్లో రూ.7.77 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 111 పాయింట్ల (క్రితం ముగింపు 81,185.58) నష్టంతో 81,074.41 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అనంతరం లాభాల్లోకి వచ్చిన సూచీ, 81,317.51 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మళ్లీ అమ్మకాలు రావడంతో, తిరిగి నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఒకదశలో 80,495.57 పాయింట్లకు పడిపోయింది. చివరకు 585.67 పాయింట్ల నష్టంతో 80,599.91 వద్ద ముగిసింది. నిఫ్టీ 203 పాయింట్లు కోల్పోయి 24,565.35 దగ్గర స్థిరపడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 23 నష్టాలు నమోదుచేశాయి. సన్‌ఫార్మా 4.49%, టాటా స్టీల్ 3.04%, మారుతీ 2.65%, టాటా మోటార్స్ 2.60%, ఇన్ఫోసిస్ 2.52%, అదానీ పోర్ట్స్ 1.91%, టెక్ మహీంద్రా 1.71%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.67%, బీఈఎల్ 1.55%, భారతీ ఎయిర్‌టెల్ 1.47% నష్టపోయాయి. ట్రెంట్ 3.24%, ఏషియన్ పెయింట్స్ 1.40%, హెచ్‌యూఎల్ 1.17%, ఐటీసీ 1.14% లాభపడ్డాయి.

✦పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ ఎండీ, సీఈఓ గిరీశ్ కౌస్గీ తన పదవికి రాజీనామా చేశారు. అక్టోబరు 28 నుంచి ఆయన రాజీనామా అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ హౌసింగ్ షేరు 18.06% కుప్పకూలి రూ.808.05 వద్ద ముగిసింది.

✦ త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపరచడంతో సన్ ఫార్మా షేరు 4.49% తగ్గి రూ.1629.05 దగ్గర స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ గత రెండు రోజుల్లో రూ.25,418.49 కోట్లు కోల్పోయి రూ.3.90 లక్షల కోట్లకు పరిమితమైంది.

✦ కంపెనీలో 12% వాటాను సింగపూర్ సంస్థ **యునిక్యూబ్ గ్లోబల్** కొనుగోలు చేసే ప్రతిపాదనకు **ఐఎఫ్ఎల్ ఎంటర్‌ప్రైజెస్** బోర్డు ఆమోదం తెలిపింది.

## 2.7 బి.డాలర్లు తగ్గిన ఫారెక్స్ నిల్వలు

మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు జులై 25తో ముగిసిన వారానికి 2.703 బి.డాలర్లు (దాదాపు రూ.24,000 కోట్లు) తగ్గి 698.192 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.59 లక్షల కోట్ల)కు పరిమితమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 1.183 బి.డాలర్లు అధికమై 695.489 బి.డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 1.316 బి.డాలర్లు పెరిగి 588.926 బి.డాలర్లుగా నమోదయ్యాయి.

✦ **ఎన్ఎస్‌డీఎల్** రూ.4011 కోట్ల ఐపీఓ ముగిసేసరికి 41 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 3,51,27,002 షేర్లను ఆఫర్ చేయగా, 1,44,03,92,004 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 103.97 రెట్లు, ఎన్ఐఐ విభాగంలో 34.98 రెట్లు, రిటెయిల్ విభాగంలో 7.73 రెట్ల స్పందన లభించింది.

✦**శ్రీలోటస్ డెవలపర్స్** ఐపీఓ చివరి రోజుకు 69.14 రెట్ల స్పందన నమోదైంది. ఇష్యూలో భాగంగా 3,96,58,730 షేర్లను జారీ చేయనుండగా, 2,74,18,69,400 షేర్లకు బిడ్లు వచ్చాయి. క్యూఐబీ విభాగంలో 163.90 రెట్లు, ఎన్ఐఐల నుంచి 57.71 రెట్లు, రిటెయిల్ విభాగంలో 20.28 రెట్ల స్పందన దక్కింది.

✦ **ఎం అండ్ బీ ఇంజినీరింగ్** ఐపీఓ ముగిసేసరికి 36.2 రెట్ల స్పందన వచ్చింది. ఇష్యూలో 97,98,309 షేర్లను ఆఫర్ చేయగా, 35,47,18,980 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఎన్ఐఐల నుంచి 38.24 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 32.55 రెట్లు, క్యూఐబీ విభాగంలో 36.72 రెట్ల స్పందన నమోదైంది.

✦ డేటా హ్యాండ్లింగ్, అంతర్గత పరిపాలన, నియంత్రణపరమైన నిబంధనల ఉల్లంఘన కేసును సెబీతో పరిష్కరించుకునేందుకు **ఎన్ఎస్ఈ** రూ.40.35 కోట్లు చెల్లించింది.

✦ **శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్** షేరు ఇష్యూ ధర రూ.199తో పోలిస్తే, 15.12% లాభంతో రూ.229.10 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.238.40 వద్ద గరిష్ఠాన్ని తాకినా, చివరకు 15.17% పెరిగి రూ.229.20 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,652.44 కోట్లుగా నమోదైంది.

✦ మ్యూచువల్ ఫండ్ కార్యకలాపాలను ప్రారంభించేందుకు తమ అనుబంధ సంస్థ ఛాయిస్ ఏఎంసీకి సెబీ తుది అనుమతి ఇచ్చినట్లు ఆర్థిక సేవల కంపెనీ ఛాయిస్ ఇంటర్నేషనల్ వెల్లడించింది.

దక్షిణ భారతదేశాన్ని పరిపాలించిన రాజ వంశాల్లో చోళులది ప్రత్యేక స్థానం. తంజావూరు రాజధానిగా చేసుకుని మూడు శతాబ్దాలకుపైగా పరిపాలన సాగించారు. వీరు పల్లవులకు సామంతులుగా ఉండేవారు. తర్వాతి కాలంలో స్వతంత్రులయ్యారు. ప్రాచీన చోళులతో వీరికి ఎలాంటి సంబంధం లేదు. వీరు తమ కాలంలో అనేక పరిపాలనా సంస్కరణలు ప్రవేశపెట్టారు. తమిళ భాషను, సాహిత్యాన్ని ఆదరించారు. అంతర్జాతీయ వర్తక వాణిజ్యం నెరిపారు. ఆర్థిక, మత, సాంస్కృతిక రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించారు.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

# ఆలయ శిల్పకళ అత్యున్నతం బహుళ అంతస్తుల్లో నిర్మాణం

## చోళులు

### రాజకీయ చరిత్ర

**విజయాలయ చోళ:** ఇతడు చోళ వంశస్థాపకుడు. ఇతడు మొదట్లో పల్లవులకు సామంతుడిగా ఉండేవాడు. పాండ్య సామంతుడు 'ముత్తరయార్'ను ఓడించి, తంజావూరును ఆక్రమించాడు. ఈ ప్రాంతంలో నిశుంబసూదిని ఆలయాన్ని నిర్మించాడు. పల్లవులు, పాండ్యుల మధ్య వివాదాలను అవకాశంగా మలుచుకుని, తంజావూరు రాజధానిగా చేసుకుని స్వతంత్ర చోళ సామ్రాజ్యాన్ని స్థాపించాడు.

**ఆదిత్య చోళ:** పల్లవరాజు నందివర్మ మరణానంతరం అతడి కుమారులను చంపి (వేర్వేరు సమయాల్లో) వారి రాజ్యాన్ని అంతం చేశాడు.

**పరాంతక చోళ:** ఇతడు ఆదిత్య చోళుడి కుమారుడు. పాండ్య రాజు మారవర్మ రెండో రాజసింహుడిని ఓడించి, మధురైను స్వాధీనం చేసుకున్నాడు. దీంతో ఇతడు మధురైకొండ అనే బిరుదు పొందాడు.

- చెంగల్పట్ దగ్గరలోని ఉత్తర మేరూర్ గ్రామంలో క్రీ.శ.919, 921లో రెండు తమిళ శాసనాలు వేయించాడు. ఇవి చోళుల కాలంనాటి గ్రామ స్వపరిపాలన గురించి తెలియజేస్తాయి.

**రాజరాజ చోళ-I (985–1014):** ఇతడి అసలు పేరు అరుమొలివర్మ. ఈయన బిరుదులు రాజరాజ, జయంగొండ, ముమ్మడి చోళదేవ, చోళమార్తాండ, రాజకేసరి.

- ఇతడు మాల్దీవులు, లక్షదీవులను జయించాడు.
- శ్రీలంక రాజు మహింద-Vను ఓడించి, రాజధాని అనురాధపురాన్ని ధ్వంసం చేసి, ఉత్తర శ్రీలంకను జయించాడు. ఈ ప్రాంతంలో పొలన్నరువ రాజధానిగా ముమ్మడిచోళ మండలం అనే కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేశాడు.

**రాజేంద్ర చోళ-I (1014–1044):** ఇతడిని చరిత్రకారులు 'దక్షిణ భారత నెపోలియన్'గా పిలుస్తారు.

- దక్షిణ శ్రీలంకను జయించి శ్రీలంక రాజు మహింద-Vను బందీగా తంజావూరుకు తీసుకువచ్చాడు. ఇతడి బిరుదులు ఉత్తమచోళ, పండితచోళ, ముదికొండచోళ.
- 1022లో బిహార్, బెంగాల్‌పై దండెత్తి పాలరాజు మహిపాలుడిని ఓడించి 'గంగైకొండ' అనే బిరుదు పొందాడు. దీనికి గుర్తుగా తంజావూర్ సమీపంలో గంగైకొండ చోళపురం అనే నగరాన్ని నిర్మించాడు.
- 1025లో ఇండోనేసియా రాజు సంగ్రామ విజయోత్తుంగవర్మను ఓడించి 'కదారంకొండ' అనే బిరుదును పొందాడు.
- వ్యాపారాభివృద్ధి కోసం రెండు దౌత్య బృందాలను చైనాకు పంపాడు. నాగపట్నంలోని చూడమణి బౌద్ధ విహారానికి ఒక గ్రామాన్ని దానంగా ఇచ్చాడు.

**రాజాధిరాజ (1044–1052):** ఇతడు అశ్వమేధయాగం నిర్వహించాడు.

- పుండూరు యుద్ధంలో కళ్యాణి చాళుక్య రాజు మొదటి సోమేశ్వరుడిని ఓడించి, యాతగిరిలో విజయస్తంభాన్ని ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత జరిగిన కొప్పం యుద్ధంలో సోమేశ్వరుడి చేతిలో ప్రాణాలు కోల్పోయాడు.

**కులోత్తుంగ చోళ-I (1070–1122):** ఇతడు ఆంధ్రాను పాలించిన వేంగి చాళుక్య వంశస్థుడైన రెండో రాజేంద్రుడు. చోళ రాకుమార్తె మధురాంతకిని వివాహం చేసుకున్నాడు. చోళ సామ్రాజ్యంలో వారసుడు లేకపోవడంతో వేంగి చాళుక్య, చోళ రాజ్యాలను విలీనం చేసి కులోత్తుంగ చోళ అనే పేరుతో పరిపాలన సాగించాడు.

- అనేక పన్నులను రద్దు చేసి సుంగంతవిర్త అనే బిరుదు పొందాడు.
- 1077లో వ్యాపారాభివృద్ధి కోసం 72 మందితో కూడిన దౌత్య బృందాన్ని చైనాకు పంపాడు. ఇతడి కాలంలోనే చోళులు శ్రీలంకను కోల్పోయారు.
- కాంబోడియా రాజు సూర్యవర్మ-IIతో ఇతడికి దౌత్య సంబంధాలుండేవి.
- సూర్యవర్మ-II 12వ శతాబ్దంలో కంబోడియాలో అంగ్‌కోర్‌వాట్ దేవాలయాన్ని (విష్ణు ఆలయం) నిర్మించాడు. ఇది ప్రపంచంలోనే అత్యంత పెద్ద హిందూ దేవాలయంగా గుర్తింపు పొందింది. యునెస్కో దీన్ని ప్రపంచ వారసత్వ కేంద్రంగా ప్రకటించింది.

**కులోత్తుంగ చోళ-III:** ఇతడు చోళ వంశంలో చివరివాడు.

- చోళుల అనంతరం దక్షిణాదిన రెండు స్వతంత్ర రాజ్యాలు వెలిశాయి. అవి:

**1. పాండ్య రాజ్యం:** వీరు మధురై రాజధానిగా తమిళనాడును పాలించారు.

**2. హొయసల రాజ్యం:** ద్వారసముద్రం (కర్ణాటకలోని హళేబీడు) రాజధానిగా కర్ణాటకను పాలించారు. వీరు అమరశిల్పి జక్కన ఆధ్వర్యంలో అనంత శిల్పసంపదతో కూడిన అద్భుతమైన మూడు ఆలయాలను నిర్మించారు.

- హొయసలేశ్వర ఆలయం - హళేబీడు
- చెన్నకేశవ స్వామి ఆలయం - బేలూరు
- చెన్నకేశవ స్వామి ఆలయం - సోమనాథపురం

## వాస్తు శిల్పకళలు

చోళుల కాలంలో హిందూ దేవాలయాల నిర్మాణం అత్యున్నత శిఖరాలకు చేరుకుంది. పల్లవులు ప్రారంభించిన ద్రావిడ శైలిని మరింత అభివృద్ధి చేసిన ఘనత వీరికే దక్కుతుంది. వీరు నిర్మించిన ఆలయాల్లో బహుళ అంతస్తుల విమానాలు, గోపురాలు, మండపాలు కనిపిస్తాయి.

**తంజావూరు–బృహదీశ్వర ఆలయం:** దీన్ని రాజరాజేశ్వర ఆలయం అని కూడా అంటారు. 1010లో రాజరాజచోళ-I నిర్మించాడు. 216 అడుగుల ఎత్తు, 13 అంతస్తుల విమానంతో నిర్మితమైన ఈ ఆలయం భారతదేశంలో అత్యంత ఎత్తైన ఆలయంగా గుర్తింపు పొందింది.

- ఈ ఆలయ నిర్మాణానికి సుమారుగా 1,30,000 టన్నుల గ్రానైట్ రాయిని ఉపయోగించారు. యునెస్కో ఈ ఆలయాన్ని ప్రపంచ వారసత్వ కేంద్రంగా గుర్తించింది. అందమైన కుడ్య చిత్రాలు ఈ ఆలయ విశిష్టత.

**గంగైకొండ చోళపురంలోని బృహదీశ్వర ఆలయం:** ఇది చోళుల కాలంనాటి రెండో గొప్ప ఆలయం. దీన్ని రాజేంద్రచోళ-I నిర్మించాడు. ఈ ఆలయ విమానాన్ని 180 అడుగుల ఎత్తుతో 9 అంతస్తుల్లో నిర్మించారు.

**ఐరావతేశ్వర ఆలయం:** ఈ ఆలయాన్ని రాజరాజచోళ-II దరశురాంలో నిర్మించాడు. ఈ ఆలయంలో అత్యద్భుతమైన శిల్పాలతో అలంకరించిన రథాకారంలోని మండపం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది.

**కురంగనాథ ఆలయం:** ఈ ఆలయాన్ని పరాంతక చోళ శ్రీనివాసనల్లూరులో నిర్మించాడు.

**విజయచోళేశ్వర ఆలయం:** దీన్ని నార్థమలైలో విజయాలయ చోళుడు నిర్మించాడు.

**బాలసుబ్రమణ్య ఆలయం:** దీన్ని మొదటి ఆదిత్య చోళుడు కన్నూర్‌లో నిర్మించాడు.

వీరి కాలంలో శైవ మతం బాగా వ్యాప్తి చెందింది. వీరు లోహ శిల్పకళలో ప్రావీణ్యం సాధించారు.

## చోళుల గ్రామ స్వపరిపాలన

దక్షిణ భారతదేశంలో చోళులు ఒక విశిష్టమైన పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేశారు. పై స్థాయిలో కేంద్రీకృతమైన పాలనా వ్యవస్థ, కింది స్థాయిలో ప్రజాస్వామ్య వికేంద్రీకృతమైన పరిపాలన ఉండేవి. రాజ్యాన్ని మండలాలుగా (రాష్ట్రాలు), మండలాలను వలనాడులుగా (జిల్లాలు), వలనాడులను నాడులుగా (తాలూకాలు), నాడులను కొట్టములుగా (గ్రామాల సముదాయం) విభజించారు. గ్రామాల్లో ప్రజాస్వామ్యయుతమైన స్థానిక స్వపరిపాలన వ్యవస్థను ప్రవేశపెట్టారు.

- భారతదేశంలో స్థానిక స్వపరిపాలన చరిత్ర చోళులతోనే ప్రారంభమైందని చెప్పవచ్చు. పరాంతక చోళుడు వేసిన ఉత్తర మేరూర్ శాసనాల్లో గ్రామ స్వపరిపాలనను సంబంధించిన సమాచారం ఉంది. గ్రామపాలన నిర్వహించడానికి ప్రతి గ్రామానికి ఒక అసెంబ్లీ ఉండేది. గ్రామ స్వభావం ఆధారంగా అసెంబ్లీని వివిధ పేర్లతో పిలిచేవారు. అవి:

1. అగ్రహార/బ్రహ్మదేయ గ్రామాల అసెంబ్లీని 'సభ' అని పిలిచేవారు. ఇందులో బ్రాహ్మణులకు మాత్రమే సభ్యత్వం ఉండేది.
2. వ్యాపారులు నివసిస్తున్న గ్రామాలను పాలించే అసెంబ్లీని 'నగర' అనేవారు. వర్తకులకు మాత్రమే ఇందులో ప్రవేశం కల్పించారు.
3. వ్యవసాయ గ్రామాలను పాలించే అసెంబ్లీని 'ఉర్' అని పిలిచేవారు. గ్రామంలోని భూస్వాములకు మాత్రమే సభ్యత్వం ఉండేది.

- ప్రతి గ్రామంలో 'వరియం' అనే గ్రామ కమిటీలు ఉండేవి. ఈ కమిటీలు గ్రామ అసెంబ్లీ పర్యవేక్షణలో గ్రామపాలనను నిర్వహించేవి. ఈ కమిటీల్లోని సభ్యులను వరియార్ లేదా పెరుమక్కల్ అనేవారు. వీరిని కుండవలి విధానం ద్వారా ఎన్నుకునేవారు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

## 729 Word of the Day

**Jaded**

**Telugu meaning:** విసిగిపోయిన, అలసిన

**English meaning:** The word jaded (జేడెడ్) is an adjective that describes someone who is tired or bored, usually due to over-exposure or excess.

**Synonyms:** Weary, Fed up

**Antonyms:** Enthusiastic, Fresh

**Usage:** 1. Years of disappointment had left her jaded and emotionally distant.
2. After attending countless parties, he became jaded with the nightlife scene.

## కరెంట్ అఫైర్స్



ఇస్రో, నాసా సింథటిక్ ఎపర్చర్ రాడార్ (నైసార్) ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 వాహకనౌక 2025, జులై 30న విజయవంతంగా కక్ష్యలోకి తీసుకెళ్లింది. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాతో కలిసి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేపట్టిన తొలి అంతరిక్ష ప్రయోగం ఇది. తిరుపతి జిల్లాలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరిగింది.

- సాయంత్రం 5 : 40కి నైసార్‌ను తీసుకుని జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. 19 నిమిషాల తర్వాత 745 కి.మీ. ఎత్తులో ఉన్న సన్ సింక్రనస్ పోలార్ ఆర్బిట్ (ఎస్ఎస్‌పీఓ)లో 2392 కిలోల బరువున్న నైసార్ ఉపగ్రహాన్ని విడిచిపెట్టింది. తద్వారా 10 ఏళ్ల ఇస్రో, నాసా కృషి ఫలించినట్లయ్యింది.



ప్రపంచ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఫ్రెంచ్ స్టార్ స్విమ్మర్ లెయోన్ మార్షాన్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 2025, జులై 30న సింగపూర్‌లో జరిగిన పురుషుల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే సెమీఫైనల్లో మార్షాన్ ఒక నిమిషం 52.61 సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానం సాధించాడు. 2011లో ర్యాన్ లోక్టే (1 నిమిషం 54 సెకన్లు-అమెరికా) పేరిట నమోదైన రికార్డును అధిగమించాడు.

దేశంలో ప్రతి ఇంట్లో ఏటా సగటున 55 కిలోల ఆహారం వృథా అవుతున్నట్లు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి బి.ఎల్. వర్మ 2025, జులై 30న లోక్‌సభలో తెలిపారు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వెలువరించిన ఆహార వృథా సూచిక-2024 నివేదిక ప్రకారం ఈ లెక్కలు తేలినట్లు చెప్పారు.

ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) 2025 ఫార్చూన్ గ్లోబల్-500 జాబితాలో అత్యుత్తమ భారతీయ కంపెనీగా నిలిచింది. అంతర్జాతీయంగా చూస్తే 88వ ర్యాంకును పొందింది. 2024లో ఈ సంస్థ 86వ ర్యాంకులో ఉండగా, 2021లో 155 స్థానంలో ఉంది.

- ఈ జాబితా అగ్రస్థానంలో అమెరికా రిటైల్ దిగ్గజం వాల్ మార్ట్ ఉంది. ఆ తర్వాతి స్థానంలో అమెజాన్ నిలిచింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## భారతదేశంలో ప్రధాన వ్యవసాయ విప్లవాలు

స్టడీ - జోన్

భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఉంది. నేటికీ సుమారు 55 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. దేశ శ్రామికశక్తిలో అధిక భాగం ఇందులోనే ఉన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీలో సుమారు 16% ఆదాయం ఈ రంగం నుంచే సమకూరింది.

- భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం ఆహార ధాన్యాల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు అనేక చర్యలు చేపట్టారు. వివిధ ప్రణాళికల్లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. 1960 దశకం నుంచి మనదేశంలో అనేక వ్యవసాయ విప్లవాలు ప్రారంభమయ్యాయి. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఆమె వీటిని మరింత ప్రోత్సహించారు. అందుకే ఆమెను 'భారతదేశ వ్యవసాయ విప్లవాల మాత' అంటారు.
- భారతదేశంలో పంటసాగుకు వర్షాలే మూలాధారం. ఇది పూర్తిగా రుతుపవనాలపైనే ఆధారపడి ఉంటుంది. వర్షాభావం, అధిక వర్షాలు, పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడం మొదలైనవన్నీ వ్యవసాయానికి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. పెరుగుతున్న జనాభాకు తగ్గట్లు అందరికీ సరిపడా ఆహారం అందించడం ప్రభుత్వాలకు పెద్ద సవాలే. పైగా వ్యవసాయ భూములు నానాటికీ తరిగిపోతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నేలల్లోనే అధిక దిగుబడి ఇచ్చే పంటల సాగుపై దృష్టి కేంద్రీకరించింది.

దిగుబడి ఉత్పాదకతను పెంచే క్రమంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో ప్రభుత్వం కొన్ని విప్లవాలను ప్రవేశపెట్టింది. కొత్త ఆవిష్కరణలు, నూతన సాంకేతికత ద్వారా ఆ రంగంలో సరికొత్త ఒరవడికి అవి నాందిగా నిలిచాయి. ఇవి వ్యవసాయ రంగ అభివృద్ధితోపాటు కొత్త అవకాశాలను సృష్టించాయి.




- మన దేశంలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వచ్చిన ప్రధాన రెవల్యూషన్‌లను పరిశీలిస్తే..

| పేరు | ఉత్పత్తులు | పితామహులు |
|---|---|---|
| గ్రీన్ రెవల్యూషన్ | ఆహార పంటలు | ఎం.ఎస్.స్వామినాథన్ |
| ఎల్లో రెవల్యూషన్ | నూనెగింజలు | శామ్ పిట్రోడా |
| వైట్ రెవల్యూషన్ | పాలు | వర్గీస్ కురియన్ |
| బ్లూ రెవల్యూషన్ | చేపలు, దాని ఉత్పత్తులు | అరుణ్ కృష్ణన్ |
| సిల్వర్ రెవల్యూషన్ | పౌల్ట్రీ, కోడిగుడ్లు | ఇందిరా గాంధీ |
| గోల్డెన్ రెవల్యూషన్ | ఆపిల్ పండ్లు, పసుపు, తేనె | నిర్పఖ్ తుతేజ్ |
| పింక్ రెవల్యూషన్ | రొయ్యలు, ఉల్లిగడ్డలు | దుర్గేశ్ పటేల్ |



## జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

### ఆధునిక భౌతికశాస్త్రం




**ఆధునిక భౌతికశాస్త్రం 1900లో ఆవిర్భవించింది. ప్లాంక్ క్వాంటం సిద్ధాంతం ఆధునిక భౌతికశాస్త్రానికి పునాదులు వేసింది. ఇది కృష్ణ వస్తువు వికిరణాన్ని అర్థం చేసుకోవడంలో కొత్త తరహా ఆలోచనలకు నాంది పలికింది. ఆధునిక భౌతికశాస్త్ర పితామహుడిగా ఐన్‌స్టీన్‌ను పేర్కొంటారు. ఈయనతో పాటు ఎందరో శాస్త్రవేత్తల కృషితో ఇది మరింత అభివృద్ధి చెందింది.**

### సంప్రదాయం, అధునాతనం

భౌతికశాస్త్ర స్థూల ధర్మాలను న్యూటన్ నియమాల ఆధారిత సంప్రదాయ భౌతికశాస్త్రం (Classical Physics) వివరిస్తుంది.

- మాక్స్‌వెల్ విద్యుదయస్కాంత తరంగాలను కనుక్కున్నాక ప్లాంక్ క్వాంటం సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. శక్తి అతి చిన్న కణాల రూపంలో ఉంటుందని, వాటిని క్వాంటంలు (quanta) అంటారని ఇది తెలిపింది. సూక్ష్మ భౌతికశాస్త్ర అధ్యయనానికి క్వాంటం సిద్ధాంతం పునాది వేసింది.

### ప్రోటాన్ – న్యూట్రాన్‌ల ఆవిష్కరణ

కేథోడ్ కిరణాలను ఇచ్చే ఉత్సర్గ నాళాన్ని కొంత మార్పునకు గురిచేసి యూజెన్ గోల్డ్‌స్టైయిన్ అనే శాస్త్రవేత్త ధనావేశిత ఆనోడ్ లేదా కెనాల్ కిరణాలను కనుక్కున్నారు.

**ఎలక్ట్రాన్ ఆవిష్కరణ - విద్యుత్ ఉత్సర్గం, ఉప పరమాణు కణాలు - కనుక్కున్న వారు, వివిధ పరమాణు నమూనాలు - ప్రతిపాదనలు - లోపాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.**

## నోటిఫికేషన్స్

### ప్రాజెక్ట్ అసోసియేట్ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ) ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 28. అర్హులైన అభ్యర్థులు 2025, ఆగస్టు 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

### బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగాలు

గుజరాత్ రాష్ట్రం వడోదరలోని బ్యాంక్ ఆఫ్ బరోడా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఒప్పంద ప్రాతిపదికన డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 330. దరఖాస్తు ఫీజు రూ.850. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 19 ఆగస్టు 2025.

### అప్రెంటిస్ పోస్టులు

గుడ్‌గావ్‌లోని ప్రభుత్వ రంగ సంస్థ రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (రైల్‌టెల్) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 40. అర్హులైన అభ్యర్థులు 2025 ఆగస్టు 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**దరఖాస్తు చేశారా..?** కింది ఉద్యోగాలకు నేడే (ఆగస్టు 2) చివరి తేదీ

- ఏపీ సీఆర్‌డీఏలో ఇన్వెస్ట్‌మెంట్ లీడ్ పోస్టులు. డిగ్రీ (ఇంజినీరింగ్), ఎకనామిక్స్, అర్బన్ ప్లానింగ్, ఫైనాన్స్, ఎంబీఏ/పీజీపీలో ఉత్తీర్ణతతో పాటు 2 ఏళ్ల పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- జిప్‌మర్‌లో ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్ ఉద్యోగాలు. పీజీ, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## Railway Exams
### Mathematics
### Ratio & Proportion

**1.** The value of a gemstone is directly proportional to the square of its weight. Unfortunately, it broke into three parts whose weights are in the ratio 2 : 3 : 5. Due to this breakage, a total loss of Rs. 14.57 lakhs occurred. What was the original value of the gemstone?
A) Rs.18.74 lakhs B) Rs.22.00 lakhs
C) Rs.24.15 lakhs D) Rs.23.50 lakhs

**2.** The weight of a wrestler varies jointly as his height and his age. When the wrestler is 1.6 m tall and 25 years old, he weighs 64 kg. What will be his weight when his height becomes 1.8 m and his age is 30 years?
A) 82.5 kg B) 86.4 kg
C) 81.2 kg D) 88.0 kg

**3.** In a coaching institute, the number of seats for Chemistry, English, and Computer Science are in the ratio 6 : 9 : 10. There is a plan to increase the seats by 25%, 20%, and 50% respectively. What will be the new ratio of seats for these subjects?
A) 30 : 54 : 75 B) 15 : 18 : 25
C) 24 : 27 : 40 D) 25 : 36 : 50

**4.** What is the fourth proportional to 7, 12, and 21?
A) 28 B) 36 C) 18 D) 36.5

**5.** A warehouse manager is storing small speakers in large cartons measuring 24 × 40 × 60 inches. If each speaker measures 6 × 5 × 4 inches, what is the maximum number of speakers that can be packed in one carton?
A) 160 B) 480 C) 200 D) 620

**6.** The number of students in three departments - History, Geography, and Economics - are in the ratio 4 : 6 : 7. If 18 students are added to each department, the ratio becomes 5 : 7 : 8. What was the total number of students before the increase?
A) 204 B) 240 C) 276 D) 306

**7.** A 36-litre solution contains alcohol and water in the ratio 4 : 5. How many litres of water must be added to this solution to make the new ratio of alcohol to water 4 : 7?
A) 6 B) 8 C) 10 D) 12

**8.** King Ashwathama decided to distribute 864 fruits among a lion, a panther, and a bear in the ratio 7 : 5 : 6. How many fruits should the panther receive?
A) 280 B) 260 C) 240 D) 220

**9.** In a sanctuary, there are peacocks and deer. Counting the heads gives 300 and counting the legs gives 880. How many peacocks are there?
A) 180 B) 160 C) 140 D) 120

**10.** If 5X = 10Y = 12Z, then what is the ratio X : Y : Z?
A) 12 : 6 : 5 B) 6 : 3 : 2.5
C) 12 : 3 : 5 D) 12 : 10 : 5

**11.** The ratio of marks obtained by Riya in theory to the total marks possible in theory is 3 : 5. The full marks in practical are 25% of the full marks in theory. If Riya secured full marks in practical, what is the ratio of her total marks obtained to the total marks that can be obtained in the subject (theory + practical)?
A) 17 : 25 B) 18 : 25
C) 19 : 25 D) 20 : 27

**12.** A father distributed chocolates among his four children and kept some with himself. The eldest three children received chocolates in the ratio 3 : 11 : 7. The total number of chocolates with the father and the youngest child is three times the total chocolates with the three eldest children. The ratio of chocolates with the father and with all the children is 3 : 4. If the youngest child has 81 chocolates, find the total number of chocolates.
A) 270 B) 300 C) 252 D) 240

**13.** Out of three positive numbers, the ratio of the first to the second is 3 : 4, and the ratio of the second to the third is 5 : 6. If the product of the second and the third numbers is 4320, what is the sum of the three numbers?
A) 177 B) 288 C) 252 D) 300

**14.** The monthly incomes of Aisha, Meera, and Kabir are in the ratio 92 : 88 : 96. If Meera's annual income is Rs.5,28,000, what is the total of Aisha's and Kabir's annual incomes?
A) Rs.10,48,000 B) Rs.10,24,000
C) Rs.10,56,000 D) Rs.11,28,000

**15.** The monthly incomes of Ramesh, Suresh, and Ganesh are in the ratio 14 : 10 : 6 and their expenditures are in the ratio 9 : 5 : 3 respectively. If Ramesh saves $\frac{2}{7}$ of his income, then what is the ratio of the savings of Ramesh, Suresh, and Ganesh?
A) 4 : 3 : 2 B) 3 : 2 : 1
C) 5 : 4 : 9
D) 9 : 10 : 6

Scan the QR code for Key

*These model questions were prepared by subject experts*

## కరెంట్ అఫైర్స్

■ భారతదేశ అతి పెద్ద ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ అయిన ఎల్ఐసీ (లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) 2025, జనవరి 20న ఒకే రోజున ఎన్ని జీవిత బీమా పాలసీలను చేయించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించింది? **జ:** 5,88,107

■ ఫార్ములా 2 రేసును గెలుచుకున్న మొదటి భారతీయ డ్రైవర్‌గా ఇటీవల ఎవరు వార్తల్లో నిలిచారు? (ప్రతిష్ఠాత్మక మొనాకో గ్రాండ్ ప్రిక్స్ స్ప్రింట్ రేసులో డామ్స్ లుకాస్ ఆయిల్ తరఫున ఈయన విజయం సాధించి, ఈ ఘనత పొందిన తొలి భారతీయుడిగా వార్తల్లో నిలిచాడు.) **జ:** కుష్ మైనీ

### మాదిరి ప్రశ్నలు

■ భారత ప్రభుత్వం ఇటీవల తన అధికారిక తీర ప్రాంతం పొడవును 7,516.6 కిలోమీటర్ల నుంచి ఎంతకు సవరించింది? (భూభాగంలో ఎలాంటి భౌతిక మార్పు సంభవించలేదని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, సూక్ష్మస్థాయి మ్యాపింగ్ వల్ల ఈ పెరుగుదల నమోదైనట్లు కేంద్ర హోంమంత్రిత్వశాఖ ప్రకటించింది.) **జ:** 11,098.8 కిలోమీటర్లు

మరింత సమాచారం

■ ప్రపంచ తాబేళ్ల దినోత్సవం సందర్భంగా 2025, మే 23న ఏ రాష్ట్రంలోని నాగశంకర్ ఆలయాన్ని తాబేళ్ల సంరక్షణకు ఒక సమూనా ఆలయంగా గుర్తించారు? **జ:** అస్సాం





# ‘ఆమె నా చెల్లెలి తండ్రి భార్య తల్లి!’

## రక్త సంబంధాలు

సాధారణంగా ఒక కుటుంబంలోని వ్యక్తుల మధ్య రెండు రకాల సంబంధాలు ఉంటాయి. అవి రక్త సంబంధాలు, చట్టపరమైన సంబంధాలు. అమ్మ, నాన్న, అన్న, తమ్ముడు, అక్క, చెల్లి మొదలైనవి రక్తసంబంధాలు. భార్య, భర్త, అత్త, మామ, అల్లుడు, కోడలు మొదలైనవి చట్టపరమైన సంబంధాలు. ప్రశ్నలో ఇద్దరు వ్యక్తుల మధ్య సంబంధాన్ని అడిగినప్పుడు, మన కుటుంబంలోని వ్యక్తులకు ఆ నియమాలను వర్తింపజేసి గుర్తించకుండా, ‘ట్రీ డయాగ్రం’ ఆధారంగా సులభంగా గుర్తించవచ్చు. ఇందుకు కింది సమాచారం ఉపయోగపడుతుంది.

- ◆ తండ్రి/తల్లి కుమారుడు - సోదరుడు
- ◆ తండ్రి/తల్లి కుమార్తె - సోదరి
- ◆ తండ్రి సోదరుడు - పినతండ్రి/ చిన్నాన్న /బాబాయ్
- ◆ తల్లి సోదరుడు - మేనమామ
- ◆ తల్లి సోదరి - పినతల్లి/చిన్నమ్మ/పిన్ని
- ◆ తండ్రి సోదరి - మేనత్త
- ◆ తండ్రి తల్లి - నాయనమ్మ
- ◆ తల్లి తల్లి - అమ్మమ్మ
- ◆ తండ్రి లేదా తల్లి తండ్రి - తాత
- ◆ కుమారుడి భార్య - కోడలు
- ◆ కుమార్తె భర్త - అల్లుడు
- ◆ భర్త/భార్య సోదరి - మరదలు
- ◆ భర్త/భార్య సోదరుడు - మరిది
- ◆ సోదరి భర్త - బావ
- ◆ భార్య/భర్త తండ్రి - మామ
- ◆ భార్య/భర్త తల్లి - అత్త
- ◆ అన్న భార్య - వదిన
- ◆ తమ్ముడి భార్య - మరదలు
- ◆ అక్క కొడుకు - మేనల్లుడు
- ◆ అక్క కూతురు - మేనకోడలు
- ◆ మా తాత ఏకైక కుమారుడు - నాన్న
- ◆ మా తాత ఏకైక కుమార్తె - అమ్మ

### జనరేషన్ చార్టు

| | | |
|---|---|---|
| తాత, నాయనమ్మ | | అమ్మమ్మ, తాత |
| మేనమామ, మేనత్త | | తల్లి, తండ్రి, పెద్దనాన్న/చిన్నాన్న, పెద్దమ్మ/ చిన్నమ్మ |
| బావమరిది, మరదలు | నేను | సోదరుడు, సోదరి, భార్య, వదిన |
| మేనల్లుడు, మేనకోడలు, కోడలు | | కుమార్తె, కుమారుడు, అల్లుడు |
| మనుమరాలు | | మనువడు |



★ ఈ రక్త సంబంధాలకు సంబంధించిన ప్రశ్నలు ప్రధానంగా నాలుగు రకాలుగా ఉంటాయి. అవి

1) నేరుగా ఉండే సంబంధాలు (డైరెక్ట్ రిలేషన్స్)
2) కుటుంబ సంబంధాలు (ఫ్యామిలీ రిలేషన్స్)
3) తృతీయ వ్యక్తి సంబంధాలు (ఇన్‌డైరెక్ట్ రిలేషన్స్)
4) కోడెడ్ సంబంధాలు (కోడెడ్ రిలేషన్స్)

**గమనిక:** ఈ అధ్యాయానికి సంబంధించిన ప్రశ్నలను సాధించడానికి కింది గుర్తులను ఉపయోగిస్తాం.

★ ఒకే తరానికి (జనరేషన్‌కు) చెందినవారిని అడ్డుగీతతో సూచిస్తాం.

**ఉదా:** A సోదరి B

A — B

★ వేర్వేరు తరాలకు చెందినవారిని నిలువు గీతతో

**ఉదా:** A కుమారుడు B

A
|
B



★ పురుషులను +, స్త్రీలను – గుర్తులతో సూచిస్తాం.


**ఉదా:**
A సోదరుడు B

$A — B^+$

★ భార్యా, భర్తలను ⟺ గుర్తుతో సూచిస్తాం.

**ఉదా:** A భార్య B

$A^+ \Longleftrightarrow B^-$



**ఏదైనా సందర్భంలో తల్లి ఒక యువతిని చూపించి ‘ఈమె మా పెదనాన్న తమ్ముడి కొడుకు కూతురు’ అని చెబితే వెంటనే బంధుత్వం ఏమిటో బుర్ర బద్దలుకొట్టుకోకుండా ఉండాలంటే కాస్త రక్తసంబంధాలపై అవగాహన పెంచుకోవాలి. ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యల్లో న్యాయపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు ఈ సంబంధాలను సరిగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. నిత్య జీవితంలో తరచూ ఎదురయ్యే ఇలాంటి సంఘటనల్లో అభ్యర్థుల తార్కిక ఆలోచనా నైపుణ్యాలను పరీక్షించడానికి రీజనింగ్‌లో రక్తసంబంధాలపై ప్రశ్నలు అడుగుతారు. ఇబ్బంది పడకుండా తేలికగా సమాధానాలను కనుక్కోవాలంటే కుటుంబ వృక్షం గీయడం నేర్చుకోవాలి. సంబంధాలను గుర్తుంచుకోవాలి. బంధుత్వాలను తెలుగులో, ఆంగ్లంలో ఏమని పిలుస్తారో స్పష్టంగా తెలుసుకోవాలి.**

### మాదిరి ప్రశ్నలు

1. **A, B లు సోదరులు. B కూతురు C. C సోదరి D. A తల్లి E అయితే D కి E ఏమవుతుంది?**
   1) అమ్మమ్మ 2) నాయనమ్మ
   3) మేనత్త 4) తాత

**వివరణ:** $E^-$
|
$A^+ — B^+$
|
$C^- — D^-$



∴ నాయనమ్మ **జ: 2**

2. **A, B లు అన్నదమ్ములు; C, D లు అక్కచెల్లెళ్లు. C కుమారుడు B. A తండ్రి E అయితే C నకు E ఏమవుతారు?**
   1) తండ్రి 2) తాత 3) అమ్మ 4) భర్త

**వివరణ:** $E^+ \Longleftrightarrow C^- — D^-$
|
$A^+ — B^+$

Cకు E భర్త అవుతాడు. **జ: 4**

(3 – 5): కింది సమాచారం ఆధారంగా ప్రశ్నలకు సమాధానం గుర్తించండి.

ఒక కుటుంబంలో A, B, C, D, E, F అనే ఆరుగురు సభ్యులున్నారు. C అమ్మమ్మ D. E కూతురు F. D భర్త B. F తమ్ముడు A. C, F లు భార్యాభర్తలు.

3. **B నకు A ఏమవుతాడు?**
   1) తాత 2) మనువడు
   3) మామయ్య 4) బావ

**వివరణ:** B నకు A మనువడు అవుతాడు. **జ: 2**

4. **Cనకు E ఏమవుతాడు?**
   1) మామయ్య 2) తండ్రి
   3) కుమారుడు 4) బావ

**వివరణ:** Cకు E మామయ్య అవుతాడు. **జ: 1**

5. **కుటుంబంలో ఎంత మంది స్త్రీలు ఉన్నారు?**
   1) 2 2) 3 3) 1 4) 4

## జనరల్ స్టడీస్
జనరల్ స్టడీస్ - రీజనింగ్

**వివరణ:** $D^- \Longleftrightarrow B^+$
|
E
|
$C^+ \Longleftrightarrow F^- — A^+$



కుటుంబంలోని మొత్తం స్త్రీల సంఖ్య ‘2’ (D, F) **జ: 1**

6. **పార్కులో నిల్చున్న మహిళను చూపిస్తూ రవి ఇలా అన్నాడు. ‘ఆమె, నా చెల్లెలి తండ్రి భార్య తల్లి’. అయితే పార్కులో నిల్చున్న మహిళ రవికి ఏమవుతుంది?**
   1) నాయనమ్మ 2) తల్లి
   3) అమ్మమ్మ 4) సోదరి

**వివరణ:**
ఆమె$^-$
|
తండ్రి$^+$ ⟺ తల్లి$^-$
|
రవి$^+$ — సోదరి$^-$



పార్కులో నిల్చున్న మహిళ రవికి అమ్మమ్మ అవుతుంది. **జ: 3**

7. **‘సీత తండ్రి రామన్, మా మామయ్య మోహన్‌కు ఒకే ఒక కుమారుడు.’ అని వీణ అంటే, సీత సోదరి అయిన సింధు, మోహన్‌కు ఏమవుతుంది?**
   1) సోదరి లేదా సోదరుడి కుమార్తె
   2) కుమార్తె
   3) కోడలు 4) మనుమరాలు

**వివరణ:**

నేను (వీణ) — మా మామయ్య — మోహన్ — కుమారుడు — రామన్
రామన్ కూతురు సీత, కూతురు సింధు — అక్కచెల్లెళ్లు



పై పటం ఆధారంగా సింధు.. మోహన్‌కు మనుమరాలు అవుతుంది. **జ: 4**

(8–10): కింది సమాచారాన్ని చదివి, సంబంధిత ప్రశ్నలకు సరైన జవాబులివ్వండి.

1) A × B అంటే B తండ్రి A
2) A + B అంటే B కుమార్తె A
3) A ÷ B అంటే B తల్లి A
4) A – B అంటే B సోదరుడు A

8. **P × T ÷ Q + R అనే సమాసంలో R, P నకు ఏమవుతారు?**
   1) అల్లుడు 2) భర్త
   3) కుమార్తె 4) కుమారుడు

**వివరణ:** $P^+$
|
$R^+ \Longleftrightarrow T^-$
|
$Q^-$



R, P నకు అల్లుడు అవుతాడు. **జ: 1**


9. **P + R – Q × T అనే సమాసంలో P, T నకు ఏమవుతారు?**
   1) సోదరి 2) తాత
   3) అత్త 4) అమ్మమ్మ/నానమ్మ

**వివరణ:** $P^-$
|
$R^+ — Q^+$
|
T



P, Tనకు నానమ్మ అవుతుంది. **జ: 4**

10. **‘P భార్య R’ అని సూచించే సమాసం ఏది?**
    1) P ÷ T + R – Q
    2) P × T – Q + R
    3) P ÷ R – Q + T
    4) P × R – Q – T



**వివరణ:** మొదటి ఆప్షన్ నుంచి
$P^- \Longleftrightarrow R^+ — Q$
|
$T^-$


రెండో ఆప్షన్ నుంచి
$P^+ \Longleftrightarrow R^-$
| |
$T^+ — Q^-$



R.. P భార్య అవుతుంది. **జ: 2**

11. **ఒక సమూహంలో A, B, C, D E, F లు ఉన్నారు. F సోదరి C. E యొక్క భర్తకు సోదరుడు B. A తండ్రి D. F తాత D. ఈ సమూహంలో మొత్తం ఇద్దరు తండ్రులు, ముగ్గురు సోదరులు, ఒక తల్లి ఉన్నారు. అయితే కిందివారిలో తల్లి ఎవరు?**
    1) A 2) D 3) E 4) B

**వివరణ:** $D^+$
|
$B^+ — A^+ \Longleftrightarrow E^-$
|
$F^+ — C^-$



ఈ సమూహంలో తల్లి E **జ: 3**






రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

# పశ్చిమ కనుమల్లో కుమారి.. హిమాలయాల్లో ఖిల్లా!

దేశంలో నేటికీ అత్యధిక జనాభాకు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలే ఉపాధి కల్పిస్తున్నాయి. మైదాన ప్రాంతాల్లో ఆధునిక సేద్య విధానాలు అమలవుతుండగా, అటవీ ప్రాంతాల్లో పురాతన పోడు సాగు ఇంకా ఉనికిలో ఉంది. ప్రాంతాల వారీగా నేలల రకాలు, నీటివనరుల లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విభిన్న రకాల పంటలు పండిస్తున్నారు. దేశ వ్యవసాయ రంగ స్వరూపం, పంటకాలాలు, ప్రాంతాల వారీగా ప్రధాన ఆహార, వాణిజ్య పంటలు, పలు రాష్ట్రాల్లో పోడు సాగుకు ఉన్న పేర్లు, పశుసంపద విస్తరణ తీరుతెన్నుల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. హరితవిప్లవంతో పాటు అనుబంధ రంగాలకు సంబంధించిన విప్లవాలు, అవి తెచ్చిన మార్పులు, పంటల పరిశోధనా కేంద్రాలు, రాష్ట్రాలవారీ ప్రత్యేకమైన పశు జాతులు, వాటిని పోషించే జాతులు, వివిధ పంటల శాస్త్రీయ నామాలతో పాటు కనీస మద్దతు ధరల వరకు అన్నీ తెలుసుకోవాలి.



## వ్యవసాయం


1. **కింది వాక్యాలను సరిచూడండి.**
   ఎ) పోడు వ్యవసాయ విధానాన్ని మధ్యప్రదేశ్‌లో ‘బేవార్ లేదా దహియ’ అంటారు.
   బి) పోడు వ్యవసాయ విధానాన్ని బ్రెజిల్‌లో ‘రోకా’ అంటారు.
   సి) వియత్నాంలో పోడు వ్యవసాయ విధానాన్ని ‘రే’ అంటారు.
   డి) ఝార్ఖండ్‌లో పోడు వ్యవసాయ విధానాన్ని ‘కుమరి’ అంటారు.
   1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి, సి, డి లు సరైనవి.
   3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

2. **ఖరీఫ్ పంటకు సంబంధించి విభిన్న రాష్ట్రాల్లో ఉన్న పేర్లను జతపరిచి, సమాధానం గుర్తించండి.**

| రాష్ట్రం | పేరు |
|---|---|
| ఎ) పశ్చిమ బెంగాల్ | 1) ముందకన్ |
| బి) అస్సాం | 2) సర్రద్ |
| సి) ఒడిశా | 3) అమన్ |
| డి) కేరళ | 4) సాలి |

   1) ఎ-1, బి-2, సి-3, డి-4
   2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-2, డి-3
   4) ఎ-3, బి-4, సి-2, డి-1

3. **కింది వాక్యాలను సరిచూడండి.**
   ఎ) 1968 లో విలియం ఎస్.గాండ్ అనే వ్యక్తి మొదటిసారి ‘హరిత విప్లవం’ అనే పదాన్ని వినియోగించాడు.



విలియం ఎస్.గాండ్

   బి) ప్రపంచ హరిత విప్లవ పితామహుడిగా నార్మన్ బోర్లాగ్‌ను పిలుస్తారు.
   సి) 1960 - 1961 కాలంలో సాంద్ర వ్యవసాయ జిల్లాల కార్యక్రమం ప్రారంభించారు (ఇంటెన్సివ్ అగ్రికల్చర్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్).
   డి) 1965లో సాంద్ర వ్యవసాయ ప్రాంతాల కార్యక్రమం (ఇంటెన్సివ్ అగ్రికల్చర్ ఏరియా ప్రోగ్రామ్) మొదలైంది.
   1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   2) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   3) ఎ, బి, సి, డి లు సరైనవి.
   4) ఎ, సి లు సరైనవి; బి, డి లు సరికావు.

4. **కింది పశు జాతులను, వాటి రాష్ట్రాలతో జతపరిచి సమాధానం గుర్తించండి.**

| | |
|---|---|
| ఎ) అమృతమహల్ | 1) తమిళనాడు |
| బి) నీలిరావి | 2) మహారాష్ట్ర |
| సి) ఖిల్లారి | 3) పంజాబ్ |
| డి) కంగయం | 4) కర్ణాటక |

   1) ఎ-4, బి-3, సి-2, డి-1
   2) ఎ-4, బి-1, సి-2, డి-3
   3) ఎ-1, బి-4, సి-3, డి-2
   4) ఎ-3, బి-4, సి-2, డి-1

5. **ఇచ్చిన వాక్యాలను సరిచూడండి.**
   ఎ) గోధుమ శాస్త్రీయ నామాన్ని ‘ట్రిటికం వల్గేర్’ అంటారు.
   బి) మొక్కజొన్న శాస్త్రీయ నామం ‘జియామేజ్’.
   సి) శ్రీవరి సాగు విధానాన్ని అభివృద్ధి పరిచినవారు ‘హెన్రీ డిలౌనీ’.
   డి) రాగులు శాస్త్రీయ నామం ‘ఇల్యూసైన్ కొరకానా’.
   1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   2) ఎ, బి, సి, డి లు సరైనవి.
   3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

6. **కింది వాటిని జతపరచండి.**

| జాబితా – 1 | జాబితా – 2 |
|---|---|
| ఎ) వెండి పీచు విప్లవం | 1) మందులు, ఉల్లిపాయలు |
| బి) బంగారు పీచు విప్లవం | 2) రసాయనిక ఎరువులు |
| సి) బూడిద రంగు విప్లవం | 3) జనుము |
| డి) గులాబీ విప్లవం | 4) పత్తి |

   1) ఎ-1, బి-2, సి-3, డి-4
   2) ఎ-1, బి-4, సి-3, డి-2
   3) ఎ-3, బి-4, సి-2, డి-1
   4) ఎ-4, బి-3, సి-2, డి-1

7. **కింది వాక్యాలను సరిచూడండి.**
   ఎ) చెరకు ప్రధానంగా ఆయన రేఖ, ఉప ఆయన రేఖ ప్రాంతపు పంట.
   బి) చెరకు పరిశోధనా కేంద్రం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో ఉంది.
   సి) చెరకు పంటకు ఉష్ణోగ్రతలు సరాసరిగా 21 °C నుంచి 27 °C వరకు ఉండాలి.
   డి) చెరకు బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్ కోయంబత్తూరు (తమిళనాడు)లో ఉంది.
   1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి, సి, డి లు సరైనవి.
   3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.




చెరకు పరిశోధనా కేంద్రం (లఖ్‌నవూ)

## ఇండియన్ జాగ్రఫీ

8. **పోడు వ్యవసాయనికి సంబంధించి కింది వాటిని జతపరిచి, సమాధానాలు గుర్తించండి.**

| జాబితా – 1 | జాబితా – 2 |
|---|---|
| ఎ) మణిపుర్ | 1) పామదాబి |
| బి) హిమాలయాలు | 2) కుమారి |
| సి) పశ్చిమ కనుమలు | 3) ఖిల్లా |
| డి) ఒడిశా | 4) పామ్లో |

   1) ఎ-3, బి-4, సి-2, డి-1
   2) ఎ-1, బి-2, సి-3, డి-4
   3) ఎ-4, బి-1, సి-2, డి-3
   4) ఎ-4, బి-3, సి-2, డి-1

9. **రబీ/శీతాకాలపు పంటకు సంబంధించి వాక్యాలను సరిచూడండి.**
   ఎ) రబీ పంటను ఒడిశాలో ‘దాలువ’ అంటారు.
   బి) రబీ పంటను పశ్చిమ బెంగాల్‌లో ‘బోరో’ అంటారు.
   సి) కేరళలో రబీ పంటను ‘పుంజ’ అంటారు.
   డి) తమిళనాడులో రబీ పంటను ‘నవరాయ్’ అంటారు.
   1) ఎ, బి, సి, డి లు సరైనవి.
   2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

10. **కింది వాటిని జతపరచండి.**

| మేకజాతి | రాష్ట్రం |
|---|---|
| ఎ) బకర్వాలి | 1) ఉత్తరాఖండ్ |
| బి) బిద్రి | 2) గుజరాత్ |
| సి) కచ్మీ | 3) జమ్ము-కశ్మీర్ |
| డి) రోహిల్‌ఖండ్ | 4) కర్ణాటక |

   1) ఎ-4, బి-3, సి-2, డి-1
   2) ఎ-1, బి-4, సి-2, డి-3
   3) ఎ-3, బి-4, సి-2, డి-1
   4) ఎ-1, బి-2, సి-3, డి-4

11. **కింది వాక్యాలను సరిచూడండి.**
   ఎ) పత్తి పంటకు నల్లరేగడి నేలలు అత్యంత అనుకూలం.
   బి) పత్తి పంటకు 210 రోజులు మంచు కురవకుండా ఉండటం అవసరం.
   సి) నూలు వస్త్ర పరిశ్రమకు ప్రధాన ముడిపదార్థం పత్తి.
   డి) పత్తి పరిశోధనా కేంద్రం మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఉంది.
   1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి, డి లు సరికావు; సి సరైంది.
   3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   4) ఎ, బి, సి, డి లు సరైనవి.

12. **కింది పశుపోషక ఆధారిత సమాజాలు, వారి రాష్ట్రాలను జతపరిచి సమాధానాలు గుర్తించండి.**

| పశుపోష ఆధారిత సమాజం | రాష్ట్రం |
|---|---|
| ఎ) రైకా | 1) గుజరాత్ |
| బి) మోన్‌పెస్ | 2) మహారాష్ట్ర |
| సి) ధంగర్ | 3) రాజస్థాన్ |
| డి) మల్ధారీ | 4) అరుణాచల్ ప్రదేశ్ |

   1) ఎ-3, బి-4, సి-2, డి-1
   2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-3, డి-2
   4) ఎ-1, బి-2, సి-3, డి-4

13. **కింది వాక్యాలను సరిచూడండి.**
   ఎ) సజ్జ శాస్త్రీయ నామం ‘పెన్నెసిటమ్ టైఫాయిడ్’
   బి) జొన్న శాస్త్రీయ నామం ‘పెన్నెసిటమ్ గ్లాకమ్’.
   సి) 2023 ను ‘అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం’గా ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ ప్రకటించింది.
   డి) మన దేశంలో పప్పుదినుసుల పరిశోధనా కేంద్రం ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్‌లో ఉంది.
   1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   2) ఎ, బి, సి, డి లు సరైనవి.
   3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

14. **కింది వాటిని జతపరచండి.**

| జాబితా – 1 | జాబితా – 2 |
|---|---|
| ఎ) పసుపు విప్లవం | 1) విశాల్ తివారీ |
| బి) నీలి విప్లవం | 2) దుర్గేష్ పాటిల్ |
| సి) గులాబీ విప్లవం | 3) అరుణ్ కృష్ణన్ - హీరాలాల్ చౌదరి |
| డి) ఎరుపు విప్లవం | 4) శ్యామ్ పిట్రోడా |

   1) ఎ-1, బి-2, సి-3, డి-4
   2) ఎ-3, బి-4, సి-2, డి-1
   3) ఎ-4, బి-3, సి-2, డి-1
   4) ఎ-1, బి-4, సి-2, డి-3

15. **కింది వాక్యాలను సరిచూడండి.**
   ఎ) ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్ (ఐసీఏఆర్) ప్రధాన కేంద్రం న్యూదిల్లీలో ఉంది.
   బి) ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) బిహార్‌లోని పూసా వద్ద ప్రారంభించారు.
   సి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్ హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ప్రారంభించారు.
   డి) సెంట్రల్ పొటాటో రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లాలో ఉంది.
   1) ఎ, బి, సి, డి లు సరైనవి.
   2) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.



ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్

16. **కింది వాటిని జతపరచండి.**

| జాబితా – 1 | జాబితా – 2 |
|---|---|
| ఎ) సెల్వికల్చర్ | 1) ఫలాలు |
| బి) మారికల్చర్ | 2) కూరగాయలు |
| సి) ఒలెరికల్చర్ | 3) సముద్ర సంబంధిత జీవులు |
| డి) పోమికల్చర్ | 4) కలప |

   1) ఎ-1, బి-3, సి-2, డి-4
   2) ఎ-1, బి-4, సి-3, డి-2
   3) ఎ-1, బి-2, సి-3, డి-4
   4) ఎ-4, బి-3, సి-2, డి-1

17. **పంటలకు సంబంధించి కింది వాటిని జతపరచండి. (2025 – 2026కు సంబంధించి)**

| పంటలు | కనీస మద్దతు ధరలు |
|---|---|
| ఎ) రాగులు | 1) రూ. 7,263 |
| బి) సజ్జలు | 2) రూ. 2,400 |
| సి) మొక్కజొన్న | 3) రూ. 2,775 |
| డి) వేరుశనగ | 4) రూ. 4,886 |

   1) ఎ-1, బి-4, సి-3, డి-2
   2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-3, సి-2, డి-4
   4) ఎ-1, బి-2, సి-3, డి-4



రచయిత: బండ్ల శ్రీధర్

### సమాధానాలు

1-1; 2-4; 3-3; 4-1; 5-2; 6-4; 7-3; 8-4; 9-1; 10-3; 11-4; 12-1; 13-2; 14-3; 15-1; 16-4; 17-2.

## అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపనలు

● టూరిజం కార్పొరేషన్‌తో రూ.500 కోట్ల మేర వివిధ సంస్థల ఒప్పందాలు

ఈనాడు, కడప, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సాస్కీ, స్వదేశ్ దర్శన్ పథకాల కింద సుమారు రూ.160 కోట్లతో రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలైన గండికోట, బొర్రా గుహలు, అహోబిలం, నాగార్జున సాగర్ తదితర ప్రాంతాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబు వైఎస్సార్ జిల్లాలోని గండికోట వ్యూ పాయింట్ వద్ద నుంచి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం టూరిజం కార్పొరేషన్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధికి వివిధ సంస్థలతో రూ.500 కోట్ల విలువైన ఒప్పందాలు సాగాయి. గండికోటతో పాటు శ్రీశైలం, మంత్రాలయం, తిరుపతి, తదితర ప్రాంతాల్లో హోటళ్ల నిర్మాణం, అడ్వెంచర్ స్పోర్ట్స్, హై రోప్, కయాకింగ్, జెట్ స్కీయింగ్ వంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు ఈ ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పర్యాటక ప్రాంతాల్లో 50 వేల హోటల్ గదులు నిర్మించేలా కార్యాచరణ చేపట్టామని వెల్లడించారు. పర్యాటకులకు కారవాన్ టూరిజం సర్వీసులు అందుబాటులోకి తెస్తున్నారు. విశాఖ, అరకు, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోటలను 7 యాంకర్ హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో పర్యాటక ఈవెంట్లను నిర్వహించడంతో పాటు జిల్లాలవారీగా కార్యక్రమాలు, టూరిజం ఫెస్టివల్స్ నిర్వహిస్తామని తెలిపారు.

## 30 రోజుల్లో.. 600 టీఎంసీల వృథా

● మనుగడ కోసమే 'బనకచర్ల'పై బీఆర్ఎస్ ఆరోపణలు

● జలవనరుల శాఖ మంత్రి నిమ్మల



పాలకొల్లు, న్యూస్‌టుడే: ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమయ్యాక 30 రోజుల్లోనే గోదావరి నుంచి 600 టీఎంసీల జలాలు సముద్రంలోకి వృథాగా పోయాయని, వాటిని తెలుగు రాష్ట్రాల రైతులు వినియోగించుకునేలా ప్రాజెక్టు నిర్మిస్తే తప్పేంటని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన విమర్శలపై మంత్రి స్పందించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో శుక్రవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. 1975 నుంచి 2025 వరకు గణాంకాలను పరిశీలిస్తే గోదావరి నుంచి 1.50 లక్షల టీఎంసీల జలాలు సముద్రంలో కలిసిపోయాయని తెలిపారు. ఏటా సగటున 3,150 టీఎంసీలకు పైగా వృథాగా పోతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు ద్వారా రోజుకు 2 టీఎంసీల చొప్పున 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసే అవకాశం ఉందని.. మరో 2,800 టీఎంసీలు సముద్రంలో కలుస్తాయన్న విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు గమనించాలని కోరారు. తెలంగాణలో అంతర్గత రాజకీయాల కోసం పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. కాళేశ్వరం, సీతారామసాగర్ ప్రాజెక్టులకు ఏపీకి తర్వాత అనుమతులు తీసుకున్నారని, రాష్ట్ర విభజన నిబంధనలకు అవన్నీ విరుద్ధమని బీఆర్ఎస్ నేతలకు తెలియంది కాదని చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవడానికి చంద్రబాబు ప్రభుత్వం ఎప్పుడూ ప్రయత్నించలేదని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో సాగు, తాగునీటి అవసరాలకు తగ్గట్లు.. సమృద్ధిగా జలాలను నిల్వ చేయాలన్నదే ఏపీ ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు.

## 'బనకచర్ల'తో పోలవరం డిజైన్లలోనూ మార్పులు

● పీఎఫ్ఆర్‌పై సీడబ్ల్యూసీకి కృష్ణా బోర్డు లేఖ!

ఈనాడు, హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం చేపడుతున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కారణంగా పోలవరం ప్రాజెక్టు డిజైన్లలోనూ మార్పులు చేయాల్సి ఉంటుందని కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ) కృష్ణా బోర్డు స్పష్టం చేసినట్లు తెలిసింది. కేంద్ర జలశక్తి శాఖకు గతంలో ఏపీ పంపిన బనకచర్ల ప్రీ ఫీజిబులిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్)ను సంబంధిత రాష్ట్రాలతోపాటు కృష్ణా బోర్డుకు పరిశీలన నిమిత్తం కేంద్రం పంపింది. ఆ పీఎఫ్ఆర్‌ను అధ్యయనం చేసిన కృష్ణా బోర్డు పలు అంశాలపై సీడబ్ల్యూసీకి తాజాగా లేఖ రాసినట్లు సమాచారం. 'గోదావరి నుంచి 200 టీఎంసీల జలాలను పోలవరం ప్రాజెక్టు ద్వారా మళ్లించాలంటే ఆ మేరకు స్ట్రక్చర్లను మార్చాలి. కాలువలు తదితర నిర్మాణాల డిజైన్లను తిరిగి చేయాలి. దీనికోసం సీడబ్ల్యూసీ నుంచి తిరిగి సాంకేతిక సలహా కమిటీ అనుమతులు పొందాలి. దీంతోపాటు ఇప్పటికే పోలవరం ప్రాజెక్టుపై పలు రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. బనకచర్లపైనా ఆ రాష్ట్రాల ఆమోదం తీసుకోవాలి. బచావత్ ట్రైబ్యునల్ ప్రకారం గోదావరి జలాలు ఇతర బేసిన్‌కు తరలిస్తే ఆ నీటిలో ఎగువ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి. ఇప్పటికే పోలవరం నుంచి కృష్ణా డెల్టాకు మళ్లించే నీటిలో కర్ణాటక, మహారాష్ట్రలకు వాటా కేటాయించారు. తెలంగాణ, ఏపీల మధ్య 45 టీఎంసీలకు సంబంధించి వివాదం ఉంది. ఇప్పుడు 200 టీఎంసీలు తరలిస్తామని చెబుతుండగా గతంలో మాదిరిగానే ఎగువ రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సి ఉంటుంది. పీఎఫ్ఆర్‌లో ఈ వివరాలు చెప్పలేదు. ఇలాంటి అన్ని అంశాలపై సంబంధిత రాష్ట్రాల అభ్యంతరాలను నివృత్తి చేసి వాటి ఆమోదం పొందాల్సి ఉంటుంది' అని లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది.

## వైకాపా మైనారిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా హఫీజ్ ఖాన్

ఈనాడు, అమరావతి: వైకాపా మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే మొహమ్మద్ హఫీజ్ ఖాన్ (కర్నూలు) నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కార్యాలయం శుక్రవారం ప్రకటించింది.

## బనకచర్లపై లోకేశ్ మాటల్లో తప్పేముంది?

● హరీశ్‌రావుకు ఎందుకంత అక్కసు?

● తెదేపా నేత సోమిరెడ్డి ధ్వజం



ఈనాడు, నెల్లూరు: సముద్రంలో వృథాగా కలిసిపోయే గోదావరి జలాలను వాడుకునేందుకు పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపడతామంటుంటే తెలంగాణ సోదరులకు వచ్చిన నష్టమేంటని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సముద్రంలోకి నీరు వృథాగా పోయినా పర్వాలేదుగానీ, ఆంధ్రప్రదేశ్ ఒక్క చుక్క వాడుకోవడానికి లేదని చెప్పడానికి తెలంగాణ మాజీ మంత్రి, భారాస నాయకుడు హరీశ్‌రావుకు నోరెలా వచ్చిందని మండిపడ్డారు. 'గోదావరి మిగులు జలాల్లో 200 టీఎంసీలు వాడుకునేలా బనకచర్ల ప్రాజెక్టు నిర్మించుకుంటే తెలంగాణకు అభ్యంతరం ఎందుకు అని మంత్రి లోకేశ్ అన్నందుకు హరీశ్‌రావు ఆయనపై అక్కసు వెళ్లగక్కారు. లోకేశ్ మాటల్లో తప్పేముంది? గోదావరిలో 1,540 టీఎంసీలను నికర జలాలుగా నిర్ధారించారు. ఇప్పటి వరకు ఏపీ, తెలంగాణలో అన్ని ప్రాజెక్టులూ కలిపినా 800 టీఎంసీలనే వాడుకోలేకపోతున్నాం. ఏటా 2,500 నుంచి 3 వేల టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయి. వరదల వల్ల ఏపీలో రైతులు, ప్రజలు ఏటా రూ.2 వేల కోట్లు నష్టపోతున్నారు. ఎగువన ఉన్న తెలంగాణకు ఇలాంటి వరద కష్టాలు లేవు' అని శుక్రవారం నెల్లూరులో విలేకరుల సమావేశంలో సోమిరెడ్డి పేర్కొన్నారు. 'ఏపీ ప్రజలను ఉగ్రవాదులుగా పరిగణిస్తున్నారా? మనందరం అన్నదమ్ములం అన్న విషయం మర్చిపోవద్దు' అని ఆయన వ్యాఖ్యానించారు. మిగులు జలాలను వాడుకునే హక్కు కింది రాష్ట్రానికి ఉందని సోమిరెడ్డి తెలిపారు. 'గోదావరి నదిపై తెలంగాణలో ప్రాజెక్టులు కట్టినా అభ్యంతరం చెప్పబోమని మా ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాబినెట్ సమావేశంలో స్పష్టంచేశారు. తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు కింద 20 రిజర్వాయర్లు కట్టుకుని 450 టీఎంసీల నీటిని వాడుకుంటోంది. అయినా ఏపీ ప్రజలంటే ఎందుకంత ద్వేషం' అని ప్రశ్నించారు.

## ఘన వ్యర్థాల నిర్వహణలో సింగపూర్ ఉత్తమ విధానాలు

● పరిశీలించాలని అధికారులను ఆదేశించిన మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: ఘన వ్యర్థాల నిర్వహణలో సింగపూర్ అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను రాష్ట్రంలోనూ అమలు చేసే విషయాన్ని పరిశీలించాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. గత ఆరు రోజులుగా సింగపూర్‌లో పర్యటిస్తున్న ఆయన శుక్రవారం అక్కడి ఏఎల్‌బీఏ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబుతో కలిసి పరిశీలించారు. ఇళ్లు, పరిశ్రమల నుంచి సేకరించే ఘన వ్యర్థాలను ఆధునిక సాంకేతికతతో తయారు చేసిన వాహనాల్లో ప్లాంట్‌కు తీసుకురావడం, అక్కడ ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వస్తువుల పునర్వినియోగం, మిగిలిన వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న విధానంపై మంత్రి పరిశీలించి సంబంధిత ప్రతినిధులతో మాట్లాడారు. ఇందుకోసం అనుసరిస్తున్న విధానాలను నారాయణ పరిశీలించారు. సింగపూర్‌లోని పోలీస్ ఫోర్స్ ప్రధాన కార్యాలయాన్ని కూడా మంత్రి సందర్శించారు.




ఘన వ్యర్థాల పునర్వినియోగ ప్లాంట్ వద్ద మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు తదితరులు

## కాకినాడలో హాకీ జూనియర్ మహిళల ఛాంపియన్‌షిప్ ప్రారంభం







పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో బెలూన్లు ఎగరేస్తున్న చినరాజప్ప, పంతం నానాజీ, కర్రి పద్మశ్రీ, షాన్‌మోహన్ తదితరులు ★ తలపడుతున్న కేరళ, మణిపుర్ క్రీడాకారిణులు

ఈనాడు, కాకినాడ: జాతీయ క్రీడలకు కాకినాడ వేదికైంది. 15వ హాకీ జూనియర్ మహిళల జాతీయ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు శుక్రవారం ఇక్కడి జిల్లా క్రీడాప్రాధికార సమాఖ్య మైదానంలో ఆరంభమయ్యాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 18 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఆస్ట్రో టర్ఫ్‌పై లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ నెల 12 వరకు పోటీలు నిర్వహిస్తారు. తొలి రోజు ఏడు మ్యాచ్‌లు జరగ్గా.. గోవా, గుజరాత్, మిజోరం, మణిపుర్, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, దిల్లీ జట్లు విజయం సాధించాయి. పెద్దాపురం, కాకినాడ గ్రామీణం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీ, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులు బెలూన్లను ఎగరేసి క్రీడా సంబరాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 500 మంది క్రీడాకారులకు కాకినాడతో పాటు సామర్లకోటలో వసతి సదుపాయం కల్పించారు. పోటీల పర్యవేక్షణ కోసం అధికారులతో కమిటీలు వేసి ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ కేంద్రం నిర్వహిస్తున్నారు.

## సహకార బ్యాంకుల మధ్య సత్సంబంధాలు అవసరం

ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు

భీమడోలు, న్యూస్‌టుడే: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సహకార బ్యాంకుల మధ్య సత్సంబంధాల మెరుగుకు పరస్పరం కృషి చేస్తున్నట్లు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు (టీజీసీఏబీ) ప్రధాన కార్యాలయంలో రెండు రాష్ట్రాల సహకార బ్యాంకుల బృందాలు శుక్రవారం సమావేశమై పలు అంశాలపై చర్చించాయి. ఈ వివరాలను భీమడోలులో వీరాంజనేయులు విలేకరులకు తెలిపారు. ఆప్కాబ్, టీజీసీఏబీ సంస్థల పర్సన్ ఇన్‌ఛార్జులు సమస్యల పరిష్కారానికి అంగీకరించారని పేర్కొన్నారు. షెడ్యూల్ 10లో పేర్కొన్న సంస్థల్లో తక్కువ సమస్యలతో విభజన అయిన సంస్థ ఆప్కాబ్ అయినప్పటికీ.. ఇంకా కొన్ని మిగిలి ఉన్నాయని చెప్పారు. డిపాజిట్లు, పెట్టుబడులు, రుణాలు, ఐటీ, విజ్ఞాన భాగస్వామ్యం తదితర రంగాల్లో పరస్పర సహకారం అందించుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు ఛైర్మన్ మర్నేని రవీంద్ర, వైస్ ఛైర్మన్ సతీష్, ఎండీ కృష్ణారావు, ఆప్కాబ్ ఎండీ ఎస్.ఆర్. శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.189 కోట్లు ఖర్చు చేస్తే.. వంశ'ధార'లే!

● మరో 20 వేల ఎకరాలకు నీళ్లు

● కీలక ప్రాజెక్టు పూర్తికి ఆస్కారం

ఈనాడు, అమరావతి: వంశధార రెండో భాగం రెండో దశ పనులను రూ.189 కోట్లు ఖర్చు చేసి పూర్తి చేస్తే ...మరో 20 వేల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి వస్తుంది. ఉత్తరాంధ్ర ప్రజానీకానికి మేలు జరుగుతుంది. ఇప్పటికే 92 శాతం మేర పనులు పూర్తి అయ్యాయి. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించి, మిగిలిన నిధులనూ త్వరగా ఇస్తే మిగిలిన పనులు కూడా పూర్తవుతాయి. ప్యాకేజీ 87ను ముందస్తుగా రద్దు చేసుకుంటామంటూ సంబంధిత గుత్తేదారు చెబుతున్నారు. చివరి దశకు వచ్చిన స్థితిలో సరైన నిర్ణయంతో పనులు పరుగులు పెట్టిస్తేనే ఫలితాలు త్వరగా అందుతాయి. తక్కువ వ్యయంతో ఒక ప్రాజెక్టును పూర్తి చేసిన ఫలితమూ దక్కుతుంది.

### ఇదీ ప్రణాళిక

వంశధార నదిపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి అంతర్రాష్ట్ర సమస్యలు ఎదురైన తరుణంలో కాట్రగడ్డ వద్ద సైడ్ వియర్ నిర్మించి వంశధార నది వరద జలాలను మళ్లించి రెండు బ్యాలెన్సింగ్ జలాశయాల సాయంతో హిరమండలం జలాశయానికి నీటిని తీసుకువచ్చి నింపే ప్రణాళికతో దీన్ని చేపట్టారు. వంశధార వివాద ట్రైబ్యునల్ 8 టీఎంసీల నీటిని సైడ్ వియర్ ద్వారా మళ్లించేందుకు అవకాశం కల్పించింది. దీంతో ప్రతిపాదిత నేరడి బ్యారేజ్‌కు 1.5 కి.మీ. దిగువన సైడ్ వియర్ నిర్మించి అక్కడి నుంచి సింగిడి వద్ద 0.069 టీఎంసీల నీటి నిల్వతో బ్యాలెన్సింగ్ జలాశయం, పారాపురం వద్ద 0.404 టీఎంసీల నిల్వతో మరో బ్యాలెన్సింగ్ జలాశయం నిర్మాణం చేపట్టారు. అక్కడి నుంచి హిరమండలం జలాశయానికి నీటిని తీసుకువచ్చి 19.05 టీఎంసీల నిల్వకు వీలు కల్పించారు.

### ప్రయోజనాలు ఇలా

వరద ప్రవాహ కాలువ కింద 20 వేల ఎకరాలు, హిరమండలం కుడి ప్రధాన కాలువ కింద 20 వేల ఎకరాలు, ఎగువ స్థాయి కాలువ ద్వారా 5,000 ఎకరాలకు సాగునీరందుతుంది. మొత్తం 9 మండలాల పరిధిలోని 225 గ్రామాలకు ఇది ప్రయోజనం. 4.5 లక్షల మందికి తాగునీరందుతుంది. ప్రస్తుతం కొన్ని ప్రయోజనాలు అందుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం పూర్తైతే మరో 20 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుంది.

● సైడ్ వియర్ నుంచి 8,000 క్యూసెక్కుల నీటిని తీసుకువెళ్లే వరద కాలువ ప్యాకేజీ 87లో 80% పనులు పూర్తయ్యాయి. మరో 2 కిలోమీటర్లకు పైగా లైనింగ్ పూర్తి చేయాలి. 2,080 ఎకరాలకు నీళ్లందించే డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తి చేయాలి. ఇప్పుడు ఏజెన్సీ పనులను ముందస్తుగా రద్దు చేస్తామంటోంది.

● హిరమండలం జలాశయం వరకు నీటిని తీసుకువెళ్లే కాలువ తవ్వకం పనులు, బ్యాలెన్సింగ్ జలాశయం పనులు ప్యాకేజీ 88లో పూర్తయ్యాయి. కొంత లైనింగు పనితో పాటు 17,920 ఎకరాలకు నీరందించే డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తి చేయాలి. హిరమండలం జలాశయంలో స్పిల్ వే కాంక్రీటు పనులతో పాటు గేట్ల ఫ్యాబ్రికేషన్ పనులు జరుగుతున్నాయి.

### తక్షణం ఏం కావాలి?

తొలి రెండు ప్యాకేజీల్లో డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తి చేసేందుకు 100 ఎకరాల మేర భూసేకరణకు అవార్డు పాస్ చేశారు. ఇందుకు రూ.12.37 కోట్లు చెల్లించాల్సి ఉంది. మరో వైపు హిరమండలం జలాశయంలో రూ.19.36 కోట్ల మేర పెండింగు బిల్లులూ ఇవ్వాలి.

## రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తులు

ఈ నెల 21 నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు శుక్రవారం నుంచి ఈ నెల 8 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. డివిజన్ స్థాయిలో 11న పరిశీలించి ఒక్కో కేటగిరీ ఒకరు చొప్పున ఎంపిక చేస్తారు. ఆ జాబితాను జిల్లా విద్యాధికారికి 12న అందిస్తారు. ఒక్కో కేటగిరీ ఒకరు చొప్పున తుది జాబితాను...14న జిల్లా స్థాయి కమిటీలో రూపొందిస్తారు. దీన్ని 16న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపిస్తారు. ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో 21 నుంచి 23 వరకు ఇంటర్వ్యూలను నిర్వహించి తుది జాబితాను 25న ఖరారు చేస్తారు. ఎంపికైన వారికి సెప్టెంబరు 5న రూ.20వేల నగదు, ప్రశంస పత్రం, పతకం అందిస్తారు. జిల్లా స్థాయిలో 30 మంది, మండల స్థాయిలో 10 మందికి మించకుండా అవార్డులకు ఎంపిక చేయాలని డైరెక్టర్ ఆదేశించింది.

● ఉత్తమ పని తీరు కనబరిచిన ఉపాధ్యాయులకు ఉత్తమ టీచర్ అవార్డు ఇస్తారు. ఇందుకోసం జిల్లాకు 16 మంది చొప్పున రాష్ట్ర స్థాయిలోనే ఎంపిక చేసి, ఆ జాబితాను జిల్లాకు పంపిస్తారు. అక్కడ పరిశీలించి తిరిగి రాష్ట్ర స్థాయికి పంపించాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూల తర్వాత 104 మందిని ఎంపిక చేస్తారు.

● దరఖాస్తు చేయకపోయినా ఉత్తమ టీచర్ తరఫున ఎవరైనా ఈ అవార్డుకు ఐదుగురు టీచర్లు సిఫార్సు చేసేందుకు అవకాశం కల్పించారు.

## చేనేతకు ఉచిత విద్యుత్తు అమలుపై మంత్రి సవిత హర్షం



ఈనాడు, అమరావతి: చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకాన్ని జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ నుంచి అమలు చేయబోతున్నట్లు సీఎం ప్రకటించనున్నారు. నేతన్నలకు ఉచిత విద్యుత్తు పథకానికి రూ.125 కోట్ల వ్యయం కానున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వివరించారు.

## 7 నుంచి డిగ్రీ అధ్యాపకుల నిరసనలు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల వెంటనే బదిలీలు చేపట్టాలని, హోదాలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ అధ్యాపక ఐకాస ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, శ్యాంబాబు, రాఘవరెడ్డి, గోపాల్‌నాయుడు నిరసనలకు పిలుపునిచ్చారు. ఈ నెల 7 నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతామని, 11 నుంచి భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ నెల 18న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. 'అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ బదిలీలు నిర్వహించినా డిగ్రీ అధ్యాపకులకు చేపట్టలేదు. ఎయిడెడ్ కళాశాలలు గ్రాంట్ ఇన్ ఎయిడ్ పునరుద్ధరించినా నిలిపేశారు పని చేసే అధ్యాపకులను వెనక్కి పంపలేదు. దేశవ్యాప్తంగా సుమారు 26 రాష్ట్రాల్లో యూజీసీ వేతనాలు తీసుకుంటున్న డిగ్రీ లెక్చరర్ల హోదాను అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్లుగా మార్పు చేశారు. తెలంగాణలో 2015లోనే ఈ మార్పు చేశారు. కానీ, ఏపీలో ఇంతవరకు దీనిపై చర్యలు చేపట్టలేదు' అని వారు పేర్కొన్నారు.

## విద్యుత్తు రంగంలో సాంకేతికత అందించేందుకు ఎన్‌ఎల్‌సీ అంగీకారం

● సీఎస్‌తో ఆ సంస్థ ఛైర్మన్ భేటీ



సీఎస్ విజయానంద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎన్‌ఎల్‌సీ ఛైర్మన్ ప్రసన్నకుమార్

ఈనాడు, అమరావతి: పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టుల అభివృద్ధి, గ్రిడ్, డీకార్బనైజేషన్ తదితర అంశాల్లో రాష్ట్ర విద్యుత్తు సంస్థలకు అవసరమైన సాంకేతికత అందించేందుకు నేవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ అంగీకరించింది. ఆ సంస్థ ఛైర్మన్, ఎండీ ఎం.ప్రసన్నకుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో పనిచేసేందుకు అంగీకరించారు. రాష్ట్రంలో పునరుత్పాదక, హరిత ఇంధన వనరుల అభివృద్ధికి ఉన్న అవకాశాలు, చేపట్టాల్సిన చర్యలు.. గ్రిడ్‌ల సామర్థ్యం పెంపు, డీకార్బనైజేషన్ లక్ష్యాల సాధన తదితర అంశాలపై చర్చించారు. ఈ భేటీలో ఎన్‌ఎల్‌సీ డైరెక్టర్ (ఫైనాన్స్) ప్రసన్నకుమార్ ఆచార్య పాల్గొన్నారు.

## మరో రూ.5,000 కోట్ల రుణాల సమీకరణకు ప్రభుత్వం ప్రయత్నాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.5,000 కోట్ల మేర రుణాలు సమీకరించబోతోంది. వచ్చే మంగళవారం రిజర్వు బ్యాంకు నిర్వహించే సెక్యూరిటీల వేలంలో పాల్గొని ఈ రుణాలు తీసుకోనుంది. ఆరేళ్ల కాల పరిమితితో తిరిగి తీర్చేలా రూ.1,500 కోట్లు, ఎనిమిదేళ్ల కాల పరిమితితో మరో రూ.1,500 కోట్లు, తొమ్మిదేళ్ల కాల పరిమితితో రూ.2,000 కోట్ల రుణాలు తీసుకోనుంది.

## జాతీయ నైపుణ్య పోటీలకు రిజిస్ట్రేషన్లు

ఈనాడు, అమరావతి: జాతీయ నైపుణ్య పోటీల్లో పాల్గొనేవారు సెప్టెంబరు 30 లోపు తమ పేర్లను తమ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈఓ గణేష్‌కుమార్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో విడుదల చేశారు. 60కి పైగా ట్రేడ్‌లలో ఈ పోటీలు ఉంటాయని, జాతీయ స్థాయిలో ఎంపికైన వారికి ప్రపంచ స్థాయి పోటీలను షాంఘైలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారు రీజియన్, ఆ తర్వాత జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని వెల్లడించారు. సాధారణ నైపుణ్య పోటీల్లో పాల్గొనేవారు 2004 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలని.. ప్రత్యేక నైపుణ్యాలు క్లౌడ్ కంప్యూటింగ్, మెకాట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి వాటిల్లో పాల్గొనే వారు 2001 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారై ఉండాలనే నిబంధనలు ఉన్నట్లు వెల్లడించారు.



## పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

### మంగళగిరి ఎయిమ్స్‌లోనే ఖాళీలు ఎక్కువ

ఈనాడు, దిల్లీ: మంగళగిరి ఎయిమ్స్‌లో 158 (51%) బోధన, 800 బోధనేతర (41%) సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్ర వైద్యఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం 151 మంది బోధనా సిబ్బంది, 1,153 మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నట్లు వెల్లడించారు. జాతీయ సగటుతో పోలిస్తే మంగళగిరి ఎయిమ్స్‌లో ఎక్కువ ఖాళీలు ఉన్నట్లు మంత్రి సమాధానంతో వెల్లడైంది.

### 4 ఏళ్లలో ఖాళీగా మిగిలిన 11,966 మెడికల్ యూజీ సీట్లు

నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా 11,966 మెడికల్ యూజీ సీట్లు ఖాళీగా మిగిలిపోయినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. లోక్‌సభలో ఏలూరు తెదేపా సభ్యుడు పుట్టా మహేష్‌కుమార్ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2021-22లో 2,012, 2022-23లో 4,146, 2023-24లో 2,959, 2024-25లో 2,849 సీట్లు ఖాళీగా మిగిలిపోయినట్లు చెప్పారు.

### ఏపీలో అతితక్కువ సమయంలో పోక్సో కేసుల విచారణ

ఏపీలో ఒక్కో పోక్సో కేసు ట్రయల్‌కు సగటున 257 రోజుల సమయం పడుతున్నట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. ఇది దేశంలో అతితక్కువ సమయమన్నారు. లోక్‌సభలో విజయవాడ తెదేపా సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రశ్నకు బదులిచ్చారు. ఈ కేసుల విచారణకు దేశంలో సగటున 850-950 రోజులు, తెలంగాణలో 408 రోజులు పడుతోందన్నారు. పోక్సో కేసుల విచారణకు ఏపీలో 16 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నట్లు చెప్పారు. వీటికి 13,790 కేసులు రాగా, 7,487 విచారణ ముగించినట్లు వెల్లడించారు. 2020-21 నుంచి 2024-25వరకు ఏపీలోని ఈ కోర్టులకు కేంద్ర వాటా నిధులు విడుదల చేయలేదని వెల్లడించారు.

### ఏపీలో 97 కోర్టు హాళ్ల నిర్మాణం

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 661 కోర్టు హాళ్లకుగాను 97, 661 రెసిడెన్షియల్ యూనిట్లకు 13 నిర్మాణంలో ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ వెల్లడించారు. న్యాయవ్యవస్థలో మౌలిక వసతుల కల్పనకు ఏపీకి 2022-23లో రూ.22.50 కోట్లు, 2023-24లో రూ.49.82 కోట్లు, 2024-25లో రూ.99 లక్షలు, 2025-26లో జూన్ వరకు రూ.5.24 కోట్లు విడుదల చేసిందన్నారు. ఏపీలోని కిందిస్థాయి కోర్టుల్లో 65 న్యాయాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. సబార్డినేట్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 8,99,526కి చేరినట్లు చెప్పారు. ఐదేళ్లలో పెండింగ్ కేసుల సంఖ్య 39% పెరిగినట్లు తెలిపారు.

### రామాయపట్నం పోర్టుకు రైల్వే లైన్ నిర్మాణం ప్రారంభం

రామాయపట్నం పోర్టు నుంచి తెట్టు రైల్వేస్టేషన్‌కు అనుసంధాన రైల్వే లైన్ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ తెలిపారు. రాజ్యసభలో తెదేపా ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్ పాలసీ కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైం బోర్డు ఈ పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు.

### సీఎస్‌టీఎస్‌లో శిక్షణ పొందిన వారిలో 95% మందికి ప్లేస్‌మెంట్స్

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) ఆధ్వర్యంలో 2015లో విజయవాడకు మంజూరైన సెంటర్ ఫర్ స్కిల్లింగ్ అండ్ టెక్నికల్ సపోర్ట్ (సీఎస్‌టీఎస్)లో ఐదేళ్లలో శిక్షణ పొందిన 1,183 మందిలో 1,125 మందికి (95%) ప్లేస్‌మెంట్లు దక్కినట్లు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. అనంతపురం తెదేపా లోక్‌సభ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు.

### స్టీల్ ప్లాంట్‌లో స్వచ్ఛంద పదవీ విరమణకు 1,017 మంది దరఖాస్తు

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో స్వచ్ఛంద పదవీ విరమణకు 1,017 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్లు కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. రాజ్యసభలో వైకాపా సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబురావులు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. ఆర్‌ఐఎన్‌ఎల్‌లో 100% పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్ర ప్రభుత్వం 2021 ఆగస్టు 27న సూత్రప్రాయ అనుమతి ఇచ్చిందని చెప్పారు.

## భగవంత్ కేసరి చిత్ర బృందానికి చంద్రబాబు శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమాకు జాతీయ ఉత్తమ తెలుగు చిత్రం అవార్డు రావడం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రేక్షకాదరణ పొందిన ఈ చిత్రానికి జాతీయ అవార్డు రావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. బాలకృష్ణకు, చిత్ర బృందానికి 'ఎక్స్' వేదికగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## జాతీయ చలనచిత్ర పురస్కార విజేతలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందనలు

ఈనాడు, అమరావతి: జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు సినిమా రంగానికి పలు పురస్కారాలు దక్కడం సంతోషంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. ''సోదరుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' ఉత్తమ తెలుగు చిత్రం పురస్కారానికి ఎంపిక కావడం ఆనందదాయకం. ఆ చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, హరీష్ పెద్దిలకు అభినందనలు. ఉత్తమ వీఎఫ్ఎక్స్ చిత్రంగా 'హను-మాన్' చిత్రం నిలిచింది. ఈ చిత్ర దర్శకుడు ప్రశాంత్‌వర్మ, వీఎఫ్ఎక్స్ నిపుణులు, నిర్మాతకు అభినందనలు. ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా నీలం సాయి రాజేష్(బేబీ చిత్రం), ఉత్తమ గీత రచయితగా కాసర్ల శ్యామ్(బలగం), ఉత్తమ గాయకుడిగా పీవీఎన్ఎస్ రోహిత్(బేబీ), ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్‌గా నందు పృథ్వీ(హను-మాన్), ఉత్తమ బాల నటిగా సుకృతివేణి బండ్రెడ్డి(గాంధీ తాత చెట్టు) పురస్కారాలకు ఎంపికైనందుకు హృదయపూర్వక అభినందనలు. ఈ పురస్కారాలు చిత్ర పరిశ్రమకు నూతనోత్సాహాన్ని అందిస్తాయి. జాతీయ ఉత్తమ నటులుగా షారుక్‌ఖాన్, విక్రాంత్ మాస్సే, ఉత్తమ నటిగా రాణీ ముఖర్జీ, ఉత్తమ దర్శకుడిగా సుదీప్తో సేన్‌తో పాటు ఇతర పురస్కార విజేతలకు అభినందనలు'' అని పేర్కొన్నారు.

### బాలా మామయ్యకు అభినందనలు: మంత్రి లోకేశ్

బాలా మామయ్య హీరోగా నటించిన 'భగవంత్ కేసరి' సినిమా 71వ జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికవ్వడం సంతోషంగా ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. సందేశాత్మక చిత్రంగా మన్ననలు పొందడంపై ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ అవార్డు వచ్చిన సందర్భంగా హీరో బాలకృష్ణ, డైరెక్టర్ అనిల్ రావిపూడి, చిత్ర బృందానికి లోకేశ్ అభినందనలు తెలిపారు.

### అవార్డు గ్రహీతలకు అభినందనలు: మంత్రి కందుల దుర్గేష్

జాతీయ చలనచిత్ర అవార్డు గ్రహీతలకు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు తెలిపారు. 'భగవంత్ కేసరి' చిత్రానికి జాతీయ అవార్డు రావడంతో పాటు తెలుగు సినిమా రంగానికి పలు పురస్కారాలు దక్కడం సంతోషంగా పేర్కొన్నారు.

## ఆలయాల్లో అనుమతుల్లేకుండా పనులు చేస్తే చర్యలు

● దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

ఈనాడు, అమరావతి: పురాతన ఆలయాలు, వారసత్వ నిర్మాణాల్లో ఇష్టానుసారం పనులు చేస్తే చర్యలు తప్పవని, వాటికి ఉన్నతాధికారుల అనుమతి ఉండాల్సిందేనని దేవాదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ స్పష్టం చేశారు. కొన్ని పురాతన ఆలయాల్లో బేతంచర్ల స్టోన్, సిరామిక్ టైల్స్, పాలిష్ చేసిన గ్రానైట్ స్టోన్స్‌తో పనులు చేశారని, రాతి స్తంభాలకు రంగులు వేశారని.. ఇవన్నీ ఆయా ఆలయాల వారసత్వాన్ని నాశనం చేయడం వంటివేనని కమిషనర్ పేర్కొన్నారు. ఇంజినీరింగ్ పనుల విషయాల్లో ఇకపై సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

# నైసార్ పరికరాలపై పరీక్షలు ప్రారంభం

**90 రోజులు కొనసాగనున్న ప్రక్రియ**



చెన్నై: అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా), భారత రోదసి సంస్థ (ఇస్రో) సింథటిక్ అపెర్చర్ రాడార్ (నైసార్) ఉపగ్రహం కీలకమైన సన్నద్ధత దశకు చేరుకుంది. ఇందులో ఉపగ్రహంలోని వివిధ వ్యవస్థలు, పరికరాలను క్షుణ్ణంగా పరీక్షిస్తారు. దాని కక్ష్యలోనూ సర్దుబాట్లు చేపడతారు. పూర్తిస్థాయిలో భూపరిశీలనకు ఉపగ్రహాన్ని సన్నద్ధం చేయడం దీని ఉద్దేశం. ఇవి 90 రోజుల పాటు సాగుతాయి. జులై 30న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా నైసార్‌లోని నింగిలోకి పంపిన సంగతి తెలిసిందే. "నైసార్ 737 కిలోమీటర్ల కక్ష్యలోకి చేరింది. దాన్ని 747 కిలోమీటర్ల ఎత్తుకు చేర్చాలి. ఇవన్నీ జరగడానికి 45-50 రోజులు పడుతుంది" అని నాసా భూ విజ్ఞానాల శాస్త్ర విభాగంలో ప్రకృతి విపత్తుల పరిశోధన సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ గెరాల్డ్ డబ్ల్యూ బాడెన్ శుక్రవారం ఇక్కడ తెలిపారు. సన్నద్ధత దశ పూర్తయ్యాక ఉపగ్రహంలోని రాడార్లను క్రియాశీలం చేస్తామని, అవి పుడమిపై మంచు, నేలకు సంబంధించిన డేటాను సేకరించడం మొదలుపెడతాయని వివరించారు. "ఈ ఉపగ్రహం ద్వారా 5×5 మీటర్ల స్పష్టత కలిగిన చిత్రాలు లభిస్తాయి. నిర్దిష్ట ప్రదేశాన్ని 12 రోజులకోసారి చిత్రీకరిస్తాం. ఫలితంగా భారీగా డేటాను ఈ శాటిలైట్ అందిస్తుంది. గతంలో మేం ప్రయోగించిన ఉపగ్రహాలు ఇవ్వనంత డేటా దీని ద్వారా లభ్యమవుతుంది" అని తెలిపారు. ఈ సంయుక్త భాగస్వామ్యం ద్వారా నేర్చుకున్న అంశాలేంటని ప్రశ్నించినప్పుడు.. సైన్స్ ద్వారా సమాజానికి ఎలా సాయపడొచ్చన్నది ఇస్రో నుంచి నాసా నేర్చుకుందని గెరాల్డ్ తెలిపారు. శాస్త్రీయ పరిశోధనలపై నాసాకున్న లోతైన దృష్టి ద్వారా ఇస్రో ప్రయోజనం పొందిందని వివరించారు. "రెండు దేశాల మధ్య సాంస్కృతిక వైరుధ్యాలు ఉన్నాయి. భూమిపై చెరో వైపు ఉన్నాయి. అయినా సాంకేతిక పరిజ్ఞానం పట్ల మక్కువ విషయంలో రెండు దేశాల మధ్య సారూప్యత ఉంది" అని తెలిపారు. ఒకే ఉపగ్రహంలో రెండు రకాల రాడార్లను ఏర్పాటు చేసి, భూ పరిశీలనలకు ఉపయోగించడం ఇదే మొదటిసారని తెలిపారు.

**అత్యంత కచ్చితత్వంతో నైసార్ ప్రయోగం: ఇస్రో ఛైర్మన్**

తిరువనంతపురం: జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా చేపట్టిన నైసార్ ఉపగ్రహ ప్రయోగం.. ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ప్రయోగాల్లో ఒకటని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. స్వదేశీ వాహకనౌకతో భారత్ విజయవంతంగా ఈ శాటిలైట్‌ను పంపడం చూసి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) అధికారులూ ఆనందించారని వివరించారు. సాంకేతికంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఒక ఉపగ్రహాన్ని అమెరికాతో కలిసి నిర్మించడం, అలాగే భారత రాకెట్‌తో ప్రయోగించడం.. దేశమంతటికీ గర్వకారణమని తెలిపారు.

## పంద్రాగస్టు ప్రసంగానికి ఆలోచనలు పంపండి: మోదీ

దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవంలో తాను చేయబోయే ప్రసంగంలో ప్రతిబింబించాలనుకునే ఇతివృత్తాలను, ఆలోచనలను ప్రజలు పంచుకోవాలని ప్రధాని మోదీ శుక్రవారం పిలుపునిచ్చారు. "నా ప్రియమైన భారతీయుల్లారా.. ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకల్లో నా ప్రసంగంలో మీరు వినాలనుకుంటున్న అంశాలను, మీ ఆలోచనలను నమో యాప్ ద్వారా నాకు తెలియజేయండి" అని మోదీ కోరారు.

## రాహుల్ వ్యాఖ్యల్ని తప్పుబట్టిన శశిథరూర్

దిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే పతనమయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమర్థించడాన్ని సొంత పార్టీ ఎంపీ శశిథరూర్ తప్పుబట్టారు. ట్రంప్ విమర్శలను కూడా కొట్టిపారేశారు. భారత ఆర్థికస్థితి ఎలా ఉందో అందరికీ తెలుసన్నారు. మరో కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం సైతం రాహుల్ వ్యాఖ్యలను వ్యతిరేకించారు.

## దావూద్ అనుచరుడి ఆస్తుల జప్తు

దిల్లీ: గుజరాత్‌లోని భరూచ్‌లో 2015లో జరిగిన జంటహత్యల కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు, దావూద్ ఇబ్రహీం అనుచరుడికి సంబంధించిన రెండు స్థిరాస్తులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) శుక్రవారం జప్తుచేసింది. ఈ కేసులో ఎన్ఐఏ ఆదేశాల మేరకు అరెస్టయిన నిందితుడు మహ్మద్ యూనస్ అలియాస్ మంజ్రో ఆస్తులను చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) కింద జప్తు చేసినట్లు అధికారులు తెలిపారు. 2015లో భాజపా కార్యకర్తలు శిరీష్ బెంగాలీ, ప్రగ్నేశ్ మిస్త్రీల హత్య కేసులో మంజ్రో అరెస్టయ్యాడు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న దావూద్ ముఠాను మట్టుపెట్టడానికి ఇది కీలక పరిణామంగా సంస్థ తెలిపింది.

## యూపీలో పట్టాలు తప్పిన రైలు

**పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు**



దిల్లీ, కాన్పుర్: బిహార్‌లోని ముజఫర్‌పుర్ నుంచి గుజరాత్‌లోని సబర్మతికి వెళ్తున్న జన్‌సాధారణ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉత్తర్‌ప్రదేశ్‌లో పట్టాలు తప్పింది. శుక్రవారం సాయంత్రం 4.20 గంటల సమయంలో రైలు కాన్పుర్-టూండ్లా మార్గంలో వెళ్తుండగా రెండు బోగీలు పట్టాల నుంచి పక్కకు వెళ్లాయి. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు స్వల్పగాయాలైనట్లు అధికారులు తెలిపారు. ఘటన సమయంలో రైలు 15 కి.మీ. స్వల్ప వేగంతో వెళ్తున్నందువల్ల పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఈ ఘటన కారణంగా ఈ మార్గంలో వెళ్లాల్సిన ఆరు రైళ్లను దారి మళ్లించినట్లు చెప్పారు.

# రహస్య ఓటింగు.. నో విప్

- ఉప రాష్ట్రపతి ఎన్నిక తీరుతెన్ను




ఈనాడు, దిల్లీ: రాజ్యాంగం ప్రకారం ఉప రాష్ట్రపతి ఎన్నికను రహస్య బ్యాలెట్ విధానం ప్రకారం నిర్వహించాల్సి ఉన్నందున ఓటర్లు కూడా ఈ విషయంలో గోప్యతను పాటించాల్సి ఉంటుంది. ఓపెన్ ఓటింగ్ విధానం ఉండదు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వేసే ఓటును ఇతరులకు చూపడం పూర్తిగా నిషిద్ధం. ఉల్లంఘనకు పాల్పడితే ఆ ఓటును రద్దు చేసే అధికారం ప్రిసైడింగ్ అధికారికి ఉంటుంది. రాజకీయ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీచేయడానికీ వీల్లేదు. ఈ ఎన్నిక 1974 నిబంధనల్లోని రూల్ 8 ప్రకారం పార్లమెంటు భవనంలోనే జరుగుతుంది. ఒకే అభ్యర్థి నామినేషను వేస్తే ఎన్నిక ఏకగ్రీవమవుతుంది. అంతకుమించి అభ్యర్థులు రంగంలోకి దిగి ఎన్నిక అనివార్యమైతే పార్లమెంటు భవనం మొదటి అంతస్తులోని రూమ్ నంబరు ఎఫ్-101, వసుధలో ఓటింగు జరుగుతుంది. కొత్త పార్లమెంటు భవనంలో జరిగే తొలి ఎన్నిక ఇదే కానుంది. అభ్యర్థుల నామినేషన్‌ను ఎలక్టోరల్ కాలేజి సభ్యులైన కనీసం 20 మంది ఓటర్లు ప్రతిపాదించాలి, మరో 20 మంది బలపరచాల్సి ఉంటుంది. అభ్యర్థి నామినేషను పత్రాలతోపాటు రూ.15 వేల సెక్యూరిటీ డిపాజిటు చెల్లించాలి. ఈ సొమ్మును ఆర్‌బీఐలో లేదా ప్రభుత్వ ట్రెజరీలో డిపాజిట్ చేసి, రుజువులను నామినేషనకు జత చేయాలి.

**ఉప రాష్ట్రపతులుగా 14 మంది..**

ఇప్పటివరకు 14 మంది ఉప రాష్ట్రపతులుగా సేవలందించారు. అందులో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, మహమ్మద్ హామీద్ అన్సారీ అత్యధికంగా పదేళ్ల చొప్పున ఈ పదవిలో కొనసాగారు. అత్యల్పకాలం వీవీగిరి 1 సంవత్సరం 355 రోజులు, ఆర్.వెంకటరామన్ 2 ఏళ్ల 327 రోజులు మాత్రమే ఉన్నారు. తర్వాత వీరిద్దరూ రాష్ట్రపతులు అయ్యారు. పదోన్నతి లేకుండా, అకస్మాత్తుగా రాజీనామా చేసి 2 ఏళ్ల 344 రోజులకు ఉప రాష్ట్రపతి పదవి నుంచి వైదొలగిన తొలి వ్యక్తి జగదీప్ ధన్‌ఖడే. ఉప రాష్ట్రపతులుగా పనిచేసినవారిలో సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్‌హుసేన్, వీవీ గిరి, ఆర్.వెంకటరామన్, శంకర్‌దయాళ్ శర్మ, కేఆర్ నారాయణన్ రాష్ట్రపతులు అయ్యారు. కేఆర్ నారాయణన్ తర్వాత ఒక్క ఉప రాష్ట్రపతి కూడా రాష్ట్రపతి స్థానానికి చేరుకోలేకపోయారు. 2002-07 మధ్య ఉప రాష్ట్రపతిగా ఉన్న భైరాన్‌సింగ్ షెకావత్ 2007 రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీపడినా ఓటమిని చవిచూశారు.

## మోదీ ప్రభుత్వ విధానాలతోనే దేశ ఆర్థిక వ్యవస్థ నాశనమైంది: జైరాం



దిల్లీ: మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు విధానాల ప్రభావంతోనే దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నాశనమైందని కాంగ్రెస్ శుక్రవారం ఆరోపించింది. ప్రభుత్వం, దాని మద్దతుదారులు ఆర్థిక స్థితి వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోనే పొదుపుగా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. పార్లమెంటు ఆవరణలో రమేశ్ విలేకరులతో మాట్లాడుతూ.. "మోదీ ప్రభుత్వం, మద్దతుదారులు ఒక ఊహా ప్రపంచంలో జీవిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదనే విషయం ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు తప్ప అందరికీ తెలుసు. దశాబ్ద కాలంలో మోదీ ప్రభుత్వం వరుసగా అమలుచేసిన ఐదు విధానాలతో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నాశనమైంది. దీనికి మరెవరినో బాధ్యులను చేయలేరు. పెద్ద నోట్ల రద్దు మన అభివృద్ధిని దెబ్బతీసి దేశంలోని కోట్లమంది జీవనోపాధిని నాశనం చేసింది. ప్రాథమికంగా లోపాభూయిష్టమైన జీఎస్టీ వేలకొద్దీ చిరు వ్యాపారాలకు నష్టం కలిగించింది. పెద్ద కంపెనీలు మాత్రమే జీఎస్టీ సమ్మతికి సంబంధించిన ఖర్చును భరించగలుగుతాయి. చైనా దిగుమతుల కారణంగా అనేక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను మూసివేశారు. భారత పారిశ్రామికవేత్తలు రోజురోజుకీ విదేశీ పౌరసత్వాన్ని పెంచుకుంటున్నారు. ఈ దశాబ్ద కాలంలో అన్ని రంగాలు, తరగతుల్లో ఎక్కువ శాతం భారతీయుల వేతనాలు స్తబ్దుగా ఉన్నాయి" అని రమేశ్ ఆరోపించారు.

## ఐర్లాండ్‌లోని భారతీయులంతా జాగ్రత్తగా ఉండండి: ఎంబసీ

లండన్: ఐర్లాండ్ రాజధాని డబ్లిన్, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇటీవల భారతీయులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం శుక్రవారం జాగ్రత్తలతో కూడిన సూచనలను జారీచేసింది. "జాతి వివక్ష కారణంగా భారతీయలపై దాడులు జరుగుతున్నాయి. కాబట్టి భారత్ పౌరులంతా నిర్జన ప్రదేశాలకు దూరంగా ఉండండి. ఈ విషయంలో ఐర్లాండ్ సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం" అని సూచించింది.

## వీడియో గేమ్స్‌తో తీవ్రవాదుల నియామకం

**బ్రిటన్ పరిశోధకుల వెల్లడి**

దిల్లీ: వీడియో గేమ్స్ ఆడుతున్నప్పుడు ఎదుటివారితో సంభాషించడానికి (చాట్) వీలు కల్పించే గేమింగ్ ప్లాట్ ఫామ్స్‌ను నయా నాజీల వంటి తీవ్రవాద బృందాలు ఉపయోగించుకుంటున్నాయని బ్రిటిష్ పరిశోధకులు వెల్లడించారు. ఈ బృందాలు అతిమితవాద భావజాలాన్నీ, స్త్రీ ద్వేషాన్నీ, యూదు ద్వేషాన్నీ, జాత్యహంకారాన్నీ, కుట్ర సిద్ధాంతాలనూ వ్యాపింపజేసి, వాటికి ఆకర్షితులయ్యే యువతను తమవైపు తిప్పుకుంటున్నాయని వివరించారు. గేమ్స్ ఆడేటపుడు చాట్ చేయడానికీ, లైవ్ స్ట్రీమింగ్‌కూ వీలు కల్పించే డిస్కార్డ్, స్టీమ్, ట్విచ్ వంటి ప్లాట్ ఫామ్స్‌పై నియంత్రణ తక్కువగా ఉండటంతో తీవ్రవాద బృందాలు వీటిని ఎక్కువగా ఉపయోగించుకుంటున్నాయి. గేమింగ్ డిజిటల్ వేదికను అందిస్తుంది. సామాజిక మాధ్యమాల నుంచి యువతను, విపరీత భావాలున్న వారినీ గేమింగ్‌కు ఆకర్షించడం తీవ్రవాద బృందాలకు సులువవుతోంది. మహా దూకుడు ఉట్టిపడే షూటింగ్ తదితర ఆన్ లైన్ గేమ్స్ ఆడేవారికి తీవ్రవాద గ్రూపులు వలవేసి రిక్రూట్ చేసుకుంటాయి. ఆ గేమర్లను నియంత్రణ తక్కువగా ఉండే ప్లాట్ ఫామ్స్‌కు లాగి పరిచయం పెంచుకుంటాయి. ఇలాంటి తతంగంపై మానవ సిబ్బందితోపాటు కృత్రిమ మేధా సాధనాలతో గట్టి నిఘా వేసి నియంత్రించాలని అధ్యయన కర్తలు సూచించారు.


## మలుపు తిప్పే 50 ఏళ్ల వయసు!



దిల్లీ: ఐదు దశాబ్దాల మానవ కణజాలాల నమూనాలను విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఒక వ్యక్తి జీవితంలో 50 ఏళ్ల వయసు.. కీలక మలుపు తీసుకుంటుందని తేల్చారు. ఈ దశ నుంచి వయసు మీదపడే ప్రక్రియ వేగవంతమవుతుందని చెప్పారు. రక్తనాళాల్లో వార్ధక్యం వడివడిగా సాగడంతోపాటు అవి దుర్బలంగా మారుతాయని వివరించారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. ఇందుకోసం శరీరంలోని వివిధ భాగాల నుంచి సేకరించిన 500కుపైగా నమూనాలను విశ్లేషించారు. 44 - 60 ఏళ్ల వయసులో శరీరంలోని అణువులు, సూక్ష్మజీవుల్లో కీలక మార్పులు వస్తాయని చెప్పారు. దీనివల్ల గుండె, రోగనిరోధక వ్యవస్థ పనితీరుపై గణనీయ ప్రభావం పడుతుందని వివరించారు.

## మానవసహిత యాత్రల్లో పైచేయి సాధించడమే భారత లక్ష్యం

**వ్యోమగామి శుభాంశు శుక్లా వ్యాఖ్య**



దిల్లీ: యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తాను చేపట్టిన యాత్ర.. 'రెండో కక్ష్య' (మానవసహిత రోదసి యాత్రలు)లోకి భారత్ వేస్తున్న తొలి అడుగులని వ్యోమగామి శుభాంశు శుక్లా పేర్కొన్నారు. ఈ తరహా యాత్రల్లోనూ పైచేయి సాధించడమే లక్ష్యమని తెలిపారు. శుక్రవారం ఆయన తన సహచర ఆస్ట్రోనాట్‌లతో కలిసి వర్చువల్‌గా పాత్రికేయులతో మాట్లాడారు. ఐఎస్ఎస్‌లో భారరహిత స్థితిలో సాగిన తమ జీవనాన్ని, చేపట్టిన ప్రయోగాలను వివరించారు. తన వెనుక త్రివర్ణ పతాకం ఉండగా.. భారత ప్రధాన మంత్రితో ఐఎస్ఎస్ నుంచి మాట్లాడటం అద్భుతమని శుభాంశు తెలిపారు. భారత్ కేవలం మౌన వీక్షకురాలు కాదని, సమాన భాగస్వామిగా ఎదిగిందనడానికి ఇది నిదర్శనమని చెప్పారు.

## వినియోగదారుల ఫిర్యాదుల కోసం క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శించాలి

**ఆహారోత్పత్తుల విక్రేతలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టీకరణ**

దిల్లీ: భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తాజాగా కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. ఆహారోత్పత్తుల వ్యాపార సంస్థలన్నీ తమ ప్రాంగణాల్లోని నిర్దిష్ట ప్రదేశంలో లైసెన్సు/ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను తప్పక ప్రదర్శించాలని స్పష్టంచేసింది. వినియోగదారుల ఫిర్యాదులను నమోదు చేయడానికి ఉద్దేశించిన మొబైల్ యాప్‌నకు సంబంధించి క్యూఆర్ కోడ్‌నూ అందరికీ కనపడేలా ఉంచాలంది. ప్రవేశ ద్వారాలు, బిల్లింగ్ కౌంటర్లు, వినియోగదారులు కూర్చొనే ప్రదేశాలు వంటి చోట్ల వీటిని ప్రదర్శించాలని పేర్కొంది. వినియోగదారుల సాధికారత, ఆహార భద్రత పరిరక్షణే దీని ఉద్దేశమని తెలిపింది. రెస్టారెంట్లు, ధాబాలు, కెఫేలు సహా ఆహారోత్పత్తుల వ్యాపారంలో ఉన్న సంస్థలన్నింటికీ ఇది వర్తిస్తుందని స్పష్టంచేసింది.

## త్వరలో క్యూలైన్‌లోనే శ్రీవాణి టికెట్ల వివరాల నమోదు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవాణి దర్శన టికెట్ల జారీ విధానంలో త్వరలోనే పూర్తిస్థాయిలో మార్పులు తెచ్చేందుకు తితిదే చర్యలు తీసుకోనుంది. శ్రీవాణి దర్శన టికెట్ల కోసం వచ్చే కుటుంబంలోని ఓ వ్యక్తి ఫొటో, ఫోన్ నంబర్‌ను క్యూలైన్‌లోనే సిబ్బంది క్యాప్చర్ చేసి అతని మొబైల్‌కు ఓ లింకును పంపుతారు. ఆ లింకు పొందిన భక్తులు శ్రీవాణి టికెట్ల కోసం తనతోపాటు కుటుంబసభ్యుల వివరాలను అందులోనే నమోదు చేసి నగదును డిజిటల్ విధానంలో చెల్లిస్తారు. క్యూలైన్‌లో ఉండగానే భక్తులు ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. అనంతరం టికెట్లు జారీచేసే సిబ్బంది భక్తుల ఫొటో తీసుకుని శ్రీవాణి టికెట్లు జారీ చేస్తారు. దీంతో భక్తులు తమ వివరాల నమోదు, నగదు చెల్లింపునకు పట్టే సమయం పూర్తిగా తగ్గిపోతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం శ్రీవాణి టికెట్ జారీకి ఒకటిన్నర నిమిషం పడుతుండగా.. కొత్త విధానం అమల్లోకి వస్తే 15 సెకన్లలోనే టికెట్లు జారీ అవుతాయి. మరోవైపు, శ్రీవాణి దర్శన టికెట్లు పొందిన భక్తులకు 12 గంటల సమయానికే గదుల కేటాయింపునకు గల అవకాశాలను తితిదే పరిశీలిస్తోంది.

## పాఠశాలల ఆవరణలోకి అనధికార వ్యక్తులకు నిషేధం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లోకి అనధికార వ్యక్తులను అనుమతించొద్దని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులను మాత్రమే అనుమతించాలన్నారు. బహుమతులు, విరాళాలు ఇవ్వడానికి ముందస్తు అనుమతి లేకుండా అనధికార వ్యక్తులు పాఠశాలల్లోకి వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. అనధికార వ్యక్తుల ప్రవేశం విద్యా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తుందని వెల్లడించారు. ఏదైనా విరాళాలు, వస్తు సామగ్రిని ఇవ్వాలనుకుంటే తరగతి గదిలోకి ప్రవేశించకుండా వాటిని ప్రధానోపాధ్యాయులకు అప్పగించాలని సూచించారు. పిల్లలతో ఫొటోలు దిగరాదన్నారు. పాఠశాల ఆవరణలో రాజకీయ పార్టీలు, సంస్థలకు సంబంధించిన జెండాలు, శాలువాలు, బ్యానర్లు, పోస్టర్లలాంటి ఏవైనా ప్రదర్శించడం నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులపై ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజలపై విద్యుత్తు భారం ఆపాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని, ట్రూడౌన్ పేరుతో ధరలు తగ్గిస్తామని ప్రకటించి నెల రోజులు గడవక ముందే మళ్లీ ట్రూఅప్ పేరుతో రూ.12,771 కోట్ల భారాన్ని ప్రభుత్వం ప్రజలపై మోపేందుకు సిద్ధమవుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. వెంటనే దీన్ని ఉపసంహరించుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు.

# పలు సంస్థలకు భూ కేటాయింపులు

- ఏపీ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆమోదం
- మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పలు ప్రైవేటు కంపెనీలకు భూములు కేటాయించేందుకు ఏపీ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆమోదం తెలిపింది. మంగళగిరిలోని భూ పరిపాలనశాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన అథారిటీ సమావేశంలో ఆయా జిల్లాల కలెక్టర్ల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై పరిశ్రమలు, ఇతర శాఖల అధికారులు చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ భూములపై రానున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు కోసం 45.60 ఎకరాలు (ఎకరా రూ.37.12 లక్షలు) ఇచ్చేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. గ్రీన్‌కో కంపెనీకి నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురంలో 174.1 ఎకరాలు (ఎకరాకు రూ.6.25 లక్షల చొప్పున) ఇవ్వాలని అథారిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అదానీ సోలార్ ఎనర్జీ కంపెనీకి వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలంలో 1,200 ఎకరాలు (ఎకరాకు రూ.3.06 లక్షలు), హెటిరో విండ్‌పవర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వైఎస్సార్ కడప జిల్లా కొండాపురం మండలంలో 45 ఎకరాలు (ఎకరాకు రూ.6 లక్షలు) ఇచ్చేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. వైఎస్సార్ కడప జిల్లా తొండూరు మండలంలో మల్లేల, ఉడవగండ్ల గ్రామాల్లో 40 ఎకరాల భూమిని ఆట్రియా విండ్‌పవర్‌కు కేటాయించేందుకు సమ్మతి తెలిపింది. కలెక్టర్ ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ఎకరా రూ.2.25 లక్షలు, రూ.99,000 చొప్పున ప్రతిపాదించారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 7.74 ఎకరాలను (ఎకరా రూ.4.60 లక్షలు) ఇచ్చేందుకు కూడా అథారిటీ సిఫార్సు చేసింది. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలంలో ఏపీ టిడ్కోకు 50 ఎకరాలు ఇచ్చేందుకు అథారిటీ సమ్మతి తెలిపింది. ఈ సిఫార్సులపై మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## పీఎంఆర్‌బీపీ నామినేషన్ల గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (పీఎంఆర్‌బీపీ) నామినేషన్ల స్వీకరణ గడువును ఆగస్టు 15 వరకు పొడిగించినట్లు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి త్రిప్తి గుర్హ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో పిల్లల అసాధారణ విజయాలను గుర్తించి, వారిని అభినందించడానికి కేంద్రం ఈ జాతీయ అవార్డు అందిస్తుందని పేర్కొన్నారు. ధైర్యం, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లో పురస్కారాలు ఇస్తుందని వెల్లడించారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలు (2025 జులై 31కి) నామినేట్ కావడానికి అర్హులని వివరించారు. నామినేషన్లను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ https://awards.gov.in ద్వారా మాత్రమే స్వీకరించనున్నట్లు స్పష్టం చేశారు.

## పీసీబీలో నాన్-అఫిషియల్ సభ్యుల నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో అనధికార (నాన్-అఫిషియల్) సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఎంపిక కమిటీ సిఫార్సుల ప్రకారం పంచకర్ల నాగ సందీప్ (విశాఖపట్నం), భాగవతుల వెంకట సందీప్ (విశాఖపట్నం), నాగలపాటి నాగేశ్వర రాజు (చిత్తూరు)ను నియమిస్తూ నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు.

## అటవీ ప్రాంతాలను గుర్తించేందుకు కమిటీ పునర్ నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అటవీ ప్రాంతాలను గుర్తించి సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఏకీకృత నివేదికను రూపొందించేందుకు నిపుణుల కమిటీని పునర్ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అడవులుగా ఉండి, నరికివేతకు గురైన లేదా చదును చేసిన ప్రాంతాలు, తోటలు వంటి వాటిని ఈ కమిటీ గుర్తిస్తుంది. ఈ కమిటీకి పర్యావరణ, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా.. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. మరో 8 మంది సభ్యులుగా ఉంటారు. నెలలోపు ఈ కమిటీ నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

## పులివెందుల జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా సునీల్‌కుమార్ యాదవ్

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు సునీల్‌కుమార్ యాదవ్ శుక్రవారం పులివెందుల జడ్పీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. పత్రాలను రిటర్నింగ్ అధికారి ఓబులమ్మకు అందించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో వైకాపా పోటీచేస్తోంది కాబట్టే తానూ బరిలో నిలుస్తున్నానన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలను కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తోందన్నారు. కక్ష సాధింపులకు కూటమి ప్రభుత్వం పోలీసులను ఉపయోగించుకుంటోందని ఎంపీ అవినాష్‌రెడ్డి విమర్శించడం సరికాదన్నారు. గత ప్రభుత్వం పోలీసులను ఎలా ఉపయోగించుకుందో అందరికీ తెలుసన్నారు.

# బనకచర్లను అడ్డుకోవడంలో కేంద్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం

- ఆ ప్రాజెక్టును ఎలా ఆపాలో మాకు తెలుసు: హరీశ్‌రావు




కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ గతంలో ఏపీ ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను చూపిస్తున్న హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడంలో కేంద్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఏపీలో అక్రమ ప్రాజెక్టులు కట్టి కృష్ణా నదిలో నీళ్లు మళ్లించినట్లు.. గోదావరి నీళ్లూ మళ్లించాలని ఆలోచన చేస్తున్నారని, రెండు నదులను హస్తగతం చేసుకునేలా ఏపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఏపీ సీఎంతో తెలంగాణ ముఖ్యమంత్రి లోపాయికారీ ఒప్పందం చేసుకోవడం వల్లే.. బనకచర్లను కట్టితీరుతామని ఆ రాష్ట్ర మంత్రి లోకేశ్ గట్టిగా చెబుతున్నారని విమర్శించారు. ఆనాడు తెలంగాణను ఎన్ని కుయుక్తులు పన్ని అడ్డుకున్నా.. తన శక్తియుక్తులతో కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం సాధించారని తెలిపారు. ఇప్పుడు కూడా తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసే బనకచర్ల ప్రాజెక్టును ఎలా అడ్డుకోవాలో తమకు తెలుసని స్పష్టం చేశారు. శుక్రవారం హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "బనకచర్లపై చంద్రబాబు బుల్డోజ్ విధానానికి భాజపా, కాంగ్రెస్‌ల మౌనమే కారణం. కాళేశ్వరం ప్రాజెక్టుకు 11 రకాల అనుమతులు న్నాయి. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ గతంలో ఏపీ ప్రభుత్వం ఏడు లేఖలు రాసింది. గోదావరిలో మిగులు జలాలు అనేవి నిజంగా ఉంటే.. నాలుగు కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎందుకు బనకచర్ల డీపీఆర్‌ను వెనక్కి తిప్పి పంపించాయి? ఏపీ ప్రాజెక్టులను అడ్డుకోవడం మా ఉద్దేశం కాదు. మా హక్కుల గురించి మేం మాట్లాడుతున్నాం. మా వాటా మాకు ఇవ్వండి.. గౌరవిస్తాం. బుల్డోజ్ చేస్తామంటే మాత్రం సహించేది లేదు. సుప్రీంకోర్టుకు వెళ్లైనా సరే.. తెలంగాణ హక్కులను కాపాడుకుంటాం" అని హరీశ్‌రావు చెప్పారు.

# కంబోడియాకు యువకుల రవాణా

- అక్కడ వారి చేత సైబర్ నేరాలు
- నిజామాబాద్ వాసి అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: కంబోడియాలో చైనా వారు నిర్వహిస్తున్న నకిలీ కాల్‌సెంటర్లకు యువకులను అక్రమంగా రవాణా చేస్తున్న మాయగాడి గుట్టును నగర సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలో శుక్రవారం సైబర్ క్రైమ్ డీసీపీ కవిత దార, ఏసీపీలు శివమారుతి, జయపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సీతారాములుతో కలిసి అదనపు సీపీ విశ్వప్రసాద్ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్‌కు చెందిన చిక్కాల సంతోష్‌కుమార్(31) వారాసిగూడ బౌద్ధనగర్‌లో ఉంటూ వీసా కన్సల్టెన్సీ ప్రారంభించాడు. నకిలీ కాల్‌సెంటర్లకు యువకులను పంపితే పెద్దఎత్తున లాభపడొచ్చని భావించాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు యువకులను టూరిస్ట్ వీసాలపై కంబోడియాలోని నకిలీ కాల్‌సెంటర్‌కు పంపాడు. కమీషన్‌గా రూ.3 లక్షలు తీసుకున్నాడు. ఆ నకిలీ కాల్ సెంటర్ వారు వారిని సైబర్ నేరాలకు పావులుగా మార్చారు. వారి బంధువులు సంతోష్‌కుమార్‌పై ఒత్తిడి తేవటంతో వారిని దేశానికి తీసుకొచ్చాడు. చైనా నుంచి వచ్చిన ఆదేశాలతో మరికొందర్ని కంబోడియా పంపేందుకు సిద్ధమయ్యాడు.

**ఎలా బయట పడిందంటే..**

గతేడాది నగరానికి చెందిన వ్యక్తికి ఒక మహిళ వాట్సప్ కాల్ చేసింది. ఐపీవో, స్టాక్స్‌లో పెట్టుబడితో పెద్దఎత్తున లాభం ఆశచూపి రూ.1.70 లక్షలు వసూలు చేసింది. నకిలీ వెబ్‌సైట్‌లో వర్చువల్ ఖాతాలో 20 వేల అమెరికన్ డాలర్లున్నట్టు చూపింది. నగదు ఉపసంహరణకు ఛార్జీల పేరిట రూ.7.5 లక్షలు వసూలు చేసి ముఖం చాటేసింది. బాధితుడి ఫిర్యాదుతో ఏసీపీ శివమారుతి, ఇన్‌స్పెక్టర్ సీతారాములు బృందం దర్యాప్తు చేపట్టి విదేశీ సైబర్ ముఠాలతో చేతులు కలిపిన సంతోష్‌కుమార్ ఈ మోసంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. పాత విషయాలూ వెలుగులోకి వచ్చాయి. నిందితుడిని అరెస్ట్ చేసి 24 డెబిట్‌కార్డులు, 5 పాస్‌పుస్తకాలు, 7 చెక్‌బుక్‌లు, ల్యాప్‌టాప్‌లు, షెల్ కంపెనీల స్టాంపులు, 15 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

**ప్రొటీన్ పౌడర్ ఎగుమతి పేరిట ఖరీదీ.. ఒకరి అరెస్టు**

నగరానికి చెందిన వ్యాపారి ప్రొటీన్ పౌడర్ విక్రయిస్తుండేవారు. ఆయనకు దిల్లీలోని ట్రేడ్ ఫండమెంటల్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ నిర్వాహకుడినంటూ లక్ష్యవర్మ పరిచయమయ్యాడు. తనకు హాంకాంగ్‌కు చెందిన ఓ కంపెనీలో భాగస్వామ్యం ఉందని నమ్మించాడు. ప్రొటీన్ పౌడర్‌ను విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా బాగా లాభపడొచ్చని ఆశ కల్పించి రూ1.11 కోట్లు కాజేశాడు. బాధితుడు ఆన్‌లైన్‌లో ఆ సంస్థ వివరాలు పరిశీలించగా ఒకప్పుడు బాగానే నడిచిన కంపెనీ ప్రస్తుతం మూతపడిందని తెలిసి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగదు గుజరాత్‌లోని కిరాణ దుకాణ యజమాని పేరుతో ఉన్న ఖాతాలో జమైనట్టు గుర్తించారు. ఒకప్పుడు ఆ దుకాణంలో పనిచేసిన పరాస్ సింగ్లా, లక్ష్యవర్మ బ్యాంకు రుణం ఇప్పిస్తామని యజమాని కేవైసీ వివరాలు తీసుకెళ్లి సైబర్ ముఠాలకు విక్రయించారు. ప్రధాన నిందితుడు పరాస్ సింగ్లా(29)ను అరెస్ట్ చేశారు. లక్ష్యవర్మ మరొకరు పరారీలో ఉన్నారు. నిందితుడి నుంచి 30 ఫోన్లు, 3 సిమ్‌కార్డులు, ఒక డెబిట్‌కార్డు స్వాధీనం చేసుకున్నారు.

## బల్క్‌డ్రగ్ పార్కు ఈఐఏ నివేదికపై విచారణ చేయించాలి

**రాష్ట్ర పీసీబీ ఛైర్మన్‌కు మానవ హక్కుల వేదిక లేఖ**

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ప్రతిపాదిత బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా వేసి, పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ) నివేదికపై విచారణ చేయించాలని శాస్త్రవేత్తలు, వైద్యులతో పాటు మానవ హక్కుల వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్యకు శుక్రవారం లేఖ రాశారు. తప్పుడు నివేదిక ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత కన్సల్టెన్సీ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 'ఈఐఏ నివేదిక తయారీలో కాలుష్య నియంత్రణ మండలి బాధ్యతాయుతంగా వ్యవహరించి.. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలి' అని కోరారు.

## 65 వేల చేనేత కుటుంబాలకు లబ్ధి

**మంత్రి సత్యకుమార్**

ఈనాడు, అమరావతి: చేనేత దినోత్సవమైన ఆగస్టు 7 నుంచి మగ్గాలకు ఉచిత విద్యుత్తు ఇస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. దీంతో 65 వేల చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.